ముహూర్తం

శ్రీ హేవళంబినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘమాసం, తిథి: బహుళ త్రయోదశి రా. 10.24 వరకు, అనంతరం చతుర్దశి; నక్షత్రం: ఉత్తరాషాఢ తె. 5.13 వరకు, అనంతరం శ్రవణం; అమృతకాలం: రా. 10.00 నుండి 11.45 వరకు; వర్జ్యం: ఉ. 11.31 నుండి 1.17 వరకు; దుర్ముహూర్తం: ఉ. 8.24 నుండి 9.12 వరకు, రా. 10.48 నుండి 11.36 వరకు; రాహుకాలం: మ. 3.00 నుండి 4.30 వరకు; యమగండం: ఉ. 9.00 నుండి 10.30 వరకు;

Estd 1938

ఆంధ్రప్రభ

www.prabhanews.com

Journalism first!

సంపుటి:56 • సంచిక:303 • మంగళవారం 13 ఫిబ్రవరి 2018 • హైదరాబాద్ * పేజీలు:12+4 • వెల:5.00 • Published from:Hyderabad|Vijayawada|Guntur|Rajahmundry|Visakhapatnam|Tirupati|Karimnagar|Kurnool|Suryapet|Anantapur|Nellore|Nizamabad

ఆయిల్ హబ్ భారత్!



మస్కట్: మసీదును సందర్శించిన ప్రధాని మోడీ

ఫలించిన మోడీ ఆయిల్ మంత్రం

భారత్‌లో యూఏఈ ఆయిల్ నిల్వలు

ఇంధన అత్యవసర పరిస్థితుల్లో వాడకం

మంగళూరులో చమురు నిల్వలు

వివరాలు 3లో...

జయ్ షా అవినీతి మాటేంటి?



రాయచూర్: రోడ్‌సైడ్ హోటల్‌లో ఉగ్గాని భజ్జీ ఆరగిస్తున్న రాహుల్ బృందం

యెడ్డీ జైలుకెళ్లాడు.. మంత్రులదీ అదే తీరు

11మంది నేతలు రాజీనామా చేశారే

రైతుల రుణమాఫీ ఎందుకు చేయరు?

యువతకు ఉపాధి కల్పనలో మోడీ విఫలం: రాహుల్

3లో

మహాశివరాత్రికి ఆలయాలు ముస్తాబు



విద్యుత్ కాంతులతో వేములవాడ రాజరాజేశ్వరి ఆలయం

పాఠకులకు, ప్రకటనకర్తలకు, ఏజెంట్లకు, శ్రేయోభిలాషులకు

ఆంధ్రప్రభ మహాశివరాత్రి శుభాకాంక్షలు

- ముత్తా గౌతమ్, మేనేజింగ్ డైరెక్టర్

కంది కష్టాలు!

మార్కెట్‌యార్డుల్లో టన్నులకొద్దీ కందులు

మద్దతు ధరలేక దిగాలు

చేతులెత్తేసిన కేంద్రం.. రైతుల కన్నీళ్లు

మద్దతు ధరలు అందక, కొనుగోళ్లు లేక ఉత్పత్తిదారులకు నానా తిప్పలు

రాష్ట్రం స్పందిస్తున్నా.. కందుల సేకరణకు కేంద్రం ససేమిరా

సహకార పరిమితి సంఘాల్లో వారం క్రితమే కొనుగోళ్లు బంద్

మార్క్‌ఫెడ్ 73 కేంద్రాలు, హాకా 15 కేంద్రాలు మాత్రమే కొనసాగింపు

ఈ రెండు ఏజెన్సీల ద్వారా 16 లక్షల క్వింటాళ్లు కొనుగోలు

రైతుల వద్ద మరో 10లక్షల క్వింటాళ్ల వరకు కంది నిల్వలు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: గతంలో కంది కొరతతో పప్పు ధరలు మూడింతలు పెరిగి పేద వర్గాలు ఆందోళన చెందితే, ఈ ఏడాది అందుకు పూర్తి విరుద్ధంగా ఉత్పాదకత రెండింతలు పెరిగి రైతులు రోడ్డెక్కాల్సిన పరిస్థితి నెలకొంది. కొన్ని ప్రాంతాల్లో కనీస మద్దతు ధరలు అందక, మరికొన్ని ప్రాంతాల్లో కొనుగోళ్ళు లేక ఆందోళనలు తీవ్రతరమవుతున్నాయి. గత వారం, పది రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలు స్తంభించడంతో అనేక వ్యయ ప్రాయాసలను ఓర్చుకుని పండించిన రైతులకు కన్నీళ్ళే మిగులుతున్నాయి. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తున్నా కేంద్ర ప్రభుత్వం చేతులెత్తేయడంతో ప్రతికూల పరిస్థితులు నెలకొన్నాయి. గత నెల మొదటివారంలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల ద్వారా కొనుగోళ్ళు ప్రారంభించిన అధికారులు టార్గెట్లను పూర్తిచేసి నిలిపివేశారు. కేంద్రం నుంచి సేకరణ స్తంభించడంతో గత్యంతరం లేక రాష్ట్ర ప్రభుత్వం చేతులెత్తేయక తప్పడం లేదు. ప్రస్తుతం మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో 73 కొనుగోలు కేంద్రాలు కొనసాగుతుండగా, హాకా సంస్థ కొనుగోలు కేంద్రాలను 48 నుంచి 15కు తగ్గించారు. దీంతో సమస్యల నానాటికీ పెరుగుతోంది. ఈ సీజన్‌లో ఇప్పటివరకు మార్క్‌ఫెడ్ సంస్థ 6.5 లక్షల క్వింటాళ్ళ కందులను కొనుగోలు చేశారు. హాకా సంస్థ ద్వారా 9.5 లక్షల క్వింటాళ్ళు కొనుగోలు చేసినట్లు ఈ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సురేందర్ రెడ్డి తెలిపారు. అంచనాకు మించి దిగుబడులు సాధించడంతో కనీస మద్దతు ధరలు ఒక్కసారిగా పడిపోయాయి. కేంద్రం ప్రతి క్వింటాలుకు మద్దతు ధర రూ.5450 ప్రకటించినప్పటికీ, అవి ఎక్కడా అమలు కావడం లేదు. ఈ పరిస్థితులను అదునుగా చేసుకుంటున్న కొందరు వ్యాపారులు కనీస మద్దతు ధరలకు వెయ్యి నుంచి రూ.1500 వరకు తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. ఇదివరకు ఎన్నడూలేని విధంగా అంచనాకు మించిన కంది పంట ఉత్పత్తులు ఒక్కసారిగా

3వ పేజీలో...



ఖైరతాబాద్‌లోని జలమండలిలో జలం-జీవం పోస్టరు ఆవిష్కరించిన మంత్రి కేటీఆర్

హైదరాబాద్‌లో

రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ పార్క్

దేశంలో ప్రప్రథమంగా హైదరాబాద్‌లో ఏర్పాటు

భూమిపై పడిన ప్రతీనీటి చుక్కను ఒడిసి పట్టడమే ప్రధాన లక్ష్యం

అన్ని విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఇంకుడు గుంతలు

జలం-జీవం సమీక్షలో మంత్రి కేటీఆర్

హైదరాబాద్, ఆంధ్రప్రభ: దేశంలో ఎక్కడా లేనివిధంగా అత్యుత్తమ విధానాలతో హైదరాబాద్ నగరంలో ప్రత్యేకంగా ఒక రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ (ఇంకుడు గుంతల) పార్కు ఏర్పాటు చేస్తున్నామని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ తెలిపారు. భూమిపై పడిన ప్రతి వర్షపు చుక్కను ఒడిసి పట్టాలన్న ప్రధాన లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. సోమవారం ఖైరతాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో 'జలం-జీవం' కార్యక్రమంపై మంత్రి సమీక్ష నిర్వహించారు. భవిష్యత్తులో నీటి ఇబ్బంది తలెత్తకుండా ఉండాలన్న లక్ష్యంతో హార్వెస్టింగ్ పార్కు ఏర్పాటు చేస్తున్నట్లు స్పష్టం చేశారు. ఈ పార్కు ద్వారా పెద్దఎత్తున ఇంకుడు గుంతల నిర్మాణాలు చేపట్టడంతో పాటు ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. ఈ పార్కులో అన్ని అవసరాల కోసం ఎటువంటి నల్లా కనెక్షన్ తీసుకోకుండా కేవలం వాననీటినే వినియోగిస్తామని వివరించారు. దీనిని ఆదర్శంగా తీసుకునే విధంగా పార్కు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. నగరంలో అనువైన చోట ప్రజలు, విద్యార్థులు పార్కు నుంచి ప్రేరణ పొందేలా రూపొందించాలని సూచించారు. లాతూర్ పట్టణంలో ఎదురైన నీటి కష్టాల అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని.... అలాంటి పరిస్థితులు హైదరాబాద్‌లో రాకుండా ఉండేందుకు ''జలం-జీవం''లో భాగంగా పెద్దఎతున ఇంకుడు గుంతల నిర్మాణాలకు పూనుకుంటున్నామని తెలిపారు. లాతూర్ ప్రజల దాహార్తిని తీర్చడానికి ఆ రాష్ట్ర ప్రభుత్వం మంచినీటిని రైళ్ళద్వారా సరఫరా చేసిన విషయాన్ని కేటీఆర్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. మన రాష్ట్ర రాజధానిలో

9వ పేజీలో...



ఐటీ కాంగ్రెస్‌కు రోబో సోఫియా

చీరకట్టుతో అతిథుల ముందుకు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: భాగ్యనగరం హైదరాబాద్‌లో జరుగుతున్న ప్రతిష్టాత్మక ప్రపంచ ఐటి కాంగ్రెస్ సదస్సుకు అరుదైన అతిథి వస్తోంది. ప్రపంచంలోనే కృత్రిమ మేథోశక్తి కలిగిన మొదటి హ్యూమనైడ్ మరమనిషి (రోబో) ఈ సదస్సులో సందడి చేయనుంది. ఈ సదస్సుకు హాజరవుతున్న దేశ, విదేశీ ప్రతినిధులనుద్దేశించి రోబో సోఫియా ప్రసంగించనుంది. ముంబైలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటి)లో చీరకట్టుతో అలరించిన రోబో సోఫియా మన దేశంలో పర్యటించడం

9వ పేజీలో...



అరబ్ షేక్‌ల చేతుల్లో

అతివల విలవిల

అభాగ్యురాలి ఆక్రందనతో వెలుగులోకి

నరకయాతనను తల్లికి వీడియో

విముక్తి కల్పించాలంటూ సీఎంకు వేడుకోలు

వివరాలు 10లో...

జనగామకు గోదావరి జలాలు



సిద్దిపేటప్రతినిధి, ప్రభ న్యూస్ : వచ్చే డిసెంబర్ నాటికి జనగామ నియోజకవర్గంలోని బచ్చన్నపేట, చేర్యాల, మద్దూరు మండలాలకు కాళేశ్వరం, దేవాదుల ఎత్తిపోతల పథకం ద్వారా గోదావరి నీటిని రైతుల పొలాలకు అందిస్తామని రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. సోమవారం నియోజకవర్గంలో పలు మండలాల్లో మంత్రి సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా చేర్యాలలో రూ.17కోట్ల వ్యయంతో నిర్మించనున్న సమీకృత ప్రభుత్వ కార్యాలయాల భవన సముదాయానికి శంకుస్థాపన చేశారు. అనంతరం గ్రామీణ పర్యాటక పథకం నకాషి చిత్రకారుల భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా సమావేశాల్లో మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ 18వేల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో పని చేస్తున్నామన్నారు. చేర్యాల ప్రాంతాన్ని పచ్చదనంతో నింపే చర్యలకు అంకురార్పన జరిగిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా చేర్యాల ప్రాంతానికి 8వేల ఎకరాలకు, ప్యాకేజీ 11ద్వారా రంగనాయకసాగర్ నుండి నీళ్ళను మళ్ళిస్తామన్నారు. 2018లో చేర్యాల, మద్దూరు మండలాలకు సాగునీరు అందిస్తామని పునరుద్ఘాటించారు. అభివృద్ధికి నోచుకోక కరువు ప్రాంతాలైన పై మూడు మండలాలకు కాళేశ్వరం, దేవాదుల, గౌరవెల్లి, గండివెల్లి రిజర్వాయర్‌ల ద్వారా భగీరథ ప్రయత్నం చేస్తున్నామన్నారు. దేవాదుల నుండి చేర్యాల ప్రాంతానికి నీటిని మళ్లించడానికి అపరభగీరథుడు సీఎం కేసీఆర్ నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. సముద్ర మట్టానికి 89మీటర్ల ఎత్తున ఉన్న గోదావరి నీళ్ళను 630మీటర్ల ఎత్తున ఉన్న చేర్యాలకు తరలించడం కేసీఆర్ వల్లే అవుతుందన్నారు. బెక్కల్ రామలింగేశ్వరస్వామి ఆలయంలో మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శరవేగంగా నీటిప్రాజెక్టుల నిర్మాణం

బీడు భూములకు నీళ్లు

- ప్రస్తుత ఆయకట్టు 54. 16 లక్షల ఎకరాలు
- ప్రాజెక్టులు పూర్తయితే 95. 33 లక్షల ఎకరాలకు నీళ్లు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: కోటి ఎకరాల దారిలో.. ప్రాజెక్టులను పరుగులు పెట్టిస్తున్న ప్రభుత్వం ఖరీఫ్‌కు భారీగా ఆయకట్టు పెంచనుంది. ఆన్‌గోయింగ్ ప్రాజెక్టుల పనులు వేగంగా సాగుతుండడంతో ఆయా ప్రాంతాల రైతాంగంలోనూ ఆశలు చిగురించాయి. ఆకుపచ్చ తెలంగాణ లక్ష్యంగా వడివడిగా పనులు చేయిస్తున్న ప్రభుత్వానికి ఈ ఏడాది అతి కీలకం కాగా.. అనేక ప్రాజెక్టుల నుండి వడివడిగా జలసిరులు బీళ్ళకు మళ్లనున్నాయి. ఇప్పటికే నిర్దేశించిన లక్ష్యం దిశలో సగానికి పైగా అధిగమించిన తెలంగాణ.. మిగతా పనులను కూడా ప్రణాళికా బద్ధంగా, వేగంగా నిర్వహిస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం భూమి 282.85లక్షల ఎకరాలు కాగా, ఇందులో సాగుయోగ్యత కలిగిన భూమి 175.04లక్షల ఎకరాలు. వీటిలో కోటి ఎకరాలకు ఖచ్చితంగా సాగునీరు ఇవ్వాలని నిర్ణయించిన ప్రభుత్వం 1.20కోట్ల ఎకరాలకు సాగునీరందేలా పలు ప్రాజెక్టులు, ప్రణాళికలు రూపొందించింది.

ఆన్‌గోయింగ్ ద్వారా సస్యశ్యామలం

రాష్ట్రంలో ఆన్‌గోయింగ్ ప్రాజెక్టులు పూర్తయితే 41.17లక్షల ఎకరాలు కొత్తగా సాగులోకి రానున్నాయి. ఇందులో ఒక్క కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారానే 18లక్షల ఎకరాలు సాగులోకి రానుంది. పాలమూరు- రంగారెడ్డితో పాటు ఇతర ప్రాజెక్టుల ద్వారా ఉమ్మడి పాలమూరు జిల్లాలో అత్యధికంగా 7.5లక్షల ఎకరాలకు కొత్తగా సాగునీరు అందనుంది. పూర్వ కరీంనగర్‌లో 6లక్షల ఎకరాలు, మెదక్‌లో 5.59లక్షల ఎకరాలు, వరంగల్‌లో 5.32లక్షల ఎకరాల భూమికి కొత్తగా సాగునీరు అందనుంది. రంగారెడ్డి జిల్లాలో కేవలం 2.46లక్షల ఎకరాలు సాగులోకి రానుండగా, కొత్త ప్రాజెక్టులు అందుబాటులోకి వస్తే అత్యధికంగా నల్లగొండ జిల్లాలో రికార్డుస్థాయిలో 16.37లక్షల ఎకరాలు పండనుంది. మొత్తం వరంగల్ ఆయకట్టు 13.71లక్షల ఎకరాలకు, కరీంనగర్ ఆయకట్టు 14.7లక్షల ఎకరాలకు, మహబూబ్‌నగర్ ఆయకట్టు 12.98లక్షల ఎకరాలకు పెరగనుంది.

విస్తీర్ణం ఎక్కువ.. సాగు తక్కువ

రాష్ట్రంలో ఉమ్మడి జిల్లాలవారీగా పరిశీలిస్తే మహబూబ్‌నగర్ విస్తీర్ణపరంగా అత్యధికంగా ఉన్నప్పటికీ సాగు అతి తక్కువగా ఉంది. పూర్వ మహబూబ్‌నగర్ మొత్తం విస్తీర్ణం 45.55లక్షల ఎకరాలు ఉండగా, వీటిలో 34.92లక్షల ఎకరాలు సాగుయోగ్యత ఉన్న భూమిగా అధికారిక రికార్డులు సూచిస్తున్నాయి. కానీ సాగునీరు అందుతున్న ప్రాంతం కేవలం 5.17లక్షల ఎకరాలే. పాలమూరు తర్వాత సాగుయోగ్యత అధికంగా ఉన్న ప్రాంతం నల్లగొండ. పూర్వ నల్లగొండ జిల్లాలో 27.69 లక్షల ఎకరాలు సాగవుతుండగా, ఇందులో ప్రాజెక్టుల ద్వారా నీరందుతున్నది 11.97లక్షల ఎకరాలకే. మెదక్ జిల్లాలో 12.68లక్షల ఎకరాల సాగుయోగ్యత ఉన్నా ప్రాజెక్టుల ద్వారా నీరందుతున్నది 2.87లక్షల ఎకరాలకే. ఈ లోటును కాళేశ్వరం, పాలమూరు ప్రాజెక్టులు భర్తీచేసే అవకాశాలున్నాయి.

పూర్వ జిల్లాల వారీగా.. భూముల విస్తీర్ణం, సాగుయోగ్యత

ఉమ్మడిజిల్లా	విస్తీర్ణం(లక్షల్లో)	సాగు
ఆదిలాబాద్	40.03	20.39
కరీంనగర్	29.37	19.15
వరంగల్	31.73	19.79
నిజామాబాద్	19.92	12.40
ఖమ్మం	39.06	13.94
నల్లగొండ	34.97	27.69
రంగారెడ్డి	18.7	14.08
మెదక్	23.52	12.68
మహబూబ్‌నగర్	45.55	34.92
మొత్తం	**282.85**	**175.04**



టౌన్ ప్లానింగ్‌లో సంస్కరణలు

- స్టేట్ యూనిఫైడ్ రూల్ అందుకే : కేటీఆర్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ప్రజలు తెరాస ప్రభుత్వం నుంచి సరికొత్త పాలన ఆశించారని, ఆ దిశగానే పాలనలో అనేక సంస్కరణలతో ముందుకు సాగుతున్నామని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. ఇందులో భాగంగానే స్టేట్ యూనిఫైడ్ రూల్స్‌ను తీసుకువచ్చామన్నారు. సాధారణ పౌరునికి అత్యంత పారదర్శకంగా, ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని అనుమతులు వచ్చేలా డిపిఎంఎస్ విధానాన్ని అమలులోకి తీసుకువచ్చామన్నారు. సోమవారం నగరంలోని ఖైరతా బాద్ లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ కార్యాలయంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న టౌన్‌ప్లానింగ్ సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ, పాలనలో పారదర్శకతకు తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రాముఖ్యతను ఇస్తోందన్నారు. డిపిఎంఎస్ విధానంలో నెల రోజుల గడువును కుదించి 21 రోజుల్లోనే అన్ని అనుమతులు వచ్చేలా చేశామన్నారు. అప్లయ్ చేసుకున్న వారం రోజుల్లో లోపించిన పత్రాల తాలుకు సమాచారాన్ని దరఖాస్తుదారునికి తెలియజేయాలన్నారు. అనుమతుల ప్రక్రియలో అనవసర ఆలస్యాన్ని తగ్గించేందుకు ఈ విధానం తీసుకువచ్చామన్నారు. డిపిఎంఎస్ విధానం పట్ల టౌన్ ప్లానింగ్ అధికారులు పూర్తి అవగాహన పెంచుకోవాలని, సంపూర్ణ పరిజ్ఞానంతో పనిచేయాలని మంత్రి ఆదేశించారు. ప్రజల్లో అధికార వ్యవస్థకు మరించ పేరు తెచ్చేలా ప్రతి ఒక్క అధికారి పనిచేయాలని అధికారులను ఆదేశించారు.



బేగంపేట విమానాశ్రయంలో భారత ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుకు వీడ్కోలు పలుకుతున్న గవర్నర్ నరసింహన్, ఉపముఖ్యమంత్రి మహమూద్ అలీ.

విమానయాన కేంద్రంగా హైదరాబాద్!

- సాంకేతికంగా విస్తరిస్తున్న భాగ్యనగరం : కేటీఆర్
- టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు శంకుస్థాపన

హైదరాబాద్, ఆంధ్రప్రభ : సాంకేతికపరంగా హైదరా బాద్ ఎంతో విస్తరిస్తోందని, స్థానిక యువత నైపుణ్యా లను వీటికి జోడించాల్సిన అవసరం ఉందని ఐటిశాఖ మంత్రి కేటీ రామారావు అన్నారు. హైదరాబాద్ ఏరోస్పేస్ కేంద్రంగా అభివృద్ధి చెందుతోందని, టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ (టిఎఎస్ఎల్) కీలక టెక్నాలజీ సెంటర్ కానుందని ఆయన అన్నారు. టిఎఎస్ఎల్, అమెరికాకు చెందిన జిఈ సంస్థల ఏరో-ఇంజన్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు సోమవారం కేటీఆర్ భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లా డుతూ, డిసెంబర్ చివరినాటికి సంస్థ విమానాల ఇంజన్లు ఉత్పత్తి ప్రారంభిస్తే అది హైదరాబాద్‌కే కొత్త రికార్డుగా ఉంటుం దన్నారు. టిఎఎస్ఎల్ ద్వారా ఉన్నత శ్రేణి టెక్నాలజీ మార్పు చెందుతూ విస్తరిస్తోందని, ఇది ఉపాధి అవకాశాలకు దోహద పడుతుందన్నారు. హైదరాబాద్‌లో రెండు ఏరో పార్కులు, రాష్ట్రంలో ఐదు ఎయిర్ స్ట్రిప్స్ ఏర్పాట వుతున్నాయని, ఇది విమానయాన రంగం అభివృద్ధి సంకేతంగా నిలుస్తుం దన్నారు. స్థానిక మానవ వనరుల ద్వారా టెక్నా లజీపరమైన కంపెనీలు రావలసిన అవసరం ఉందని కేటీఆర్ అన్నారు.

జనవరి నాటికి ఏరో-ఇంజన్ ఉత్పత్తి విశాల్ వాన్చూ

తమ సంస్థ బెంగళూరులో ఆర్అండ్‌డి, హైదరాబాద్‌లో కాంపోనెంట్ డిజైన్, మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్ ఏర్పాటు చేసిందని జీఈ సౌత్ ఆసియా సీఈవో విశాల్ వాన్చూ చెప్పారు. ఏరో ఇంజన్ యూనిట్ వచ్చే జనవరి నాటికి ఉత్పత్తి ప్రారం భించి ఎగుమతి చేయనున్నట్లు చెప్పారు. ప్రస్తుతం భారత్ నుంచి తమకు ఎలాంటి ఆర్డర్లు రాలేదని, అయితే తమ సంస్థకు ఇప్పటికే ఉన్న ఏరో ఇంజన్లు ఎగుమతి చేస్తామని చెప్పారు. ప్రపంచ శ్రేణి ఏరో-ఇంజన్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటులో రాష్ట్ర ప్రభుత్వం భాగస్వామ్యం ఉందని, తమ ప్రాజెక్టుకు ప్రభుత్వ సహకారం హర్షణీయమన్నారు. భారతీయ విమాన పరిశ్రమ కోసం దేశీయ సామర్థ్యం నిర్మిం చేందుకు తమ రెండు సంస్థలు కలిసి ఈ ప్రాజెక్టు అమలు చేస్తు న్నాయని విశాల్ పేర్కొ న్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి పి.మహేందర్‌రెడ్డి, టిఎస్-ఐఐసి ఎండి వెంకట నరసింహారెడ్డి, టాటా సన్స్ ఇన్‌ఫ్రా, ఏరోస్పేస్ ప్రెసిడెంట్ బన్మాలీ అగర్వాల పాల్గొన్నారు.





రాజ్‌భవన్‌లో గవర్నర్ నరసింహన్‌ను కలిసిన సీఆర్‌పీఎఫ్ (సౌత్ జోన్) అడిషనల్ డైరెక్టర్ జనరల్ పంకజ్ కుమార్.

కేంద్ర పథకాలతో సుస్థిర ఉపాధి

- 2022 నాటికి నూతన భారత్ ఆవిష్కరణ
- ఎన్ఐఆర్‌డి శిక్షణా కార్యక్రమంలో కేంద్రమంత్రి రాంకృపాల్ యాదవ్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత కార్యక్రమాల ద్వారా గ్రామీణ ప్రజలకు సుస్థిర ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఎంతో ఉందని కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ సహాయ మంత్రి రాంకృపాల్ యాదవ్ చెప్పారు. ఉపాధి హామీ, ప్రధానమంత్రి ఆవాస్ యోజన, ముద్రా యోజన, గ్రామ సడక్ యోజన తదితర పథకాలను సమర్థంగా అమలుచేసి గ్రామీణ ప్రజలకు జీవనోపాధి పెంచాలని ఆయన సూచించారు.

గ్రామీణ అంశాలకు సంబంధించి దక్షిణ ఆసియా స్థాయిలో ప్రారంభమైన శిక్షణా కార్యక్రమాన్ని సోమవారం మంత్రి ప్రారంభించారు. 12 నుంచి 16వ తేదీ వరకు రాజేంద్రనగర్‌లోని ఎన్ఐఆర్‌డి నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో భారత్, బంగ్లాదేశ్, నేపాల్, శ్రీలంక దేశాల నుంచి వంద మందికిపైగా నేషనల్ ట్రైనింగ్ ప్రోగ్రామ్‌లో పాల్గొంటున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎన్ఐఆర్‌డి డైరెక్టర్ జనరల్ డాక్టర్ డబ్ల్యు. రాంపుల్లారెడ్డి, ఎన్ఐఆర్‌డి అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రమేష్ శక్తివేల్, పంచాయతీరాజ్ ముఖ్య కార్యదర్శి వికాస్‌రాజ్, కమిషనర్ నీతూ ప్రసాద్, సెర్ప్ సీఈవో పౌసమి బసు తదితరులు పాల్గొ న్నారు.



ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ, 2022 నాటికి నూతన భారతాన్ని ఆవిష్కరించాలని, అందుకోసం ప్రణాళికాబద్ధంగా పనిచేయాల్సి ఉందన్నారు. ఈ లక్ష్యసాధనలో వ్యవసాయ ఆదాయం రెట్టింపు చేయడం, గ్రామీణాభివృద్ధి, గ్రామ యువతకు ఉపాధి, విద్య, ఆరోగ్యం, మౌలిక సదుపాయాలు కల్పించాలన్న లక్ష్యానికి అనుగుణంగా కార్యక్రమాలు విజయవంతం చేయాలని మంత్రి కోరారు. ప్రభుత్వ పథకాలను కేత్రస్థాయిలో ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకోవలసిన అవసరం ఉందని రాంకృపాల్ యాదవ్ చెప్పారు.

జూపల్లి మాట్లాడుతూ, ఉపాధి హామీ పథకం కింద పని దినాలను 8 కోట్ల నుంచి 16 కోట్లకు పెంచాలని కేంద్రాన్ని కోరారు. రాష్ట్రానికి రూ.750 కోట్ల మెటీరియల్ కాంపోనెంట్ చెల్లించాల్సి ఉందని కేంద్ర మంత్రి దృష్టికి తెచ్చారు. 2003-04లో జరిగిన పొరపాటు నివేదికలతో రాష్ట్రానికి ప్రధానమంత్రి సడక్ యోజన కింద రావలసిన 1,230 కిలోమీటర్ల రహదారులను మంజూరు చేయలేదని, దీనిపై కేంద్ర బృందాలు క్షేత్రస్థాయిలో పర్యటించి నివేదిక ఇచ్చాయని చెప్పారు. దీనికి సంబంధించి రూ.800 కోట్ల విలువైన రహదారుల నిర్మాణానికి పిఎంజి ఎస్‌వై-2 కింద అనుమతి ఇవ్వాలని జూపల్లి కోరారు. రాష్ట్రానికి మూడు విడతల్లో 16 రూరల్ క్లస్టర్లను మంజూరు చేశారని, అయితే కనీసం జిల్లాకు ఒక్కటైనా ఇవ్వాలని కోరుతూ కేంద్రమంత్రికి ఈ మేరకు ఓ వినతిపత్రం సమర్పించారు.

స్వచ్ఛతలో నంబర్‌వన్!

- 15,320 మందితో రోడ్లు శుభ్రం : కేటీఆర్ పిలుపు



సిటీబ్యూరో, హైదరాబాద్ : స్వచ్ఛతలో నగరాన్ని అగ్రస్థానంలో ఉంచుదామని పురపాలక, ఐటీ శాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు ప్రజలకు పిలుపునిచ్చారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో హైదరాబాద్ పతాకాన్ని జాతీయ స్థాయిలో ఎగురవేయాలని కోరారు. గత ఏడాది స్వచ్ఛ స్వరేక్షణ్‌లో దేశవ్యాప్తంగా ఉన్న మెట్రో నగరాల్లో హైదరాబాద్‌కు అగ్రస్థానం దక్కిందని.. అదే స్ఫూర్తితో ఈ ఏడాదికి సంబంధించి చేయాల్సిన పనులు చాలా ఉన్నాయని సూచించారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా 15,320 మంది రోడ్లను శుభ్రం చేసి గిన్నిస్ రికార్డు నమోదు చేయడం అభినందనీయమన్నారు. స్వచ్ఛ భారత్ ప్రారంభం కంటే ముందు స్వచ్ఛ హైదరాబాద్ కార్యక్రమానికి సీఎం కేసీఆర్ శ్రీకారం చుట్టారని మంత్రి గుర్తుచేశారు. స్వచ్ఛ హైదరాబాద్ కింద నగరాన్ని 400 యూనిట్లుగా విభజించి.. బల్దియా సహకారంతో నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని పునరుద్ఘాటించారు.

ఈ మేరకు సోమవారం రాంనగర్ డివిజన్‌లోని బాగ్‌లింగంపల్లి ప్రధాన రహదారిని ఒకేసారి 15,320 మంది విద్యార్థులు శుభ్రం చేసి గిన్నిస్ రికార్డు నమోదు చేసిన కార్యక్రమంలో మంత్రి కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. స్వచ్ఛత విషయంలో హైదరాబాద్ మహానగరాన్ని జాతీయ స్థాయిలో ముందుంచాలని కోరారు. 2017లో స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వేలో మెట్రో నగరాల్లో మొదటి స్థానంలో నిలిచామని.. ప్రస్తుతం అదే స్ఫూర్తితో అగ్రభాగాన నిలిచేలా చూడాలని కోరారు. తడి-పొడిగా చెత్తను వేరు చేసేలా విద్యార్థులు తమ తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని విజ్ఞప్తి చేశారు. బల్దియా సిబ్బంది సామర్థ్యంతో హైదరాబాద్‌లో రోజుకు 4,500 మెట్రిక్ టన్నుల చెత్తను తరలిస్తున్నట్లు తెలిపారు.

నిధులున్నాయ్.. ఖర్చుపెట్టండి!



- ఎస్సీల ప్రత్యేక అభివృద్ధినిధి సమీక్షలో మంత్రి జగదీష్‌రెడ్డి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాబోవు 50 రోజుల గడువులోగా ఎస్సీల అభివృద్ధికి రూ. 7,686 కోట్లు ఖర్చు చేయాలని ఎస్సీ అభివృద్ధి శాఖ మంత్రి జి. జగదీష్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. కొన్ని శాఖలు వార్షిక సంవత్సరం ముగుస్తున్నప్పటికీ ఏ మాత్రం నిధులు ఖర్చు చేయకపోవడం పట్ల ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. శాఖాధిపతులు ప్రణాళికాబద్ధంగా కార్యాచరణ రూపొందించుకోవడంలో విఫలమవు తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దళితుల అభివృద్ధి, సంక్షేమం కోసం భారీ మొత్తంలో నిధులు అందు బాటులో ఉన్నప్పటికీ వాటిని ఖర్చు చేయకపోవడం సహేతుకం కాబోదన్నారు. దళితుల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక నిధిని ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. నిర్దిష్ట వ్యవధిలో లక్ష్యాలను చేరుకొనేందుకు అధికారులు సహకరించాలన్నారు. కొన్ని శాఖలు నిధుల వ్యయంపై దృష్టి పెట్టడం లేదని అన్నారు. ఇక మీదట నిధులు వ్యయం చేయడానికి ప్రణాళికాబద్ధంగా వ్యవహరించవలసి ఉందన్నారు. దళితుల అభివృద్ధికి జనవరి వరకు రూ. 6,689 కోట్లు ఖర్చు చేశారు. మార్చి మాసాంతానికి మరో రూ. 7,686 కోట్లు ఖర్చు చేయవలసి ఉంటుంది. షెడ్యూల్డు కులాల అభివృద్ధి నిధి కింద వార్షిక బడ్జెట్‌లో రూ. 14,375.30 కోట్లు కేటాయించారు. దళితుల అభ్యున్నతి కోసం 197 సంక్షేమ పథకాలతో పాటు 219 ఉప సంక్షేమ పథకాలను అమలు జరుపుతున్నారు. దాదాపు 42 శాఖల పరిధిలో దళిత అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఇన్ని శాఖల భాగస్వామ్యం ఉన్నప్పటికీ నిధులను సకాలంలో ఖర్చు చేయలేని పరిస్థితి రాష్ట్రంలో నెల కొంది. దళిత అభివృద్ధి శాఖ మంత్రి జి. జగదీష్‌రెడ్డి ప్రత్యేక అభివృద్ధి నిధి చట్టం అమలుపై సంబంధిత అధికారులతో సోమవారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. దళితుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని , వారి అభ్యున్నతి కోసం కేటాయించిన నిధులు సకాలంలో వ్యయం చేయలేని పరిస్థితి నెలకొనడం ఆందోళనకు గురి చేస్తుందన్నారు. సమీక్ష అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడారు. మొత్తం నిధులను మార్చి మాసాంతానికి వ్యయం చేయాలని నోడల్ ఏజెన్సీలను ఆదేశించామన్నారు.

సమాజ స్థితిపై రచనలు రావాలి

- కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు స్వీకారోత్సవ సభలో దేవీప్రియ సూచన

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: ప్రముఖ రచయిత, కవి దేవీ ప్రియను ప్రతిష్టాత్మక కేంద్ర సాహిత్య అకాడమీ-2017 పురస్కారంతో సత్కరించింది. సోమవారం న్యూఢిల్లీలో కామని ఆడిటోరియంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. వివిధ భాషల్లో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గెలుపొందిన రచయితలకు పురస్కారాన్ని అందజేశారు. కేంద్ర సాహిత్య అకాడమీ అధ్యక్షుడు చంద్రశేఖర్ కాంబర్ చేతుల మీదుగా విజేతలకు సాహిత్య అకాడమీ అవార్డులను అందించారు. తెలుగు భాషలో గాలిరంగు కవితా సంపుటి రచించిన దేవీ ప్రియకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వరించింది. సాహిత్య అకాడమీ అధ్యక్షుడు చంద్రశేఖర్, ఆయనకు శాలువా కప్పి, సాహిత్య అకాడమీ జ్ఞాపిక, లక్ష రూపాయలు అందజేశారు. సాహిత్య రంగంలో అత్యున్నతమైన కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు అందుకోవడం చాలా ఆనందంగా ఉందని కవి దేవీప్రియ అన్నారు. గాలి రంగు కవిత్వానికి అవార్డు సంతోషకరమైన విషయమన్నారు. సమాజంలో ప్రస్తుత పరిస్థితులపై రచనలు రావాల్సిన అవసరముందన్నారు. యువత సైతం సాహితీరంగంలోకి రావాలని అభిలషించారు. ఉర్దూ భాషలోమహ్మద్ బేగ్ ఎహసాస్ కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డును అందుకున్నారు. సాహిత్య అకాడమీ కార్యదర్శి శ్రీనివాసరావు తొలి ప్రసంగం చేయగా, అధ్యక్షుడు చంద్రశేఖర్ అధ్యక్షోపన్యాసం చేశారు.

దేవీప్రియ అసలుపేరు షేక్ ఖాజా హుస్సేన్, 1949 ఆగస్టు 1న గుంటూరులో జన్మించారు. కాలేజీ రోజుల్లోనే కవిత్వం పట్ల ఆకర్షితుడై పద్యాలు, గేయాలు రాయడం ప్రారంభించారు. గుంటూరు కేంద్రంగా అవతరించిన పైగంబర కవులు బృదంలో దేవీప్రియ ఒకరు. పాత్రికేయుడిగా పలు దినపత్రికల్లో పనిచేశారు.




వ్యంగ్య, విమర్శకనాత్మకమైన సమాజానందస్వామి, రన్నింగ్‌కామెంటరీ, కార్టూన్ కవిత్వం ద్వారా తెలుగు పత్రికా రంగంలో కొత్త ఒరవడి సృష్టించారు. అమ్మచెట్టు, సమాజానందస్వామి, గరీబు గీతాలు, నీటిపుట్ట, తుఫాను తుమ్మెద, రన్నిం గ్‌కా మెంటరీ, అరణ్య పురాణం, పిట్ట కూడా ఎగిరిపోవల్సిందే, అధ్యక్షా మన్నించండి తదితర రచనలు చేశారు.

12 నుంచి 17వరకు సాహిత్యోత్సవం

వివిధ భాషల రచయితలతో కలిసి ఆరురోజుల పాటు ఫెస్టివల్ ఆఫ్ లెటర్స్ పేరుతో సాహిత్యోత్సవాన్ని నిర్వహిం చనున్నారు. వివిధ అంశాలపై అనేక కార్యక్రమాలను ఈ ఉత్సవంలో నిర్వహించ తలపెట్టారు. గిరిజన సాహిత్యం, మీడియా సాహిత్యం, సాహితీకారులతో ఫేస్ టు ఫేస్, 70 ఏళ్ల భారత స్వాతంత్ర్యం సాహితీ రంగం, దళిత సాహిత్యం, దేశసమగ్రతకు సాహిత్యం, యువ సాహితి, కవి సమ్మేళనం, ఈశాన్య రాష్ట్రాల రచయితల సదస్సు, భారత రాజ్యాంగం సాహితీ వర్ణన, అనువాద సాహిత్యం తదితర అంశాలపై ఈ సాహిత్యోత్సవం నిర్వహించాలని నిర్ణయించనున్నారు.

ప్రాణాంతక వ్యాధులకు చికిత్స చౌక



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : తక్కువ ఖర్చుతో ప్రాణాంతక వ్యాధులకు చికిత్స అందించేందుకు వివిధ పరిశోధనలు జరుగుతు న్నాయని అందుకు 10 ప్రాజెక్టులకు పరిశోధనల బాధ్యతలను అప్ప గించినట్టు అటవీ, పర్యావరణ, బీసీ సంక్షేమ శాఖా మంత్రి జోగురామన్న తెలిపారు. సోమవారం సచివాలయంలోని తన చాంబర్‌లో జరిగిన రాష్ట్ర సైన్స్ అండ్ టెక్నాలజీ కౌన్సిల్ మధ్యంతర సమీక్ష సమావేశంలో మంత్రి జోగురామన్న సుదీర్ఘంగా చర్చించారు. ప్రస్తుతం అత్యంత ఖరీదుగా మారిన వైద్య పరీక్షలను చౌకగా అందించేందుకు సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ తరఫున కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. క్యాన్సర్, కిడ్నీ, మైగ్రెన్, బీ-తలసే మియా వంటి ప్రాణాంతక వ్యాధులకు తక్కువ ఖర్చుతో వైద్యం ప్రజలకు అందించే ందుకు చర్యలు తీసు కుంటున్నట్టు ఆయన పేర్కొన్నారు. వివిధ వ్యాధుల పరిశోధనల బాధ్యతలను ప్రతిష్టాత్మక సంస్థలకు అప్పగిం చామన్నారు. పరిశోధనల కోసం రూ.50 లక్షలను మంజూరుచేశామని, తొలివిడతగా రూ.25లక్షల రూపాయలను విడుదల చేశామన్నారు. స్థానిక పరిశోధనలకు ప్రాధాన్యత ఇవ్వ నున్నట్టు ఆయన తెలిపారు. వాననీటిని భూగర్భజలా ల్లోకి కలపడం ద్వారా నల్లగొండ జిల్లాల్లో ఫ్లోరైడ్ శాతాన్ని క్రమంగా తగ్గించే అవకాశం ఉన్నట్టు శాస్త్రవేత్తలు ఈ సందర్భంగా మంత్రితో పేర్కొన్నారు. జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లా మర్రిగూడ మండల పాఠశాలలో దీనిని ప్రయోగాత్మకంగా అమలు చేసిన విషయాన్ని శాస్త్రవేత్తలు తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మ కంగా చేపట్టిన డబుల్ బెడ్‌రూం ఇళ్లలో రేడియేషన్ గుర్తించడం ప్రాజెక్టు మరో లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు.



కంది కష్టాలు!

(మొదటిపేజీ తరువాయి)

మార్కెట్లోకి రావడంతో సమస్యలు ఉత్పన్నమ వుతున్నాయి. అవసరం మేరకు ఇప్పటికే కొనుగోలు చేసి నిల్వ చేసుకున్న వారు ఇదే అదునుగా అమాంతం ధరలను తగ్గించి కొంటున్నారు. ప్రభుత్వ పరంగా రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ ద్వారా ఇప్పటివరకు భారీగానే కొనుగోలు చేశామని అధికారులు చెబుతున్నారు. వాస్తవ పరిస్థితులను పరిశీలిస్తే కొన్న కందులను నిల్వ చేయడానికి తీవ్రమైన గిడ్డంగుల కొరత ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఇబ్బడి ముబ్బడిగా కొనుగోళ్ళు జరిగినందున వ్యాపారులెవరూ ప్రస్తుతం ఆసక్తి చూపడంలేదు.

కష్టార్జితం కూడా మిగలని రైతులు

కందులను పండించిన రైతులకు ఎటూ పాలుపోని పరిస్థితి నెలకొంది. కష్టపడి చెమటోడ్చి పండించడమే కాదు, దుక్కి దున్నడం మొదలుకుని, పంట చేతికందే వరకు పెట్టుబడుల కోసం తెచ్చిన అప్పులు తీర్చే మార్గమే కనిపించడం లేదు. గత్యంతరం లేక రోడ్లెక్కి ఆందోళనకు దిగుతున్నారు. ఈ దుర్భిక్ష పరిస్థితులకు ప్రభుత్వమే పరోక్షంగా కారణమవుతోంది. గత ఏడాది సీజన్ ప్రారంభానికి ముందు ప్రపంచ వ్యాప్తంగా పత్తి సంక్షోభం కొనసాగుతున్నందున ఆ పంటను సాగు చేయవద్దంటూ వ్యవసాయశాఖ అధికారిక ప్రకటన చేసింది. పత్తికి ప్రత్యామ్నాయంగా కంది పంటను సాగు చేసుకోవాలంటూ గ్రామగ్రామాన రైతులకు తెలిసేలా ప్రచారం చేసింది. అంతేకాకుండా ప్రత్యేక సబ్సిడీపై విత్తనాలను ఏమాత్రం కొరత లేకుండా సరఫరా చేశారు. దీంతో అన్నదాతలు రెచ్చిపోయి కంది పంటను సాగు చేశారు. వ్యవసాయశాఖ ఉన్నతాధికారులకు సైతం ఊహకందని విధంగా దాదాపు రెండింతల విస్తీర్ణంలో ఈ పంట సాగైంది. అదే సమయంలో దిగుబడి కూడా రెండింతలైంది.

వారం రోజులుగా ఆందోళనలు

పక్షం రోజుల నుంచి కందులు పెద్దఎత్తున మార్కెట్లోకి వచ్చాయి. కొనుగోలు చేసేందుకు వ్యాపారులు ముందుకు ంాకపోవడంతో ప్రస్తుతం ఈ అంశం తీవ్రమైన సమస్యగా తయారైంది. ముగిసిన ఖరీఫ్‌లో సాధారణంగా 2.60 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో కంది పంట సాగవుతుందని వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు ముందస్తు అంచనాలతో ప్రతిపాదనలు సిద్ధం చేసుకున్నారు. పత్తికి ప్రత్యామ్నాయంగా ఇచ్చిన ప్రోత్సాహంతో గరిష్టంగా 25శాతం విస్తీర్ణం పెరుగుతుందని భావించారు. కానీ, ప్రభుత్వ అంచనాలను తారుమారు చేస్తూ దాదాపు 200శాతం విస్తీర్ణానికి కంది పంట గణనీయంగా పెరిగింది.

రికార్డు స్థాయిలో కంది సాగు 4.36 లక్షల హెక్టార్లు

సాధారణంగా అయితే ఖరీఫ్‌లో 2.60 లక్షల హెక్టార్లలో సాగు కావాల్సిన కంది పంట, ఈ సారి ఉమ్మడి రాష్ట్ర చరిత్రలోనూ ఎన్నడూ లేనివిధంగా 4.36 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో సాగైంది. ఇది సాధారణ విస్తీర్ణంలో 188 శాతం అధికం. రికార్డులను పరిశీలిస్తే 2016 ఖరీఫ్‌లో కంది పంట విస్తీర్ణం 2.48 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో మాత్రమే సాగైంది. కంది పంట సాగు విస్తీర్ణం భారీగా పెరిగిన నేపథ్యంలో పత్తి పంట విస్తీర్ణం తగ్గిపోయింది. సాధారణంగా 17.09 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో సాగు కావాల్సిన ఈ పంట ఈ ఏడాది 12 లక్షల హెక్టార్లను మించలేదు. 2016 ఖరీఫ్ సీజన్‌లో మాత్రం సాధారణాన్ని మించి 17. 73 లక్షల హెక్టార్లో పత్తి విస్తరించినట్లు అధికారులు చెబుతున్నారు.

భారీగా పెరిగిన ఉత్పాదక వ్యయం

కంది పంటను పండించే రైతుకు ప్రతి కిలో ధాన్యానికి అయ్యే ఉత్పాదక వ్యయం సరాసరిగా పన్నెండు రూపాయలు అవుతుందని ఒక అంచనా. కానీ రైతుకు ఆ మొత్తం కూడా మిగలడం లేదు. ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) ప్రతి క్వింటాలుకు రూ.5,450 కాగా, ఉత్పాదక వ్యయం 7వేల 500 రూపాయలకు మించిపోతోంది. అంటే పెట్టుబడి శ్రమకు మించి 25శాతం నష్టాన్ని భరించాల్సి వస్తోంది. ఈ ఏడాది తలెత్తిన సరికొత్త సమస్యను చూస్తే కంది రైతులకు ఊహించని నష్టాలు ఎదురవుతున్నాయి. గిట్టుబాటు కాని కనీస మద్దతు ధరలకు కూడా కొనుగోలు చేయడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, పంటకోత ఖర్చులు, రవాణా వ్యయం, కూలీతో పాటు రైతు కుటుంబ శ్రమ అన్నీ కలిపి అన్నదాతకు వ్యవసాయం మోయలేని భారంగా తయారైంది.

గత్యంతరం లేక రోడ్డెక్కుతున్న రైతులు

కష్టాల నుంచి బయట పడేందుకు మార్గం తోచని ఈ పరిస్థితుల్లోనే అన్నదాతల ఆగ్రహం కట్టలు తెంచు కుంటోంది. రోజుల తరబడి మార్కెట్ యార్డుల్లో ధాన్యాన్ని కుప్పలు పోసి కొనుగోలుకు ముందుకు రాని పరిస్థితుల్లో, ప్రభుత్వం పట్టించుకోని సందర్భాల్లోనే ప్రత్యక్ష దాడులకు దిగుతున్నారు. గత వారం రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా ప్రధాన మార్కెట్లలో రైతుల ఆందోళనలు, నిరసనలు కొనసాగుతున్నాయి. అదుపు తప్పుతున్న పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర మార్కెటింగ్‌శాఖ మంత్రి హరీష్‌రావు రంగంలోకి దిగారు. కనీస మద్దతు ధరలను అమలు చేస్తూ కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించి పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.

కంది కొనుగోళ్లకు నిధులు

- మార్క్‌ఫెడ్, హాకా సంస్థలకు చెరో రూ.300 కోట్లు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రంలో స్తంభించిన కంది కొనుగోళ్ళపై ప్రభుత్వం స్పందించింది. ప్రభుత్వ రంగ సంస్థలైన మార్క్‌ఫెడ్, హాకా సంస్థలకు చెరో రూ.300 కోట్ల చొప్పున నిధులు సమకూర్చింది. ఈ మేరకు సోమవారం వ్యవసాయ సహకార శాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారధి ఉత్తర్వులు జారీ చేశారు. నిర్ధేశించిన మొత్తాలను ఆయా సంస్థలు జాతీయ బ్యాంకుల ద్వారా పొందాలని సూచించారు. ప్రభుత్వ గ్యారంటీ ఉంటుందన్నారు. ఈ సీజన్‌లో హాకా సంస్థ ద్వారా మొత్తం 11లక్షల క్వింటాళ్ళ కందులను కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంటే ఇప్పటివరకు 8,01, 139 క్వింటాళ్ళు పూర్తిచేసినట్లు తెలిపారు. అందుకు రూ.460 కోట్లు వెచ్చించామన్నారు. అలాగే మార్క్‌ఫెడ్ సంస్థ ద్వారా మొత్తం 7.52 లక్షల క్వింటాళ్ళ కందులను కొను గోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటివరకు 3.93 లక్షల క్వింటాళ్ళు పూర్తిచేసినట్లు వెల్లడించారు. అందుకు రూ.214.8 కోట్లు వెచ్చించినట్లు పార్థసారధి జీవోలో వెల్లడించారు.



ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యానాయుడుతో సమావేశమైన ఆంధ్రప్రభ ఎండి ముత్తా గౌతమ్

ఉపరాష్ట్రపతితో ఆంధ్రప్రభ ఎండీ ముత్తాగౌతమ్ భేటీ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : భారత ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడుతో 'ఆంధ్రప్రభ' దినపత్రిక మేనేజింగ్ డైరెక్టర్ ముత్తా గౌతమ్ సోమవారం సమావేశమయ్యారు. రెండు రోజులపాటు నగరంలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన ఉప రాష్ట్రపతిని బంజారాహిల్స్‌లోని ఆయన నివాసంలో గౌతమ్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

కంది రైతులను ఆదుకోండి

- కేంద్రానికి ఎంపీ వినోద్ విజ్ఞప్తి

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: ఆంధ్రప్రదేశ్‌లోని కంది రైతులను ఆదుకోవాలని తెలంగాణా ఎంపీ కేంద్రాన్ని కోరారు. కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బి.వినోద్ కుమార్ ఢిల్లీలోని తెలంగాణా భవన్ ప్రిన్సిపల్ రెసిడెంట్ కమిషనర్ అశోక్ కుమార్‌లతో కలిసి సోమవారం కృషి భవన్‌లో కేంద్ర పౌర సరఫరాలు, ఆహార శాఖ మంత్రి రాం విలాస్ పాశ్వాన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణలో కందులు అధిక దిగుబడి అయినందున, రైతులను ఆదుకునేందుకు కేంద్రం కందులను కొనుగోలు చేయాలని కోరారు. సమావేశం అనంతరం వినోద్ మీడియాతో మాట్లాడుతూ... పీఎస్‌ఎఫ్ (ప్రైజ్ స్టేబిలైజేషన్ ఫండ్) కింద కందులను కొనుగోలు చేయాలని పాశ్వాన్‌ను కోరామని తెలిపారు. తమ విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి కందులు కొనుగోలు చేసేలా కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రికి లేఖ రాస్తామని హామీ ఇచ్చారని వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈసారి దాదాపు 2 లక్షల 84 వేల మెట్రిక్ టన్నుల కంది పంట సాగైందని ఎంపీ తెలిపారు. రైతులకు ఎంఎస్‌పీ దక్కేలా కందులు కొనుగోలు చేయాలని హరీష్ కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రిని రెండు సార్లు కలిశారని అన్నారు. రాష్ట్ర మంత్రి, ఎంపీల విజ్ఞప్తులతో కేంద్ర ప్రభుత్వం దాదాపు లక్షా 67 వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసిందని, మిగిలిన లక్ష మెట్రిక్ టన్నుల పరిస్థితి ఎంతో కేంద్రమే చెప్పాలని ఆయన అన్నారు. అన్ని పంటలకు ఎంఎస్‌పీ ఇస్తామని ప్రధాని మోడీ చెబుతున్నప్పటికీ వాస్తవ పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉందని విమర్శించారు. సాగైన పంటలో 30 శాతమే కేంద్రం కొంటామంటోందని, మరి 70 శాతం పంటను ఎవరు కొనాలని వినోద్ ప్రశ్నించారు.



టాప్‌గేర్‌లో మంత్రులు

- టీఆర్ఎస్ సర్వే సంకేతం
- ర్యాంకును మెరుగుపరుచున్న మంత్రులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ రాష్ట్రసమితి రాష్ట్రంలోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ పరిస్థితిపై మూడుసర్వేలు నిర్వహించగా, ఈ సర్వేల్లో మంత్రులందరికీ మంచి మార్కులు వచ్చినట్లు పార్టీవర్గాల సమాచారం. గతంలో సిఎం నిర్వహించిన సర్వేలలో కొందరు మంత్రుల ర్యాంకింగ్ పడిపోగా.. చాలా మంది తమ పనితీరును గణనీయంగా మెరుగుపరుచుకున్నట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. సిఎం తాజాగా నిర్వహించిన సర్వేకు సంబంధించి మంత్రుల్లో హరీష్‌రావు, కెటిఆర్ మళ్ళీ అగ్రస్థానాల్లో ఉండగా.. గతంలో తక్కువ రేటింగ్ వచ్చిన మంత్రులు కూడా తమ పనితీరును గణనీయంగా మెరుగుపరుచుకుని మంచిస్థితిలో ఉన్నారని చెబుతున్నారు. ప్రస్తుత కేబినెట్‌లో డిప్యూటీసిఎంలు కడియం శ్రీహరి, మహమూద్ అలీ, హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డిలు మండలి నుండి ప్రాతినిధ్యం వహిస్తుండగా.. సిఎం మినహా 13మంది ఎమ్మెల్యేలు శాసనసభ నుండి ఉన్నారు. ఈ 13నియోజకవర్గాల్లోనూ మంత్రులు టాప్‌గేర్‌లో ఉన్నట్లు తాజా సర్వేలు తేల్చాయి. ముఖ్యమంత్రి కెసిఆర్ చేసిన సూచనలను ఆచరణలో పెట్టిన మంత్రులు తమ శాఖలకు సంబంధించిన పనులతో పాటు తమ సొంత నియోజకవర్గాల్లోనూ జనంతో మమేకం కావడంతో పరిస్థితి మెరుగుపడినట్లు పార్టీవర్గాలు చెబుతున్నాయి. మంత్రులెవరికీ.. వారి నియోజకవర్గాల్లో ఇబ్బందిలేదని, ఎపుడు ఎన్నిక జరిగినా విజయం ఖాయమని తాజా సర్వే ఫలితాలను తెలుసుకున్న ముఖ్యనేతలు చెబుతున్నారు.

ఈ సర్వే ఫలితాలను అన్నికోణాల్లో విశ్లేషించి.. త్వరలో జరిగే సమావేశంలో సిఎం కెసిఆర్ ఎమ్మెల్యేలకు వీటిని అందజేసే అవకాశముందని తెలంగాణభవన్ వర్గాల సమాచారం. మొత్తంగా సర్వేల ప్రచారంతో నియోజకవర్గాల్లో నేతలు మరింత అప్రమత్తమయ్యారు. 2018జనవరి 1 తర్వాత ఉన్న పరిస్థితిపై ఈ సర్వేలు జరిగినట్లు తెలిసింది. జనవరిలో రెండు సర్వేలు, ఫిబ్రవరిలో మరో సర్వే అన్ని నియోజకవర్గాల్లో నిర్వహించినట్లు పార్టీవర్గాల ద్వారా తెలిసింది.

పేదల కష్టాలు మోడీకే తెల్సు

- కేంద్రమంత్రి రామ్ కృపాల్ యాదవ్ కితాబు



హైదరాబాద్, ఆంధ్రప్రభ : గ్రామాల అభివృద్ధి జరిగినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి రామ్‌క్రిపాల్ యాదవ్ అన్నారు. ఇందుకు ఎన్డీయే ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతను ఇస్తోందన్నారు. పేదల కష్టాలు, బాధలు తెలిసిన వ్యక్తి ప్రధాని నరేంద్రమోదీ అని అన్నారు. సోమవారం నాంపల్లిలోని భాజపా కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్‌తో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వాలు గ్రామ స్వరాజ్యానికి అంతగా ప్రాధాన్యతను ఇవ్వలేదని విమర్శించారు. దీని కారణంగా ఇంకా వేలాది గ్రామాలకు కరెంటు లేని పరిస్థితి ఉందని అన్నారు. అందుకే మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగు సంవత్సరాల్లోనే నాలుగు కోట్ల ప్రజలకు ఉచితచంగా కరెంటును అందిస్తోందన్నారు. రోటీ, కపడా, మకాన్ (అన్నం, బట్టలు, ఇళ్ళు) ఈ మూడు అంశాలను దృష్టిలో పెట్టుకుని మోదీ తీసుకుంటున్న నిర్ణయాలపై ఆశించిన ఫలితాలు వస్తున్నాయన్నారు. వేల కోట్లాది రూపాయల ఖర్చు చేస్తున్నామన్నారు. 2019 నాటికి కోటి ఇళ్ళను నిర్మించి ఇవ్వాలన్న లక్ష్యంతో కేంద్ర సర్కార్ పనిచేస్తోందన్నారు.

విద్యుత్ చార్జీలు యథాతథం

- విద్యుత్ వాహనాలకు చార్జింగ్ స్టేషన్లు
- ఎల్‌టీ2. హెచ్‌టీ2 కేటగిరిలో ప్రతిపాదన
- ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు
- వ్యవస్థ పటిష్టతతో మెరుగైన సేవలు: సీఎండీ రఘుమారెడ్డి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్రంలో విద్యుత్ చార్జీల టారీఫ్‌ను స్వల్ప మార్పులతో యథాతథంగా కొనసాగించనున్నారు. నాణ్యమైన నమ్మకమైన విద్యుత్ సరఫరాతో వినియోగదారుడికి మరిన్ని మెరుగైన సేవలు అందించనున్నారు. సోమవారం ప్యాప్సిలో 2018-19 ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదించిన ఆదాయ ఆవశ్యకత ,రిటైల్ సరఫరా ధరలు ,క్రాస్ సబ్సిడి, సర్ చార్జీలు, అదనపు సర్‌చార్జీలపై ఎస్పీడీసీఎల్ సమర్పించిన ప్రపాదనలపై తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి బహిరంగ విచారణ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈఆర్‌సీ ఛైర్మన్ ఇస్మాయిల్ అలీఖాన్ ,సభ్యులు శ్రీనివాసర రావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎస్పీడీసీఎల్ సీఎండి రఘుమారెడ్డితోపాటు విద్యుత్ పంపిణీ సంస్థ డైరెక్టర్లు, వివిధ జిల్లాల ఎస్ఇలు, పారిశ్రామిక, వాణిజ్య సంస్థల ప్రతినిధులు, ఆర్టీసీ, రైల్వే,ఏయిర్ పోర్ట్ సంస్థల ప్రతినిధులు , రైతుసంఘాల నాయకులు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. ఎస్పీడీసీఎల్ పరిధిలో 2018-19కిగాను సమగ్ర ఆదాయ అవశ్యకత ప్రతిపాదనలను ఈ సందర్భంగా టీఎస్‌ఈఆర్సీకి సమర్పించారు. సమగ్ర ఆదాయం రూ.23519కోట్లుగా నివేదికలో వెల్లడించారు. ఆదాయ అంచనాలు రూ.18504కోట్లు కాగా టారీఫేతర ఆదాయం రూ.36కోట్లు , స్థూల రెవెన్యూ లోటు రూ4979 కోట్లుగా నివేదికలో వివరించారు. క్రాస్ సబ్సిడీ సర్చార్జీతో ఆదాయ అంచనాలు రూ.312కోట్లు, అడిషనల్ సర్చార్జీ ఆదాయ అంచనాలు రూ.444కోట్లుగా అంచనా వేశారు. రూ.4222కోట్ల నికర రెవెన్యూ లోటుతో ఈఆర్సీకి నివేదిక సమర్పించారు. దక్షిణ తెలంగాణవిద్యుత్ సంస్థ పరిధిలోని మొత్తం 14జిల్లాల్లో అన్ని రకాల విద్యుత్ కనెక్షన్లు కలిపి 82.25లక్షలు ఉన్నట్లు వెల్లడించారు. 2017-18లో సవరించిన అంచనాల మేరకు విద్యుత్ కొనుగోలుకు 38664 మిలియన్ యూనిట్లు కాగా ,ఇది 2018-19కి 42193 మిలియన్ యూనిట్లుగా అంచనా వేశారు. విద్యుత్ కొనుగోలుకు ఖర్చు సవరించిన అంచనాల మేరకు 2017-18లో రూ.18307 కోట్లు కాగా 2018-19లో రూ.18433కోట్లుగా అంచనా వేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2017-18 టారీఫ్ ఆర్డర్లోని ధరలను రాబోయే ఆర్థిక సంవత్సరం 2018-19కి కూడా కొనసాగించాలని ప్రతిపాదించారు. విద్యుత్ వాహనాల చార్జింగ్ స్టేషన్లకు ఎల్‌టీ-2, హెచ్ -2 కేటగిరిలో ప్రతిపాదించారు. ఓపెన్ యాక్సెస్ వినియోగదారులకు స్టాండ్‌బై చార్జీలు ప్రతిపాదించారు. ఎత్తిపోతల పథకాల కేటగిరికి సింగిల్ పార్ట్ టారీఫ్‌ను టూ పార్ట్ టారీఫ్‌గా ప్రతిపాదించారు. ఎనర్జీ చార్జీలు రూ.4.88గా , డిమాండ్ చార్జీలు కిలోవాట్‌కు నెలకు రూ.390గా ప్రతిపాదించారు. అయితే రాష్ట్ర స్థాయిలో ఎత్తిపోతల పథకాలకు సంబంధించి ఆదాయంలో మాత్రం ఎటువంటి మార్పు ఉండదని ప్రతిపాదించారు. క్రాస్ సబ్సిడీ చార్జీల ప్రతిపాదనల్లో సర్చార్జీ ధరలను సగటు రాబడిపైన 20శాతం పరిమితం చేయకూడదని ఎస్పీడీఎసీఎల్ ప్రతిపాదనల్లో ఈఆర్‌సీని అభ్యర్థించారు.

సమగ్ర ఆదాయ ,ఆవశ్యకత (ఏఆర్ఆర్) విద్యుత్ చార్జీలుపై ఎస్పీడీసీఎల్ సమర్పించిన ప్రతిపాదనలపై వివిధ వర్గాల వినియోగదారులు తమ తమ అభిప్రాయాలను వెల్లడించారు. అనంతరం ఎస్పీడీసీఎల్ సీఎండి జి.రఘుమారెడ్డి అందరి అభిప్రాయాలు సూచనలు, ప్రశ్నలు ,ఆరోపణలకు వివరణ ఇచ్చారు. ఎస్పీడీఎసీఎల్ పరిధిలో అవినీతిపై విచారణలు జరిపి కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. అవినీతి రహిత డిస్కంగా మార్చేందుకు అన్నిస్థాయిల్లో అధికారులతో పాటు వినియోగదారులు కూడా తమ వంతు సహకారం అందిచాలని కోరారు. 24గంటల విద్యుత సరఫరా ద్వారా విద్యుత్ ప్రమాదాలు తగ్గాయన్నారు. గత ఏడాది జనవరిలో 12 కేసులు నమోదు కాగా ఈ ఏడాది జనవరిలో 7కేసులు మాత్రమే నమోదయ్యాయని వివరించారు. టోల్ ఫ్రీ నంబర్‌ను విస్తృతంగా ప్రచారంలోకి తెస్తామన్నారు. లూజ్‌లైన్లను సరిచేసేందుకు ఈ ఏడాది రూ.132కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. సెప్టెంబర్ నాటికి ఈ పనులు పూర్తవుతాయని వెల్లడించారు. 24గంటల విద్యుత్ సరఫరా వల్ల ట్రాన్స్ ఫార్మర్ల ఫెయిల్యూర్స్ కూడ తగ్గాయన్నారు. ఆటో స్టార్టర్లను రైతులు స్వచ్ఛందంగానే తొలగించుకుంటున్నారని తెలిపారు. విద్యుత్ డిమాండ్ సరఫరాలో సమన్వయం కోసమే కొంత మేరకు మిగులు విద్యుత్‌ను రిజర్వ్‌లో పెట్టుకోవాల్సి వస్తున్నట్టు వెల్లడించారు. రాత్రి పూట విద్యుత్ డిమాండ్ తగ్గుతుందన్నారు. హెచ్‌టీ వినియోగదారులకు రాత్రి విద్యుత్‌పై ఒక రూపాయి ఇన్సెంటీవ్‌గా ఇస్తున్నామన్నారు. సోలార్ విద్యుత్ వల్ల లైన్‌లాస్ తగ్గిందన్నారు.



మోడీజీ...జయ్‌షా

అవినీతి మాటేమిటి?

- యెడ్డీ జైలుకెళ్లి వచ్చాడు, మంత్రులదీ అదేతీరు
- 11 మంది నేతలు రాజీనామా చేశారే
- రైతుల రుణమాఫీ చేయకుంటే, నోరు మెదపరు
- యువతకు ఉద్యోగాలివ్వలేదు, ఉపాధి కల్పించలేదు
- కర్నాటక ఎన్నికల జనాశీర్వాద్ యాత్రలో రాహుల్ ధ్వజం

రాయ్‌చూర్: ప్రధానమంత్రి నరేంద్ర మోడీపై రాహుల్‌గాంధీ మాటల దాడిని ముమ్మరం చేశారు. బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా కుమారుడు జయ షా అవినీతి గురించి ఎందుకు మాట్లాడటం లేదని కాంగ్రెస్ అధ్యక్షుడు నిలదీశారు. కర్నాటక ఎన్నికల ప్రచారంలో భాగంగా మూడో రోజు సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీ, సభల్లో మోడీని లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పించారు. మోడీజీ... అవినీతి గురించి మాట్లాడేటప్పుడు మీ ఎడమ, కుడి వైపున చూసి ఆరోపణలు చేయాలన్నారు. భూతకాలం నాటి ఘటనలు ప్రస్తావిస్తే.. బాగుంటుందని అన్నారు. ఓ వైపు యెడ్యూరప్ప కనిపిస్తాడు, ఆయన ఇప్పటికే జైలుకు కూడా వెళ్లొచ్చారు. ఇక మరో వైపు చాలా మంది మంత్రులు అందులో నలుగురు ప్రముఖులు ఉన్నారు. 11 మంది అవినీతి ఆరోపణలతో రాజీనామాలు చేసిన విషయాన్ని మరచిపోయారా అని రాహుల్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. మీరు అవినీతి గురించి మాట్లాడితే... తొలుత అమిత్ షా గురించి చెప్పండి, యాభై వేల రూపాయలు పెట్టుబడి పెట్టి... మూడు నెలల్లో రూ.80కోట్లు ఆర్జించారో... అదెలాగో ఈ దేశ ప్రజలకు చెబితే బాగుంటుందని ఎద్దేవా చేశారు.

''ఉద్యోగాల కల్పనలో మోడీ విఫలమయ్యారు, రైతన్నలు నిరాశతో కొట్టుమిట్టాడుతున్నారు. మనకు చైనానే పోటీ అంటూ యువతకు ఉపన్యాసాలు ఇస్తున్నారు. చైనా 24 గంటల్లో 50వేల మంది యువతకు ఉద్యోగాలు కల్పిస్తోంది'' అంటూ దుయ్యబట్టారు. రాయ్‌చూర్ సమీపంలో రోడ్డు పక్కన గ్రామస్తులతో రాహుల్ గాంధీ ముచ్చటిస్తూ... ప్రధానమంత్రి రైతులకు ఏమైనా చేశారా అని ఆరా తీశారు. తాను వ్యక్తిగతంలో ప్రధాని కార్యాలయానికి వెళ్లి, రుణాల మాఫీ చేయాలని నరేంద్రమోడీని కోరినా పట్టించుకోలేదని ఆరోపించారు. రైతుల రుణాలు మాఫీ చేయాలని కర్నాటక ప్రభుత్వానికి సూచించా, తక్షణమే అమలు చేశారని రాహుల్ గుర్తుచేశారు. ఇప్పటికైనా ప్రధాని కళ్లు తెరిచి, రైతుల రుణాలు మాఫీ చేసి, కష్టాల నుంచి గట్టెక్కించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. జనాశీర్వాద్ యాత్రలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా బారులు తీరిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, ప్రజలకు అభివాదం చేస్తూ... గ్రామ కూడళ్లలో ఆగి స్థానికులతో మమేకమై వారి సాదకబాధలు విన్నారు. మరోసారి




కాంగ్రెస్‌కు ఓటు వేసి గెలిపిస్తే... అధికారంలోకి వచ్చిన వెంటనే రైతుల రుణాలు మాఫీ చేయడంతో పాటు, అన్నదాతల ఆదాయం రెట్టింపు అయ్యే చర్యలు తీసుకుంటాం, యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పిస్తామని హామీనిచ్చారు.

'ఉగ్గానీ-మిర్చీ భజ్జీ' ఆరగించిన రాహుల్

సోమవారం ఉదయం రాయ్‌చూర్ శివారులో కమలం వద్ద రోడ్డు ప్రక్కన హోటల్ వద్ద ఆగాడు. అక్కడ గుమిగూడిన గ్రామస్తులతో రాహుల్‌గాంధీ ముచ్చటించారు. గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని స్థానికుల రాహుల్ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం అక్కడే ఆ హోటల్‌లో కాంగ్రెస్ నేతలతో కలిసి 'ఉగ్గానీ - మిర్చీ భజ్జీ' ఆరగించాడు. అనంతరం తేనీరు సేవించారు. సిద్ధరామయ్య, వీరప్పమొయిలీ మధ్య కూర్చొని, పార్టీ నేతలతో ముచ్చటిస్తూ... నవ్వుతూ కనిపించారు. అనంతరం హోటల్ బిల్లు చెల్లించి, బస్సు ఎక్కి ''జనాశీర్వాద్ యాత్ర''లో భాగంగా బీదర్‌కు బయలుదేరి వెళ్లారు. రాహుల్ వెంట లోక్‌సభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే, కేపీసీసీ అధ్యక్షుడు జి.పరమేశ్వర, ఎన్నికల ప్రచార కమిటీ కన్వీనర్ శివకుమార్, పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి కె.సి. వేణుగోపాల్ తదితరులు కూడా ఉన్నారు.

చమురు నిల్వల కేంద్రంగా భారత్

- ఫలించిన మోడీ ఆయిల్ మంత్రం
- భారత్‌లో యూఏఈ ఆయిల్ నిల్వలు
- మంగళూరులోని ఐఎస్‌పీఆర్ఎల్‌కు..58 లక్షల 60వేల మిలియన్ బ్యారళ్ల క్రూడాయిల్
- ఇంధన అత్యవసర పరిస్థితుల్లో వాడేలా ప్రణాళికలు



న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోడీ పశ్చిమాసియా దేశాల పర్యటనతో భారత వాణిజ్య రంగం లో మరో ముందడుగు పడింది. యూ ఏఈతో మోడీ జరిపిన చర్చల ఫలించడంతో మన దేశం చమురునిల్వల కేంద్రంగా మారిపోతోంది. ఇంత వరకెన్నడూ లేని విధంగా తొలిసారి అరబ్ దేశాలు భారత్‌లో ఆయిల్ పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధమవడం ఆహ్వానించదగిన పరిణామం.క్రూడాయిల్ విషయంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న భారత్ లాంటి దేశానికి యూఏఈ అధికారిక ఆయిల్ కంపెనీ తన ఆయిల్ నిల్వలను పంపేందుకు సిద్ధపడటం ఊహించని పరిణామని కార్పోరేట్ దిగ్గజాలు చెబుతున్నాయి. అబు దాబీ జాతీయ ఆయిల్ కంపెనీ తీసుకున్న ఈ నిర్ణయం భారత్‌ను ప్రాంతీయ ఆయిల్ స్టోరేజీ, ట్రేడింగ్ హబ్ గా మార్చేసింది. యూఏఈ ఆయిల్ నిల్వలు భారత్‌కు చేరితే పశ్చిమాసియా, భారత్ కొనుగోలుదారులు, అమ్మకందారుల మధ్య బంధం మరింతగా బలపడుతుంది. ఓఎన్జీసీ విదేశ్ - అబుదాబీ జాతీయ ఆయిల్ కంపెనీ ఈ మేరకు ఒప్పందంపై సంతకాలు చేశాయి. ఈ ఒప్పందం ప్రకారం కర్నాటకలోని మంగళూరులోని పుదూర్ లో క్రూడాయిల్ నిల్వ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. నిల్వ చేసిన క్రూడాయిల్ ను దేశ ఇంధన అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు అందజేస్తారు. అబుదాబీ యువరాజు షేక్ మహ్మద్ బిన్ జాయేద్ గత నెల రిపబ్లిక్ డే వేడుకలకు భారత్‌కు అతిథిగా విచ్చేసిన సమయంలో ఈ ప్రాజెక్టుకు సంబంధించిన చర్చలు జరిగాయి. ప్రధాని మోడీ అబుదాబీ పర్యటనలో మరోసారి కూలంకషంగా చర్చించి భారత్‌లో ఆయిల్ స్టోరేజీకి ఇరుదేశాల ప్రతినిధులు సంతకాలు చేశారు. తాజా ఒప్పందం ప్రకారం అబుదాబీ నుంచి భారత్ లోని ఐఎస్‌పీఆర్ఎల్ మంగళూరుకు 58లక్షల 60 వేల మిలియన్ల బ్యారల్ల క్రూడాయిల్ వస్తోంది. ఈ ఆయిల్ నిల్వలు ముగిసిపోతే మరోసారి చర్చలు జరిపి అత్యవసరంగా అవసరమైన మేరకు ఆయిల్ ను భారత్‌కు పంపేందుకు అబుదాబీ సంసిద్ధత వ్యక్తంచేసింది.ఐఎస్‌పీఆర్ఎల్ మంగళూరులోని రెండు ఆయిల్ నిల్వ కేంద్రాల్లో నిల్వ సామర్థ్యం ప్రస్తుతం ఒకటిన్నర మిలియన్ టన్నులుగా ఉంది. ఇప్పటికే ఒక కంపార్ట్‌మెంట్‌ను కేంద్రం అందజేసిన నిధులతో నింపారు. అబుదాబీ నుంచి వచ్చే ఆయిల్ నిల్వలను రెండో కంపార్ట్ మెంట్‌లో నింపుతారు. ఈ రెండు కంపార్ట్ మెంట్లలోని ఆయిల్ దేశ ఇంధన ఎమర్జెన్సీ సమయంలో వాడటానికి ఉద్దేశించారు..

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్

ఆంధ్రప్రభ

మంగళవారం 13 ఫిబ్రవరి 2018

మోడీ ఆగ్నేయాస్త్రం

ప్రధాని నరేంద్ర మోడీ తాజాగా ముగించుకుని వచ్చిన ఆగ్నేయాసియా పర్యటనలో ఎన్డీయే ప్రభుత్వ శైలినీ, పనితీరును వివరించడంలో కృతకృత్యులయ్యారు. పాలస్తీనాతో ఆయన 40 మిలియన్ డాలర్ల విలువ చేసే ఒప్పం దాలను కుదుర్చుకున్నారు. పాలస్తీనా అధ్యక్షుడు అబ్బాస్‌తో పనిలో పనిగా పాకిస్తాన్ తీవ్రవాదాన్ని ప్రస్తావించారు. ముస్లిం దేశంలో మరో ముస్లిం దేశం చేస్తున్న క్షుద్ర చర్యలను ప్రస్తావించడం పాక్‌ను ఏకాకిని చేసేందుకు ఉద్దేశించిన చర్యే. గల్ఫ్ దేశాలలో ఆయన పర్యటించడం ఇది అయిదో సారి. ఇంధనం, రైల్వేలు, మానవ వనరులు, ఆర్థిక సేవలు వంటి రంగాల్లో భారత్- యుఏఈలు ఆయన సమక్షంలో ఐదు ఒప్పందాలను కుదుర్చుకున్నాయి. మూడు దేశాల పర్యటనలో ఆయన వ్యవహార శైలి రానున్న ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా సాగించినట్లు కనిపించింది. రాయితీలను బ్యాంకు ఖాతాలకు జమచేయడానికి ఆధార్ అనుసంధానం, కరెన్సీ రద్దు నిర్ణయాలు మోడీ హయాంలో తీసుకున్న వివాదాస్పద నిర్ణయాలు. పన్ను ఎగవేతదారులు, రుణాల ఎగవేతదారులు ఈ పర్యటనలోని ప్రతి ప్రసంగంలోనూ ప్రధాన అంశాలయ్యాయి. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సౌకర్యాల కల్పనకు ప్రభుత్వ పథకాలు ఎలా ఉపయోగపడుతున్నదీ ఆయన వివరించారు. విదేశాల్లో చేసిన ఈ ప్రసంగాల సారాంశం స్వదేశంలోని ఓటరును లక్ష్యంగా చేసుకున్నట్లు కనిపించింది. మస్కట్‌లో భారతీయ సంతతి ప్రజలను ఉద్దేశించిన ప్రసంగం ఈ ఉద్దేశాన్ని బాగా కనిపించేలా చేసింది. వాస్తవానికి నరేంద్ర మోడీ ప్రభుత్వం పాటించిన విధానాలు అంతర్జాతీయ సమాజం దృష్టిని కూడా ఆకర్షించాయి. ఆయన తీసుకున్న నిర్ణయాలు భారత్‌లో తీవ్ర ప్రభావాన్ని చూపాయి. విదేశాల్లోనూ అంతే ప్రభావం కనిపించింది. 500, 1000 రూపాయల నోట్ల రద్దు, గూడ్స్ అండ్ సర్వీస్ టాక్స్ ఆయన నిర్ణయాల్లో అగ్రభాగాన నిలుస్తాయి. ఆర్థిక వ్యవస్థలో భాగస్వాములైన వారినందరినీ ఈ రెండూ తీవ్రంగా ఇబ్బందిపెట్టాయి. ఈ నిర్ణయాలు మోడీకి మాత్రం మంచి పేరు తెచ్చాయి. ఎటువంటి నిర్ణయాన్నయినా సాహసోపేతంగా తీసుకుంటారన్న పేరొచ్చింది. ఆదివారం మస్కట్‌లో భారతీయ సంతతిని ఉద్దేశించి మోడీ మాట్లాడుతూ, ఎన్డీయే ప్రభుత్వం చేపట్టిన నాలుగు పథకాల ద్వారా గడిచిన మూడేళ్ళలో లక్షా నలభైవేల కోట్ల రూపాయలను దేశానికి ఆదా చేశాయని చెప్పడం వెనుక ప్రజలను ఉపశమింపజేయడానికేనన్న ఉద్దేశం ప్రబలంగా కనిపిస్తోంది. పారదర్శకత కారణంగానే సొమ్మును ఆదా చేయగలిగామని చెప్పుకొచ్చారు మోడీ. దేశంలో ఎల్ఈడీ బల్బుల వాడకాన్ని ప్రోత్సహించడం ఒక్కటే 60 వేల కోట్లను ఆదా చేసిందన్నారు. ఈ వ్యాఖ్య కచ్చితంగా 2019 సాధారణ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని చేసిందే. పేద, మధ్య తరగతి ప్రజలకు ఇలాంటి వ్యాఖ్యలు ఉపశమనాన్ని కలిగించడమే కాక, ఎన్డీఏ ప్రభుత్వం పట్ల అనురక్తినీ పెంచుతాయనడంలో సందేహం లేదు. ఇలాంటి కార్యక్రమాలను అత్యుత్తమంగా ప్రజల్లోకి సంతృప్తికరంగా తీసుకెళ్ళే విద్య మోడీ సొంతం. గడిచిన ఐదేళ్ళుగా మోడీ ఇలాంటి ప్రసంగాలతోనే ఓటర్లను బుట్టలో వేసుకుంటున్నారు. ఆయన స్టార్ క్యాంపెయిన్ వెనుక ప్రధాన విజయం ఇదే. విదేశాల్లో ఇలాంటి ప్రసంగం చేస్తారని ఏ పార్టీ ఊహించి ఉండదు. ప్రతిపక్ష నేతకు అసలు ఇలాంటి ఊహే రాదు. వచ్చినా అది ప్రధానిని విమర్శించడానికే సరిపోతుంది. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఎంత సమర్థంగా ప్రచారం చేసుకుంటే అన్ని ఎక్కువ ఓట్లు బీజేపీకి వస్తాయని నరేంద్ర మోడీకి తెలిసినంతగా ఎవరికీ తెలీదు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో ఆయన మోడీ కేర్ గురించి ప్రస్తావించారు. ఎన్డీఏ ప్రభుత్వం తాజా బడ్జెట్లో ఆవిష్కరించిన ఆరోగ్య ప్రాజెక్టిది. నిజానికి దేశంలో పర్యటించేటప్పుడు ఆయన తన ప్రభుత్వ ఘనతను ప్రసంగాల్లో చాటుకోవచ్చు. విదేశాల్లో వారికి సంబంధించిన సమస్యలను ప్రస్తావించవచ్చు. వాటిని తీర్చడానికి ఎలాంటి చర్యలు చేపడుతున్నదీ తెలియజేయవచ్చు. గల్ఫ్ దేశాల్లో భారతీయుల వెతలను ఉదహరించి, వాటి నుంచి బయటపడే మార్గాలనూ చెప్పవచ్చు. కానీ అలా చేయలేదు నరేంద్ర మోడీ. విదేశాల్లో ఇలా మాట్లాడడం వెనుక వ్యూహం ఉంది. అంతర్జాతీయ మీడియా దృష్టికి ఈ అంశం వెడుతుంది. తద్వారా మరింత విస్తృత ప్రచారం అందుతుంది. దేశం తలచుకుంటే మోడీకేర్ పథకాన్ని విజయవంతంగా అమలు చేయవచ్చని ఆ సభలో మోడీ అన్న మాట దీనికి సంకేతం. విదేశాల్లోకి వెళ్ళి దేశం తలచుకుంటే అనడం వెనుక వ్యూహం ఇదే. ఇంత పెద్ద ఆరోగ్య పథకాన్ని విజయవంతంగా అమలు చేయడం ఎంత కష్టమో అందరికీ తెలిసిందే. వాస్తవంగా చూస్తే... గత ప్రభుత్వాలకంటే మోడీ ప్రభుత్వానికి కేంద్రంలో అనుకూలమైన పరిస్థితులు నెలకొన్నాయి. సరళీకరణ విధానాలలోనూ, అవినీతిపై యుద్ధంలోనూ, సంక్షేమ పథకాల రాయితీని అమలు చేయడంలోనూ, గ్రామీణ ప్రాంతాలలో మౌలిక వసతులను మెరుగుచేయడంలో ఎన్డీఏ ప్రభుత్వానికి చెప్పుకోతగ్గ సవాళ్ళు కనిపించలేదు. ప్రధానిగా ఆయన పనితీరును రాజకీయ విమర్శకు ప్రశ్నించలేని రీతిలోనే ఉంది. ఆయన చేపట్టిన పథకాల ఫలితాలు ప్రశ్నార్థకంగానే మిగిలాయి. వీటిపై ఎప్పుడూ చర్చకు ప్రతిపక్షాలు సై అంటూనే ఉంటున్నాయి. బ్యాంకింగ్ రంగాన్ని ప్రక్షాళన చేసి, బలోపేతం చేయడం, నూతన ఆర్థిక విధానానికి పయనం కావడం మోడీ లక్ష్యాలలో ప్రధానమైనవి. భారత్‌కు పెట్టుబడులను ఆకర్షింప జేసేందుకు ఈ రెండు అంశాలను మోడీ ఆగ్నేయాసియా పర్యటనలో ప్రతి సందర్భంలోనూ ప్రస్తావించారు. ఈ దేశాలలో ఆసియాకు చెందిన ప్రముఖులున్నారు. వారిని ఆకర్షించడమే మోడీ ధ్యేయంగా కనిపించింది. విధానాలను సరళీకరిస్తున్నామని పదేపదే చెప్పడం వెనుక ఉద్దేశం కూడా ఇదే. ఈ అంశాలన్నింటినీ ఆగ్నేయాసియా పర్యటనలో నరేంద్రమోడీ ప్రముఖంగానూ, ప్రధానంగానూ ప్రస్తావించడంలో కృతకృత్యులయ్యారు. పాలస్తీనియాను సందర్శించిన భారతీయ ప్రధానిగా మోడీ నిలిచిపోతారు. దుబాయ్‌లో స్వామి నారాయణ్ ఆలయాన్ని ఆరంభించడం భారతీయు లను కచ్చితంగా ఆనందిపజేస్తుంది. ఈ పర్యటన ఎలాంటి ఫలితాలను ఇస్తుందో తెలుసుకోవాలంటే కొద్ది కాలం ఆగాల్సిందే.

కర్ణాటకలో కాషాయానికి కషాయమేనా?





శంకరాజీయం

-శంకర్ రాజ్, సీనియర్ పాత్రికేయులు

ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి ఒక అలవాటుంది. భారతీయ జనతా పార్టీకి చెందిన ముఖ్యమంత్రుల్ని ఆయన ఆకాశానికెత్తేస్తారు. ఇతర పార్టీల ముఖ్యమంత్రుల్ని చీల్చి చెండాడతారు. వివాదాలను సృష్టిస్తారు. హిందూ సంస్థలు సృష్టించిన హింసతో ఉత్తర ప్రదేశ్ రక్తమోడుతున్నప్పటికీ ఆయన ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ దాస్‌ను ప్రశంసలతో ముంచెత్తారు. ప్రభుత్వాస్పత్రులలో సౌకర్యాలు కరవై వందలాదిమంది పిల్లలు మరణించిందీ ఇక్కడే. ఉత్తర ప్రదేశ్ కంటే చాలా బాగా పనిచేస్తున్నప్పటికీ కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్యను తీవ్రంగా విమర్శించారు. కాంగ్రెస్ నాయకత్వంలోని కర్ణాటక 10శాతం కమిషన్ ప్రభుత్వంగా వ్యవహరిస్తోందని మోడీ అభివర్ణించారు. ప్రతి కాంట్రాక్టుకూ ప్రభుత్వం పది శాతం ముడుపులు తీసుకుంటుందని ప్రజలందరికీ తెలుసన్నారు. బెంగళూరు లోని ప్రధాన కూడలి నుంచి కెంపగౌడ అంతర్జాతీయ విమానాశ్రయానికి స్టీల్ బ్రిడ్జిని నిర్మించాలని కొద్ది నెలల క్రితం తలపెట్టింది. కోట్లాది రూపాయలు దీనికి ఖర్చు పెట్టాలని భావించింది. సిద్దరామయ్య, ఆయన మంత్రివర్గ సహచరులు తప్ప అందరికీ తెలిసిపోయింది.. ఆ బ్రిడ్జిని తలపెట్టింది భారీగా ముడుపులు అందుకోవడానికేనని విమర్శించారు. 2019 సాధారణ ఎన్నికలలో పార్టీ ఫండ్ ఇవ్వడానికే దీన్ని తలపెట్టారనే సంగతీ అందరికీ తెలుసన్నారు.

పర్యావరణవేత్తలూ, పౌరులు నుంచి వెల్లువెత్తిన నిరసన లతో అది కాస్తా వెనక్కివెళ్ళింది. అది స్టీలు బ్రిడ్జి కాదనీ, కమిషన్ల బ్రిడ్జనీ అందరూ విమర్శించారు. ఉద్యాన నగరికి కంట్లో నలుసులా మారుతుందేమోననే ఉద్దేశంతో సిద్ద రామయ్య ఈ ప్రణాళికను ఉపసంహరించుకున్నారు. ఆర్థిక శాఖను కూడా నిర్వహించే సిద్దరామయ్యకు ఇది మింగుడు పడనిదే. కాంట్రాక్టర్లు చెల్లించాల్సిన కమిషన్ల పెర్సంటేజి వివాదం కారణంగానే వంతెన నిర్మాణం నిలిచిపోయిందని అనేకమంది చెబుతున్నారు. హామీల అమలుపై గుర్రు పెట్టి నిద్రిస్తారని సిద్దరామయ్యకు పేరు. బహిరంగ సభలలో సైతం ఆయన నిద్రపోతూ కనిపిస్తారు. రోడ్లు, కాల్వలు, ఆరోగ్యం, తదితర ప్రధాన పనులపై 60శాతం కూడా నిధులు ఖర్చుచేయలేదు. కమిషన్ల కారణంగానే ప్రజా జీవితాన్ని సుఖమయం చేయగల సత్తా ఉన్న అనేక ప్రాజెక్టులు స్థంభించిపోయాయి.

సిద్దరామయ్య ప్రభుత్వాన్ని కమిషన్ ఏజెంటని మోడీ విమర్శించడం వెనుక కారణం ఉండి ఉండవచ్చు. చరిత్రలోకి తొంగి చూస్తే.. కర్ణాటక రాజకీయ నేతలందరిదీ ఇదే తీరుగా కనిపిస్తుంది. బంగారప్ప నుంచి అనేక మంది ముడుపుల కారణంగా ముఖ్యమంత్రి పదవులకు రాజీనామాలు చేసిన సంగతిని ఎలా మరువగలం. మహాత్మా గాంధీ చిరునవ్వుతో ఉన్న రెండు వేల రూపాయల నోటు లేదా ఇతర కరెన్సీ నోటు లేకుండా విధాన సౌధనుంచి రాయి కూడా కదలదని బెంగళూరులో హాస్యోక్తి.

బంగారప్ప అంటే కాంగ్రెస్ పూర్వ కాలపు మనిషి. ప్రస్తుతం మోడీ మనిషిగా చెలామణీ అవుతున్న బీజేపీ కర్ణాటక ముఖ్యమంత్రి అభ్యర్థి బిఎస్ ఎడ్డియూరప్ప సైతం భారీగా కమీషన్లతో జేబులు నింపుకున్నవారే. సిద్దరామయ్య కనీసం చూసేందుకు నిజాయితీగా కనిపిస్తారు. సిద్దరామయ్య మాదిరిగా కాక ఎడ్డియూరప్ప రాజకీయాన్నో వ్యాపారంలా మార్చేశారు. కుమారులు, అల్లుళ్ళూ ఆయనకు కమిషన్ ఏజెంట్లలా వ్యవహరించేవారు. ఆయన కుటుంబ అనేక చారిటీ సంస్థలను నడిపేది. వాటికి భారీ స్థాయిలో ముడుపులందేవి. అలా ఆ సంస్థలకు నిధులిచ్చిన వారు కోరినదేమైనా ప్రభుత్వంలో చిటికెలో పూర్తయ్యేది. గనుల లైసెన్సు నుంచి భూ మార్పిడి దాకా సునాయాసంగా చేసుకునేవారు. ఈ కారణంగానే ఎడ్డియూరప్ప అవమానకరంగా జైలుకు వెళ్ళాల్సివచ్చింది. దీన్ని దృష్టిలో ఉంచుకుంటే సిద్దరామయ్య కొంచె నయం. కమిషన్లను గుంజుతున్నారనే ఆరోపణలు ఉన్నప్పటికీ ఆయనపై అవి రుజువు కాలేదు. సిద్దూ వైజె ల ౦ క్ రా

వెళ్ళలేదు. కుటుంబం పేరుతో వ్యాపారసంస్థలను నడపలేదు.

ఇటీవల బెంగళూరులో నిర్వహించిన ఓ సభలో.. కాంగ్రెస్ ప్రభుత్వం 10శాతం ప్రభుత్వమని అనేక మంది తనకు చెప్పారని వ్యంగ్యాస్త్రం సంధించారు. ఆయనకు ఎడ్డియూరప్ప ఘనకార్యాల గురించి ఎవరూ చెప్పలేదా? అది కొత్తది కాకపోయినప్పటికీ, ఎడ్డియూరప్ప గురించి వినడానికి చెవుడు నటించి ఉండవచ్చు. తన ఆరోపణను రూఢీ చేయడానికి మోడీ ఇద్దరు మంత్రులు, ఒక సీనియర్ నాయకుడి ఇళ్ళపై ఆదాయ పన్ను శాఖ అధికారుల దాడిని ఉదహరించారు. బెంగళూరులో యంత్రాంగాన్ని ఇసుక మాఫియా నియంత్రిస్తుంది. బదిలీల మాఫియా ఆధిపత్యం చాటుకుంటుంది. నిర్మాణ మాఫియా ఆదేశిస్తుంది. బెంగళూరులో కుంభకోణాలు, మాఫియా సామ్రాజ్యం నగ్నంగా నాట్యం చేస్తుందని కూడా మోడీ తీవ్ర ఆరోపణ చేశారు. ఇక్కడ కూడా మోడీ తప్పులో కాలేశారు. బీజేపీ పరిపాలనలో గనుల పట్టణమైన బెళ్ళారి నుంచి అవినీతి, కుంభకోణాలూ విస్తృతంగా సాగిన సంగతిని ఆయన మరిచిపోయారు. అవి కేవలం ఆరోపణలు కావు. మైనింగ్ రంగంలో డాన్ అయిన గాలి జనార్ధన రెడ్డి బీజేపీ ప్రభుత్వంలో మంత్రిగానూ పనిచేశారు. కుంభకోణాల కారణంగా ఆయన జైలు జీవితాన్ని కూడా గడపాల్సి వచ్చింది. ఇప్పటికీ ఆయనపై అవినీతి, నల్లధనం, కోట్లాది రూపాయలను బ్యాంకులకు చెల్లించకుండా ఎగ్గొట్టారనే ఆరోపణలున్నాయి. తన కుమార్తె వివాహానికి ఆయన 200 కోట్ల రూపాయలను మంచినీళ్ళలా ఖర్చు పెట్టేశారు. ఇది ఓ కుంభకోణం నగ్నంగా నర్తించడం కాక మరేమిటి?

కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం అవినీతికి పాల్పడి ఉండవచ్చు. బీజేపీ అవినీతికి పెద్దన్నయ్యలా కర్ణాటకలో పేరు తెచ్చుకుంది. ఈ కారణంగానే కర్ణాటకలో ప్రజలు మోడీకి మద్దతిస్తారు కానీ, ఎడ్డియూరప్పకూ, ఆయన చుట్టూ ఉన్న అవినీతి బృందానికీ కాదు. ఇద్దరు దొంగలలో ఎవరిని ఎంచుకోవాలనే ప్రశ్న వస్తే ఓటర్లు కచ్చితంగా కాంగ్రెస్ వైపే మొగ్గుతారు. కాంగ్రెస్ ముక్త్ కర్ణాటక చేయాలని మోడీ తపన. ఇలా చేస్తే అవినీతి నుంచి విముక్తం చేయవచ్చనేది ఆయన భావన. కాంగ్రెస్ నుంచి కర్ణాటకు తప్పిస్తే అనువంశిక పాలన, క్షుద్ర రాజకీయాలు, అవినీతి నుంచి కూడా రాష్ట్రాన్ని విముక్తం చేసినట్టేనని మోడీ అంటున్నారు. ఎడ్డియూరప్ప సాగించిన వంశపారంపర్య పాలన మోడీకి తెలుసా? ఆయన కుమారు ఎంపీ. ఆయన సింహాసనానికి వారసుడు. వివిధ వర్గాలను తృప్తి పరిచేందుకు ఎడ్డియూరప్ప కూడా కొన్ని పనులు చేస్తుంటారు. దళితులతో మధ్యాహ్న భోజనం లేదా విందులను ఎట్టి పరిస్థితులలో వదులుకోరు. వారు బీజేపీకి ఓటేస్తారనే ఆశతోనే ఆయనిలా చేస్తారు. పెద్దగా ప్రచారం చేసుకునే ఇలాంటి కార్యక్రమాలు బుజ్జగింపు రాజకీయాలు కావా? కంపు కొట్టే అవినీతి, సిగ్గువాలిన బుజ్జగింపు రాజకీయాలు, మెగా కుంభకోణాలు కర్ణాటక జీవితంలో ఓ భాగమైపోయాయి. ఈ సంగతి అందరికీ తెలుసు. మరి మోడీ నుంచి కర్ణాటక ప్రజలు వినాలనుకుంటున్నది ఏమిటి? బీజేపీ పాలిత గోవా నుంచి ప్రవహిస్తున్న క్లేశం కలిగిస్తున్న మహాదాయి నది జలాలలో భాగస్వామ్యం గురించి వారు వినాలనుకున్నారు. దురదృష్టవశాత్తూ ఆయన ఈ అంశంపై మౌనాన్ని పాటించారు.

బెంగళూరులో నిర్వహించిన ఓ ర్యాలీలో మహాదాయి నదిపై ఒక్క ముక్క మాట్లాడలేదు. ఇది కన్నడ ప్రజలలో అసంతృప్తిని కలిగించింది. దిగ్భ్రాంతికి గురిచేసింది. వివాదాస్పదమైన మహాదాయి నదీ జలాల భాగస్వామ్యం గురించి ప్రస్తావిస్తారని ప్రజలు భావించారు. మీరు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యనూ పరిష్కరిస్తా.. అని మాత్రం అన్నారు. ఇది ప్రజలను నిరాశకు గురిచేసింది. మహాదాయ నదీ జలాల భాగస్వామ్యం ఆయన చెప్పినట్లు చిన్న సమస్య కాదు. పెను సమస్య. ఉత్తర కర్ణాటకలో ప్రజలకు ఈ సమస్య నిద్ర పట్టనీయడం లేదు.

సరిగ్గా ఇదే అంశాన్ని కాంగ్రెస్ అందిపుచ్చుకుంది. కాషాయ దళం ఢిల్లీ కేంద్రంగా పనిచేసే పార్టీయే తప్ప కన్నడ ప్రజలంటే ఏ మాత్రం జాలి లేదని మండిపడింది. నది ప్రవాహంలా హామీలు గుప్పించారు తప్ప మరేమీ కాదని విమర్శించింది. ప్రధాన మంత్రి ప్రసంగించి వెళ్ళిపోయాక, ముంబై-కర్ణాటకల ప్రాంతానికి చెందిన రైతులు విసిగిపోయినట్లు కనిపించడంలో ఆశ్చర్యం లేదు. పైగా మోడీ సాగు నీటి పారుదల, రైతుల ఆత్మహత్యలను ప్రస్తావించారు. ఆ సమయంలోనైనా మహాదాయి గురించి మాట్లాడతారని అంచనా వేశారు. మోడీ ప్రసంగంలో ప్రధాన భాగం కాంగ్రెస్‌పై దాడి చేయడానికే కేటాయించారు. ఈ ఒక్క అంశమూ ఉత్తర కర్ణాటకలో బీజేపీపై తీవ్ర ప్రభావాన్ని చూపించేఅవకాశముంది. ఈ ఏడాది ఏప్రిల్-మే నెలల్లో జరిగే ఎన్నికల్లో ఓటు వేసే సమయంలో ఓటర్లకు మహాదాయి గుర్తొచ్చి తీరుతుంది. మోడీ వ్యాఖ్యలపై స్పందించే సమయంలో సిద్దరామయ్య ఇదే అంశాన్ని ప్రస్తావించారు. దేశంలోనే స్టార్టప్‌లకూ, సృజనకూ కేంద్రంగా ఉన్న నమ్మ బెంగళూరుకు వచ్చినందుకు మోడీగారూ! మీకు కృతజ్ఞతలు. మీకు సమయమున్నప్పుడు కర్ణాటక ప్రజల దాహార్తిని తీర్చేందుకు మహాదాయి వివాదాన్ని పరిష్కరించాల్సిందిగా ప్రజల తరపున విజ్ఞప్తి చేస్తున్నాను. నమ్మకర్ణాటకఫస్ట్ అంటూ సిద్దరామయ్య ట్వీట్ చేశారు. కర్ణాటకకు మీకు స్వాగతం. మీరు గుజరాత్ బిడ్డడైనప్పటికీ.. దేశానికంతటికీ ప్రధాని. ఎంతో కాలంగా అపరిష్కృతంగా ఉన్న మహాదాయి వివాదాన్ని కొలిక్కి తెస్తారని ఆశిస్తున్నాను. ఇది ఉత్తర కర్ణాటక రైతులకు శుభవార్తవుతుంది... అంటూ జేడి(ఎస్) అధ్యక్షుడు హెచ్.డి. కుమారస్వామి తెలిపారు. అబద్ధాల చిట్టాతో కర్ణాటక ప్రజలను తప్పుదారి పట్టిస్తూ, తన పదవికి అప్రతిష్ఠ తెస్తున్నారని కూడా సిద్దరామయ్య ఆరోపించారు.

గౌరవంతోనూ, వాస్తవాలతోనూ ఎన్నికలను ఎదుర్కొనాలి తప్ప 10శాతం కమిషన్ ప్రభుత్వం అనే ఆరోపణలతో కాదని హితవు పలికారు. సిద్దరామయ్య ప్రభుత్వంపై విరుచుకుపడ్డ ఒక్క రోజుకే మోడీ, బీజేపీ కర్ణాటకలో ఇబ్బందికర పరిస్థితిని ఎదుర్కొనాల్సి వచ్చింది. ఆయన వెళ్ళి 24 గంటల తరవాత కర్ణాటక గవర్నర్ వజుభాయ్ ఆర్ వాలా సిద్దరామయ్య పాలనను ప్రశంసించారు. అవినీతిపై యుద్ధం చేస్తోందని కితాబునిచ్చారు. మతపరమైన హింస, అభివృద్ధి అంశాలపై సిద్దరామయ్య పాలన చక్కగా ఉందని పేర్కొన్నారు. కర్ణాటక ఉభయ సభలనుద్దేశించి ప్రసంగిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఎన్నికలకు వెళ్ళే ముందు ఇదే చివరి అసెంబ్లీ సమావేశాలు. శాంతి, భద్రతల పరిరక్షణ ప్రభుత్వం పటిష్ఠమైన చర్యలను తీసుకుంటోందనీ గవర్నర్ పేర్కొన్నారు. మతపరమైన హింసాత్మక ఘటనలనూ ఉక్కుపాదంతో అణిచేశారన్నారు. అవినీతి ప్రభుత్వం ప్రకటించి యుద్ధాన్ని ప్రశంసించారు అవినీతి నిరోధక శాఖనూ, లోకాయుక్తనూ సమర్థంగా ఉపయోగించుకుందన్నారు. ప్రజా వ్యవహారాలలో తమ ప్రభుత్వ అవినీతిపై పోరాటాన్ని కొనసాగిస్తుందన్నారు.

చీలికలు పేలికలైపోయిన బీజేపీకి వ్యతిరేకంగా పరిస్థితుల్ని మార్చేయడంలో సిద్దరామయ్య, కాంగ్రెస్ పార్టీలు కృతకృత్యులయ్యారు. అవినీతి మరకలు ముద్దులుముద్దులుగా అంటిన ముఖ్యమంత్రి అభ్యర్థి, కాషాయదళంలో అంతఃకలహాలూ, మహాయాది నదీ జలాల భాగస్వామ్యంపై మౌనం కర్ణాటకలో తిరిగి అధికారంలోకి రావాలనుకుంటున్న బీజేపీకి అశనిపాతాలుగా పరిణమిస్తున్నాయి.

తిరకాసు రాజకీయం!

గడిచిన వారం రోజులుగా నిజంగా నిధుల గురించేరచ్చ జరుగుతోందా? లేకమరోమైనా ఇతర కారణాలు ఉన్నాయా అన్న మీమాంస జనం మదిలో మెదులుతోంది! ఇందుకు సహేతుకమైన కారణం లేకపోలేదు. నాలుగేళ్ళుగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కాలుకు బలపం కట్టుకుని ఢిల్లీ చుట్టూ తిరిగిన మాట నిజమే... ఆర్థిక లోటు నుంచి పోలవరం వరకూ విభజన చట్టంలో పేర్కొన్న హామీలన్నీ నెరవేర్చాలంటూ ఆయన పదేపదే ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర మంత్రుల చెవుల్లో గూడుకట్టుకుని మరీ పోరాడారు. ముఖ్యంగా పోలవరం నిధుల గురించి ఆయన ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. 2019 ఎన్నికలకు ముందే ఎట్టిపరిస్థితుల్లోనూ పోలవరం ప్రాజెక్టును పూర్తిచేసి సాగునీటిని విడుదల చేయాలన్నది ఆయన సంకల్పం. తెలుగుదేశం భవిష్యత్తు మొత్తం దీనితోనే ముడిపడి ఉందన్నట్టుగా ఆయన ప్రయత్నాలు అంత ప్రత్యేకంగా సాగాయి. పోలవరాన్ని పూర్తి చేసి రైతాంగానికి సాగునీరందించ గలిగితే మిగిలిన అంశాలు ఎలా ఉన్నా జనం పెద్దగా పట్టించుకోరన్నది ఆయన అభిమతం కావచ్చు! ఏదైతేనేం ఆయన ప్రతి సోమవరం నాడు పోలవరం పనులను సమీక్షిస్తూ పోలవారంగా మార్చేశారు. ఇక్కడి వరకూ బాగానే ఉంది... కేంద్రం దేనికెంత నిధులిచ్చినా రాష్ట్రం నుంచి కూడా పెద్దగా అడిగిందీ లేదు... అభ్యంతరపెట్టిందీ లేదు. చెలిమి నిరాఘాటంగా సాగిపోతోంది. రాష్ట్ర భాజపాలోని కొన్ని వర్గాలకు ఇది మింగుడుపడలేదు. అప్పటికే రాష్ట్ర శాఖ అధ్యక్షుడు హరిబాబు వ్యతిరేక వర్గానికి తోడు కాంగ్రెస్ నుంచి భాజపాలోకి వలస వచ్చి చేరిన కొందరు చంద్రబాబు వ్యక్తిగత వ్యతిరేక మాజీ కాంగ్రెస్ పెద్దల గొంతు కూడా కలిసింది. రాష్ట్రానికి చెందిన వెంకయ్యానాయుడు కేంద్ర మంత్రి వర్గంలో చక్రం తిప్పుతుండడం, రాష్ట్రానికి పెద్ద దిక్కుగా కనిపిస్తుండడంతో ఎవరూ బరి దాటే ప్రయత్నం చేయలేదు. లోలోపల ఎంత రగిలిపోతున్నా ఆక్రోశం గొంతు దాటలేదు. భాజపా కేంద్ర నాయకత్వంలో ఏం జరిగిందో ఏమో కాని, తనకు ఏమాత్రం ఇష్టం లేదని చెబుతున్నా వెంకయ్యనాయుడిని ఉపరాష్ట్రపతిని చేసేశారు. అంతే! రాష్ట్రంలో చంద్రబాబు వ్యతిరేక గళాలు ఒక్కసారిగా మిన్నంటాయి. పోలవరం నిధులలో అవినీతి వరద పారుతోందని, నరేగా నిధులతో తెదేపా నేతల జేబులు నిండి పగిలిపోతున్నాయంటూ మొదలైన ఆరోపణలు... చివరకు రెండెకరాల చంద్రబాబు లక్షల కోట్లకు ఎలా అధిపతి అయ్యారో చెప్పాలనే వరకూ సాగాయి. తినగ తినగ గారెలు చేదు... వేప తీయన అన్నట్టు... ఆరోపణల్లో వాస్తవమెంతన్న దానితో పనిలేకుండా, నిబంధనల సాకుతో పోలవరానికి అడ్డంకులు మొదలయ్యాయి. సరే... చంద్రబాబు ఒక మెట్టుదిగి గడ్కరీ ఇంటికి వెళ్ళి మరీ మాట్లాడడంతో పనులు మళ్ళీ గాడినపడ్డాయి. ఆరోపణల మంటలు మాత్రం ఎగిసిపడుతూనే ఉన్నాయి. దీనికితోడు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి పాదయాత్ర సాగుతోంది. నవరత్నాలతో మొదలైన పాదయాత్ర దిశ మార్చుకుని చంద్రబాబు నాయుడు అవినీతిపైనే సాగుతోంది! రాష్ట్రానికి రావాల్సిన నిధుల గురించి కాని, విభజన చట్టంలోని హామీల గురించి కాని జగన్మోహన్ రెడ్డి పట్టుపడుతున్న దానికంటే, చంద్రబాబు మీద దోపిడీ, వంచన ఆరోపణల మీదే ఆయన ప్రసంగాలు కేంద్రీకృతమయ్యాయి. మరోపక్క హస్తినలో ఆ పార్టీ నేత, ఎంపీ విజయసాయిరెడ్డి ప్రధానమంత్రితో అప్పటికే ముచ్చటగా మూడుసార్లు కోరుకున్న సమయానికే భేటీ కాగలిగారు! అంతర్గత చర్చ ఏంటన్నది పక్కనబెడితే, బాహాటంగా మాట్లాడింది మాత్రం ప్రత్యేక హోదా ఎప్పుడిస్తారని ప్రశ్నించాననో, వెంటనే ఇవ్వాలని కోరాననో మాత్రమే ఆయన చెబుతూ వచ్చారు! అదే సమయానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రధాన మంత్రిని కలిసి సరిగ్గా 16 నెలలు! దక్షిణాదిలో ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో పాగా వేయాలని భాజపా అధ్యక్షుడు అమిత్‌షా ఆ సమయంలో ఇచ్చిన పిలుపు భాజపా నేతల్లో చురుకు కలిగించిన మాట నిజం. అవకాశం లేని చోట పట్టు సంగతి అటుంచి అసలు కార్యకలాపాలు ఏవిధంగా సాగించాలన్న దానిపైనే స్థానిక నాయకత్వానికి సరైన కార్యాచరణ లేదు. తెలంగాణలో అయితే, అధికార తెరాసపై విరుచుకుపడడం మొదలెట్టారు. ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో ఉన్నది మిత్రపక్షమాయె! పైగా, కేంద్రంలో, రాష్ట్రంలో అధికారాన్ని పంచుకుంటున్నాయి. భాజపాలోని కంభంపాటి హరిబాబు వ్యతిరేకవర్గం, కాంగ్రెస్ నుంచి వలస వచ్చిన చంద్రబాబు వ్యతిరేక శక్తులు, వైకాపా ఒకే చట్రాన్ని ఆధారంగా చేసుకుని ఆరోపణలు సాగించాయి. ఆ చట్రం చంద్రబాబు అవినీతి! దీనికి భాజపా కేంద్ర అధినాయకత్వం నుంచి ఏమాత్రం అదుపు లేకపోవడంతో జనంలో అనుమాన బీజాలను తలోవైపు నాటడం మొదలైంది. రాష్ట్ర కాంగ్రెస్ ఇప్పటికే చేష్టలుడిగిపోయి నిర్వీర్యమై పోయిందని అటు భాజపా, ఇటు వైకాపా భావిస్తు న్నాయి. ఒకవేళ భవిష్యత్తులో భాజపా, వైకాపాల చెలిమి కుదిరితే కాంగ్రెస్‌లోని అక్కడక్కడ స్థానికంగా పేరున్న నేతలను ఆకర్షించడం అంత కష్టమేమీ కాదన్నది వీరి అభిప్రాయం! అన్నీ అనుకున్నట్టుగా సాగితే అది రాజకీయం ఎలా అవుతుంది?! రోజూ గంటలకొద్దీ అభివృద్ధి పనులు, కొత్త ప్రాజెక్టులను సమీక్షిస్తున్న చంద్రబాబు కాస్త ఆలస్యంగా మేలుకున్నారు! తాను ఇప్పటివరకూ రాష్ట్రాభివృద్ధిపైనే దృష్టి పెట్టాననీ, ఇక పార్టీపరంగా అధిక సమయం కేటాయిస్తాననీ చంద్రబాబు ప్రకటించారు. అప్పటికే ఆయన జరుగుతున్నదేమిటో గ్రహించారు. సరిగ్గా అదే సమయానికి కేంద్ర బడ్జెట్ వేళయింది... చంద్రబాబుపై ముప్పేట దాడి తీవ్రమైన సమయంలోనే కేంద్ర బడ్జెట్ రావడం, అందులో రాష్ట్రానికి ప్రత్యేకంగా కేటాయించింది ఏమీ లేకపోవడంతో ఎదురుదాడికి తెదేపాకు అవకాశం కలిసి వచ్చింది. చంద్రబాబు దిశానిర్దేశంతో ఎప్పటికప్పుడు తెదేపా ఎంపీలు అస్త్రశస్త్రాలను ఎక్కుపెట్టారు. గల్లా జయదేవ్ పదునైన పదజాలంతో కేంద్రం ఉలిక్కిపడింది. తెరవెనుక సాగుతున్న రాజకీయం ఇక సాగదని జయదేవ్ ద్వారా చంద్రబాబు హెచ్చరిక పంపించారని విశ్లేషకుల అంచనా! నమ్మకమైన మిత్రపక్షంగా ముద్రపడిన తెదేపాను కాదని అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటూ, సీబీఐ కేసుల్లో విచారణకు హాజరవుతున్న వైకాపా అధినేతతో కలిసి ఎలా ముందుకు వెళదామనుకుంటున్నారని జయదేవ్ భాజపా అధినాయకత్వాన్ని పార్లమెంటు సాక్షిగా సూటిగా ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఇంత నాటకాన్ని గమనించలేనంత అమాయకులు కాదని పదేపదే ఎత్తి చూపడంతో భాజపా ఆత్మరక్షణలో పడింది. ఇది ఇంతటితో ఆగదని, ఇతర మిత్రపక్షాలలో అప్పటికే రగులుతున్న అసంతృప్తి బాహాటంగా భగ్గుమనే అవకాశాలు వెల్లువవుతున్నాయని గ్రహించింది. దిద్దుబాటు చర్యలకు దిగింది. అదే సమయంలో వైకాపా చంద్రబాబుకు ధీటుగా వ్యూహరచన చేయడంలో విఫలమైంది. పావులు కదపడంలో తత్తర పాటుకు గురైంది. కేంద్ర బడ్జెట్ బ్రహ్మాండంగా ఉందని తొలుత పొగిడిన ఆ పార్టీ నేత విజయసాయి రెడ్డి జనాగ్రహాన్ని గుర్తించి, ప్రత్యేక హోదా ప్రకటించాల్సిందేనంటూ పాత పల్లవిని అందుకున్నారు. అప్పటికే జరగాల్సిన డ్యామేజీ జరిగిపోయింది. కేవలం చంద్రబాబుపై కక్షతోనే ఎడ్డెం అంటే వైకాపా తెడ్డెం అంటోందని జనం గ్రహించారు. సుజనా చౌదరి కేంద్రమంత్రిగా ఉంటూ బడ్జెట్‌కు అభ్యంతరాలు తెలపడం ఏంటని ప్రశ్నించి మరోసారి విజయసాయి సెల్ఫ్ గోల్ చేసుకున్నారు. సుజనా చౌదరి, గల్లా జయదేవ్ కేంద్ర మంత్రులను ముఖ్యంగా అరుణ్ జైట్లీ వాదనను తుత్తునీ యలు చేస్తుంటే జనంలో ఆత్మగౌరవం ఉప్పొంగింది! ఈ స్థాయిలో వైకాపా ఎంపీలు ఎందుకు నిలదీయడం లేదన్న ప్రశ్న తలెత్తింది. అదే సమయంలో విజయ సాయి చేసిన ప్రకటనలు వైకాపాకు చేటు తెచ్చిపెట్టా యనే చెప్పాలి. అప్పటివరకూ సైలెంట్‌గా ఉన్న జనసేనాని పవన్ కల్యాణ్ రంగంలోకి వచ్చారు. లోక్‌సత్తా నేత జయ ప్రకాశ్ నారాయణ, మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్, తదితర రాజకీయ, ఆర్థిక, సామాజిక ఉద్దండులతో కలిసి జాయింట్ యాక్షన్ కమిటీని ఏర్పాటు చేస్తానని ప్రకటించారు. నిధుల విడుదలపై 15లోగా శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని అల్టిమేటం ఇచ్చారు. తెలంగాణ సాధనకోసం ఏర్పడిన జాయింట్ యాక్షన్ కమిటీ తరహాలోనే తాను ఏర్పాటు చేయబోయే జేఏసీ కూడా ఉంటుందని ఆయన చెప్పారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం ఏర్పడిన జేఏసీకి, ప్రత్యేక హోదా కోసం ఏర్పడనున్న జేఏసీకి ఉన్న వ్యత్యాసం గురించి ఆయన పెద్దగా ఆలోచించినట్టు లేరని విశ్లేషకుల భావన! జనసేనాని మదిలో మూడో ఫ్రంట్ ఆలోచన ఉందా అన్నది ఇంకా స్పష్టత రాలేదు. ఏదిఏలాఉన్నా, ఎన్నికల వేళ వేస్తున్న ఎత్తుగడలు, పన్నుతున్న వ్యూహాల్లో ఎవరు గెలుస్తారు? ఎవరు చిక్కుకుని విలవిల్లాడతారన్నది పక్కనబెడితే, రాష్ట్ర ప్రజానీకానికి ఒరిగేదేమిటన్నదే అసలు ప్రశ్న!

● గుళ్లపల్లి దివ్వాబాబు, 9492424829

మంచి మాట

ఆలోచనల్లో నిజాయితీ,
వాక్కులో ధైర్యం, చేతల్లో
నిబద్ధత కలిగిన వారే
దేశానికి అవసరం

- సరోజిని నాయుడు




(నేడు జయంతి)

పాటల పెట్టె కాదు సాంకేతిక చిహ్నం

నేడు ప్రపంచ రేడియో దినోత్సవం

మన ఇంట్లో అల్మరాలో ఉండే ఓ పెట్టె రేడియో అనుకుంటే పొరపాటు. ప్రపంచాన్ని ప్రస్తుత సాంకేతిక చిహ్నంగా చూడటానికి ఉపయోగపడిన రేడియో ప్రజలకు అందించిన జ్ఞానాన్ని మరువలేం. 1820 నుంచి ఎలక్ట్రోమాగ్నెటిక్ తరంగాలపై నిర్వహించిన రకరకాల పరిశోధనల ఫలితాలను ఉపయోగించి 1895లో ఇటలీకి చెందిన మార్కోని రేడియోని కనుగొన్నారు. ఇక ఇండియాలో రేడియో 1923 సంవత్సరంలో రేడియో క్లబ్ ఆఫ్ బాంబే సౌజన్యంతో మొదలైంది. రకరకాల మార్పులతో అభివృద్ధి చెంది సుమారు 245 ఛానల్స్‌కి ఎదిగింది. మొబైల్‌లోనూ రేడియో ఒదిగిపోవడంతో ప్రతి ఒక్కరి జేబులోనూ ఇమిడిపోయింది. ఎంటర్‌టైన్ మెంట్‌కి పెద్దపీట వేసి నడుస్తున్న రేడియో ఛానల్స్



ఇంటర్నెట్‌లో వచ్చే ప్రతి విషయాన్ని తమదైన శైలిలో ప్రజలకు చెప్పి చైతన్యం తీసుకురావడం శుభసూచకం. ఇంటర్నెట్ అందుబాటులో లేని వారికి పెద్దగా చదువుకోనివారికి బాగా ఉపయోగపడుతుంది. బహుశా ఇలాంటి చర్యల వల్లనే ఇండియాలో ఎఫ్ఎమ్ రేడియో ఇండస్ట్రీ 2019 సంవత్సరానికల్లా 656.33 మిలియన్ అమెరికన్ డాలర్లకి చేరుకోబోతోందని ఇండియా ఎఫ్ఎమ్ రేడియో ఇండస్ట్రీ ఫోర్‌కాస్ట్ అండ్ ఆపర్చ్యూనిటీస్ -2019 నివేదిక చెప్తోంది. కేవలం సినిమా పాటలు - ముచ్చట్లే కాకుండా విద్యా, వ్యవసాయ, వైద్య అంశాలపై ఇంకా ఎక్కువ దృష్టి సారిస్తే రేడియో ఎప్పటికీ అందరి మనస్సులో చిరంజీవిగా ఉంటుంది. రేడియో ప్రజా సమాజానికి ప్రపంచ వ్యాప్తంగా చేసిన సహాయానికి ఫిబ్రవరి 13వ తేదీని ప్రపంచ రేడియో దినోత్సవంగా గుర్తించింది. ఆపత్కాల (తుపాను) పరిస్థితులలో మానవ సమాజాలని అనుసంధానం చేసి అండగా నిలుస్తున్న రేడియోకి ఇంకా ప్రజాదరణ ఉంది. అందుకే రేడియో చేస్తున్న సేవలని ఐరాస గుర్తించి ప్రతి సంవత్సరం ఒక్కొక్క నినాదంతో జరుపుకుంటూ వివిధ చైతన్య కార్యక్రమాలని చేస్తోంది. 2018 సంవత్సరానికి గాను రేడియో క్రీడలకి ఇచ్చిన ప్రాధాన్యం గుర్తుచేసుకొని క్రీడా ప్రపంచంలో స్త్రీ - పురుషభేదం లేకుండా - అందరికీ సమాన గౌరవం ఇచ్చి వివిధ సంప్రదాయ క్రీడలను వారి వారి సమాజాలకి చైతన్యం ఇచ్చేలా ప్రస్తావించాలని ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో పిలుపునిస్తున్నారు. పోయిన నెల జనవరిలో భారతదేశంలో ప్రప్రథమ స్పోర్ట్స్ రేడియో స్పోర్ట్ ఫ్లాషస్ మొదలవ్వడం క్రీడాభిమానులకి సంతోషకరం! ఇలాగే విద్యా, వైద్యం, వ్యవసాయానికి కూడా 24/7 రేడియోలు ఉంటే ఆయారంగాల్లో ఆసక్తిగల వారికి అండగా నిలవటంలో రేడియో ఇండస్ట్రీ ఇంకా సహాయం చేసినట్లవుతుంది.

● డాక్టర్ పోటు భగత్‌కుమార్, హైదరాబాద్


శివరాత్రికి పర్యాటక శాఖ ఏర్పాట్లు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : పర్యాటక శాఖ ఆధ్వర్యంలో మహాశివరాత్రి సందర్భంగా వివిధ శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటుచేసినట్లు పర్యాటక శాఖ ఈడి సోమవారం తెలిపారు. హైదరాబాద్ నుండి శ్రీశైలంకు పెద్దలకు రూ.1700, పిల్లలకు రూ.1400, హైదరాబాద్-వేములవాడ మధ్య పెద్దలకు రూ.700, పిల్లలకు రూ.600, హైదరాబాద్-రామప్ప మధ్య పెద్దలకు రూ.వేయి, పిల్లలకు రూ.800, హైదరాబాద్-కాళేశ్వరం మధ్య పెద్దలకు రూ.వేయి, పిల్లలకు రూ.800 ఛార్జీగా నిర్ణయించారు. అప్ అండ్ డౌన్‌కు ఒకే ఛార్జీ వసూలుచేయనుండగా, దర్శనంతో పాటు రిఫ్రెష్ అయ్యేందుకు సౌకర్యాలు సమకూర్చుతున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

ఏడుపాయల జాతరకు రూ. 1.50 కోట్లు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: మెదక్ జిల్లాలోని ఏడుపాయల జాతర నిర్వహణకు ప్రభుత్వం రూ. కోటి 50 లక్షలు మంజూరు చేసింది. ఈ మేరకు రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి కె రామకృష్ణారావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిధులను జాతర జరిగే మెదక్ జిల్లా పాపన్నమండలంలో మౌలిక సదుపాయాల కల్పనకు ఖర్చు చేస్తారు. ప్రతియేటా శివరాత్రికి మొదలయ్యే ఈ జాతరకు స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద నిధులు మంజూరు చేయాలని డిప్యూటి స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం కోటి 50 లక్షల రూపాయలు మంజూరు చేసింది.

ఆ సమయంలో మైండ్ బ్లాంక్ అయింది



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ప్రమాదం జరిగిన సమయంలో తనకేమి అర్థం కాలేదని టీజేఏసీ చైర్మన్ కోదండరామ్ అన్నారు. 10 నుంచి 15 నిమిషాల వరకు మైండ్ బ్లాక్ అయిందని, సీటు బెల్టు పెట్టుకోవడం, బెలూన్లు ఓపెన్ కావడంతో తనకు ఎలాంటి హానీ జరగలేదన్నారు. ఆదివారం సాయంత్రం నల్లగొండ జిల్లా ఉంచి హైదరాబాద్‌కు కారులో వస్తుండగా కోదండరామ్‌కు ప్రమాదం జరిగిన విషయం తెలిసిందే. కాగా సోమవారం కోదండరామ్ నివాసానికి వెళ్లిన ఆయన సన్నిహితులకు ప్రమాదం జరిగిన తీరును వివరించారు. కారు ప్రయాణిస్తున్న దారిలో ఇద్దరు యువకులు రావడం, వారిని తప్పించే ప్రయత్నంలోనే తమ కారు రోడ్డు డివైడర్ ఢీ కొట్టిందన్నారు.

19న ఆర్టీసి ఎంప్లాయీస్ దీక్షలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 19న రాష్ట్రవ్యాప్తంగా అన్ని రీజనల్ కేంద్రాల్లో సామూహిక నిరాహార దీక్షలు చేపట్టబోతున్నామని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు ఎస్.బాబు, ప్రధాన కార్యదర్శి కె. రాజిరెడ్డి తెలిపారు. ఆర్టీసీలో అనేక సమస్యలతో కార్మికులు సతమతమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నిరాహార దీక్షల ద్వారా కార్మికుల సమస్యలను, సంస్థ ఎదుర్కొంటున్న ఇబ్బందులను అటు ప్రభుత్వం ఇటు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందని ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు.

రైల్వే స్టేషన్లలో విజిలెన్స్ తనిఖీలు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: రైల్వేలో విజిలెన్స్ తనిఖీలను ముమ్మరం చేశారు. అవకతవకలు, అక్రమాలను నియంత్రించడానికి గత పది రోజుల కాలంలో 676 తనిఖీలు జరిపి 69 మంది ఉద్యోగులు బాధ్యులుగా గుర్తించారు. రైల్వే బుకింగ్ కార్యాలయాలు, రిజర్వేషన్ కేంద్రాలు, పార్శిల్ ఆఫీసులు, రైళ్ల వద్ద ముమ్మరంగా తనిఖీలు జరిపారు. సికింద్రాబాద్, హైదరాబాద్, విజయవాడ, గుంటూరు, గుంతకల్, నాందేడ్ డివిజన్ల పరిధిలోని 298 బుకింగ్ కార్యాలయాలు, 122 రిజర్వేషన్ కేంద్రాలు, 77 పార్శిల్ ఆఫీసులు, 108 రైళ్లలో, 71 ప్లాట్‌ఫారాలపై తనిఖీలు నిర్వహించినట్టు దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. ఈ తనిఖీల్లో కమర్షియల్, సెక్యూరిటీ, విజిలెన్స్ విభాగాల అధికారులు పాల్గొన్నారు. అవకతవకలకు పాల్పడిన 69 మంది ఉద్యోగులపైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు.

రైల్వే భద్రతలో రాజీలేదు జీఎం వినోద్ కుమార్ యాదవ్

భద్రత విషయంలో రాజీకి అవకాశం లేని విధంగా చర్యలు తీసుకోవాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ వినోద్ కుమార్ యాదవ్ అధికారులను ఆదేశించారు. రైళ్ల ఆలస్యానికి కారణయ్యే వ్యవస్థాగత వైఫల్యాల తగ్గుదల కోసం కృషి చేయాలని ఉద్ఘాటించారు. భద్రత, సమయపాలన పైన రైల్ నిలయంలో ఆయన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. రైల్వే విధుల్లో అంకిత భావాన్ని, జాగరూకతను ప్రదర్శించి అవాంఛనీయ సంఘటనలు జరుగుకుండా నిరోధించడంలో ప్రతిభ కనబర్చిన ఉద్యోగులకు మ్యాన్ ఆఫ్ ద మంత్ అవార్డులను ప్రదానం చేశారు. సమీక్షలో జోన్ పరిధిలోని సికింద్రాబాద్, హైదరాబాద్, విజయవాడ, గుంతకల్, నాందేడ్ డివిజన్ల రైల్వే మేనేజర్లు, అన్ని విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఫార్మా-డీపై త్వరలో నివేదిక

● విద్యార్థులకు డీఎంఈ హామీ




మంత్రి డా. లక్ష్మారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ఫార్మా-డీ విద్యార్థులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఫార్మా-డి విద్యార్థులు తమకు ఉద్యోగాలు ఇవ్వాలని తమ ఉద్యమాన్ని ఉధృతం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా పలుచోట్ల ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించారు. సోమవారం 400 మంది విద్యార్థులు కోఠిలోని డీఎంఈ కార్యాలయం ఎదుట మౌనదీక్షకు దిగారు. దీంతో డీఎంఈ విద్యార్థులను తన చాంబర్‌కు పిలిపించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 2015 సంవత్సరం ఆగష్టులో తెలంగాణ ప్రభుత్వం జీఓ 515 కింద త్రిసభ్య కమిటీని వేసింది. ఇంతవరకు ఆ కమిటీ ఎందుకు సమావేశం కాలేదని వారు ఆయన్ను ప్రశ్నించారు. దీంతో డీఎంఈ డాక్టర్ రమేష్‌రెడ్డి వెంటనే డ్రగ్ కంట్రోలర్ డీడీ కైలాసంకు ఫోన్‌చేసి ఈనెల 16వ తేదీన సమావేశం నిర్వహించానున్నామని ఆయనతో పేర్కొన్నారు. సమావేశం అనంతరం వారంరోజుల్లో ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని ఆయన విద్యార్థులకు హామీనిచ్చారు. విద్యార్థుల తరపున ఇద్దరిని ఈ సమావేశానికి పిలుస్తామని పేర్కొన్నారు. దీంతో వారు డ్రగ్ కంట్రోలర్ డీడీ కైలాసాన్ని కలిసి తమ బాధను విన్నవించుకున్నారు. ఆయన కూడా 16వ తేదీ సమావేశానికి హాజరవుతానని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులకు మంత్రి లక్ష్మారెడ్డి నుంచి పిలుపు అందడంతో ఆయన్ను కలిసి తమ డిమాండ్లను ఆయనకు అందజేశారు. దీనిపై స్పందించిన ఆయన త్వరలో కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఫార్మా-డి సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ బి.నరేష్, డాక్టర్ రామలక్ష్మి, వందలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు.

అన్ని రాష్ట్రాల్లో 'విదేశీ విద్యానిధి'

● జాతీయ బీసీ సంఘం డిమాండ్



హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో బీసీ విద్యార్థుల కోసం అమలు చేస్తున్న ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకంతోపాటు, విదేశీ విద్యానిధి పథకాన్ని అన్ని రాష్ట్రాల్లోనూ అమలు చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. ఈ పథకాలను అన్ని రాష్ట్రాల్లో అమలు చేసేలా కేంద్రానికి లేఖ రాయాలని తెలంగాణ బీసీ లెజిస్లేచర్ కమిటీకి సంఘం జాతీయ అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆర్ కృష్ణయ్య సోమవారం అసెంబ్లీలో విజ్ఞప్తి చేశారు. బీసీ కమిటీని కలిసిన వారిలో జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ కృష్ణ, నాయకులు భూపేష్‌సాగర్, గజేందర్, రామలింగం, సి రాజేందర్, ఎం మహేందర్‌గౌడ్ తదితరులు ఉన్నారు. ఈ పథకాలను దేశవ్యాప్తంగా అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి బీసీ లెజిస్లేచర్ కమిటీ ద్వారా నివేదికను ఇవ్వనున్నట్టు కమిటీ చైర్మన్ గంగాధర్‌గౌడ్ చెప్పారని తెలిపారు. 22న తిరుపతిలో బీసీ విద్యార్థి, యువజన జాతీయ మహాసభను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను రిలీజ్ చేశారు.



ఒక్క అడుగు ముందుకు... రెండడుగులు వెనక్కు

● పెండింగ్‌లో వెల్‌నెస్ సెంటర్లు ● అరకొర బడ్జెట్... నిధుల్లేక సతమతం
● ఇబ్బందులు పడుతున్న ఉద్యోగులు, జర్నలిస్టులు, పెన్షనర్లు


హైదరాబాద్, ఆంధ్రప్రభ : వెల్‌నెస్ సెంటర్ల ఏర్పాటు ఒక్క అడుగు ముందుకు రెండు అడుగులు వెనక్కి అన్న చందంగా తయారయ్యింది. సంవత్సరం క్రితం వెల్‌నెస్ సెంటర్ల పేరుతో జర్నలిస్టులు, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఫించన్‌దారుల కోసం వైద్యానికి సంబంధించి వెల్‌నెస్ సెంటర్లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. మొదటగా ఖైరతాబాద్‌లో అనంతరం వనస్థలిపురంలో వీటిని ప్రభుత్వం ప్రారంభించింది. దీంతోపాటు చార్మినార్, కూకట్‌పల్లిలో కూడా వెల్‌నెస్ సెంటర్లను ఏర్పాటు చేస్తామని పేర్కొంది. వీటితోపాటు అన్ని పాత జిల్లా కేంద్రాలలో వెల్‌నెస్ సెంటర్లను ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. అయినా ఇప్పటివరకు 4 వెల్‌నెస్ సెంటర్లనే ప్రారంభించింది. ఇంకా 10 చోట్ల వెల్‌నెస్ సెంటర్లు ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నల్లగొండ జిల్లాకు చెందిన ఉద్యోగులను తీసుకుంటే వారు రోగం వస్తే చూపించుకోవడానికి ప్రస్తుతం వనస్థలిపురం వెల్‌నెస్ సెంటర్‌కు రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఖమ్మం జిల్లా వాసులు ప్రస్తుతం వరంగల్ లేదా హైదరాబాద్ రావాల్సిన పరిస్థితి నెలకొంది. ఉద్యోగులు ఒక్కరే కాకుండా జర్నలిస్టులు, పింఛన్‌దారులది అదే పరిస్థితి నెలకొంది.

18 సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రులతో ఒప్పందం

ఈజేహెచ్ఎస్ కింద సేవలను అందించేందుకు నగరంలోని 18 సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులతో ఒప్పందం చేసుకుంది. 1885 రకాల వ్యాధులతో పాటు వాటికి సంబంధించిన చికిత్సలు ఉచితంగా అందించడంతో పాటు 200 బ్రాండెడ్ మందులను సైతం అందజేస్తున్నారు. ఈజేహెచ్ఎస్ కింద సేవలను పొందడానికి ప్రత్యేక యాప్‌ను రూపొందించారు. ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని డాక్టర్ అపాయింట్‌మెంట్‌తో పాటు వెల్‌నెస్ సెంటర్ల వివరాలను తెలుసుకోవచ్చు. ఇక్కడ రోగులకు మందులను కూడా ఉచితంగా అందజేస్తాం.

త్వరలోనే అన్ని పాతజిల్లాల్లో...

త్వరలోనే అన్ని పాతజిల్లాల్లో వెల్ నెస్ సెంటర్లను ప్రారంభిస్తాం. హైదరాబా ద్‌లో కూడా పెండింగ్‌లో ఉన్న రెండు సెంటర్లు వచ్చే నెలలో ప్రారంభమవుతాయి. అన్నిచోట్ల పనులు ప్రారంభమయ్యాయి. కొన్నిచోట్ల భవనాల గుర్తింపులో ఆలస్యం జరిగింది. ప్రస్తుతం ఆ సమస్య కూడా తీరింది. కొన్ని మంచిపనులు చేయాలనుకున్నప్పుడు ఆరోపణలు వెల్లువెత్తడం సహజమే. ప్రభుత్వం తరపున అనుకున్న విధంగా అన్ని వెల్‌నెస్ సెంటర్లను ప్రారంభిస్తాం.



మంత్రి లక్ష్మారెడ్డి

దేశానికే మన సెంటర్లు ఆదర్శం

రాష్ట్రంలో అమలు చేస్తున్న వెల్‌నెస్ సెంటర్లు దేశంలోనే ఆదర్శంగా నిలిచాయి. ఇక్కడ అమలు చేస్తున్న వైద్య సేవలపై గతంలో పలు రాష్ట్రాల నుంచి వచ్చిన వైద్య అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ మధ్య కేంద్రం కూడా వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేస్తామని పేర్కొనడం, దానికోసం బడ్జెట్‌ను కేటాయిస్తానని పేర్కొంది. కాగా, ప్రభుత్వ ఉద్యోగులు, ఫించన్‌దారులు, జర్నలిస్టులకు కార్పొరేట్ ఆస్పత్రిలో వైద్య సేవలను నెలక్రితం నిలిపివేస్తున్నట్టు తెలంగాణ స్పెషాలిటీ ఆస్పత్రుల అసోసియేషన్ (టీఎస్‌హెచ్ఏ) గతంలో ప్రభుత్వానికి నోటీసు ఇచ్చింది. బకాయిలను చెల్లించక పోవడంతో చాలా ఆస్పత్రులు వైద్య సేవలను నిలిపివేశాయి. ఈ విషయమై స్పందించిన వైద్య ఆరోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డి టీఎస్‌హెచ్ఏ అసోసియేషన్‌తో చర్చలు జరిపి కొంతమొత్తాన్ని చెల్లించి సేవలను పునరుద్ధరించారు.

వెల్‌నెస్ సెంటర్లకు సంబంధించి ప్రభుత్వం 350 కోట్ల రూపాయల బడ్జెట్‌ను కేటాయిస్తానని పేర్కొంది. ఆ బడ్జెట్ నుంచే ఉద్యోగులకు జీతాల చెల్లింపుతో పాటు భవనాల మెరుగులు దిద్దడం, కొత్త భవనాలకు కేటాయింపులతో పాటు మందులకు, పరికరాల కొనుగోలు సైతం ఇందులో నుంచేనని ప్రభుత్వం పేర్కొంది. ఈ అరకొర బడ్జెట్ ఎటూ సరిపోక ప్రైవేటు ఆస్పత్రులకు బిల్లుల చెల్లింపులకు ఇబ్బందులు తలెత్తుతున్నట్టు తెలుస్తోంది. కాగా కొందరు అధికారులకు ఈ పథకం నచ్చలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ పథకం ముందుకు సాగకుండా అడ్డుకుంటున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వచ్చే నెలలో కరీంనగర్, నల్లగొండలో ప్రారంభం

కరీంనగర్, నల్లగొండ జిల్లాల్లో వచ్చేనెల వెల్‌నెస్ సెంటర్లు ప్రారంభమవుతాయి. మిగతావి 3 నెలల్లో పూర్తి అవుతాయి. ఒకటి రెండు జిల్లాల్లో భవనాలు దొరకడం లేదు. భవనాలు కేటాయించిన మిగతా చోట్ల పనులు ప్రారంభమయ్యాయి. పరికరాలతో పాటు కావలసిన వసతులను సమకూర్చుకుంటున్నాం. కార్పొరేట్ ఆస్పత్రులకు బకాయిలు కూడా ఏమీ లేవు.

కె.పద్మ, సీఈఓ, ఈహెచ్ఎస్, జేహెచ్ఎస్,

ప్రిన్సిపాల్స్, లెక్చరర్ల మెయిన్ పరీక్షలు వాయిదా

● త్వరలో తేదీల ప్రకటన

హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలోని వివిధ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ సొసైటీల్లోని జూనియర్ కాలేజ్, డిగ్రీ కాలేజ్ లెక్చరర్స్, ప్రిన్సిపాల్స్ కోసం నిర్వహించ తలపెట్టిన మెయిన్స్ పరీక్షలను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ వాయిదా వేసింది. ప్రిలిమినరీ పరీక్షల ఫలితాల్లో కొందరి బయోడేటాలో సీజీజీ చేసిన పొరపాట్ల మూలంగా పరీక్షలను వాయిదా వేస్తున్నట్టు కమిషన్ కార్యదర్శి వాణి ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షల తేదిలను తరువాత ప్రకటిస్తామని తెలిపారు.

15 వరకు టిఆర్‌టి ఎడిట్ ఆప్షన్

తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల నియామకం కోసం నిర్వహించనున్న టిఆర్‌టి పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల్లో బయోడేటా తప్పులను సరిచేసుకోవడం కోసం తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఇచ్చిన ఎడిట్ అవకాశాన్ని మరోసారి పొడిగించింది. 12 వరకు ఇచ్చిన అవకాశాన్ని 15 వరకు పొడిగిస్తున్నట్టు సోమవారం ఒక ప్రకటనలో కమిషన్ కార్యదర్శి వాణి ప్రసాద్ తెలిపారు.

జూబ్లీహిల్స్‌లో బ్లాస్టింగ్ కలకలం

హైదరాబాద్ (జూబ్లీహిల్స్), ప్రభ న్యూస్ : జూబ్లీహిల్స్‌లోని రోడ్ నెంబర్ 48 ప్రాంతంలో నిర్మాణ పనులు జరుగుతున్న స్థలంలో సోమవారం ఉదయం ఒక్కసారిగా బ్లాస్టింగ్‌ల మోత మోగింది. ఈ ఘటనతో స్థానికులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఆ శబ్దాలకు అసలు ఆ ప్రాంతంలో ఏం జరిగిందనే సందేహంలో పడిపోయి వారు తేరుకున్నాక అసలు విషయం తెలుసుకుని జూబ్లీహిల్స్ పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న జూబ్లీహిల్స్ సీఐ చంద్రశేఖర్, ఎస్సై నరేష్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని బ్లాస్టింగ్‌కు గల కారణాలను పరిశీలించగా, నిర్మాణం జరుగుతున్న స్థలంలో వాచ్‌మెన్ రూమ్‌లో స్టోర్ చేసిన జిలెటిన్ స్టిక్స్ పేలినట్లు గుర్తించారు. కాగా బాంబ్ స్క్వాడ్ నిర్మాణప్రాంతంలో మరిన్ని జిలెటిన్ స్టిక్స్‌ను గుర్తించారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిని పోలీసులు అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేపట్టారు. ఈ స్థలంలో చేపట్టే బ్లాస్టింగ్‌లకు కూడా అనుమతులు ఉన్నాయా లేదా అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



బ్లాస్టింగ్ జరిగిన ప్రాంతంలో తనిఖీలు చేపట్టిన బాంబ్ స్క్వాడ్

నేరస్తుల సర్వేపై విచారణ ముగింపు

● భవిష్యత్తులో వివరాలు అడగం: సర్కార్ నివేదన



హైదరాబాద్, ఆంధ్రప్రభ : సకల నేరస్తుల సమగ్ర సర్వే కోసం గత జనవరి 3న డీజీపీ జారీ చేసిన సర్క్యులర్ ఆధారంగా భవిష్యత్తులో ఎలాంటి వివరాలు అడగబోమని తెలంగాణ ప్రభుత్వం హైకోర్టుకు నివేదించింది. తెలంగాణ డీజీపీ జారీ చేసిన సర్క్యులర్ అమల్లో లేదని తెలంగాణ ప్రభుత్వం తరపున అడ్వకేట్ జనరల్ డి.ప్రకాశ్ రెడ్డి తెలిపారు. ఆ సర్క్యులర్ ఆధారంగా అతిగా వ్యవహరించరాదంటూ పోలీసు అధికారులకు డీజీపీ తాజాగా జారీ చేసిన మెమో ప్రతిని టీఏజీ కోర్టుకు సమర్పించారు. దీంతో న్యాయమూర్తి సకల నేరస్తుల సమగ్ర సర్వేపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ దాఖలైన రెండు పిటిషన్లపై విచారణ ముగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏవి.శేషసాయి సోమవారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.

సివిల్ జడ్జీల రాత ఫలితాల విడుదల

హైదరాబాద్, ఆంధ్రప్రభ: నవంబర్ 26 న జరిగిన సివిల్ జడ్జీల రాత పరీక్షా ఫలితాలు విడుదలయ్యాయి. 23 సివిల్ జడ్జీలు (జూనియర్ డివిజన్) పోస్టులను భర్తీ చేసేందుకు గానూ ఈ పరీక్షను నిర్వహించారు. రాత పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి ఈ నెల 27, 28 తేదీలలో మధ్యాహ్నం 2.30 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు హైకోర్టు రిజిస్ట్రార్ (రిక్రూట్‌మెంట్) ఉత్తర్వులు జారీ చేశారు.

కాంట్రాక్టర్లకు ఆర్థిక పరిధిపై నిర్ణయం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: అనుభవం, చేసిన పనుల ఆధారంగా వివిధ రకాల పనులు నిర్వహించే కాంట్రాక్టర్లకు కేటగిరీలు నిర్ణయిస్తుండగా, తాజాగా ప్రభుత్వం కేటగిరీల వారీగా ఆర్థికపరిమితిని సవరిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కె జోషి రాష్ట్రంలోని ఆరు కేటగిరీల కాంట్రాక్టర్లకు పరిమితిని ఉత్తర్వులలో పేర్కొన్నారు. స్పెషల్‌క్లాస్ కేటగిరీకి చెందిన కాంట్రాక్టర్లు ఏ పనయినా చేయవచ్చని ఉత్తర్వులలో పేర్కొన్నారు. ఇక క్లాస్-1 కాంట్రాక్టర్లకు రూ.30 కోట్లు, క్లాస్-2కు రూ.10 కోట్లు, క్లాస్ -3కు రూ.4 కోట్లు, క్లాస్-4కు రూ.కోటి, క్లాస్-5కు రూ.50లక్షలు పరిమితి విధించారు.

హరితహారంతో పర్యావరణానికి మేలు

● ప్రిన్సిపల్ సెక్రటరీ రజత్‌కుమార్



హైదరాబాద్, ఆంధ్రప్రభ : హరితహారం వలన పర్యావరణానికి మేలు జరుగుతుందని డాక్టర్ రజత్ కుమార్ (ప్రిన్సిపాల్ సెక్రటరీ ఎన్విరాన్‌మెంట్, ఫారెస్టు అండ్ సైన్స్ టెక్నాలజీ) పేర్కొన్నారు. ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (ఈపీటీఆర్ఐ)లో వాతావరణంలో మార్పులు, వాటి పర్యవసానాలు అనే అంశంపై సోమవారం జరిగిన కార్యక్రమంలోఆయన మాట్లాడారు. మనం నీడనిచ్చే చెట్టను నరికివేయడం వలన వాతా వరణం అంతా కలుషితమవుతుందన్నారు. పర్యావరణాన్ని ముప్పు వాటిల్లకుండా అందరూ చూడాల్సిన అవసరం ఉందన్నారు. పర్యావరణం విషయంలో తెలంగాణ ప్రభుత్వం చాలా జాగ్రత్తలు తీసుకుంటుందని, అందులో భాగంగానే హరితహారం లాంటి కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. బి.కళ్యాణ్ చక్రవర్తి (ఐఏఎస్), డైరెక్టర్ జనరల్ ఈపీటీఆర్ఐ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణపై అందరికీ అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా పర్యావరణంలో మార్పులు చోటు చేసుకుంటున్నాయని ఇది ఆందోళన కలిగించే అంశమన్నారు. డాక్టర్ డేవిడ్ ఈస్టర్లింగ్, చీఫ్ సైంటిఫిక్ సర్వీసు డివిజన్, పూణె, అమెరికాకు చెందిన నార్త్‌కరోలినా విశ్వ విద్యాలయానికి చెందిన శాస్త్రవేత్తలు కార్యక్రమంలో పాల్గొన్నారు. నాబార్డ్ సౌజన్యంతో దీనిని నిర్వహించారు.

నయీం బాధితులకు న్యాయం చేయాలి

● వివిధ పార్టీల నేతల విజ్ఞప్తి




హైదరాబాద్ (సోమాజిగూడ), ప్రభ న్యూస్ : గ్యాంగ్ స్టర్ నయీం చేతిలో నష్టపోయిన బాధితులకు న్యాయం చేయాలని పలు రాజకీయ పార్టీల నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నయీం వల్ల అనేక మంది నిరుపేదలు తీవ్ర అన్యాయానికి గురయ్యారని, ప్రభుత్వమే నయీంను పెంచి పోషించిందని వారు ఆరోపించారు. ఈ మేరకు సోమవారం వివిధ రాజకీయ పార్టీల సంయుక్త ఆధ్వర్యంలో గ్యాంగ్‌స్టర్ నయీం బాధితులకు న్యాయం చేయాలంటూ ఒక సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, సీపీఎం, టీజేఏసీ, ఎంసీపీఐ, ఫార్వర్డ్ బ్లాక్, ఆర్ఎస్పి, తెలంగాణ ప్రజా ఫ్రంట్, ప్రజా తెలంగాణ, మానవ హక్కుల వేదిక, పౌరహక్కుల సంఘం, నరహంతక ముఠా నయీం బాధితుల పరిరక్షణ సమితి ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ మాట్లాడుతూ నల్గొండ జిల్లాలో నయీం ఒక సమాంతర వ్యవస్థను ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. ప్రభుత్వానికి ఇన్‌ఫార్మర్‌గా పనిచేస్తూ వామపక్ష ఉద్యమాన్ని అణిచివేసేందుకు నయీంను ప్రభుత్వం పావుగా వాడుకుందని ఆరోపించారు. నయీం అరాచకాలకు పోలీసులు, ప్రభుత్వం సహకరించిందన్నారు. మరోవైపు నయీం అరాచకాలకు కేంద్ర ప్రభుత్వం సహకారం కూడా ఉందని, ఓ వ్యవస్థీకృత పాలన నుంచి పుట్టిన వాడే నయీం అన్నారు. నయీం వ్యవహారంపై ప్రభుత్వం ఉన్నతస్థాయి విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. నయీం కేసుపై తాను వేసిన రిట్‌పై ఇప్పటి వరకూ దర్యాప్తు ఎందుకు చేయడం లేదని, నయీం డైరీ ఆచూకీ లేకుండా పోయిందని, ఈ కేసులో టిఆర్ఎస్ వాళ్లు కూడా ముద్దాయిలేనన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ నయీం కేసులో ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ కొండను తవ్వి ఎలుకను కూడా పట్టుకోలేకపోయిందన్నారు. సిట్ వల్ల ఏ ఒక్కరికీ న్యాయం జరుగలేదని, పైగా చిన్న చేపలను పట్టుకొని నయీం సహకరించిన పెద్దవాళ్లను విడిచిపెట్టారని ఆరోపించారు.

గోకుల్ కార్పొరేట్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ జగదీశ్వర్ మాట్లాడుతూ నయీం తనను కిడ్నాప్ చేయడంతో పాటు, తన బ్యాంక్ సిబ్బంది ముగ్గురిని హత్య చేశారని తన నుంచి నయీం మూడు కోట్ల యాభై లక్షలు వసూలు చేశాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సుమారు 30 మంది నయీం బాధితులు తమకు జరిగిన అన్యాయం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ, ప్రజాస్వామ్య సంస్థల ప్రతినిధులు, చలపతిరావు, వీరన్న, అన్వేషి, సంజయ్, రవిచంద్ర, ప్రభాకర్ రెడ్డి, జానకి రాములు తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు బెయిల్‌కు పురుషోత్తంరెడ్డి పిటిషన్

● కొనసాగుతున్న ఏసీబీ దాడులు
● మరిన్ని ఆస్తిపత్రాలు స్వాధీనం



హైదరాబాద్, ఆంధ్రప్రభ: ఆదాయానికి మించి ఆస్తుల కేసులోముద్దాయిగా ఉన్న హెచ్ఎండిఏ అధికారి పురుషోత్తం రెడ్డి ముందస్తు బెయిల్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. ఈ కేసు విచారణ గురువారానికి వాయిదా పడింది. ఏసీబీ దాడుల విషయం ముందస్తుగానే పసిగట్టిన అధికారి తెలివిగా తప్పించుకున్నాడు. దీర్ఘకాల సెలవు పెట్టిన పురుషోత్తంరెడ్డి భార్య, బావమరిదితో పాటు అజ్ఞాతంలోకి వెళ్ళారు.

పురుషోత్తంరెడ్డికి ఎట్టి పరిస్థితులలో బెయిల్ ఇవ్వద్దని ఏసీబీ కోర్టుకు నివేదికను సమర్పించేందుకు సన్నద్ధమవుతోంది. తవ్విన కొద్దీ పురుషోత్తంరెడ్డి అక్రమాస్తుల చిట్టా బయటకు వస్తున్న నేపథ్యంలో 11 ప్రత్యేక బృందాలను నియమించిన అధికారులు బంధువులు, స్నేహితులు, బినామీల ఇళ్ళు, కార్యాలయాలు, అనుమానాస్పద చోట్ల దాడులను నిర్వహిస్తున్నారు. కూతురు విధితరెడ్డి పెళ్ళి అత్యంత ఘనంగా నిర్వహించిన అధికారి పెళ్ళి సందడి దృశ్యాలను షార్ట్ ఫిలింల రూపంలో తయారు చేయించినట్లు బయట పడింది. ఇందుకోసం పలు ఈవెంట్ సంస్థలతో కాంట్రాక్టు కుదుర్చుకున్నట్లు అధికారుల సోదాలలో వెల్లడైంది. విధితారెడ్డి ఇంటిపై ఇప్పటికే దాడి చేసి నఏసీబీ అధికారులు పలు కీలక డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే.

సోమవారం విధితరెడ్డికే చెందిన చరన్ లైఫ్ డివైసెస్ అనే కార్యాలయంపై దాడి చేసి సోదాలు జరిపిన అధికారులకు మరింత విస్తుపోయే సమాచారం లభ్యమైంది. విధితారెడ్డి వివాహాన్ని ఎన్ కన్వెన్షన్‌లో జరిపిన పురుషోత్తంరెడ్డి రిసెప్షన్‌ను ఎన్‌బినియన్ హాల్‌లో అట్టహాసంగా జరిపినట్లు బయటపడింది. అంతే కాకుండా పెళ్ళి గిఫ్ట్ కింద మూసాపేట రాజీవ్‌గాంధీ నగర్ ప్రాంతంలో దాదాపు రూ. 3.2 కోట్ల విలువ చేసే స్థలాన్ని ఇచ్చినట్లు గుర్తించారు. ఈ స్థలం విలువ బహిరంగ మార్కెట్లో మూడింతలుగా ఉండవచ్చని అధికారులు అంటున్నారు. ఈ మేరకు గిఫ్ట్‌డీడ్ డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. కూతురి పెళ్ళి కోసం ఖరీదైన ఆభరణాలను కొనుగోలు చేయడంతో పాటు జైపూర్‌లోనూ విలువైన వజ్రాల ఆభరణాలను కొన్నట్లు ఉన్న రసీదులు కూడా లభ్యమయ్యాయి. హైదరాబాద్‌లో డైమండ్ నెక్లెస్ సెట్‌ను కొనుగోలు చేయగా, జైపూర్‌లో డైమండ్ వడ్డాణం కొన్నారని గుర్తించారు. అదే విధంగా గోల్డ్ నెక్లెస్‌ను కూడా కొన్నట్లు ఎసిబి అధికారులకు రసీదులు లభ్యమయ్యాయి. రసీదులతో పాటు వీడియోల దృశ్యాలను కూడా అధికారులు సేకరించారు.

పురుషోత్తంరెడ్డి, ఆయన బినామీల ఇళ్ళు, కార్యాలయాలపై ఏసీబీ అధికారులు దాడులు జరిపి దాదాపు రూ. 300 కోట్ల ఆస్తులను గుర్తించారు. ఈ ఆస్తుల జాబితాను, అందుకు సంబంధించిన రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు, పురుషోత్తంరెడ్డిపై పలువురు బాధితులు ఇచ్చిన ఫిర్యాదులు, ఫిర్యాదులపై విచారణ సందర్భంగా లభ్యమైన ఆధారాలన్నింటినీ గురువారం కోర్టు ముందు ఉంచేందుకు ఏసీబీ అధికారులు సన్నద్ధమవుతున్నారు. కనిపించకుండా పోయిన పురుషోత్తంరెడ్డిని అదుపులోకి తీసుకుని విచారించాల్సిన అవసరం ఉందని, సేకరించిన ఆధారాలపై ప్రశ్నించాల్సి ఉందని ఏసీబీ అధికారులు కోర్టుకు తెలియజేయాలని నిర్ణయించారు.

Andhraprabha business 2018
బిజినెస్
BUSINESS


ద్రవ్యోల్బణం కిందకి...
పారిశ్రామికం పై పై కి...

●ఆదుకున్న తయారీ రంగం ●ముందస్తు జీడీపీ అంచనాలకు ఈ గణాంకాలు కీలకం



న్యూఢిల్లీ: దేశ ఆర్థిక వ్యవస్థ క్రమంగా కుదుటపడుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. తాజాగా కేంద్ర గణాం కాలకార్యాలయం (సీఎస్ఓ) విడుదల చేసిన డిసెంబర్‌నెల పారిశ్రామికోత్పత్తి గణాంకాలతో పాటు జనవరి నెల రిటైల్ ద్రవ్యోల్బణం గణాంకాలు రెండు ప్రభుత్వానికి టానిక్‌లా పనిచేస్తాయనడంలో ఎలాంటి సందేహం లేదు. డిసెంబర్ నెల పారిశ్రామికోత్పత్తి (ఐఐపీ) 7.1 శాతానికి ఎగబాకింది. దీని బట్టి చూస్తే ఆర్థిక వ్యవస్థ తిరిగి గాడిన పడుతోందన్న విషయం స్పష్టం అవుతోంది. తయారీరంగం పుంజుకోవడంతో దీని ప్రభావం మొత్తం పారిశ్రామికోత్పత్తి గణాంకాలపై కనిపించింది. తయారీరంగంతో పాటు క్యాపిటల్‌గూడ్స్, నాన్ కన్స్యూమర్ గూడ్స్ రంగం జోరందుకుంది. క్రితం ఏడాది ఇదే డిసెంబర్ నెల ఐఐపీ కేవలం 2.4 శాతం వృద్ధిని సాధించిందని సోమవారం నాడు సీఎస్ఓ కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించింది. నవంబర్ 2017లో ఐఐపీ వృద్ధిరేటును సవరించి 8.8 శాతానికి సవరించింది. అంతకు ముందు తాత్కాలికంగా 8.4 శాతంగా అంచనా వేసింది.ఇక జనవరి నెల రిటైల్ ద్రవ్యోల్బణం కాస్తా తగ్గి 5.07 శాతానికి దిగివచ్చింది. దీనికి ప్రధాన కారణం కూరగాయలు, పండ్లు ధరలు తగ్గడంతో పాటు ఇంధనం ధరలు తగ్గాయని ప్రభుత్వం విడుదల చేసిన గణాంకాలను బట్టి తెలుస్తోంది. వినియోగదారుల సూచి లేదా రిటైల్ ద్రవ్యోల్బణం డిసెంబర్‌లో 5.21 శాతంగా నమోదైంది. ఇది 17 నెలల గరిష్ఠానికి చేరుకుందని చెప్పవచ్చు. కాగా గతేడాది జనవరిలో రిటైల్ ద్రవ్యోల్బణం 3.17 శాతంగా నమోదైంది. జనవరిలో ఆహారేతర వస్తువుల ధరలు 4.7 శాతానికి దిగిరాగా.. అంతకు ముందు డిసెంబర్‌లో 4.96 శాతంగా నమోదైంది. రిటైల్ ద్రవ్యోల్బణం సూచిలో కూరగాయల వాటా 26.97 శాతం గా జనవరిలో చూపిస్తే.. అదే డిసెంబర్‌లో 29.13 శాతంగా చూపించింది. గత నెలలోపండ్ల ధరలు స్వల్పంగా అంటే 6.24 శాతం పెరిగితే.. అంతకు ముందు నెల 6.63 శాతం పెరిగాయి. ఇంధనం, విద్యుత్ ద్రవ్యోల్బణం జనవరిలో 7.73 శాతం నమోదైతే.. డిసెంబర్‌లో 7.90 శాతంగా నమోదైంది. తాజా గణాంకాలను ఎన్ఎస్ఎస్ఓ కు చెందిన ఫీల్డ్ ఆపరేషన్ డివిజన్ ఎంపిక చేసిన పట్టణాల్లో ధరల గణాంకాలను సేకరించగా.. తపాలాశాఖ ఎంపిక చేసిన కొన్ని గ్రామాల్లో ధరలను సేకరించింది. డిసెంబర్ ఐఐపీ గణాం కాలు, జనవరి నెల రిటైల్ ద్రవ్యోల్బణం గణాం కాలు .. 2017-18 ఆర్థిక సంవత్సరానికి ముందుస్తు జీడీపీ అంచనాలు వేయడానికి అంత్యంత కీలకం కానున్నాయి. ఈ నెలాఖరులో జీడీపీ ముందస్తు గణాంకాలు వెల్లడవుతాయి. జనవరి - మార్చి త్రైమాసికంలో రిటైల్ ద్రవ్యోల్బణం ఐదు శాతానికి అటు ఇటుగా ఉండొచ్చు. అటు తర్వాత వేసవి కాలానికి ఆరు శాతానికి కూడా ఎగబాకే అవకాశాలను కొట్టిపారేయలేం. అలాంటి సమయంలో రిజర్వుబ్యాంకు వడ్డీరేట్లు కోత విధించే పరిస్థితి ఉండదు. ఒక వేళ వచ్చే ఆర్థిక సంవత్సరం రెండవ సగభాగం తర్వాత ద్రవ్యోల్బణంలో ఊరట లభించకపోతే వడ్డీరేట్లు పెంచే ప్రమాదం లేకపోలేదని హెచ్ డీఎఫ్‌సీ సీనియర్ ఆర్థికవేత్త తుషార్ అరోరా చెప్పారు. జనవరి ద్రవ్యోల్బణం తగ్గడానికి ప్రధాన కారణం ఆహార ధరలు స్వల్పంగా తగ్గడమే. అయితే చమురు ధరలు, ఇంటి అద్దె భత్యాలు పెంచితే మాత్రం ద్రవ్యోల్బణం మళ్లీ కోరలుచాచే ప్రమాదాన్ని కొట్టిపారేయలేమని ఆయన అన్నారు. రిజర్వుబ్యాంకు కూడా వచ్చే ఆరు నెలల వరకు ద్రవ్యోల్బణం నికలడగానే ఉంటుందని పేర్కొంది. ఎందుకంటే బేస్ ఎఫెక్ట్ అని ప్రకటించింది. (పెద్ద మొత్తంలో లావాదేవీలు)ఉండవనేది ఆర్‌బీఐ ఉద్దేశం. జనవరి నెల ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టిందని.. ఆర్ బీఐ మాత్రం వడ్డీరేట్ల తగ్గింపు జోలికి పోయే అవకాశాల్లేవు.

ఎందుకంటే ఆర్‌బీఐ స్వల్ప కాలానికి దృష్టిలో ఉంచుకొని నిర్ణయాలు తీసుకుంటామని ప్రకటించింది. రిటైల్ ద్రవ్యోల్బణంతో పాటు ఐఐపీ గణాం కాల్లో ఒడిదుడుకులుంటాయి కాబట్టి దీన్ని దృష్టిలో ఉంచుకొని వడ్డీరేట్లు తగ్గించే ప్రస్తక్తి లేదని స్పష్టం చేసినట్లు డీబీఎస్ సింగపూర్ ఆర్థిక వేత్త రాధికారావు చెప్పారు. తన అంచనా ప్రకారం ఆర్‌బీఐ సమీపభవిష్యత్తులో వడ్డీరేట్ల జోలికి పోదని ఆమె అన్నారు. ఎందుకంటే రాబోయే నెలలో చమురుధరలతో పాటు ఆహార ద్రవ్యల్బణం పెరుగుతుందని వచ్చే ఆరు నెలల వరకు వడ్డీరేట్లు తగ్గించే అవకాశాల్లేవని ఆమె స్పష్టం చేశారు. చమురు ధరలతో పాటు ద్రవ్యోల్బణానికి రుతుపవనాలు కీలకపాత్ర పోషిస్తాయని, ద్రవ్యోల్బణానికి అతి పెద్ద విలన్ రుతుపవనాలన్నీ రవీంద్రనాథ్ ల్యాడర్‌అప్ వెల్త్‌మనేజ్‌మెంట్ ఎండీ చెప్పారు.



పారిశ్రామికోత్పత్తి గణాంకాలు

డిసెంబర్ నెల పారిశ్రామికోత్పత్తి పుంజుకోవడానికి ప్రధాన కారణం తయారీరంగంలో ఐఐపీ సూచిలో దీని వాటా 77.63 శాతం కాగా.. డిసెంబర్‌లో 8.4 శాతం వృద్ధి కనిపిస్తే.. 2016 డిసెంబర్‌లో కేవలం 0.6శాతం వృద్ధిని నమోదు చేసింది. పెట్టుబడులకు బాగా అవకాశం ఉన్న క్యాపిటల్‌గూడ్స్ రంగంలో ఉత్పత్తి భారీగా 16.4 శాతంగా డిసెంబర్ 2017లో వృద్ధిని సాధిస్తే.. అంతకు క్రితం ఏడాది ఇదే నెలలో 6.2 శాతం క్షీణించింది. నాన్ కన్స్యూమర్ డ్యూరబుల్స్ విషయానికి వస్తే ప్రధాన ఇవి ఫాస్ట్‌మూవీంగ్ కన్స్యూమర్‌గూడ్స్ డిసెంబర్‌లో 16.5 శాతం వృద్ధిని సాధిస్తే.. అంతకు ముందు ఏడాది 0.2 శాతం క్షీణించింది. ఐఐపీలోని వివిధ విభాగాల విషయానికి వస్తే డిసెంబర్ 2017లో ప్రైమరీ గూడ్స్ 3.7 శాతం, ఇంటర్మీడియెట్ గూడ్స్ 6.2 శాతం, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ / కన్‌స్ట్రక్షన్ గూడ్స్ విషయానికి వస్తే 6.7 శాతంగా నమోదైంది. కన్స్యూమర్ గూడ్స్ రికార్డుస్థాయిలో 0.9 శాతం వృద్ధిని సాధించింది. తయారీరంగానికి చెందిన మొత్తం 23 పరిశ్రమల గ్రూపు 16 తయారీ రంగానికి చెందిన పరిశ్రమలు మంచి ఫలితాలు సాధించాయి.

బ్రిటన్ కోర్టులో మాల్యాకు చుక్కెదురు

●బీఓసీ ఏవియేషన్‌కు 90మి.డాలర్లు చెల్లించండి



లండన్ / సింగపూర్ : భారత్ చట్టాల నుంచి తప్పించుకొని లండన్‌లో తలదాచుకుంటున్న లిక్కర్ కింగ్ విజయ్‌మాల్యాకు బ్రిటన్ కోర్టులో చుక్కెదురైంది. కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్‌కు సంబంధించి సింగపూర్‌కు చెందిన బీఓసీ ఏవియేషన్‌కు 90 మిలియన్ డాలర్లు (రూ.570 కోట్లు) చెల్లించాలని యూకె హైకోర్టు ఫిబ్రవరి 5న తీర్పు ఇచ్చింది. అసలు విషయానికి వస్తే కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్, ఎయిర్‌క్రాఫ్ట్ లీజింగ్ కంపెనీ బీఓసీ ఏవియేషన్‌కు చెందిన నాలుగు విమానాల లీజింగ్‌కు సంబంధించింది. అయితే బీఓసీ మూడు విమానాలను డెలివరీ ఇవ్వగా.. నాలుగో విమానం డబ్బు చెల్లించనందుకు డెలివరీ ఇవ్వలేదని తెలిపింది. దీంతో పాటు కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ సెక్యూరిటి డిపాజిట్లు కూడా చాలా తక్కువగా కట్టిందని, దీంతో ఒక వేళ డిఫాల్ట్ అయితే తమ డబ్బు వసూలు చేసుకోవడానికి వీలులేకుండా పోయిందని తెలిపింది. కింగ్‌ఫిషర్ లీజు ఒప్పందాన్ని గౌరవించకపోవడంతో బీఓసీ ఏవియేషన్‌కు వడ్డీతో పాటు కోర్టు ఖర్చులు కలిపి మొత్తం 90 మిలియన్ డాలర్లు చెల్లించాలని బ్రిటన్ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. కాగా బీఓసా కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్‌తో పాటు, యునైటెడ్ బ్రూవరీస్‌లను సంయుక్తంగా బాధ్యులను చేసింది. అయితే దీనిపై కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ స్పందించడానికి నిరాకరించింది. ప్రస్తుతం మాల్యా 650,000 పౌండ్ల బెయిల్‌పై ఉన్నారు. ఇదిలా ఉండగా మాల్యా కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ కోసం భారత్‌లోని వివిధ బ్యాంకుల నుంచి రూ.9వేల కోట్ల రుణాలు తీసుకొని ఎగ్గొట్టి బ్రిటన్ పారిపోయిన విషయం తెలిసిందే. భారత ప్రభుత్వం మాల్యాను రప్పించడానికి గట్టి ప్రయత్నాలు చేస్తోంది.

జీఐసీ రే ఫలితాలు భేష్

GIC Re
General Insurance Corporation of India
Global Reinsurance Solutions

హైదరాబాద్ : జనరల్ ఇన్స్యూరెన్స్ కార్పొరేషన్ ఇండియా ఫలితాలను కంపెనీ సీఎండీ ఎలైస్ వైద్యనాథన్ సోమవారం నాడు ముంబైలో విడుదల చేశారు. డిసెంబర్‌తో ముగిసిన తొమ్మిది నెలల కాలంలో ప్రీమియంఆదాయంలో 36.8 శాతం వృద్ధితో రూ.33,274.35 కోట్లు ఆర్జించింది. క్రితం ఏడాదిఇదే కాలంలో రూ. 24,328.61 కోట్లని తెలిపారు. తొమ్మిది నెలల కాలానికి పన్ను చెల్లించిన తర్వాత నికరలాభం రూ. 2, 481.99 కోట్లు కాగా.. క్రితం ఏడాది ఇదే కాలంలో రూ.554.82 కోట్లని తెలిపారు. డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో నికరలాభం రూ.372.73 కోట్లు కాగా.. సెప్టెంబర్ త్రైమాసికంలో రూ. 1,419.11 కోట్లు.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.400.99 కోట్లు నష్టాన్ని చవిచూసింది.

రిలయన్స్ ఇన్‌ఫ్రా...అదానీ ట్రాన్స్‌మిషన్ ఒప్పందానికి సీసీఐ ఆమోదం



న్యూఢిల్లీ : అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (ఆర్‌ఇన్‌ఫ్రా) ముంబైలోని పవర్ (విద్యుత్) వ్యాపారాన్ని అదానీ ట్రాన్స్‌మిషన్‌కు విక్రయించడానికి కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీ సీఐ) ఆమోదం తెలిపింది. ఈ ఒప్పందం విలువ రూ.18,800 కోట్లని ఆర్‌ఇన్‌ఫ్రా సోమ వారం నాడు ఒక ప్రకటనలో పేర్కొంది. ఇదిలా ఉండగా రిల్ ఇన్‌ఫ్రా, అదానీ ట్రాన్స్ మిషన్‌లు డిసెంబర్ 2017లో ఖచ్చితమైన ఒక ఒప్పందానికి వచ్చాయి. ఒప్పందం ప్రకారం ముంబైలోని అనిల్ అంబానీకి చెందిన విద్యుత్ వ్యాపారం వాటిలో విద్యుత్ ఉత్పత్తి, ట్రాన్స్‌మిషన్, డిస్ట్రిబ్యూషన్ వ్యాపారంలో 100 శాతం వాటాలు అదానీ ట్రాన్స్ మిషన్ కొనుగోలుచేస్తుంది. ఈ లావాదేవీ మొత్తం రూ.18,800 కోట్లు కాగా, 2018 మార్చి చివరి నాటికి ఈ లావాదేవీ పూర్తవుతుందని రిల్‌ఇన్‌ఫ్రా ఒక ప్రకటనలోపేర్కొంది. రిల్‌ఇన్‌ఫ్రా విక్రయం ద్వారా వచ్చిన మొత్తాన్ని అనిల్ అంబానీ తన అప్పులను తీర్చడానికి వినియోగిస్తారు. ప్రస్తుతం పరిస్థితుల్లో భారత్ కార్పొరేట్‌లో ఇంత భారీ మొత్తంలో అప్పుల భారాన్ని తగ్గించుకొనే కంపెనీ లేదని చెప్పవచ్చునని మార్కెట్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. వచ్చిన డబ్బులో కొంత మొత్తాన్ని రక్షణ రంగానికి చెందిన వ్యాపారాలతో పాటు ఈపీసీ (ఇంజినీరింగ్ ప్రొక్యూర్‌మెంట్ అండ్ కన్‌స్ట్రక్షన్) వ్యాపారాల్లో పెట్టుబడులు పెడుతుంది.కాగా రిలయన్స్ ఇన్‌ఫ్రా స్ట్రక్చర్‌కు చెందిన ముంబై విద్యుత్ వ్యాపారం (రిలయన్స్ఎనర్జీ)గా సుపరిచితమే. దేశంలోని అతి పెద్ద ప్రైవేట్ రంగానికి చెందిన విద్యుత్ యుటిలిటి డిస్ట్రిబ్యూషన్ కంపెనీ. సుమారు 30 లక్షల గృహాలకు, పారిశ్రామికయూనిట్లకు, వాణిజ్య సంస్థలకు ముంబై శివార్లతో సహా సుమారు 400 చదరపు కిలో మీటర్ల విస్తీర్ణంలో విద్యుత్ సరఫరా చేస్తోంది. పీక్ డిమాండ్ 1,800 మెగావాట్లవరకు విద్యుత్ సరఫరా చేసింది. ఏడాదికి నికరంగా రూ. 7,500 కోట్ల రెవెన్యూ ఆర్జించినట్లు రిల్ ఇన్‌ఫ్రా వివరించింది.

రైతులతో పాటు వినియోగదారుల ప్రయోజనాల పరిరక్షణ కత్తిమీదసామే!



న్యూఢిల్లీ : రైతులతో పాటు వినియోగదారుల ప్రయోజనాలను కాపాడాలంటే కేంద్రప్రభుత్వానికి కత్తి మీద సాములాంటి పరీక్షను ఎదుర్కొవాల్సి ఉంటుందని భారత పారిశ్రామిక మండలి అసోచామ్ సోమవారం నాడు పేర్కొంది. బడ్జెట్‌లో ఆర్థికమంత్రి రైతులకు కనీస మద్దతు ధర ప్రకటించారు. దీంతో ద్రవ్యోల్బణం పెరుగుతుందని అసోచామ్ అంచనా వేసింది. కేంద్ర బడ్జెట్ 2018-19లో ప్రభుత్వం రైతులకు కనీస మద్దతుధర (ఎం ఎస్‌పీ).. వ్యవసాయ దిగుబడి ఖర్చులో 50 శాతం ఎక్కువ ఇస్తామని ప్రకటించింది. ఈ సారి బడ్జెట్‌లో ప్రభుత్వం ఎక్కువగా వ్యవసాయరంగంపై ఫోకస్ పెట్టింది. రైతుల ఆదాయం పెంచడానికి పెద్దెత్తున కసరత్తు చేస్తోంది. గ్రామీణ సమస్యలపై దృష్టిపెట్టింది. అయితే ప్రభుత్వం రైతులకు కనీసమద్దతు ప్రకటిస్తుందని బడ్జెట్‌లో హామీ ఇచ్చింది. కానీ వాస్తవంగా వీటిని అమలు చేయాలంటే చాలా కష్టమని అసోచామ్ ప్రెసిడెంట్ సందీప్ జజోడియా ప్రకటనలో వివరించారు. రైతులకు కనీస మద్దతుధరపై గురించి ప్రభుత్వం గొప్పగా ప్రకటించినా, రైతుకు ఎంత వ్యయం అయ్యిందని లెక్కకట్టేందుకు మీడియాలో వ్యవసాయ ఆర్థికవేత్తలు, రైతు సంఘాలు పెద్దెత్తున చర్చలు జరిపాయి. దీని బట్టి చూస్తే రాబోయే రోజుల్లో రిటైల్ ద్రవ్యోల్బణంపై ఒత్తిడి పెరుగుతుంతో లేదో వేచి చూడాల్సిందేనని ఆయన అన్నారు. ప్రభుత్వానికి రైతుల ప్రయోజనాలను కాపాడ్డంతో పాటు వినియోగదారుడి ప్రయోజనాలు రెండు సమతూకం చేయడం అంటే కత్తిమీదసాము లాంటిదేనని జజోడియా పేర్కొన్నారు. గత ఆరు నెలల నుంచి రిటైల్ ద్రవ్యోల్బణం క్రమంగా పెరుగుతూపోతోందని, దీంతో ఆమ్‌ఆద్మీ నెలవారి బడ్జెట్‌పై ప్రభావం చూపుతుందని ఆయన తెలిపారు. ఇటీవల జరిగిన ద్రవ్యపరపతి సమీక్షలో ఆర్‌బీఐ కనీస మద్దతు ప్రభావం రిటైల్ ద్రవ్యోల్బణంపై ఏ మేరకు ఉంటుందో స్పష్టంగా కనిపిస్తుందని స్పష్టం చేసింది. ముఖ్యంగా కాయధాన్యాలు, ఆహార ధాన్యాలు... ఉదాహరణకు గోధుమ, బియ్యం ధరలు పెరుగుతాయని వెల్లడించింది. కూరగాయలు, పండ్ల ధరలు చుక్కలనంటుతున్నాయని, ఆర్‌బీఐ ద్రవ్యోల్బణం లక్ష్యం నాలుగు శాతం దాటే అవకాశాలు కనిపిస్తున్నాయని అసోచామ్ ఏర్కొంది. ఇక చివరగా వినియోగదారుల ప్రయోజనాలను ప్రభుత్వం ఎలా కాపాడుతుందో వేచి చూడాల్సిందేనని... పట్టణ ప్రాంతాల్లో ఉండేవారి ప్రయోజనాలను పణంగా పెట్టి రైతుల ప్రయోజనాలను కాపాడ్డం ప్రభుత్వానికి ఇబ్బందికరమైందేనని జజోడియా అన్నారు. గ్రామీణ ప్రాంతాల విషయానికి వస్తే ఇక్కడా భూముల్లేని రైతులే ఎక్కువగా ఉన్నారని, వీరంతా వ్యవసాయకూలీలేనని.. కేవలం కూలీ డబ్బులతో బతకాల్సి వస్తోందని.. ఒకవేళ ద్రవ్యోల్బణం పెరిగితే గ్రామీణ పేదలకు ఇబ్బందులు తప్పవని అనారు.

తగ్గిన కార్ల అమ్మకాలు పెరిగిన ద్విచక్రవాహనాలు




గ్రేటర్ నోయిడా : జనవరిలో కార్ల అమ్మకాలు స్వల్పంగా 1.25 శాతం క్షీణించి 184,264 యూనిట్లకు దిగివచ్చాయి. క్రితం ఏడాది ఇదే జనవరిలో 186,596 యూనిట్లు విక్రయించబడ్డాయని సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మాన్యూ ఫ్యాక్చరర్స్(సియామ) సోమవారం నాడు విడుదల చేసిన గణాంకాలను బట్టి తెలుస్తోంది. అయితే ప్యాసింజర్ వాహనాల అమ్మకాలు మాత్రం 7.57 శాతం పెరిగి 285,477 యూనిట్లకు చేరాయి.. క్రితం ఏడాది ఇదే నెలలో 265,389 యూనిట్లు విక్రయించబడ్డాయి. వివరాల్లోకి వెళితే మోటార్‌సైకిళ్ల అమ్మకాలు 28.64 శాతం పెరిగి 10,54,062 విక్రయించబడితే.. జనవరి 2017లో 849,385 యూనిట్లు విక్రయించబడ్డాయి. ద్విచక్ర వాహనాల అమ్మకాలు గత నెలలో 33.43 శాతం పెరిగి 16,84,066 యూనిట్లు విక్రయించబడితే.. క్రితం ఏడాది ఇదే నెలలో 12,62,140 యూనిట్లు విక్రయించబడ్డాయి. వాణిజ్య వాహనాల విషయానికి వస్తే 39.73 శాతం పెరిగి 85,600 యూనిట్లు విక్రయించబడితే.. క్రితం ఏడాది ఇదే నెలలో 61,305 యూనిట్లు విక్రయించబడ్డాయని సియామ్ ప్రకటనలో పేర్కొంది. అన్నీ రకాల వాహనాల అమ్మకాల విషయానికి వస్తే 30.71 శాతం పెరిగి 21,17,746 యూనిట్లు విక్రయిస్తే.. క్రితం ఏడాది ఇదే నెలలో 16,20,179 యూనిట్లు విక్రయించబడ్డాయని పేర్కొంది.

జువారి లాభం రూ. 48కోట్లు

న్యూఢిల్లీ : జువారీ ఆగ్రో కెమికల్స్ డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో స్టాండ్‌ఎలోన్ ప్రాతిపదికన 32 శాతం పెరిగి రూ.48.02 కోట్లు ఆర్జించింది. దీనికి కారణం రెవెన్యూ భారీగా పెరగడమేనని బీఎస్ఈకి సమాచారం అందించింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.36.36 కోట్లు నికరలాభాన్ని ప్రకటించింది. నికర ఆదాయం రూ.1452.08 కోట్లకు ఎగబాకగా.. క్రితం ఏడాది ఇద త్రైమాసికంలో రూ.1367.94 కోట్లని పేర్కొంది. బీఎస్ఈతో దీని షేరు 7.97 శాతం పెరిగి రూ.532.60 వద్ద మధ్యాహ్నం ట్రేడ్ అయ్యింది.

వృద్ధిరేటు 7.5శాతం


●వచ్చే ఆర్థిక సంవత్సరం ● డాయిస్ అంచనా



ముంబై : దేశ ఆర్థిక వ్యవస్థ క్రమంగా ఊపందుకుంటోందని, వచ్చే ఆర్థిక సంవత్సరానికి స్థూలదేశీయోత్పత్తి లేదా జీడీపీ 7.5 శాతానికి ఎగబావచ్చునని జర్మనీకి చెందిన డాయిస్ బ్యాంకుఅంచనా వేసింది. ద్రవ్యోల్బణం క్రమంగా పుంజుకోవడంతో సమీప భవిష్యత్తులో వడ్డీరేట్లు పెరుగాయన్న ఆందోళన అనసవరమని.. అవకాశాలు చాలా తక్కువని డాయిస్ బ్యాంకు సోమవారం నాడు విడుదల చేసిన ఒక నివేదికలో వివరించింది. ఈ ఆర్థికసంవత్సరం జీడీపీ వృద్ధి రేటు 6.6శాతానికి పరిమితం అయ్యే అవకాశాలున్నాయని పేర్కొంది. గత వారం రిజర్వుబ్యాంకు అంచనా వేసిన వృద్ధిరేటుకంటే ఇది డాయిస్ బ్యాంకు అంచనా 7.5 శాతం స్వల్పంగా ఎక్కువ. పెద్దనోట్ల రద్దు, జీఎస్టి అమల్లోకి తేవడం వల్ల జూన్ 2017తో ముగిసిన త్రైమాసికంలో వృద్ధిరేటు మూడు సంవత్సరాల కనిష్ఠానికి 5.7 శాతానికి దిగివచ్చిన విషయం తెలిసిందే. ఈ షాక్ నుంచి భారత్ త్వరగానే కోలుకొని సెప్టెంబర్ త్రైమాసికంలో వృద్ధి రేటు 6.7 శాతానికి ఎగబాకింది. అటు నుంచి డిసెంబర్ త్రైమాసికంలో మరింత పెరిగి 7శాతానికి, మార్చి 2018 తో ముగిసే చివరి త్రైమాసికంలో వృద్ధిరేటు 7.5 శాతంగా నమోదు కావచ్చునని నివేదికలో వివరించింది. ఇక సెంట్రల్ బ్యాంకు లేదా ఆర్‌బీఐ గురించి ప్రస్తావిస్తూ..ఈ నెలలో జరిగిన పరపతి సమీక్షలో ద్రవ్యోల్బణం పెరుగుతుందన్నా అంచనాతో వడ్డీరేట్ల తగ్గింపు జోలికి పోలేదు. ఇక వడ్డీరేట్ల పెంపు గురించి ప్రస్తావిస్తూ.. ద్రవ్యోల్బణం ఒక వేళ ఈ స్థాయి నుంచి పెరిగితే మాత్రం వడ్డీరేట్లు పెంచడానికి అవకాశాలున్నాయని, దీర్ఘకాలం పాటు వడ్డీరేట్లు స్థిరంగా కొనసాగే అవకాశాలున్నాయని తెలిపింది. ఇక ద్రవ్యోల్బణం విషయానికి వస్తే డిసెంబర్‌లో 5.2 శాతంగా నమోదై.. అటు తర్వాత జనవరి నాటికి ఐదు శాతానికి దిగివస్తుందని అంచనా వేసింది. ద్రవ్యలోటు గురించి ప్రస్తావిస్తూ.. ఆర్ బీఐ దీని గురించి పెద్దగా పట్టించుకోవడం లేదని పేర్కొంది.

రిలీఫ్ ర్యాలీ.. 295 పాయింట్ల వృద్ధి

●కలిసొచ్చిన ద్రవ్యోల్బణం గణాంకాలు ●గ్లోబల్ మార్కెట్ అండ



ముంబై : స్టాక్ మార్కెట్లు సోమవారం నాడు జోరందుకున్నాయి. మదుపరులు ఫార్మా, బ్యాంకింగ్, క్యాపిటల్ గూడ్స్, మెటల్, విద్యుత్ రంగానికి చెందిన షేర్లు కొనుగోలు చేశారు. దీంతో పాటు గ్లోబల్ మార్కెట్ల నుంచి అనుకూలమైన సంకేతాలు వచ్చాయి. ఇటీవల కాలంలో షేర్లు భారీ స్థాయిలో పతనం కావడంతో మదుపరులు ఎంపిక చేసిన బ్లూచిప్ షేర్లను కొనుగోలు చేశారు. సెన్సెక్స్ 295 పాయింట్లు లాభపడి 34,300 మార్కుకు వస్తే నిఫ్టీ 85 పాయింట్లు లాభంతో 10,540 వద్ద ముగిసింది. నిఫ్టీలో 33 షేర్లు లాభాలతో ముగిస్తే 17 నష్టాలతో ముగిశాయి. టాటాస్టీల్ మంచి ఫలితాలను ప్రకటించడంతో నాలుగు శాతం ఎరిగింది. ఓఎన్‌జీసీ కూడా షేర్లు కూడాలాభాలతో ముగిశాయి. దీంతో పాటు అరబిందోఫార్మా, యూపీఎల్, ఎస్‌బ్యాంకులు మూడు శాతం వరకు నిఫ్టీలో పెరిగాయి. స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా మాత్రం మూడు శాతం క్షీణించింది. క్యూ3 ఫలితాలు పేలవంగా నమోదు కావడం కారణంగా చెప్పుకోవచ్చు. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, భారత్ పెట్రోలియం కార్పొరేషన్, భారతి ఇన్‌ఫ్రాటెల్‌లు కూడా నష్టాలతో ముగిశాయి. దీంతో పాటు హెల్త్ కేర్‌కుచెందిన షేర్లు తిరిగి గాడనపడ్డాయి. మార్కెట్లకు అనుకూలించే అంశాల విషయానికి వస్తే గ్లోబల్ మార్కెట్ల నుంచి సానుకూలమైన సంకేతాలు రావడంతో పాటు జనవరి నెల రిటైల్ ద్రవ్యోల్బణం తగ్గడంతో పాటు పారిశ్రామికోత్పత్తి గణాంకాలు అనుకూలంగా ఉండటంతో దీర్ఘకాలికానికి ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందన్న అంచనాతో మదుపరులు దీర్ఘకాలానికి దృష్టిలో ఉంచుకొని షేర్లను కొనుగోలు చేశారు.

వరుసగా గత కొన్ని రోజుల నుంచి తగ్గముఖం పడుతున్న చమురు ధరలు సోమవారం నాడు స్వల్పంగా కోలుకున్నాయి. డాలర్‌మారకంతో రూపాయి కాస్తాకోలుకోవడంతో మార్కెట్లో సెంటిమెంట్ బలపడింది. సోమవారం నాడు మార్కెట్ లాభాలతో మొదలైంది ఇంట్రాడే గరిష్ఠంగా 34,351.43 పాయింట్లకు ఎగబాకింది. తర్వాత మదుపరులు లాభాల స్వీకరణకుపాల్పడడంతో 34,115 మార్కుకు దిగివచ్చింది. చివరకు 594.71 పాయింట్ల లాభంతో 34,300.47 వద్దముగిసింది. ద్రవ్యోల్బణం తగ్గముఖం పట్టడంతో దేశీయ సంస్థాగత మదుపరులు పెద్దమొత్తంలో షేర్లుకొనుగోలు చేశారు. దేశీయ సంస్థాగత మదుపరులు శుక్రవారం నాడు రూ.588.42 కోట్ల షేర్లు కొనుగోలు చేస్తే.. విదేశీ పోర్టుపోలియో ఇన్వెస్టర్లు రూ.1351.70 కోట్ల షేర్లు విక్రయించినట్లు స్టాక్ మార్కెట్ గణాంకాలు తెలియజేస్తున్నాయి. లార్సన్ అండ్ టర్బో 1.63శాతం పెరిగింది. కంపెనీపెద్ద ఆర్డర్ లభించడమేకారణం. దీంతో పాటుపవర్‌గ్రిడ్ కార్పొరేషన్; ఇండస్‌ఇండ్ బ్యాంకు, హీరోమోటో కార్ప్, రిల్, హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్, మారుతి సుజుకి, ఓఎన్‌జీసీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, విప్రో, బజాజ్ ఆటో, ఏషియన్ పెయింట్స్, సన్‌ఫార్మా షేర్లు 2.89శాతం వరకు పెరిగాయి. దీనికి వ్యతిరేకంగా ఐటి, టెక్ రంగానికిచెందిన షేర్లు నష్టపోయాయి.

ఇండియన్ బ్యాంకు లాభాల్లో 19 శాతం క్షీణత

న్యూఢిల్లీ : ప్రభుత్వరంగానికి చెందిన ఇండియన్ బ్యాంకు డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో నికరలాభం 19 శాతం క్షీణించి రూ.303.06 కోట్లకు దిగివచ్చింది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.373.48 కోట్లని ఒక ప్రకటనలో తెలిపింది. దీనికి ప్రధాన కారణం నిర్వహణా వ్యయం పెరగడంతో పాటు మొండిబకాయిలకు పెద్దమొత్తంలో కేటాయింపులు చేయాల్సి వచ్చిందని వివరణ ఇచ్చింది. మొత్తం ఆదాయం రూ.4,903.07 కోట్లు కాగా.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలోరూ.4,557.25కోట్లని తెలిపింది. మొండిబకియాలకు డిసెంబర్ త్రైమాసికంలో రూ.918.12కోట్లు కేటాయిస్తే. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ. 540.29 కోట్లని బీఎస్ఈకి సమాచారం అందించింది. బీఎస్ఈలో దీని షేరు 5.83 శాతం పెరిగి రూ.359.15 వద్ద మధ్యాహ్నం ట్రేడ్ అయ్యింది.

ఈ-ట్రియో ఆటోమొబైల్

హైదరాబాద్ : దేశంలో చౌకరకం ఎలక్ట్రిక్ వాహనాలను అందుబాటులోకి తేవడానికి ఈ -ట్రియో నడుం బిగించింది. 31 సంవత్సరాల సత్య యలమంచిలి ఈ ఎలక్ట్రిక్ వాహనాలకు డిజైన్, ఇంజినీరింగ్‌తో పాటు ఉత్పత్తి చేయనున్నారు. దీంతో పాటు ఆయన పలు స్టార్టప్‌కంపెనీలకు సీడ్ ఇన్వెస్టర్‌గా వ్యవహరిస్తున్నారు. కాగా ఆయన యూరోపియన్‌తో పాటు పలు భారత్ కార్పొరేట్లలో పనిచేసి అనుభవం గడిచారని ఈ ట్రియో తెలిపింది. బోలారంలో నెలకు 1500 కార్ల ఎలక్ట్రిక్ వాహనాల ప్లాంట్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని సత్య యలమంచిలి ఒక ప్రకటనలో తెలిపారు.

సమగ్ర సమాచారంతో 'ధరణి'

● ఐటీ, రెవెన్యూశాఖ ఉన్నతాధికారుల పర్యవేక్షణలో వెబ్‌సైట్ నిర్వహణ ● ఇక భూముల సమగ్ర సమాచారమంతా ఆన్‌లైన్‌లోనే ● ఈ డేటా ఆధారంగానే బ్యాంకు రుణాలు, క్రయ, విక్రయాలు, రిజిస్ట్రేషన్ల ప్రక్రియ

హైదరాబాద్, ఆంధ్రప్రభ : భూ యాజమాన్య హక్కులను మరింత పటిష్టం చేస్తూ తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన 'ధరణి' ప్రాజెక్టు త్వరలోనే అమల్లోకి రానుంది. ఇప్పటికే పూర్తయిన భూ రికార్డుల ప్రక్షాళన, కొనసాగుతున్న బార్‌కోడ్ టెక్నాలజీ పాసుపుస్తకాల ప్రక్రియకు అనుబంధంగా రికార్డులన్నింటినీ ఆన్‌లైన్‌లో పొందుపరిచి సమర్థవంతమైన నిర్వహణకు ప్రభుత్వం ప్రత్యేక వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తీసుకువస్తోంది. రైతుకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని ఇందులో నిక్షిప్తంచేసి ప్రపంచ నలుమూలల్లో ఎక్కడి నుంచైనా సమాచారం తెలుసుకునేందుకు వీలు కల్పిస్తూ ధరణి వెబ్‌సైట్‌ను ఆవిష్కరించాలని సీఎం కేసీఆర్ ఇదివరకే స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఆ మేరకు రెవెన్యూ, ఐటిశాఖ ఉన్నతాధికారులు సంయుక్త భాగస్వామ్యంతో ధరణి వెబ్‌సైట్ రూపకల్పనలో నిమగ్నమయ్యారు. ప్రభుత్వ పరిధిలో ఉన్న యంత్రాంగంతో ఈ వెబ్‌సైట్ నిర్వహణ సాధ్యం కాదని గుర్తించిన అధికారులు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం కలిగిన ఢిల్లీకి చెందిన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లీజింగ్ అండ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ టెక్నాలజీస్ లిమిటెడ్ (ఐఎల్‌అండ్‌ఎఫ్‌ఎస్) అనే సంస్థకు ధరణి నిర్వహణ బాధ్యతలు అప్ప గించారు. భూ రికార్డుల నిర్వహణతో పాటు ఎప్పటికప్పుడు భూ యాజమాన్య హక్కుల మార్పులు, చేర్పులను పొందు పరచడమే లక్ష్యంగా ఈ సంస్థ వెబ్‌సైట్‌ను నిర్వహిం చనుంది. ధరణి వెబ్ డిజైన్, సాంకేతిక నైపుణ్యత అభివృద్ధి, దాని అమలు, నిర్వహణ తది తర అంశాలను షార్ట్ సర్క్యూ లేషన్ పద్ధతిలో ఉండాలన్న ప్రతిపాదనకు ఇదివరకే రాష్ట్ర మంత్రిమండలి ఆమోదం తెలి పింది. ఈ వెబ్‌సైట్ నిర్వహణ కోసం రానున్న మూడేళ్ళలో ప్రభుత్వం రూ.116.57 కోట్ల మొత్తాన్ని ఖర్చు చేయనుంది. ప్రభుత్వం ఎంచుకున్న లక్ష్యం మేరకు మార్చి 11న రాష్ట్రవ్యాప్తంగా పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ మొదలుకొని ధరణి వెబ్‌సైట్ కూడా ప్రజలకు అందుబాటులోకి రానుంది. ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఈ వెబ్‌సైట్‌ను ప్రారంభిస్తామని భూ పరిపాలనా ప్రధాన కమిషనర్ కార్యాలయం తెలిపింది. సిసిఎల్ఎ కార్యాలయంలో ఉన్న భూ రికార్డుల డేటాను జోడించి సమగ్ర, సమీకృత సమాచారాన్ని వెబ్‌సైట్‌లో పొందుపరిచే ప్రక్రియ ప్రస్తుతం కొనసాగుతోంది.





భూ రికార్డుల ప్రక్షాళన తర్వాత ఆ డేటాను అప్‌డేట్ చేసే బాధ్యతను ప్ర భుత్వ తహసీల్దార్లకు అప్పగించింది. పట్టాదారు పాస్‌పుస్తకాలను జీపీఎస్ వ్యవస్థ ద్వారా ధరణి వెబ్‌సైట్‌కు అను సంధానం చేయనున్నారు. ఈ ప్రక్రియ రాష్ట్ర ఐటిశాఖ పర్యవేక్షణలో కొనసాగుతుంది. భూ యజమానులకు డిజిటలైజేషన్ పట్టాదారు పాస్‌పుస్తకాలను ఇవ్వడంతో పాటు త్వరలోనే ఏటీఎం తరహాలో భూ ముల సమగ్ర సమాచారం పొందుపరిచి స్మార్టు కార్డులను అందిం చా లన్న కోణంలోనూ ఐటి, రెవెన్యూ అధికారులు కసరత్తు చేస్తున్నారు.

ధరణిపై సిసిఎల్ఎ సమీక్ష

ధరణి వెబ్‌సైట్ రూపకల్పన నేపథ్యంలో భూ పరిపాలనాశాఖ ప్రధాన కమిషనర్ ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. రెవెన్యూ, ఐటి, కమ్యూనికేషన్ శాఖల అధికారులతో పాటు ఐఎల్‌ఎఫ్ఎల్ టెక్నాలజీస్ సంస్థ ప్రతినిధులతో సాంకేతిక పరిజ్ఞానంపై చర్చించారు. పట్టాదారు పాస్‌పుస్తకాలు పంపిణీ చేసే నాటికి ధరణి వెబ్‌సైట్ కూడా సమగ్ర సమాచారంతో అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశాలు ఇచ్చారు.

డిప్యూటీ కలెక్టర్లకు పదోన్నతులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : రెవెన్యూలో 20 మంది డిప్యూటీ కలెక్టర్లకు స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతి కల్పించారు. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ తివారి ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతులు పొందిన వారిలో పి. రాజా విక్రమ్ రెడ్డి, కనతాల వెంకటేశ్వర్లు, ఎం, కృష్ణ ఎం.వి. రవీంద్రనాథ్, ఎన్. నటరాజ్, ఎస్. మోహన్‌రావు, ఒడ్డి జోసెఫ్ మధు, నూతి మధుసూదన్, కందూరి చంద్రారెడ్డి, వి. చంద్రశేఖర్ రెడ్డి, అబ్దుల్ అహ్మద్, వి. హన్మం తరెడ్డి, అరమడ వెంకట్ రెడ్డి, వన మాల చంద్రశేఖర్, బి. వెంకటేశ్వర్లు, ఎన్. శ్రీనివాసరావు, టి. పూర్ణచంద్ర, కొండగడప విద్యా సాగర్, జి. భాస్కర్‌రావు, వడ్ల లక్ష్మి నారాయణ ఉన్నారు. పదోన్నతులు పొందిన వారిలో అత్యధికులు ఆర్డీవోలుగా వివిధ జిల్లాల్లో పని చేస్తున్నారు. కొందరు డిప్యూటేషన్ పైన గృహ నిర్మాణం, మైనార్టీ సంక్షేమ శాఖల్లో పని చేస్తున్నారు. విద్యాసాగర్ రాజ్ భవన్ లో లైజన్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. నిబంధనలకు లోబడి తాత్కాలికంగా ఈ పదోన్నతులను కల్పించారు.

మహాశివరాత్రి శుభాకాంక్షలు




హైదరాబాద్, ఆంధ్రప్రభ : మహా శివరాత్రి పండుగను పురస్కరించుకుని తెల గు రాష్ట్రాల ప్రజలకు గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్ శుభాకాంక్షలు తెలిపారు. మహాశివరాత్రి కఠోర దీక్ష, ఆరాధన, భక్తిశ్రద్ధలతో జరుపుకునే ముఖ్యమైన పండుగ అని ఆయన పేర్కొన్నారు. ఈ పండుగ సందర్భంగా ప్రేమతో కూడిన ఆదర్శవంతమైన ఆలోచనలు, ఆత్మీయత, స్నేహం, సోదరభావం పెంపొందాలని ఆయన ఆకాంక్షించారు.

అందరూ సుఖసంతోషాలతో జీవించాలి : కేసీఆర్



తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు శివరాత్రి పండుగ శుభా కాంక్షలు తెలిపారు. ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించేలా భగవంతుడు దీవించాలని ప్రార్థిం చారు. మహా శివరాత్రి సందర్భంగా భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున శివా లయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని కేసీఆర్ అధికారులను కోరారు.

ప్రేమాభిమానాలు పెరగాలి : చంద్రాబాబు



మహా శివరాత్రి సందర్భంగా తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు తెలుగు ప్రజలకు శుభా కాంక్షలు తెలిపారు. ఈ మహాశివరాత్రి పర్వ దినం తెలుగు వారందరిలో ప్రేమాభిమానాలు పెం చాలని, అందరూ ఆయు రారోగ్యాలు, సుఖ సంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.

ఏఓబీలో ఎదురు కాల్పులు

చిత్రకొండ పీఎస్ పరిధిలో ఘటన

విశాఖపట్నం, ప్రభన్యూస్ బ్యూరో: ఆంధ్రా-ఒడిషా సరిహద్దు (ఏఓబి) బోర్డర్ లో సోమవారం మావోయిస్టులు, పోలీసు వర్గాల మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. చిత్రకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఎదురుకాల్పుల్లో ఎటువంటి ప్రాణనష్టం చోటు చేసుకోలేదు. గ్రేహౌండ్స్, ఎస్ఓజి బృందాలు జాయింట్ ఆపరేషన్‌లో భాగంగా చిత్రకొండ పిఎస్‌కు సమీప అటవీ ప్రాంతంలో కూంబిగ్ నిర్వహిస్తున్నారు. అయితే అకస్మికంగా పోలీసు బృందాలపై మావోలు కాల్పులు జరపడంతో పోలీసులు కూడా ఎదురుకాల్పులకు దిగారు. దీంతో మావోలు అక్కడ నుంచి తప్పించుకోగా పోలీసులు భారీ డంప్‌ను గుర్తించారు. అక్కడ మావోయిస్టులు శిబిరం నిర్వహించినట్లు పోలీసులు నిర్ధారించుకున్నారు. పోలీసులు గుర్తించిన డంప్‌లో రెండు స్టీల్‌క్యారేజ్ మైన్స్, 45 కిట్‌బ్యాగ్‌లు, రెండు వెపన్‌లు, పలు బుల్లెట్‌లు, 303 లైవ్ ఆరు రౌండ్లు, మ్యాగ్జైన్, వైర్ బండిల్స్, గ్యాస్ కట్టర్, ఏడు జతల దుస్తులు, ఆరు స్టీల్‌క్యారేజ్‌లు, 9ఎమ్ఎమ్ కార్బన్ మ్యాగ్జైన్, నాలుగు 9ఎమ్ఎమ్ కార్బాన్ రౌండ్స్, 16 డిటోనేటర్లు, ఎక్స్‌ప్లోజివ్ సామాగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లో పోలీసులు విస్తృతంగా కూంబింగ్ నిర్వహిస్తున్నారు. మావోలు, పోలీసులు ఎదురుకాల్పులు కారణంగా ఏఓబిలో మరోసారి ఉద్రిక్తపరిస్థితులు నెలకొన్నాయి. అనేక ప్రాంతాల్లో చెక్‌పోస్టులు, ఇతర స్వాగత ద్వారాల వద్ద పోలీసులు భారీగా గాలింపులు చేపడుతున్నారు.

పూలు, పండ్ల ధరలకు శివరాత్రి ఎఫెక్ట్

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : మహాశివరాత్రి సందర్భంగా మార్కెట్‌లో పండ్లు, పూల వ్యాపారాలకు విపరీతమైన గిరాకి పెరిగింది. శివ రాత్రి అంటే ఉపవాసాలు, జాగా రంతో కూడిన పర్వదినం. ఈ పండు గను భక్తి ప్రవృత్తులతో ఆచరిస్తారు. భక్తులు ఉపవాసంతో రాత్రంతా జాగారం చేస్తూ పలు రకాల పండ్లను శివునికి నైవేద్యంగా పెట్టడం ఆన వాయితీ. పండ్లు, పూలతో పరమ శివుడిని పూజిస్తే కోరిన కోరికలు తీరుతాయని భక్తుల నమ్మకం. మెజారిటీ ప్రజలు ఈ పుణ్యదినాన్ని ఆచ రిస్తున్నందున వ్యాపారులకు భలే గిరాకి. ఇదే అదనుగా పండ్లు, పూలు, పూజాసామగ్రి ధరలను వ్యాపారాలు విపరీతంగా పెంచారు. మామూలు రోజులతో పోలిస్తే రెట్టింపు ధరలను వసూలు చేస్తారు. ధరల పెంపును ప్రశ్నించాల్సిన అధి కార యంత్రాంగం పట్టిం చుకోనందున ఇష్టం వచ్చిన రీతిగా ధరలు పెంచేస్తున్నారు. నగరంలో గుడి మల్కాపూర్, గడ్డి అన్నారం, ఓల్డ్ మోండామార్కెట్, మోజాంజాహి మార్కెట్, దిల్‌సుక్‌నగర్ మార్కెట్‌లు పూలు, పండ్ల విక్ర యాలకు ప్రసిద్ధి. శివరాత్రిని పుర స్కరించుకుని నగరం చుట్టుపక్కల పండించే పూలు, పండ్లు సరి పోనందున బెంగళూరు, మహారాష్ట్ర నుంచి వాటిని తెప్పిస్తారు. మంగళవారం మహా శివరాత్రి పుర స్కరించుకుని రెండు రోజుల ముందే వాటి విక్రయాలు ప్రారం భమ య్యాయి. నగరంలో ఎక్కడ చూసి నా అంగళ్లు వెలిశాయి. పూలతో ఫుట్‌పాత్‌లను పరిచేశారు. బంతి ,చామంతి, మల్లె పూలు సాధారణ రోజుల్లో కిలో 50 రూపాయలు పలికేవి. ప్రస్తుతం కిలో రూ. 200 కి పైగానే అమ్ముతున్నారు. సంత్ర, బతా ్యి పండ్లు ఇతర రోజుల్లో ఒక్కోటి సైజును బట్టి 5 లేదా 10 రూపా యలకు విక్రయించేవారు. ద్రాక్ష కిలో రూ.50 ఉండగా ఏకంగా రూ.100 కి పెంచారు. ఆపిల్, అరటి పండ్ల ధరలు కూడా విపరీతంగా పెంచేశారు.


సామాజిక పథంలో జైళ్లశాఖ



హైదరాబాద్, ఆంధ్రప్రభ: పరిమితికి తగిన ఖైదీలు లేకపోవడంతో తెలంగాణ రాష్ట్ర జైళ్ళ శాఖ 13 జైళ్ళను మూసి వేసింది. మూసి వేసిన జైళ్ళను అలాగే వదిలేస్తే భవిష్యత్‌లో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశాలుండటంతో వాటిల్లో సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించాలని నిర్ణయించింది. ఇందుకోసం రూ. 3 కోట్లను వెచ్చించనుంది. జైళ్ళ శాఖ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డిజి వికె సింగ్ మాట్లాడుతూ, 2025 నాటికల్లా మాజీ ఖైదీలందరికీ ఉపాధి, ఖైదీలలో పరివర్తనతో నేర రహిత సమాజం ఏర్పాటు, సామాజికసేవలతో ప్రజలలో మమేకం కావాలన్న లక్ష్యంలో భాగంగా సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించనున్నామన్నారు. ఇందులో 235 మంది తిరిగి ఆశ్రమాలకు వచ్చారన్నారు. మూసి వేసిన జైళ్ళలో సామాజిక కార్యక్రమాలను చేప ట్టడంతో పాటు విద్యా సంస్కార కేంద్రాలుగా, పరిశ్రమ కేంద్రాలుగా తయారు చేయబోతున్నామన్నారు.

పోలీసులకు సపోర్టుగా కెన్నల్ స్క్వాడ్

భవిష్యత్ సవాళ్లకు సంసిద్ధం



హైదరాబాద్, ఆంధ్రప్రభ: తీవ్రవాదం ఉగ్రవాదంపై పోరాటానికి పోలీ సుల కు సపోర్ట్‌గా కెన్నల్ (శునకాల) స్క్వాడ్‌ను సన్నద్ధం చేయడం అభి నం దనీయమని ప్రధాన కార్యదర్శి ఎస్‌కె జోషి అన్నారు. నగర శివార్లలోని మొయినాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ ఇంటెలిజెన్స్ అకాడమీలో సోమవారం పోలీసు శునకాలు, హ్యాండ్లర్స్ పరేడ్‌కు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దర్యాప్తులో పోలీసులకు తోడుగా శిక్షణ పొందిన శునకాలు ఎంతో తోడవుతాయన్నారు. భవిష్యత్ సవాళ్ళ కోసం పోలీసులకు మద్దతుగా ఈ స్క్వాడ్‌ను సిద్ధం చేయడం అభినందనీయమన్నారు. అనంతరం డిజిపి ఎం. మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ, పోలీసులు వృత్తిపరంగా పోటీ పడుతుంటారని ఈ పోటీని నిరంతరం సాధారణ శిక్షణా కార్యక్రమాల ద్వారా అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. కేసులను దర్యాప్తు చేయడం, వివిపిల భద్రత, పేలుడు పదార్థాలను గుర్తించడం, మత్తు పదార్థాలను పసిగట్టడం తదితర వాటి విషయంలో శునకాల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధి కారులు గోపీకృష్ణ జితేందర్, సందీప్ శాండిల్య, మల్లారెడ్డి, నవీన్‌చంద్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సిటీలో హవాలా దందా



● గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న వైనం ● నల్లధనాన్ని ఆసరాగా చేసుకుని నిర్వహణ ● జెమ్స్ అండ్ జూవెల్లర్స్ షాపులే కేంద్రాలు ● కమీషన్ పద్ధతిన చెల్లింపులు ● నమ్మకమే పెట్టుబడిగా అక్రమ వ్యవహారం ● పలువురిని అరెస్ట్ చేసిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు ● వివరాలు వెల్లడించిన సీపీ శ్రీనివాసరావు

హైదరాబాద్,ప్రభ న్యూస్: నగరంలో హవాల దందా గుట్టుచప్పుడు కాకుండా సాగుతోంది. నల్లధనాన్ని ఆసరాగా చేసుకుని, నగరంలో అనేక మంది హవాలా దందాను కొనసాగిస్తున్నారు. ఎలాంటి లెక్కాపత్రాలు, సంతకాలు, బ్యాంకులతో పనిలేకుండానే, కేవలం ఎదుటివ్యక్తిపై ఉన్న ప్రగాఢ విశ్వాసాన్ని నమ్మకంగా, హవాలా వ్యాపారంలో అనేక మంది ఆరితేరి పోతున్నారు. ప్రధానంగా అరబ్ దేశాల నుంచి, నగరానికి పాకినా హవాలో దందాలో, ప్రస్తుతం బడా వ్యాపారులు, రాజకీయ నేతలే కాదు సామాన్యులు కూడా మునిగితేలుతున్నారు. అయితే గుట్టుచప్పుడు కాకుండా గ ుట్టు చప్పుడు కాకుండా హవాలా లావాదేవీలకు పాల్పడుతున్న ముఠాను హైదరాబాద్ ఉత్తర మండల టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోమవారం పట్టుకోవడం ప్రస్తుతం నగరంలో, హాట్ టాఫిక్‌గా మారింది.

నగరంలో హవాల దందా రోజురోజుకు మూడు పువ్వులు ఆరుకాయాలుగా సాగుతుంది. ఎంతో కాలంగా గుట్టుచప్పుడు కాకుండా నగరంలో హవాల దందా కొనసాగుతున్నా, నిర్వాహకులు తమకున్న పరిచయాలతో ఇప్పటివరకు బయటపడలేదు. అయితే వీటిపై ఎంతోకాలంగా దృష్టిసా రించిన హైదరాబాద్ పోలీసులకు చిన్న క్లూ దొరికింది. వాటి ఆధా రంగా విచారణ కొనసాగించడంతో, హవాలా ముఠా బట్టబయలైంది. ఇదిలాఉంటే హవాల ముఠా గుట్టురట్టుతో వడ్డీవ్యాపారులు, రాజకీయ నేతల్లో వణుకు మొదలైంది. ఆదాయపుపన్ను, బ్యాంకు లావాదేవీల నుంచి తప్పించుకుంటూ దందా సాగిస్తున్నవారంతా, తమ వంతు ఎప్పుడు వస్తుందోనని భయాందోళనకు గురువుతున్నారు.

రూ. కోటి 40 లక్షల 80 వేలు స్వాధీనం

నగరంలో హవాలా రాకెట్‌ను టాస్క్‌ఫోర్స్ పోలీసులు గుట్టును రట్టు చేసారు. అబిడ్స్‌లోని మహాలక్ష్మీ జెమ్స్ అండ్ జూవెల్లర్స్ కేంద్రంగా హవాలా వ్యాపారం నిర్వహిస్తున్న, వారిని సోమావారం నార్త్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేసారు. కేసు వివరాలను నగర సీపీ వీవీ శ్రీనివాసరావు మీడియాకు వివరించారు. వీరిలో ప్రధాన నిందితుడు జేయేష్ పటేల్, అలియాస్ అరుల్‌తో పాటు వనరాజ్‌సింహ్, బామర్ సింహ్, పటేల్ ప్రదీప్ కుమార్, గణేష్ సత్యనారాయణ సాబ్, బోనబోయిన విఘేశ్వర్, అరుణ్ అడ్చిలు ఉన్నారు. నిందితుల నుంచి కోటి 40 లక్షల 80 వేల రూపాయలను స్వాధీనం చేసుకున్నారు. హవాల ఏజెంట్లతో లాభాలు ఎక్కువ ఉంటాయని, తెలుసుకుని వ్యాపారం మొదలు పెట్టారని పోలీసులు తెలిపారు. గుజరాత్‌కు చెందిన జేయేష్ పటేల్ 2009లో నగరానికి వచ్చి స్థిరపడ్డారు. బంగారు, వజ్రాల వ్యాపారం చేస్తున్నాడు. హావాల వ్యాపారులతో పరిచయం ఏర్పడి జేయేష్ సిన్స్ 0.6 నుంచి 0.8 కమిషన్‌కు హవాల రూపంలో డబ్బులు మార్చేవాడని సీపీ తెలిపారు. వాట్సప్‌లో నోటుకు సంబంధించిన సీరియల్ నెంబర్ ను పంపి, అలా బ్లాక్‌మనీని, వైట్‌గా , వైట్ మనినీ బ్లాక్‌గా మార్చేవాడని సీపీ వెల్లడించారు. రాయలసీమ స్టీల్, రీరోలింగ్ స్కాన్, ఎనర్జి అండ్ పవర్ లిమిటెడ్, సంస్థలకు హవాలా డబ్బులు మార్చేవాడని, జీఎస్టీ చెల్లించకుండా లావాదేవిలు నడిపేవారిని, ఐటీ డిప్యూటీ డైరెక్టర్ రాజేష్, టాస్క్‌ఫోర్స్ డీసీపీ రాధాకిషన్ తెలిపారు. పట్టుకున్న నగదును ఇన్‌కమ్ టాక్స్ అధికారులకు అందజేస్తామని సీపీ తెలిపారు.

తాత్కాలిక కార్యాలయాలకు
నిధులిచ్చేది లేదు!

● ఏపీ ప్రభుత్వానికి స్పష్టం చేసిన కెంద్రం

అమరావతి, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి: రాజధాని అమరావతిలో శాశ్వత కార్యాలయాల ప్రాతిపదిక నిర్మాణానికి మాత్రమే తమ నిధులు వినియోగించాలని కేంద్రం రాష్ట్రానికి స్పష్టం చేసింది. బడ్జెట్ సమావేశాల సమయంలోనే కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ రాష్ట్ర ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి రవిచంద్ర, ఇతర అధికారుల్ని ఢిల్లీకి పిలిపించారు. వీరితో కేంద్ర ఆర్థికశాఖాధికారులు భేటీ అయ్యారు. ఇంతవరకు అమరావతికి కేంద్రమిచ్చిన నిధుల వినియోగ అంశం ఇందులో ప్రధానంగా చర్చకొచ్చినట్లు సమాచారం. రాజధానికి సంబంధించినంతవరకు మౌలిక అవసరాలకు తగిన నిర్మాణాలకు నిధులివ్వడంలో ఎలాంటి వెనుకబాటు లేదని ఈ సందర్భంగా కేంద్ర ఆర్థికశాఖ రాష్ట్ర అధికారులకు తెలియజేసింది. అయితే ఇంతవరకు అమరావతిలో జరిగిన నిర్మాణాలన్నీ తాత్కాలికమైనవే కావడంతో వీటిని తాము పరిగణనలోకి తీసుకోవడంలేదని తేల్చిచెప్పింది. అమరావతిలో నిర్మించిన తాత్కాలిక సచివాలయం, తాత్కాలిక అసెంబ్లీ భవనాల్తో పాటు సుందరీకరణ, విగ్రహాల ఏర్పాటు వంటివన్నీ తమ పరిధిలోవి కావని పేర్కొంది. శాశ్వత సచివాలయం, శాశ్వత అసెంబ్లీ భవనాల నిర్మాణానికి మాత్రమే తమ నిధులు వినియోగించాలని స్పష్టం చేసింది. తెలంగాణా నుంచి వస్తున్న ఒత్తిడికనుగుణంగా విభజనానంతరం నాలుగేళ్ళ తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో ప్రతిపాదించిన హైకోర్టుకు కూడా తాత్కాలిక భవనాల నిర్మాణానికే మొగ్గుచూపడం కూడా ఈ భేటీలో చర్చకొచ్చినట్లు సమాచారం. గతంలో అంటే డిజైన్లు, ఆకృతుల రూపకల్పన పూర్తికాలేదు. కానీ ఇప్పుడు డిజైన్లు అందుబాటులోకొచ్చేశాయి. అత్యున్నత సాంకేతిక నైపుణ్యం కూడా అందుబాటులో ఉంది. వీటి ఆసరాతో ఏడాదితిరిగేసరికి శాశ్వత ప్రాతిపదికన వినియోగానికనువైన భారీ భవనాల నిర్మాణం సునాయాసంగా పూర్తవుతుంది. ఆ దిశగా ప్రయత్నాలు చేయాల్సిందిగా సూచించినట్లు తెలుస్తోంది. రాజధాని నగ రాన్ని ప్రధాన జాతీయ రహదార్లతో అనుసంధానించే రోడ్లకు కూడా నిధు లిచ్చేందుకు కేంద్రం సమ్మతించింది. అయితే తగిన జనసాంద్రత లేకుండానే మెట్రో రైల్, బుల్లెట్ రైళ్ళ ప్రాజెక్టులు తమకు కావాలంటూ రాష్ట్రం చేస్తున్న వాదనను తప్పు బట్టింది. మొక్కల పెంపకం, విగ్రహాల ఏర్పాటు, ఉద్యానవనాలు, సుందరీకరణ వంటివన్నీ పర్యాటక ఆకర్షణకు పనికొచ్చే కార్యక్రమాలు. వీటికయ్యే ఖర్చును రాష్ట్రం సొంత నిధుల్నుంచే భరించాలి తప్ప రాజధాని నిర్మాణంతో వీటిని అను సంధానించి నిధుల కోసం డిమాండ్ చేయడం తగదని స్పష్టం చేసినట్లు సమాచారం.

ఏపీలో ఈఎస్‌ఐ ఆసుపత్రులు

● నిర్మాణానికి కేంద్రం సానుకూలం ● ఏపీ మంత్రి పీతాని వెల్లడి

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: ఆంధ్రప్రదేశ్‌లో ఈఎస్‌ఐ ఆసుపత్రుల నిర్మాణానికి సత్వర చర్యలు చేపట్టాలని రాష్ట్ర సర్కార్ చేసిన విజ్ఞప్తికి కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. ఏపీ రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన, శిక్షణ శాఖ మంత్రి పితాని సత్యనారాయణ ఆ శాఖ కమిషనర్ వరప్రసాద్, ఈఎస్‌ఐ ఆసుపత్రుల సంచాలకులు డాక్టర్ విజయ్ కుమార్‌తో కలిసి సోమవారం కేంద్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖా మంత్రి సంతోష్ కుమార్ గంగ్వార్‌తో న్యూఢిల్లీలోని ఆయన కార్యాలయంలో సమావేశమయ్యారు. కొత్త రాజధాని అమరావతిలో ఈఎస్‌ఐ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణానికి అనుమతి, మంజూరు, ఈఎస్‌ఐ ఆసుపత్రుల స్థాయి పెంపుదల, నూతన డిస్పెన్సరీల మంజూరు, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, చంద్రన్న బీమా పథకం అనుసంధానానికి, నేషనల్ స్కాలర్ షిప్ పోర్టల్‌లో అర్హులైన విద్యార్థుల డేటా పొందుపరిచే అంశాలపై కేంద్ర మంత్రితో చర్చించారు. సమావేశం అనంతరం పితాని సత్యనారాయణ పాత్రికేయులతో మాట్లాడుతూ... ప్రధానంగా విశాఖపట్నంలో నిర్మాణానికి మంజూరు చేసిన 500 పడకల ఈఎస్‌ఐ ఆసుపత్రి నిర్మాణానికి, అమరావతి సూపర్ స్పెషాలిటీ ఈఎస్‌ఐ ఆసుపత్రిని మూడు వందల పడకలతో విజయవాడలోని ఈఎస్‌ఐ ఆసుపత్రి ప్రాంగణంలో నిర్మాణానికి అనుమతి మంజూరు చేయాలని, విజయనగరంలో 100 పడకల ఆసుపత్రి నిర్మాణానికి అవసరమైన భూములను రాష్ట్రప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి అందచేసినందున వెంటనే నిర్మాణం చేపట్టి కార్మికుల సంక్షేమానికి సహకరించవలసినదిగా కేంద్ర మంత్రి, ఆ శాఖ అధికారులతో సమగ్రంగా చర్చించినట్లు పితాని వివరించారు. తిరుపతిలో చేపట్టిన వంద పడకల ఆసుపత్రి నిర్మాణం పనులు పూర్తి కావచ్చినందున, ఏప్రిల్ రెండో వారంలో జరిగే ప్రారంభోత్సవానికి రావలసినదిగా సంతోష్ గంగ్వార్‌ను ఆహ్వానించామని చెప్పారు. ఇందుకు కేంద్ర మంత్రి అంగీకరించినట్టు పితాని తెలిపారు. రాజమండ్రిలో వున్న 50 పడకల ఈఎస్‌ఐ ఆసుపత్రిని రెండు వందల పడకల ఆసుపత్రిగా మార్చి, ఇందుకు అవసరమైన భవన నిర్మాణ పనులను చేపట్టాలని కోరామన్నారు. రాష్ట్రంలో 3 పడకలు, 6 పడకల స్థాయి గల 25 డిస్పెన్సరీలను మంజూరు చేసి అవసరమైన వైద్యులను, సిబ్బందిని నియమించాలని కేంద్ర మంత్రిని కోరినట్లు ఆయన చెప్పారు. కార్మికుల సంక్షేమానికి కేంద్రం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి జన జీవన్ బీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, ఆమ్ ఆద్మీ బీమా యోజన పథకాలను, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న చంద్రన్న బీమా యోజన పథకంతో అనుసంధానం చేసి రాష్ట్రంలో కార్మికుల సంక్షేమానికి చేయూతనివ్వాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేసినట్లు మంత్రి పితాని సత్యనారాయణ చెప్పారు. ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించడం, ప్రమాద బీమా మొత్తం చెల్లించడంలో వున్న వ్యత్యాసాలను సవరిస్తే ఎంతో మంది కార్మికులకు ప్రయోజనం చేకూరుతుందని కేంద్ర మంత్రికి చేసిన విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించారని, ఈ అంశంపై అధికారులతో చర్చించి తగు నిర్ణయం తీసుకోనున్నట్లు చెప్పారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అక్టోబర్ 2, 2016 నుంచి అమలు చేస్తున్న చంద్రన్న బీమా పథకం కింద 2.50 కోట్ల మంది కార్మికులు ఆధార్ కార్డుల అనుసంధానంతో నమోదు చేసుకున్నారని చెప్పారు. ప్రమాదం సంభవించినప్పుడు వీరికి ప్రమాద బీమా కింద 5లక్షల రూపాయలు రాష్ట్రప్రభుత్వం చెల్లిస్తుందని, కేంద్ర ప్రభుత్వం 2 లక్షల రూపాయలు మాత్రమే చెల్లిస్తున్నందున ఈ వ్యత్యాసాన్ని సవరించాలని కూడా ఆయన దృష్టికి తీసుకెళ్లినట్టు వెల్లడించారు. పీఎంజేజేబీవై పథకం కింద 18 నుంచి 50 సంవత్సరాల వయసులోపు వారు, ఏఏబీవై పథకం కింద 51 నుంచి 60 సంవత్సరములలోపు వయస్సు వారికి కేంద్ర ప్రభుత్వం బీమా పథకాలను అమలు చేస్తుండగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 18 నుంచి 70 సంవత్సరాల వయసు గల వారికి బీమా ప్రయోజనం చేకురుస్తున్నదని మంత్రికి వివరించినట్లు చెప్పారు. నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్‌లో రాష్ట్రంలో 22 ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజిలు ఉన్నాయన్న మంత్రి చిత్తూరు, అనంతపురంలలో మోడల్ కెరీర్ సెంటర్లు మంజూరైనట్లు చెప్పారు. 6.36 కోట్ల రూపాయలతో 14 కేంద్రాలలో మోడల్ కెరీర్ సెంటర్లు ఏర్పాటు చేయాలని కోరుతూ ఇప్పటికే ప్రతిపాదనలు కేంద్రానికి సమర్పించినట్లు మంత్రి పితాని సత్యనారాయణ పాత్రికేయులకు వివరించారు. చిత్తూరు కేంద్రానికి రూ.37.45 లక్షలకు గానూ రూ. 22.47 లక్షలు మంజూరు చేయడం జరిగిందని, అనంతపురం కేంద్రానికి రూ.31.91 లక్షలకుగాను రూ.19.14 లక్షలు విడుదల చేసినట్లు పేర్కొంటూ మిగిలిన మొత్తాన్ని విడుదల చేయాలని కోరామన్నారు.



ఏపీ మంత్రి పితాని సత్యనారాయణ ,కమిషనర్ వరప్రసాద్, ఈఎస్‌ఐ డాక్టర్ విజయ్ తో కేంద్ర మంత్రి సంతోష్‌కుమార్ గంగ్వార్

బీజేపీ మిత్రపక్షాల విశ్వాసం కోల్పోతోంది



రాజమహేంద్రవరం, ప్రభన్యూస్ : బీజేపీపై ఎన్ డీయే భాగస్వామ్య పక్షాలక్కూడా విశ్వాసం పోతోం దని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, రెవెన్యూ మంత్రి కెఇ కృష్ణమూర్తి వ్యాఖ్యానించారు. సోమవారం జిల్లా కొచ్చిన ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌కు జరుగుతున్న అన్యా యం ఇప్పుడు జాతీయ సమస్యగా మారిందన్నారు. అన్ని రాష్ట్రాలు, పార్టీల్నుంచి సంఘీభావం వ్యక్త మౌతోందన్నారు. బడ్జెట్లో రాష్ట్రానికి కేటాయించిన నిధులపై వివాదం ఇప్పట్లో సమసేలా లేదన్నారు. ఈ అన్యాయం కళ్ళకుకట్టినట్లు కనబడుతున్నా కేంద్రం స్పందించక పోవడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రధాని మోడి కలగజేసుకుని రాష్ట్రానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రం అనుసరిస్తున్న తీరు ఫెడరల్ వ్యవస్థకే భిన్నంగా ఉందన్నారు. భారత ప్రజాస్వామ్య విధానంలో రాష్ట్రాల ప్రయోజనాల్ని కాపాడాల్సిన బాధ్యత కేంద్రానిదేనన్నారు. అలాంటిది ఆంధ్రప్రదేశ్‌కు నేరుగా కేంద్రమే అన్యాయం చేస్తోందని మం డిపడ్డారు.

విభజన హామీల సాధనకు సమష్టి కార్యాచరణ

● జయ ప్రకాశ్ నారాయణ



హైదరాబాద్, ఆంధ్రప్రభ : రాష్ట్ర విభజన బిల్లు హామీలు సాధించేందుకు నిపుణులు, ఆర్థికవేత్తలు, పదవీ విరమణ చేసిన సీనియర్ ఉన్నతాధికారులు, వివిధ రంగాల్లో అనుభవజ్ఞులను భాగస్వామ్యం చేస్తామని లోక్‌సత్తా జాతీయ అధ్యక్షుడు జయప్రకాశ్ నారాయణ్ చెప్పారు. విభజన చట్టంలోని హామీలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఇప్పటి వరకు అమలు చేసిన అంశాలు, చేయాల్సిన వాటిపై అధ్యయనం చేయాల్సి ఉందని ఆయన చెప్పారు. విభజన చట్టంలోని అంశాలను సాధించే క్రమంలో జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ చేసిన ప్రతిపాదనల నేపథ్యంలో లోక్‌సభ మాజీ సభ్యుడు ఉండవల్లి అరుణ్ కుమార్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణలతో ఆయన సోమవారం సమావేశమయ్యారు. సమగ్ర సమాచారం సేకరించే అంశంపై సీనియర్ల సలహాలు, సూచనలు తీసుకునే దానిపై దాదాపు గంటన్నరపాటు చర్చించారు. అనంతరం జయప్రకాశ్ మీడియాతో మాట్లాడుతూ, ప్రజలకు న్యాయం జరిగేందుకు కేంద్రం ఇచ్చిన హామీలు అమలు చేసేలా ఒత్తిడి తేవాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. రాష్ట్రం కోసం హక్కులు సాధించడంలో ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని, అయితే ఆర్భాటాలు, ప్రకటనలకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు.

రాజకీయాలకు అతీతంగా:ఉండవల్లి

ఈ ఉద్యమంలో అందరిని కలుపుకుని ముందుకు సాగితేనే విభజన హామీలను సాధించుకోగలుగుతామని ఉండవల్లి అరుణ్ కుమార్ అన్నారు. జయప్రకాశ్ నారాయణ్ వద్ద దీనికి సంబంధించి ఎంతో సమాచారం ఉందని, నిపుణుల సలహాలతో ముందడుగు వేయాల్సి ఉందన్నారు

హక్కుల సాధనకు పోరాటం : రామకృష్ణ

8వ తేదీన నిర్వహించిన బంద్‌లో 5 కోట్ల ఆంధ్రులు ఒకే అభిప్రాయంతో ఉన్నారని స్పష్టమైందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. రాష్ట్ర ప్రజల ఆవేదన, ఆగ్రహం కేంద్ర ప్రభుత్వానికి తెలిసి వచ్చేలా బంద్‌లో పాల్గొని మద్దతు ప్రకటించారని గుర్తుచేశారు. 18న ఎంపీ, ఎమ్మెల్యేలు, విద్యార్థి, ప్రజా సంఘాలతో విజయవాడలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నామని తెలిపారు.

పోలవరం పనుల్లో జాప్యాన్ని సహించను

● అధికారులకు ఏపీ సీఎం చంద్రబాబు హెచ్చరిక



అమరావతి, ఆంధ్రప్రభ : నవ్యాంధ్రుల జీవనాడి పోలవరం ప్రాజెక్టు పనుల్లో ఇక ఎటువంటి జాప్యాన్ని సహించేది లేదని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్పష్టం చేశారు. సోమవారం ఆయన సచివాలయంలో పోలవరం ప్రాజెక్టుపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ పనులకు సంబంధించి ఎవరూ కూడా వేలెత్తి చూపకూడదన్నారు. నిర్ధేశిత లక్ష్యాల మేరకు పనులను శరవేగంగా చేయాలని అధికారులను ఆదేశించారు. ఆంధ్రుల చిరకాల స్వప్నమైన పోలవరం ప్రాజెక్టు 53 శాతం పూర్తయిందని , పనులు వేగంగా సాగేందుకు వర్చువల్ సమీక్షలో అధికారులకు,కాంట్రాక్టర్లకు ఆయన దిశానిర్దేశం చేశారు. కుడిప్రధాన కాలువ, హెడ్ వర్క్ విభాగం పనులకు సంబంధించి 53 శాతం పూర్తయినట్లు జలవనరుల శాఖాధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. స్పిల్‌వే,స్పిల్ చానల్‌కు సంబంధించి 71 శాతం పూర్తయ్యాయి. మొత్తం 1,055 లక్షల క్యూబిక్ మీటర్ల పనులకు గాను 775 లక్షల క్యూబిక్ మీటర్ల పనులు పూర్తయ్యాయి. ఇక స్పిల్‌వే కాంక్రీటింగ్, స్టిల్లింగ్ బేసిన్‌కు సంబంధించి కాంక్రీట్ పనులు 71 శాతం పూర్తయ్యాయని సీఎం పేర్కొన్నారు. ప్రాజెక్టు పురోగతి వివరాలను ఆన్‌లైన్‌లో ఉంచాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. పోలవరం ప్రాజెక్టుకు గతవారం కేంద్రం రూ. 603 కోట్లు రీఇంబర్స్‌మెంట్ కింద ఇచ్చింది. ఇంకో దఫాగా రూ. 407కోట్లు విడుదల చేయగా, అవి నాబార్డుకు చేరాయి. వారంలో రాష్ట్రప్రభుత్వానికి అందుతాయి. 2017 డిసెంబర్ 31 దాకా పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి రూ. 12, 915.38 కోట్లు వ్యయం చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం 2018 ఫిబ్రవరి 9న రూ.4,932.26 కోట్లు రీఇంబర్స్‌మెంట్ కింద చెల్లించింది. ఎడమ ప్రధాన కాల్వ పనులను కాంట్రాక్టర్లు శరవేగంతో పూర్తి చేయాలని, వచ్చే సోమవారం నాటికి కాల్వ పనుల ముగింపు తేదీ, తత్సంబంధిత ప్రణాళికను తయారు చేసి,తనకు అందించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. రాష్ట్రప్రభుత్వం చేపట్టిన 28 ప్రాధాన్యత ప్రాజెక్టుల్లో 7 ప్రాజెక్టులు పూర్తయ్యాయని, మరో 6 ప్రాజెక్టులను జలసంరక్షణ ఉద్యమ స్ఫూర్తి కార్యక్రమం కింద 116 రోజులలో వరుసగా ప్రారంభించనున్నట్లు ముఖ్యమ ంత్రి తెలిపారు. పశ్చిమగోదావరి పగొండ రిజర్వాయర్,పెద్దాపురం ఎత్తిపోతల, చినసన ఎత్తిపోతల, దిటక్ టెన్నెల్,గోరకల్లు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్,పులికనుమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులను ముఖ్యమంత్రి ప్రారంభిస్తారు. 116 రోజులు జలసంరక్షణ స్ఫూర్తి కార్యక్రమంలో జలసంరక్షణకు ముందు,తర్వాత వచ్చిన ఫలితాలపై ఒక ప్రజెంటేషన్ తయారు చేయాలని, ప్రాజెక్టులలో నీటి మట్టాలు,భూగర్భ జల మట్టాలపై జలసంరక్షణ ఫలితాలను విశ్లేషించాలన్నారు.

ఎయిర్ కార్గో మరింత అభివృద్ధి

ఎంపీ హరిబాబు స్పష్టం



విశాఖపట్నం, ప్రభన్యూస్ బ్యూరో: విశాఖలోని అంతర్జాతీయ ఎయిర్ కార్గోను మరింత అభివృద్ధి చేయడానికి కేంద్రప్రభుత్వం కృతనిశ్చ యంతో ఉందని విశాఖ పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ కంభంపాటి హరిబాబు పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం హోటల్ దసపల్లలో ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ ఇంటర్నేషనల్ ఎయిర్ కార్గో ఫెసిలిటెస్ ఇన్ విశాఖపట్నం ఎయిర్ పోర్ట్ అనే అంశంపై ఏర్పాటు చేసిన వర్క్‌షాప్‌ను ఆయన ప్రారంభించి సభలో మాట్లాడారు. విశాఖలో ఎయిర్ కార్గో రవాణాకు ఎదురయ్యే ప్రతి సమస్యను పరిష్కరించి కార్గో ప్రమాణాలను మరింత పెంచుతామని తెలిపారు. విశాఖలోని ఫార్మా కంపెనీల ఉత్పత్తులను విదేశాలకు రవాణా చేసేందుకు అనువుగా ఒక డ్రగ్ కంట్రోలరను నియమించి సమస్యను పరిష్కరించాలని తెలిపారు. అయినప్పటికీ ఫార్మా కంపెనీలు తమ ఉత్పత్తులను రోడ్డు రవాణా ద్వారా హైదరాబాద్‌కు అక్కడ నుంచి విదేశాలకు తరలిస్తున్నారని తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. విదేశాలకు ఫార్మా ఉత్పత్తులు విమాన కార్గో ద్వారా రవాణా చేసే కంపెనీలకు రవాణా ఛార్జీల రాయితీ తో పాటు ఇతర పత్రాల జారీ ప్రక్రియను సులభతరం చేయడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశాఖ ఎయిర్ పోర్ట్ డైరెక్టర్ జి.ప్రకాష్‌రెడ్డి, జాయింట్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఫారెన్ ట్రేడ్ సర్వీస్ పన్నం కుమార్, ఏపీ ఛాంబర్ ప్రెసిడెంట్ జి.సాంబశివరావు, ఉపాధ్యక్షుడు డాక్టర్ కె.కుమార్‌రాజా, స్టీల్‌ప్లాంట్ పూర్వ సిఎండి వై.శివసాగర్‌రావు, సింబియోసిస్ నరేష్, ఏపి చాంబర్స్ విశాఖ జోన్ వైస్ ఛైర్మన్ ఎం.సుదీర్ తదితర కంపెనీల ప్రతినిదులు పాల్గొన్నారు.

అర్హులు 18 మంది.. వర్క్‌లు 25

- ఒక్కోవర్క్‌కు పరిపాలన అనుమతి.. ఇచ్చింది మాత్రం మూడు నుంచి ఐదు వర్కులకు ప్యాకేజీ
- కమిషన్ల కోసమేనంటున్న కాంట్రాక్టర్ల సంఘం
- 3శాతం కమిషన్ డిమాండ్ చేస్తున్నారని ఆరోపణ
- కొందరికి కట్టబెట్టడం కోసం చేశారంటున్న అసోసియేషన్ నేతలు

హైదరాబాద్,ఆంధ్రప్రభ: తెలంగాణ రాష్ట్రంలోని సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్ సొసైటీ అధ్వర్యంలో నిర్మించే రెసిడెన్షియల్ స్కూల్స్, జూనియర్ కాలేజీలు, డిగ్రీకాలేజీల నిర్మాణంలో తెలంగాణ రాష్ట్ర విద్య, సంక్షేమ సంస్థల మౌలిక వసతుల అభివృద్ధి మండలి (టిఎస్‌ఈడబ్ల్యూఐడీసీ) సంస్థ కొత్త విధానం అవలంభించింది. భవనాల నిర్మాణ పనులను ఒక్కో పనిని ఒక కాంట్రాక్టర్‌కు కాకుండా మూడు నుంచి ఐదు పనులను ఒక ప్యాకేజీగా నిర్ణయించి టెండర్లను పిలిచింది. దీంతో టెండర్లు వేయడానికి అర్హత ఉన్నవారి సంఖ్య తక్కువగానూ... ప్యాకేజీల సంఖ్య ఎక్కువగానూ ఉన్నాయి. రెసిడెన్షియల్ స్కూల్స్, జూనియర్ కాలేజీలు 72 వర్కులున్నాయి. డిగ్రీ కాలేజీలు 16 ఉన్నాయి. మొత్తం 88 పనులు ఉన్నాయి. వీటి నిర్మాణం కోసం ప్రభుత్వానికి సొసైటీ కార్యదర్శి ఒక్కో వర్క్‌కు వేర్వేరుగా పరిపాలన అనుమతులు కోరారు. ప్రభుత్వం కూడా అందుకు అంగీకరించింది. కానీ టెండర్లు పిలిచేసమయంలో దానిని మార్చేసి ప్యాకేజీల రూపంలో టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. రాష్ట్రంలోని మొత్తం 31 జిల్లాల్లో 24 జిల్లాల్లో నిర్మాణాల అనుమతులు ఇచ్చారు. రాష్ట్రంలో కాంట్రాక్టర్లు సుమారు 1000 మంది వరకు ఉంటారు. వారిలో భవన నిర్మాణాలు మాత్రమే చేసే కాంట్రాక్టర్లు సుమారు 100 మంది వరకు ఉంటారని కాంట్రాక్టర్ల అసోసియేషన్ నేతలు చెబుతున్నారు. వారిలో ప్రభుత్వం చేసిన ప్యాకేజీల ప్రకారం టెండర్లు వేయడానికి అర్హులు అయిన వారు 20 మందికంటే ఎక్కువ ఉండరని చెబుతున్నారు. టెండర్లలో భవన నిర్మాణాలతోపాటు ఎలక్ట్రీషియన్ పనులు, శానిటరీ పనులు కూడా చేయడానికి అర్హత కలిగి ఉండాలనేది నిబంధన ఉంది. ఈ మూడింటితో టెండర్లు వేయడానికి అర్హులైన వారు 20 మందికంటే



ఫైల్ ఫొటో

ఎక్కువ ఉండరని అంటున్నారు. అయితే ఇందులో ఒక్కో ప్యాకేజీలో రూ. 30 కోట్ల నుంచి రూ. 60 కోట్ల వరకు ఉంటుంది. రెసిడెన్షియల్ స్కూల్, జూనియర్ కాలేజీలు, డిగ్రీ కాలేజీల నిర్మాణాలకు అంచనాలను మొదట ఒక బడ్జెట్‌గా నిర్ణయించి తరువాత వాటిని తగ్గించారు. మొదట వేసి అంచనా ప్రకారం రెసిడెన్షియల్ స్కూల్స్, జూనియర్ కాలేజీలకు ముందు రూ. రూ. 20 కోట్ల నుంచి రూ. 20.50 కోట్లుగా ప్రతిపాదించి తరువాత దానిని రూ. 13.10 కోట్లకు తగ్గించారు. డిగ్రీ కాలేజీలకు మొదట రూ. 30 కోట్లు నిర్ణయించగా తరువాత దానిని కాస్త రూ. రూ. 19.40 కోట్లకు తగ్గించారు. ఇలా రివైజ్డ్ చేసిన తరువాత టెండర్ల కోసం బిడ్‌లను ఆహ్వానించారు.

కమిషన్ల కోసమేనంటున్న కాంట్రాక్టర్లు

ఎస్సీ గురుకులాల్లో పనులకు పిలిచిన టెండర్లు కేవలం కొందరికి కట్టబెట్టడం కోసమే అధికారులు కావాలని రూపొందించారని కాంట్రాక్టర్ల అసోసియేషన్ నేతలు ఆరోపిస్తున్నారు. ప్రతి పనికి వేర్వేరుగా పరిపాలన అనుమతులు పొంది టెండర్లను మాత్రం ప్యాకేజీలుగా రూపొందించి బిడ్లను ఆహ్వానిస్తున్నారని విమర్శించారు. పనులను ప్యాకేజీల రూపంలో టెండర్లను పిలుస్తూ ప్రతి పనికి 3 శాతం కమిషన్లను టిఎస్‌ఈడబ్ల్యూఐడీసీ ఉన్నతాధికారులు డిమాండ్ చేస్తున్నారని నేతలు ఆరోపిస్తున్నారు. మొత్తం పనుల్లో 3 శాతం కమిషన్ ఇస్తే సుమారు రూ. 36 కోట్లకు పైగా అవుతుందని ఆరోపిస్తున్నారు. గతంలో మైనారిటీ గురుకులాల నిర్మాణాల్లో ఇలా వ్యవహరించలేదని, అప్పుడు కూడా ఒక్కో పనికి టెండర్లను పిలిచారని చెబుతున్నారు. ప్యాకేజీల మూలంగా చిన్న కాంట్రాక్టర్లు పనులు చేసే అవకాశం లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రీ బిడ్ సమావేశంలోనే వ్యతిరేకత

టెండర్ల ప్రక్రియలో భాగంగా ప్రీ బిడ్ సమావేశంలో సుమారు 40 మంది కాంట్రాక్టర్లు పాల్గొన్నారు. వారిలో 37 మంది ప్యాకేజీల విధానాన్ని వ్యతిరేకించారు. అలా చేయడం వలనఎక్కువ సమయం పడుతుందని కాబట్టి ఇటువంటి విధానం వద్దని, పాత విధానంలోనే ఒక్కో పనికి వేర్వేరుగా టెండర్లను ఆహ్వానించాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ప్యాకేజీల వ్యవహారం అయితే టెండర్లలో లెస్ కోడింగ్ కూడా తగ్గుతుందని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. అవసరం అయితే కోర్టుకు సైతం వెళతామని అధికారులకు చెప్పినట్టు సమాచారం. తాము చెప్పిన అభ్యంతరాలు వేటిని పరిగణనలోకి తీసుకోకుండా టిఎస్‌ఈడబ్ల్యూఐడీసీ తమకు తోచిన విధంగా ప్యాకేజీ విధానాన్ని ప్రారంభించిందని కాంట్రాక్టర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

హైదరాబాద్‌లో



రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ పార్క్

(మొదటిపేజీ తరువాయి)

అలాంటి కష్టాలు రాకుండా చైతన్యం కావాలని సూచించారు. కరవు పరిస్థితులు తలెత్తినా... నగరంలో నీటి కష్టాలు రాకుండా ఉండేందుకు 'జలం-జీవం' కార్యక్రమం చేపట్టినట్లు కేటీఆర్ తెలిపారు.హైదరాబాద్ నగరంలో భూగర్భ జలాలు, తాగునీటికి ఇబ్బందులు కలుగకుండా చూడడమే సీఎం కేసీఆర్ లక్ష్యమన్నారు. అందుకే మంచినీటిని కృష్ణా, గోదావరి నదుల నుంచి నగర దాహార్తి తీర్చుతున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని బ్యాంకుల ప్రాంగణాల్లో ఇంకుడుగుంతుల నిర్మాణం తప్పనిసరి చేయాలని అధికారులకు సూచించారు. ఇందుకు అవసరమైన ఆదేశాలను జారీ చేయాలన్నారు. వీటితో పాటు ప్రతి ప్రభుత్వరంగ సంస్థ, కార్యాలయాల్లోనూ, విద్యాసంస్థల్లో కూడా ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగాలని పేర్కొన్నారు.టీసాట్, నిపుణ ఛానెళ్ల ద్వారా ఇంకుడుగుంతల నిర్మాణాలపై అవగాహన కార్యక్రమాలు ప్రసారం చేయాలని మంత్రి కేటీఆర్ అన్నారు. జలం-జీవం కార్యక్రమంలో సెలెబ్రిటీలను భాగస్వామ్యం చేయాలని సూచించారు. వాటర్ బోర్డు ఎండీ దానకిషోర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన వెయ్యి ఇంకుడు గంతుల్లో అన్ని శాఖల సమన్వయంతో ఇప్పటికే 821 పూర్తి చేశామని మంత్రిదృష్టికి తీసుకొచ్చారు.

ఇంకుడు గుంతల నిర్మాణానికి జలమండలి వినియోగదారులకు బ్యాంకు ద్వారా రుణాల ను ఇప్పిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ కమిషనర్ జనార్ధన్‌రెడ్డి, హెచ్ఎండీఏ కమిషనర్ చిరంజీవులు, మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్.రెడ్డి, మునిసిపల్ పరిపాలన డైరెక్టర్ శ్రీదేవితో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

మరిదే.. హంతకుడు

- గర్బిణి హత్య కేసులో వీడిన మిస్టరీ
- గ్రానైట్ కట్ చేసే మిషన్‌తో హత్య

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (ప్రభన్యూస్): సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో చోటుచేసుకున్న గర్బిణీ హత్య కేసు మిస్టరీ ఎట్టకేలకు వీడింది. ఎనిమిది నెలల గర్భిణీ మహిళను ముక్కలుగా నరికి దారుణ హత్య చేసిన కేసులో, నిందితుడితో పాటు, హత్యకు సహకరించిన వారిని సైబరాబాద్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గత నెల 29వ తేదీన తెల్లవారుజామున, మూడున్నర గంటల ప్రాంతంలో, గర్బిణీ స్త్రీని హత్య చేసి గోనే సంచిలో కట్టి ద్విచక్ర వాహనంలో తీసుకవచ్చిన నిందితులు కొండాపూర్ బొటానికల్ గార్డెన్ వద్ద పడేసి వెళ్లిపోయారు. కుటుంబ కలహాల కారణంగానే, వదినను మరిది అమరకాంత్ ఝూ అతికిరాతకంగా చంపినట్లు పోలీసులు నిర్ధారించారు. ప్రధాన నిందితుడు అమర్‌కాంత్ ఝూ హత్య అనంతరం, నగరం వీడి పరారయ్యాడు. ప్రత్యేక బృందాలు, నిందితుడిని మధ్యప్రదేశ్‌లో అదుపులోకి తీసుకుని, నగరానికి తీసుకవచ్చారు.

కలహాల కారణంగానే హత్య

బీహార్‌కు చెందిన అమరకాంత్ ఝూ కుటుంబం గత కొంత కాలంగా హైదరాబాద్‌లోని మాదాపూర్ సిద్దిఖ్‌నగర్‌లో నివాసం ఉంటోంది. అమర్ కాంత్ ఝూ స్థానికంగా ఓబార్‌లో పనిచేస్తున్నాడు. కుటుంబంలో తలెత్తిన విభేదాల కారణంగా, కొన్ని రోజులుగా వదినతో గొడవలు జరగుతున్నట్లు తెలుస్తోంది. విభేదాలు మరింత ముదిరి గతనెల 28న తేదీన అమర్‌కాంత్‌ఝూ కుటుంబ సభ్యులు, గర్బిణీగా ఉన్న పెద్ద కొడలని దారుణంగా హతమర్చారు. గ్రానైట్ రాళ్లు కట్ చేసే మిషన్‌తో ఎవరూ గుర్తుపట్టని విధంగా మొఖాన్ని ఛిద్రం చేశారు. ఆ తర్వాత మృత దేహాన్ని ముక్కలుముక్కలుగా చేసి ప్లాస్టిక్ సంచుల్లో వేసారు. కొండాపూర్ బొటానికల్ గార్డెన్ వద్ద పడేశారు. మృతదేహం ముక్కులుగా ఉన్నట్లు గుర్తించిన స్థానికులు గచ్చిబౌలి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు, ముక్కలు ముక్కలుగా ఉన్న శరీర భాగాలను, స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిర్వహించారు.

సీసీ కెమారాల ఆధారంగానే...

గత రెండు వారాలుగా అనేక కోణాల్లో కేసును పరిశీలించిన పోలీసులు, సీసీ కెమెరాల్లో నమోదైన దృశ్యాల ఆధారంగా, హతురాలి మరిది, అత్తశరీర భాగాలుగా ఉన్న గోనే సంచిని బొటానికల్‌గార్డెన్ వద్ద పారవేసినట్లు నిర్ధారణకు వచ్చారు. అనంతరం క్రైమ్స్ డీసీపీ జానకి షర్మిల, మాదాపూర్ డీసీపీ విశ్వప్రసాద్ ఆద్వర్యంలో సిద్ధిఖ్ నగర్‌లో ఆరువందల మంది పోలీసులతో కార్డెన్ సెర్చ్ నిర్వహించి, ప్రధాన నిందితుడు అమర్ కాంత్ ఝూ, తల్లిండ్రులతో పాటు ఆరేళ్ల బాలుడిని అదుపులోకి తీసుకున్నారు. హత్యచేసిన సమయంలో అమర్ కాంత్ ఝూ తల్లి అక్కడే ఉన్నట్లు పోలీసుల విచారణలో తేలింది. అయితే హత్యకు సంబంధించిన పూర్తి వివారాలను ఇవాళ మీడియాకు వెల్లడించే అవకాశం ఉంది.

ఐటీ కాంగ్రెస్‌కు రోబో సోఫియా



(మొదటిపేజీ తరువాయి)

ఇది రెండోసారి కానుంది. హంకాంగ్‌కు చెందిన డేవిడ్ సోఫియా రోబోను సృష్టించారు. వృద్ధులకు సేవలను అందించడంతో పాటు జనసమ్మర్ధం ఉన్న ప్రాంతాల్లో సహాయకారిగా ఉండేలా ఈ మరమనిషిని రూపకల్పన చేశారు. కెమెరాలు, మైక్రోఫోన్లు ఈ రోబోలో అమర్చినట్లు డేవిడ్ చెబుతున్నారు. సౌదీ అరేబియా సోఫియాకు ఏకంగా వారసత్వమే కల్పించింది. గత ఏడాది నవంబర్ మాసంలో ముంబై ఐఐటిలో జరిగిన ఓ కార్యక్రమంలో సోఫియా పాల్గొని సభికులు అడిగిన ప్రశ్నలకు అద్భుతంగా సమాధానాలిచ్చి అందరినీ ఆశ్చర్యంతో ముంచెత్తింది. ఈ సందర్భంగా ఓ ఇంజనీరింగ్ విద్యార్థిని రోబో సోఫియాకు ఓ ప్రశ్న సంధించింది. భారత్‌కు మొదటిసారిగా రావడం ఎలా అనిపిస్తోంది అని అడిగింది. దీనికి రోబో సోఫియా సమాధాన మిస్తూ గొప్ప ఆచారాలు, సంప్రదాయాలు, నైతిక విలువలు ఉన్న భారతదేశానికి రావడం గర్వకారణంగా ఉందని, ఈ దేశం నుంచి ఎన్నో అంశాలు విన్నానని బదులిచ్చింది. ముంబైకి రావడం గొప్ప అనుభవంగా భావిస్తున్నానని, శాస్త్ర, సాంకేతిక, అంతరిక్ష, ఆర్థికరంగాల్లో ఈ దేశం వేగంగా పురోగమిస్తోందని సోఫియా తెలిపింది. నీవు ఎక్కడ ఉన్నావో తెలుసా అని ఆ ఇంజనీరింగ్ విద్యార్థిని ప్రశ్నించగా, ముంబైలో ఉన్నానని, ఈ సదస్సులో 2,140 మంది మధ్య నిలబడి ఉన్నానని చెప్పడంతో అందరూ ఒక్కసారిగా నిర్ఘాంతపోయారు. అటువంటి రోబో హైటెక్స్‌లో జరిగే ప్రతిష్టాత్మకమైన ప్రపంచ ఐటి కాంగ్రెస్‌కు ప్రత్యేక అతిథిగా వస్తోంది. సదస్సు తొలిరోజే ఈ మరమనిషి సోఫియా అందరినీ ఆశ్చర్యంచేసే అవకాశాలు ఉన్నట్లు అత్యంత విశ్వసనీయంగా తెలిసింది.

భారతదేశంలో మొదటిసారి జరగబోతున్న ప్రపంచ ఐటి కాంగ్రెస్‌కు తెలంగాణ ప్రభుత్వం చురుకుగా ఏర్పాట్లు చేస్తోంది. మాదాపూర్‌లోని హైటెక్స్ (హెచ్ఐసిసి) వేదికగా ఈనెల 19వ తేదీనుంచి మూడు రోజులపాటు ఈ ఐటి సదస్సు జరుగుతుంది. దాదాపు 40 ఏళ్ళ చరిత్ర ఉన్న ప్రపంచ కాంగ్రెస్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ 1978వ సంవత్సరంలో ఏర్పాటైంది. అప్పటి నుంచి వరుసగా సదస్సులు నిర్వహిస్తోంది. హైదరాబాద్ లో జరుగుతున్న ఈ సదస్సు 22వదని నిర్వాహకులు చెబుతున్నారు. డిజిటల్ పరిజ్ఞా నాన్ని అందిపుచ్చుకోవడంతో పాటు మరింత విస్తృతం చేయాలన్న సంకల్పంతో ఈ సదస్సును నిర్వహిస్తున్నారు. 80 దేశాలకు చెందిన 2,500 మంది ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరవుతుండగా, భారత ప్రధాని నరేంద్రమోడీ ఢిల్లీలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ సదస్సును ప్రారంభిస్తున్నారు. శ్రీలంక ప్రధానమంత్రి విక్రమ సింహ, కేంద్ర ఐటిశాఖ మంత్రి రవిశంకర ప్రసాద్, రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు, ఐటిశాఖ మంత్రి కేటీ రామారావు, కెనడా, చైనా, నైజీరియా, అర్మేనియా, బంగ్లాదేశ్, అఫ్ఘనిస్థాన్, శ్రీలంక దేశాలకు చెందిన ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరవుతున్నారు. సైబర్ సెక్యూరిటీతో పాటు సాంకేతిక పరిజ్ఞానంతో వస్తున్న మార్పులను తట్టుకునేందుకు వీలుగా తీసుకోవలసిన చర్యలను ఈ సదస్సులో చర్చిస్తారు. డిజిటలైజేషన్, బ్లాక్‌చైన్ టెక్నాలజీ, కృత్రిమ మేధస్సు వంటి కీలకాంశాలపై మూడు రోజులపాటు సదస్సులు, చర్చాగోష్టులు జరుగుతాయి. అడోబ్ సిస్టమ్స్ అధినేత శంతన నారాయణ్, పీడబ్ల్యుసీ చైర్మన్ శ్యామల ముఖర్జీ, యోగా గురువు జగ్గి వాసుదేవన్, బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్ తో పాటు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగానికి సంబంధించి ఎంతోమంది నిష్ణాతులు ఈ సదస్సు లో పాల్గొని ప్రసంగించనున్నారు. ప్రసంగీకుల జాబితాలో అందరినీ ఆకర్షించేది మాత్రం సోఫియానేనని అంటున్నారు.

కీచక ఉపాధ్యాయుడు జైలుపాలు

ఐడీఏ బొల్లారం, ప్రభ న్యూస్ : విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించాల్సిన ఉపాధ్యాయుడు విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించి జైలుపాలయ్యాడు. బొల్లారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేసిన సంజీవరెడ్డి విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించాడన్న విషయంలో అతన్ని విధుల్లోంచి తొలగించారు. ఆపై అతనిపై క్రిమినల్ కేసు నమోదైంది. కాగా సోమవారం సంజీవరెడ్డిని పోలీసులు రిమాండ్ పంపి సంగారెడ్డి జైలుకు తరలించారు.

కేంద్రం నిధులిచ్చినా రాష్ట్రం ఖర్చు చేయడం లేదు

- 19 నుంచి 23 వరకూ త్యాగరాయ గాన సభలో ధూం.. ధాం
- భాజాపా రాష్ట్ర అధ్యక్షుడు కె. లక్ష్మణ్



హైదరాబాద్, ఆంధ్రప్రభ: రాష్ట్రాన్ని ఆదునేందుకు కేంద్రం ఉదారంగా నిధులు మంజూరు చేస్తున్నప్పటికీ ఆ నిధులను కూడా ఖర్చు చేయలేని దుస్థితిలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉందని భాజపా రాష్ట్ర శాఖ అధ్యక్షుడు కె. లక్ష్మణ్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. వివిధ పథకాల కింద కేంద్రం ఇచ్చిన నిధులపై, రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు పెట్టిన నిధులపై వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సోమవారం నాంపల్లిలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో విలేకరుల సమావేశం లో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్ళేందుకు ఈ నెల 19 నుంచి 23వ తేదీ వరకు నగరంలోని త్యాగరాయ గానసభలో భారీ ఎత్తున ధూం.. ధాం కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. జన చైతన్య కళామండలి ఆధ్వర్యంలో దాదాపు వంద కళా బృందాలతో కేంద్ర ప్రభుత్వ పథకాలు, కేసీఆర్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రచారం చేస్తామన్నారు. పార్టీ నేతలు మోహన్‌రెడ్డి, బద్దంబాల్‌రెడ్డి.ఎన్వీసుభాష్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ జిల్లా అధ్యక్షుల నియామకం

హైదరాబాద్, ఆంధ్రప్రభ: టి.టీడీపీ నల్గొండ జిల్లా పార్టీ అధ్యక్షుడిగా ఎండి యూసుఫ్, సూర్యాపేట జిల్లా అధ్యక్షుడుగా పెద్దిరెడ్డి రాజా, యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడిగా బండ్రు శోభారాణిని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.రమణ నియమించారు. అలాగే నల్గొండ అసెంబ్లీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్‌గా మాదగాని శ్రీనివాస్ గౌడ్‌ను నియమించినట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.బుచ్చిలింగం తెలిపారు.

'ఎంపీగా పోటీ చేస్తా'



వేములపల్లి, ప్రభన్యూస్: వచ్చే ఎన్నికల్లో ఎంపీగా పోటీచేస్తానని సీఎల్‌పీ ఉపనేత కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. వేములపల్లి మండల కేంద్రంలో సోమవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ఆవిష్కరించిన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కార్యకర్తల నుద్దేశించి మాట్లాడారు. సంవత్సరం కష్టపడండి ప్రజా వ్యతిరేక పాలనను అంతమొందిద్దామని పిలుపునిచ్చారు. తెలంగాణ ఆస్తిని ఆంధ్ర కాంట్రాక్టర్లకు అప్పగించి కమీషన్లు తీసుకుని ప్రగతిభవన్‌కే ముఖ్యమంత్రి కేసీఆర్ పరిమితమయ్యారని దుయ్యబట్టారు. ప్రజా దర్బార్‌నే ఎత్తివేసిన సీఎం ఈయననే చూస్తున్నామన్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో శ్రీశైలం సొరంగ మార్గానికి రూ.2వేల కోట్లు, బ్రాహ్మణ వెల్లెంల ప్రాజెక్టుకు రూ.700కోట్ల నిధులను మంజూరు చేయించానని తెలిపారు. శెట్టిపాలెం గ్రామం లోని శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అన్నపు రెడ్డిగూడెంలో జరుగుతున్న గంగమ్మ జాతరలో పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయకులు చిరుమర్తి లింగయ్య, వేణుగోపాల్ రెడ్డి, సత్తయ్య గౌడ్, స్కైలాబ్ నాయక్, కరీం, శంకర్ నాయక్, పందిరి శ్రీను, పొదిల శ్రీనివాస్, మాలి కాంతారెడ్డి, పుట్టల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ధనిక రాష్ట్రంలో ఉపాధి కూలీలకు డబ్బుల్లేవా?



- టి. పీసీసీ చీఫ్ ఉత్తమ్ కుమార్ రెడ్డి

హైదరాబాద్,ఆంధ్రప్రభ: ఉపాధి హామీ కూలీలకు నాలుగు నెలలుగా డబ్బులు ఎందుకు ఇవ్వడం లేదని టీ పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రశ్నించారు. ధనిక రాష్ట్రంలో పేదలకు కూలీ డబ్బులు ఇవ్వకపోవడానికి నిధులు లేవా..? లేక పేదలంటే నిర్లక్ష్యమా..? అంటూ ఉత్తమ్ నిలదీశారు. ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో ఉపాధిహామీ చట్టంపై ఐదు రోజుల పాటు జరిగే శిక్షణా కార్యక్రమాలు సోమవారం ప్రారంభమైనాయి. ఈ శిక్షణా కార్యక్రమాలకు ఏఐసీసీ ఇన్‌చార్జీ రాంచంద్ర కుంతియా, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డి, కార్మిక నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ లక్షలాది మంది పేదలకు పని కల్పించాలనే ఉద్దేశ్యంతోనే గత యూపీఏ ప్రభుత్వం ఉపాధి హామీ అనే విప్లవాత్మకమైన చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు.

అదాని, అంబానీల కోసమే పనిచేస్తున్న కేంద్రం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదల కోసం పని చేయడం లేదని, ఆదాని, అంబానీల కోసమే పని చేస్తున్నాయని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జీ రాంచంద్ర కుంతియా ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఒక్కటే పేద ప్రజల సంక్షేమం కోసం ఆలోచన చేస్తుందన్నారు. అసంఘటిత కార్మికులందరూ ఏకమైతే ఏ ప్రభుత్వమైనా దిగిరావాల్సిందేనని హెచ్చరించారు. పేద ప్రజల కోసం గత కాంగ్రెస్ ప్రభుత్వాలు ఎన్నో విప్లవాత్మకమైన చట్టాలు తీసుకొస్తే బీజేపీ ప్రభుత్వం వాటిని నిర్లక్ష్యం చేస్తున్నదన్నారు. సంఘటితం, అసంఘటిత కార్మికుల కోసం ఐఎన్‌టీయూసీ అండగా ఉంటుందని సంజీవరెడ్డి, జనక్‌ప్రసాద్‌లు తెలిపారు.

ఓటర్ల సవరణ గడువు పొడిగించాలి

ఓటర్ల సవరణ కోసం గతంలో ఇచ్చిన గడువును మరో మూడు వారాలు పొడగించాలని టీ పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఈ నెల 14 వరకు ఇచ్చిన గడువు తేదీ సరిపోవడం లేదని, ఓటర్ల సవరణ కోసం ఏర్పాటు చేసిన క్యాంపుల వద్దకు అధికారులు అందుబాటులోకి రాలేదన్నారు. సోమవారం గాంధీభవన్‌లో టీపీసీసీ ఎన్నికల కమిటి సమావేశం మర్రి శశిధర్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఓటర్ల తొలగింపులో అనేక అక్రమాలు జరిగాయని, ఆశాస్త్రీయంగా ఓట్లు తొలగించారని శశిధర్‌రెడ్డి వివరించారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ప్రకటించన తేదీల్లో చాలా గ్రామాల్లో క్యాంపులు నిర్వహించలేదని, అలాంటప్పుడు ఓటర్ నమోదు, సవరణపై ఎక్కడ ఫిర్యాదుల చేస్తారని అన్నారు. ఈ నెల 14 వరకు ఉన్న గడువును మరో మూడు వారాల పాటు పొడగించాలని ఎన్నికల కమిషన్‌కు లేఖ రాయనున్నట్లు ఉత్తమ్ తెలిపారు.

కాంగ్రెస్ టికెట్లపై ఎవరికి హామీ ఇవ్వలేదు

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున పోటి చేసే వారి పేర్లను ప్రకటించినట్లుగా సోషల్ మీడియాలో వైరలవుతున్న వార్తల్లో వాస్తం లేదని టీ పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వారంలో రోజులుగా రాష్ట్రంలోని వివిధ అసెంబ్లీ నియోజక వర్గాలకు చెందిన నేతలు పార్టీ టికెట్ తమకే అంటూ ప్రచారం చేసుకుంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సోషల్ మీడియాలోని వార్తలను ఉత్తమ్ ఖండించారు.

ఏఎస్పీ సునీతారెడ్డి కేసులో కొత్త ట్విస్ట్

- సురేందర్‌రెడ్డితో వివాహం కంటే ముందు మరొకరితో మనువు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: తన కింది స్థాయి ఉద్యోగితో అక్రమ సంబంధం కేసులో చిక్కుకున్న ఎసిబి ఎఎస్‌పి సునితారెడ్డి వ్యవహారం కొత్త మలుపు తిరిగింది. సురేందర్‌రెడ్డితో వివాహమైన సునితారెడ్డి సిఐ మల్లిఖార్జున్‌రెడ్డితో అక్రమ సంబంధం పెట్టుకుందని, ఈ వ్యవహారం మొత్తాన్ని ప్రస్తుత భర్త సురేందర్‌రెడ్డి, ఆయన తల్లి, అత్తలు కలిసి రెడ్ హ్యాండెడ్‌గా బట్టబయలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంలో సునితతో పాటు మల్లిఖార్జున్‌రెడ్డిని ఉన్నతాధికారులు సస్పెండ్ చేసిన విషయం కూడా తెలిసిందే. సునితతో ఏకాంతంగా ఉండి బంధువులకు చిక్కిన సిఐ మల్లిఖార్జునరెడ్డి స్పందిస్తూ తామిద్దరం వివాహం చేసుకుందామని నిర్ణయించుకున్నామని, త్వరలోనే ఇద్దరం మీడియా ముందుకు వచ్చి అననిషయాలను వివరిస్తామని చెప్పడం కూడా జరిగింది. ఈ వ్యవహారం సద్దుమణగక ముందే సురేందర్‌రెడ్డిని వివాహం చేసుకోక ముందే సునితారెడ్డి లెనిన్ అనే వ్యక్తిని వివాహం చేసుకున్నట్లు ఉన్న ఫొటోలు బహిర్గతమయ్యాయి. లెనిన్ ఒక టివి యాంకర్ సోదరుడని కూడా బయటపడింది. 2010 సంవత్సరంలో సురేందర్‌రెడ్డిని సునితారెడ్డి వివాహం చేసుకున్నారు. అంతకంటే రెండేళ్ళ ముందు లెనిన్‌ను ఆర్య సమాజ్‌లో వివాహం చేసుకున్న సునితారెడ్డి రెండేళ్ల తర్వాత వరకట్నం కేసు పెట్టి విడాకులు తీసుకున్నట్లు వెల్లడవుతోంది. అయితే లెనిన్‌తో వివాహం ఎప్పుడైంది, పోలీసు శాఖలో చేరిన తర్వాత జరిగిందా? లేక అంతకు ముందే జరిగిందా అన్న విషయంలో స్పష్టత రావడం లేదు. మొత్తం మీద సునితారెడ్డి విషయంలో ట్విస్ట్‌లపై ట్విస్ట్‌లు వెలువడటం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

రెండో పెళ్లి వివాదంలో రాజేంద్రనగర్ సీఐ

- విడాకుల కేసు విచారణలో ఉండగానే రెండో పెళ్ళి
- ధర్నాకు దిగిన భార్య, బంధువులపై దాడి
- కేసు నమోదు చేసిన ఎపిలోని చిల్లకల్లు పోలీసులు

హైదరాబాద్, ఆంధ్రప్రభ: సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని రాజేంద్రనగర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పుష్పన్‌కుమార్ కుటుంబపరమైన వివాదంలో చిక్కుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కృష్ణా జిల్లా జగ్గయ్యపేట మండలంలోని అనుమంచిపల్లి గ్రామానికి చెందిన పుష్పన్‌కుమార్ వివాహం కొన్నేళ్ల క్రితం విజయతో జరిగింది. వ్యక్తిగత కారణాల వల్ల కొన్నేళ్ళుగా వీరిద్దరూ దూరంగా ఉంటున్నారు. విడాకులకు సిద్ధమైన ఇద్దరూ కొన్నాళ్ళ క్రితం కోర్టును ఆశ్రయించారు. విడాకుల కేసు కోర్టు విచారణలో ఉండగానే పుష్పన్‌కుమార్ మరో వివాహం చేసుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న భార్య విజయ అనుమంచిపల్లిలోని సిఐ ఇంటి ముందు పుట్టింటి వారితో కలిసి తనకు న్యాయం చేయాలంటూ ధర్నాకు దిగారు. దీంతో ఆగ్రహించిన పుష్పన్‌కుమార్ అతడి కుటుంబసభ్యులు విజయ, ఆమె కుటుంబసభ్యులపై దాడి చేశారు. జరిగిన ఘటనపై విజయ స్థానిక చిల్లకల్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విడాకులిస్తానని కొంత కాలంగా దూరంగా ఉంచారని, కోర్టు నుంచి ఎలాంటి తీర్పు రాకపోయినా పుష్పన్ కుమార్ తనకు అన్యాయం చేసి మరో వివాహం చేసుకున్నారని, న్యాయంకోసం ఆందోళన చేస్తే తనతో పాటు తన కుటుంబసభ్యులపై అత్తింటి వారితో కలిసి భర్త దాడికి పాల్పడ్డారని పేర్కొన్నారు. విజయ ఫిర్యాదు మేరకు చిల్లకల్లు పోలీసులు పుష్పన్‌కుమార్ అతడి కుటుంబసభ్యులపై కేసు నమోదు చేశారు.

చుట్టం కోసమేనా అసైన్డ్ ఆర్డినెన్స్ చట్టం?



హైదరాబాద్,ఆంధ్రప్రభ : ఇతరుల చేతుల్లోకి వెళ్లిన అసైన్డ్ భూములను అస్మదీయులకు దోచిపెట్టాలనే ఉద్దేశంతోనే అసైన్డ్ భూములపై అర్డినెన్స్ తీసుకురావాలని ప్రభుత్వం తొందరపడుతోందని కాంగ్రెస్ నేత, ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు సమీప బంధువైన మైం హోం రామేశ్వర రావుకు మేలు చేయడానికే ఆర్డినెన్స్ భాగోతానికి ప్రభుత్వం తెరలేపిందని ఆయన విమర్శించారు. సోమవారం సీఎల్పీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. అసైన్డ్‌భూముల అక్రమణలపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఈ నెలలో బడ్జెట్ సమావేశాలు నిర్వహించాల్సి ఉండగా, అసెంబ్లీ సమావేశాలను ఎందుకు ప్రొరోగ్ చేశారో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. హడావుడిగా అర్డినెన్స్ తీసుకురావడంలో మతలబేంటో చెప్పాలని, విచారణ అధికారిని నియమిస్తే ఆధారాలతో సహా నిరూపించడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు.

పర్యాటక కేంద్రాలకు 'ట్రాక్' రహదారులు

✦ సీఎం కేసీఆర్ ఆమోదం కోసం ఆర్అండ్ బీ నిరీక్షణ



హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ఉన్న ప్రభుత్వం ఆ దిశలో పర్యాటక కేంద్రాలకు రహదారులను వేయాలని నిర్ణయించింది. ముందుగా ప్రధాన కేంద్రాలకు ఆ తర్వాత దశల వారిగా అన్ని పర్యాటక కేంద్రాలకు రోడ్లు వేయాలని సంకల్పించింది. ఈ మేరకు రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ కార్యాచరణ ప్రణాళికను రూపొందించింది. రాష్ట్ర , దేశ, విదేశీ యాత్రికులతో కిటకిటలాడే పరిస్థితి ఏర్పడింది. దాంతో రాష్ట్ర ఆదాయం కూడా పెరిగే అవకాశం ఉంది. గత డిసెంబర్ నెలలో జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో రహదారుల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ పథకానికి సంబంధించి సమీక్షించారు. ప్రపంచ వ్యాప్తంగా చాలా దేశాలు పర్యాటక రంగం ద్వారా ఆదాయ వనరులు సమకూర్చుకుంటున్నందున ఆదాయం పెంచుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేస్తోంది. ప్రస్తుతం రాష్ట్రంలోని 31జిల్లాల్లోని పర్యాటక కేంద్రాలకు రోడ్లు నిర్మించేందుకు అధికారులు మాస్టర్ ప్లాన్ రూపొందించారు. మొత్తం రాష్ట్రంలో ఉన్న రహదారుల నిడివి 25,792 కిలోమీటర్లు కాగా పంచాయతిరాజ్ ఇతర శాఖల నుంచి బదలీ అయిన తర్వాత రోడ్ల పొడవు 42,053 కిలోమీటర్లు చేరుకుంటుందని అధికారులు ప్రణాళికను సిద్ధం చేశారు. ఈ ప్రణాళికలో భాగంగా హైదరాబాద్ మహానగరం చుట్టూ ప్రస్తుతం బాహ్యవలయ రహదారి (ఔటర్ రింగ్ రోడ్డు), ప్రాంతీయ వలయ రహదారి (రింగ్ రోడ్డు) తోడు మరో రెండు రింగ్ రోడ్లను చేపడతారు. బంగారు వాల నడవా, ఉత్తర -దక్షిణ నడవా,స తూర్పు పడమర నడవా పేర రహదారులతో పాటు తెలంగాణ ప్రగతి రథాలు (టీపీపీ)పేర రేడియల్ రోడ్స్ నిర్మించే బృహత్తర కార్యక్రమం 2018-19 వార్షిక బడ్జెట్ సమావేశాల తర్వాత ప్రారంభం అయ్యే అవకాశాలు ఉన్నాయని అధికారులు చెప్పారు. ఈ బృహత్తర కార్యక్రమానికి ముఖ్యమంత్రి కె చంద్రశేఖరరావు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన తర్వాత వేగవంతం చేస్తారు. ఈ పథకానికి నిధుల కేటాయింపు బడ్జెట్‌లో కుదరనందున బ్యాంకు రుణాలు ఇతరేత్రా సమీకరించుకోవాలని ఈ శాఖ నిర్ణయించింది. ఈ నిధి ఏర్పాటు విషయమై సీఎం కేసీఆర్ దృష్టికి ఇది వరకే మంత్రి తుమ్మల తీసుకుపోయారు. ఆయన ఆమోదం తర్వాత నిధుల సేకరణపై స్పష్టత వస్తుందని అధికారులు వెల్లడించారు. ఈ నెలాఖరు లేదా బడ్జెట్ సమావేశాల తర్వాత సీఎంతో ఉన్నత స్థాయి సమావేశం జరిగే అవకాశం ఉందని ఆ తర్వాత పనులు వేగవంతం అవుతాయని తెలిపారు. ట్రాక్ పథకం ఆచరణలోకి వస్తే 30 జిల్లాల్లోని 425 మండలాలకు రహదారి సౌకర్యం ఏర్పడుతుంది. 87 పర్యాటక కేంద్రాలకు రోడ్డు సౌకర్యం ఏర్పాటుతుంది. 91వ్యవసాయ మార్కెట్లకు కూడా రహదారులను అనుసంధానం చేస్తారు. 164 పారిశ్రామిక మండళ్లకు కూడా రోడ్డు సౌకర్యం ఏర్పడుతుంది. ట్రాక్ ద్వారా 5,107 కిలోమీటర్ల రహదారులు వేయాలని రహదారుల శాఖ ప్రతిపాదించింది. వాటిలో 905 కిలోమీటర్ల మేర జాతీయ రహదారులు, అంతర్గతంగా కలిసిపోయే (ఓవర్‌లాప్) రోడ్లు 239 కిలోమీటర్లు ఉన్నాయి.




సుంకిరెడ్డి నారాయణరెడ్డికి 'రంగినేని' సాహితీ పురస్కారం

కరీంనగర్ బ్యూరో, ప్రభన్యూస్ : రంగినేని ట్రస్టుద్వారా అనాథ పిల్లల ఆశ్రమాన్ని నిర్వహిస్తున్న రంగినేని సుజాత మోహన్‌రావు తన తల్లి ఎల్లమ్మ పేరుమీద పది సంవత్సరాలుగా సాహితీ పురస్కారాలను అందజేస్తున్నారు. 2017 సంవత్సరానికి గాను నల్లగొండ జిల్లాకు చెందిన రిటైర్డ్ ప్రిన్సిపాల్, కవి సుంకిరెడ్డి నారాయణ రెడ్డికి సోమవారం జరిగిన కార్యక్రమంలో గవర్నర్ విద్యాసాగర్‌రావు చేతుల మీదుగా రంగినేని ఎల్లమ్మ సాహితీ పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ తాను మంత్రిగా ఉన్నసమయంలో ఈ ప్రాంతంలో అనాథ పిల్లలను మోహన్‌రావుకు అప్పజెపితే ట్రస్టులో చేర్చుకొని చదువు చెప్పించి పెళ్లిళ్లు చేసి ఉద్యోగాలకు కూడ ఎంపికయ్యేలా తీర్చిద్దారని కొనియాడారు. మోహన్ రావు తలచుకుంటే హైదరాబాద్ లాంటి మహానగరాలకు వెళ్లి వందలకోట్ల సంపాదించేవాడని సమాజ సేవ చేయాలనే సంకల్పంతో ట్రస్టు స్థాపించి సమాజ సేవ చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో కరీంనగర్ జెడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మన్‌రావు, రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ దేవరకొండ కృష్ణభాస్కర్, ఎస్పీ విశ్వజిత్ కంపాటి, నేషనల్ బుక్‌ట్రస్టు ఆఫ్ ఇండియా సహాయ సంపాదకులు పత్తిపాక మోహన్, ట్రస్టు నిర్వాహకులు రంగినేని మోహన్‌రావు, ట్రస్టులోని అనాథ పిల్లలు పాల్గొన్నారు.

పచ్చదనం పెంపులో ఏపీ నెం.1

✦ ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా ప్రశంసలు



అమరావతి, ఆంధ్రప్రభ బ్యూరో : ఆంధ్రప్రదేశ్ సిగలో మరో కలికితురాయి చేరింది. ఆంధ్రప్రదేశ్ అటవీశాఖ అధికా రులు పచ్చదనం పెంచడంలో అవిరళ కృషి చేసిన కారణంగా పూర్తి స్థాయిలో దేశంలోనే సఫలీకృమైందని ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా, సోమవారం వెబ్‌సైట్ నందు వెల్లడించింది. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా నివేదించే నివేదికంలో ఈ ఏడాది ఆంధ్ర ప్రదేశ్ అగ్రస్థానంలో నిలి చింది. 2141 చ.కీ.మి ఏరియా విస్తీర్ణంలో పచ్చదనం పెంపొందిం చడం జరిగిందని నివేదికలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలు మేరకు 2016లో వనం-మనం కార్యక్రమా న్ని ప్రారంభించి ప్రజలు, వివిధ శాఖల భాగస్వామ్యంతో ఇప్పటి వరకు వనం-మనం కార్యక్రమంలో 49.93 కోట్ల మొక్కలను నాటటం జరిగిందని అటవీశాఖ దళాధిపతి(పిసిసిఎఫ్) పి.మల్లిఖార్జునరావు వెల్లడించారు. అటవీ ప్రాంతాల్లో వివిధ మిశ్రమ జాతుల మొక్కలను 26,853 హెక్టార్లలో నాటటం జరిగిందని ఆయన వివరించారు. 3 వేల కిలోమీటర్ల మేర అటవీ సరిహద్దుల వెంట కందకాలు తవ్వడం జరిగిందని తెలిపారు. అడవిలో కార్చిచ్చు నివారణకు భూసారం కొట్టుకుపోకుండా, కోత నివారణ, భూగర్భ జలాల పెంపు తదితతరాలకు ప్రభుత్వం సంరక్షణా చర్యలు చేపట్టింది. నల్లమల్ల అటవీ ప్రాంతాల్లో కూడా వినూత్న తరహాలో కందకాలు తవ్వుతున్నారు. అడవిలో కురిసే వర్షాలు వలన ఈ కందకాలలో నిత్యం నీరు ఉండడంతో పాటు చెట్లు చేమలు పచ్చగా ఉంటాయని పిసిసిఎఫ్ మల్లిఖార్జునరావు తెలిపారు. అటవీ ప్రాంతాల్లో 349 చెక్ డ్యాములు నిర్మించడం జరిగింది. రాష్ట్రంలో మూడు నగరవనాలు ఇప్పటికే ఏర్పాటు చేయగా మరో నాలుగు ప్రజలకు అందుబాటులోకి రావడానికి సిద్ధంగా ఉన్నట్లు పిసిసిఎఫ్ వెల్లడించారు. సర్వే ఆఫ్ ఇండియా వెల్లడించిన ప్రకారం మొదటి స్థానంలో ఏపి ఉండగా, రెండవ స్థానంలో కర్ణాటక నిలిచింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి శిద్ధా రాఘవరావులను సర్వే ఆఫ్ ఇండియా ఈ సందర్భంగా ప్రశంసించింది. ఈ సందర్భంగా సిఎం చంద్రబాబును పిసిసిఎఫ్ మల్లిఖార్జున రావు మర్యాద పూర్వకంగా కలిసారు. అటవి శాఖ పచ్చదనం పెంపొందించేందుక ు చేస్తున్న కృషిని ముఖ్యమంత్రి ప్రసంశించారు. అగ్రస్థానం లో రాష్ట్రం నిలిచే విధంగా పనిచేసిన అధికారులను ఆయన అభినందించారు.



నిజామాబాద్ జిల్లా నవీపేట మండలం జగ్గారావు ఫారం వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన చిరుత

సాంకేతిక విద్యకు ప్రాధాన్యం!

✦ టెక్నికల్ యూనివర్సిటీలకు రూ.356 కోట్ల ప్రతిపాదనలు ✦ రూ.617 కోట్లతో బడ్జెట్ ప్రతిపాదనలు పంపిన సాంకేతిక విద్యా శాఖ

యూనివర్సిటీ	ప్రతిపాదనలు
జెఎన్‌టియు హైదరాబాద్	రూ. 30.50 కోట్లు
జెఎన్‌టియు సుల్తాన్‌పూర్	రూ. 87 కోట్లు
జెఎన్‌టియు మంథని	రూ. 76 కోట్లు
జెఎన్‌టియు కరీంనగర్	రూ. 51 కోట్లు
జెఎన్ఏఎఫ్ఏయు, హైదరాబాద్	రూ. 23 కోట్లు
ఆర్‌జియుకెటి, బాసర	రూ. 89 కోట్లు
మొత్తం	రూ. 356.50 కోట్లు



హైదరాబాద్,ఆంధ్రప్రభ: రాష్ట్రంలో సాంకేతిక విద్యాభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. సాంకేతికరంగంలో అభివృద్ధి చేయడం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే టి హబ్‌ను ఏర్పాటు చేసింది. నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేస్తోంది. డిగ్రీ కాలేజీల్లోనూ నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను ప్రారంభించింది. యూనివర్సిటీల్లో ఇంక్యూబేటర్‌లను కూడా ప్రారంభించాలని నిర్ణయించింది. ఇప్పటికే జెఎన్‌టియు, ఉస్మానియా యూనివర్సిటీల్లో ఇంక్యూబేటర్ల ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకుంది. రాష్ట్రా న్ని సాంకేతికంగా అభివృద్ధి చేయడంలో భాగంగా వచ్చే ఏడాదిలో టెక్నికల్ యూనివర్సిటీ లకు ప్రత్యేకంగా నిధులను కేటాయిం చాలని కోరుతూ సాంకేతిక విద్యా శాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించింది. గత ఏడాదిలో రాష్ట్రం లోని వివిధ యూనివర్సిటీలకు రూ. 420 కోట్లను కేటాయించినప్పటికీ సాంకేతిక యూనివర్సిటీలకు ప్రత్యేకంగా నిధులను కేటాయించలేదు. ఈ నేపథ్యంలో వచ్చే ఏడాది 2018-19లో గత ఏడాది మాదిరిగా కాకుండా టెక్నికల్ యూనివర్సిటీలకు కూడా నిధులు కేటాయించాలని కోరుతూ ప్రతిపాదనలు పంపించింది.

రూ. 617 కోట్లతో ప్రతిపాదనలు

రాష్ట్రంలోని సాంకేతిక విద్యా శాఖ 2018-19 సంవత్సరానికి గానూ రూ. 617 కోట్లతో బడ్జెట్ ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపించింది. అందులో జెఎన్‌టియు, ఆర్‌జియుకెటి, జెఎన్ఏఎఫ్ ఏయు యూనివర్సిటీలకు ప్రత్యేకంగా నిధులను కేటాయించాలని సాంకేతిక విద్యా శాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు.

2017-18 లో రూ. 102 కోట్లు కేటాయింపు

2017-18 విద్యా సంవత్సరానికి సంబంధించి సాంకేతిక విద్యా శాఖకు జీతభత్యాలు కాకుండా రూ. 95 కోట్లు కేటాయించారు. తరువాత కాలంలో అదనంగా మరో రూ. 12 కోట్లను కేటాయించారు. మొత్తంగా రూ. 107 కోట్లను కేటాయించగా వాటిలో రూ. 37 కోట్లను రిలీజ్ చేశారు. అందులో ఇప్పటికే రూ. 32 కోట్లను ఖర్చు చేశారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లో పాలిటెక్నిక్ చదువుతున్న దళిత అమ్మాయిల కోసం ప్రత్యేకంగా హాస్టల్స్ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. 2016లోనే ఈ నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలో 57 ప్రభుత్వ పాలిటెక్నిక్‌లు ఉండగా వాటిలో 22 పాలిటెక్నిక్ కాలేజీల్లో ఇప్పటికే హాస్టల్స్ ఉన్నప్పటికీ అమ్మాయిలకు లేవు. ఈ నేపథ్యంలో 22 పాలిటెక్నిక్ కాలేజీల్లో అమ్మాయిలకు ప్రత్యేకంగా హాస్టల్స్ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. ఒక్కో హాస్టల్‌కు రూ. 3కోట్లు చొప్పున నిర్మాణానికి కేటాయించారు. అందులో భాగంగా 2017-18 సంవత్సరంలో 34 కోట్లు కేటాయించగా అందులోనుంచి రూ. 20 కోట్లు రిలీజ్ చేశారు. వాటిలో జనవరి 31, 2018 వరకు రూ. 17 కోట్లను ఖర్చు చేశారు. ఈ 22 హాస్టల్స్ కూడా వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి అంటే జూన్ 1 నాటికి అన్నింటిని ప్రారంభించేందుకు నిర్మాణ పనులను వేగవంతం చేశారు.

అరబ్ షేక్‌ల చేతుల్లో అతివలు విలవిల

✦ వెలుగులోకి వచ్చిన ఓ అభాగ్యురాలి ఆక్రందన ✦ దుబాయ్‌లో అనుభవిస్తున్న నరకయాతనను వీడియో ద్వారా కూతురికి పంపించిన తల్లి

✦ తన మాతృమూర్తికి విముక్తి కల్పించండని ముఖ్యమంత్రిని వేడుకుంటున్న కూతురు ✦ పేగు బంధాలను దూరం చేస్తున్న ఉపాధి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : ఎడతెగని ఆర్థిక సమస్యలు... కడుపు నిండా దొరకని తిండి... కని పెంచిన పిల్లలను చదివించుకోవాలన్న ఆశ... కడు పేదరికం నుంచి బయటపడాలన్న ఆకాంక్ష... ఇవన్నీ వేలాది కుటంబాలను అరబ్ దేశాలను వెళ్ళేలా చేస్తున్నాయి. అక్కడికి వెళ్ళిన తర్వాత అనుకున్నదేదీ నెరవేరక పోగా నరకయాతనను అనుభవించాల్సి వస్తోంది. గత్యంతరం లేని పరిస్థితుల్లో దుబాయ్ దేశానికి వెళ్ళి అనేకమంది అతివలు అరబ్ షేక్‌ల చేతుల్లో విలవిల్లాడిపోతున్నారు. తీవ్రమైన సమస్యగా మారుతున్న ఉపాధి పేగుబంధాలను దూరం చేస్తోంది. తాజాగా వెలుగులోకి వచ్చిన ఓ అభాగ్యురాలి ఆక్రందన ప్రతిఒక్కరి మనసులను కలచివేస్తోంది. దుబాయ్‌లో నరకయాతనను అనుభవిస్తున్న ఓ మాతృమూర్తి ఇక్కడున్న తన కూతురికి పంపించిన వీడియో పేద బతుకులను ప్రతిబించింప జేస్తోంది. ఆ వివరాల్లోకి వెళితే...



సీఎం కేసీఆర్‌గారు అమ్మని చూడాలని ఉంది.. ఇండియాకు రప్పించేలా చూడండి ప్లీజ్.. అంటోంది ఓ కూతురు. భరించలేని కడుపు నొప్పి.. ఇంకోవైపు కడుపునిండా తినలేని స్థితి.. నరకం చూస్తున్నా.. మా ఇంటికి పంపించండి అంటూ అక్కడ ఓ అరబ్ షేక్‌ని అర్థిస్తోంది తల్లి. అమ్మ ఎలా ఉందో తెలీదు.. ఎప్పుడొస్తుందో అర్థంకాదు.. ఫోన్‌లో తన తల్లి బాధలు విన్న కూతురు అమ్మ కోసం పరితపించిపోతోంది. ఎలాగైనా సరే.. అమ్మను మా ఇంటికి రప్పించండి ప్లీజ్ అంటూ సీఎం కేసీఆర్‌ను వేడుకుంటోంది రూపారాణి. ఒక పూట తిండి.. రెండు పూటల పస్తులు ఇది మస్కట్‌లోని ధనలక్ష్మి పరిస్థితి. గుండెపోటు బాధని గుండెల్లోనే దాచుకుంటూ అరబ్ షేక్ ఇంట్లో నానా చాకిరీ చేస్తోంది. భర్త దుర్గాప్రసాద్, కొడుకు షణ్ముఖ, కూతురు రూపారాణిలను వదిలి.. వాళ్ళ కోసం నాలుగు డబ్బులు సంపాదించాలనే ఆశతో.. పనికోసం దుబాయ్ వెళ్ళి అక్కడ నరకం అనుభవిస్తోంది.

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో హౌస్ కీపర్‌గా పనిచేస్తున్న ధనలక్ష్మీకి లక్ష్మీ అనే ఓ మహిళలతో పరిచయం ఏర్పడింది. దుబాయ్ పంపిస్తానని.. అక్కడ కావల్సినంత డబ్బులు సంపాదించొచ్చని ధనలక్ష్మిని లక్ష్మీ నమ్మించింది. భర్త దుర్గాప్రసాద్‌ను, బిడ్డలను ఒప్పించి గత ఏడాది మస్కట్‌కు వెళ్ళింది ధనలక్ష్మీ. అక్కడకు వెళ్ళిన తర్వాత అర్థమైంది ఆమె వచ్చింది మస్కట్‌కు కాదని.. నరకానికి అని. మస్కట్‌కు వెళ్ళగానే ధనలక్ష్మిని ఏజెంట్ శ్రీనివాస్ ఓ అరబ్ షేక్ ఇంటికి తీసుకువెళ్ళాడు. రెండేళ్ళ పాటు పనికి కుదిర్చి ఆ షేక్ దగ్గర లక్షా 40వేలు అడ్వాన్స్ తీసుకుని జారుకున్నాడు. అడ్వాన్స్ సంగతి తెలియని ధనలక్ష్మి.. చాలీచాలని తిండి తింటూ అక్కడే వెట్టిచాకిరి చేస్తూ వస్తోంది. తిన్నా తినకపోయినా ప్రతిరోజు చాకిరీ చేయడంతో అనారోగ్యం పాలైంది. దీనికి తోడు చీకటి పడిన తర్వాత అరబ్ షేక్‌ల వెకిలి చేష్టలు ధనలక్ష్మికి ప్రత్యక్ష నరకం చూపించాయి. కనీసం ఆసుపత్రికి తీసుకువెళ్ళండి బాబు అన్నా పట్టించుకునే వారు లేకపోవడంతో తనలో తానే కుమిలిపోయింది.

తనను దుబాయ్‌కు పంపించిన మహిళతో బాధలు చెబుకుందామని ప్రయత్నిస్తే.. పంపించడం వరకే తన పని అని, బాధనంతా గుండెలోనే దాచుకో అంటూ ఉచిత సలహా ఇస్తోంది. ఇక చేసేది లేక.. అరబ్ షేక్‌నే బతిమలాడుకుంది. తనను ఆసుపత్రికి తీసుకువెళ్ళమని లేదా ఇండియా పంపించేయాలని ప్రాధేయపడింది. ఏజెంట్ అడ్వాన్స్‌గా తీసుకున్న డబ్బులు చెల్లిస్తేగానీ ఇంటికి పంపించేది లేదంటూ బెదిరింపులకు దిగాడు. దీంతో తన గోడును ఫోన్ ద్వారా తన భర్తకు చెప్పి.. కన్నీటి పర్యంతమైంది. న్యాయం కోసం ఓ టీవీ ఛానెల్‌ను ఆశ్రయించిన భర్త దుర్గాప్రసాద్.. భార్యను మాట్లాడించారు. దేశంకాని దేశంలో నరకయాతన పడుతున్న తన భార్య ధనలక్ష్మిని ఎలాగైనా స్వదేశానికి రప్పించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాడు భర్త దుర్గాప్రసాద్. ధనలక్ష్మిని వెంటనే ప్రభుత్వం రప్పించే ప్రయత్నం చేయాలని కోరుకుంటోంది. ఇలాంటి ధనలక్ష్ములు ఎంతమంది అరబ్‌షేక్‌ల ఆరాచకాలకు బలవుతున్నారో ఈ సంఘటనను బట్టి అర్థం చేసుకోవచ్చు.

సమ్మక్క సారలమ్మ జాతర హుండీ ఆదాయం రూ.10కోట్లు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ కుంభమేళా మేడారం జాతరకు ఈసారి కోటికి పైగా భక్తజనం హాజరుకాగా, ప్రభుత్వానికి హుండీఆదాయం కూడా రికార్డుస్థాయిలో లభించింది. వారం రోజుల పాటు హన్మకొండ టిటిడి కల్యాణ మండపంలో కొనసాగిన లెక్కింపు కార్యక్రమం సోమవారం ముగిసింది. మొత్తం 479హుండీల లెక్కింపు పూర్తి అయింది. మేడారం జాతర ఆదాయం రూ.10కోట్ల 17లక్షల 50వేల 363 వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. అదేవిధంగా 824గ్రాముల బంగారం, 47కిలోల వెండిని భక్తులు కానుకల రూపంలో సమర్పించారు. గత జాతరలో రూ.9.1కోట్ల ఆదాయం లభించగా, ఈ ఏడాది హుండీ ఆదాయంతో పాటు కానుకల ఆదాయం కూడా గణనీయంగా పెరిగింది.

అండర్-14 టెన్నిస్‌లో ముత్తా గౌరవ్‌కృష్ణ గెలుపు



కర్నూలు స్పోర్ట్స్, పభ న్యూస్: కర్నూలు నగరంలో జరుగుతున్న ఆల్ ఇండియా టెన్నిస్ ర్యాంకింగ్ ఛాంపియన్‌షిప్ సిరీస్‌లో ముత్తా గౌరవ్‌కృష్ణ ప్రభంజనం సృష్టించా డు. అండర్-14 విభాగంలో జరిగిన సింగిల్స్ పోటీలో తన ప్రత్యర్థి తెలం గాణ రాష్ట్రానికి చెందిన సాహన్ రెడ్డిపై 9-1 వరుస సెట్ల విజయంతో భారీ విజయాన్ని సొంతం చేసుకున్నారు. ఆఫీసర్ క్లబ్‌లోని రెండవ కోర్టులో జరిగిన పోటీలో ముత్తా గౌరవ్‌కృష్ణతన ప్రత్యర్థిపై పవర్ షాట్స్ స్ట్రాంగ్ సర్వీసెస్‌తో విరుచుకపడ్డారు. ప్రతి బంతిని అలవోకగా అందుకుం టూ, మైదానంలో చురుకుగా కదులుతూ భారీ షాట్స్‌తో ప్రత్యర్థిని ఉక్కిరిబిక్కిరి చేశారు. చెరగని ఆత్మవిశ్వాసంతో మ్యాచ్ ఆద్యాంతం ఆదిపత్యాన్ని కొనసాగించారు. ఆల్ ఇండియా టెన్నిస్‌లో 415వ ర్యాంకర్ అయిన ముత్తా గౌరవ్ కృష్ణ ఈపోటీలలో తన ర్యాంకును మరింత మెరుగు పరుచుకునే అవకాశాలు మెండుగా వున్నాయి. ముత్తా గౌరవ్ కృష్ణ ఆంధ్ర ప్రభ దినపత్రిక ఎండి ముత్తా గౌతమ్ కృష్ణ తనయుడు.

చెన్నైలో ప్రదీప్ బినామీ లాకర్

రూ.22 లక్షల విలువైన నగలు గుర్తించిన ఏసీబీ

అమరావతి, ఆంధ్రప్రభ: విశాఖపట్నం 'వుడా' మాజీ అదనపు చీఫ్ అర్బన్ ప్లానర్ పసుపర్తి ప్రదీప్ కుమార్ అక్రమాస్తులపై ఏసీబీ అధికారుల సోదాలు కొనసాగుతున్నాయి. సోదాల్లో భాగంగా సోమవారం చెన్నై టి.నగర్‌లోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లాకర్ తెరచి రూ.22లక్షల విలువైన 905 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు గతంలో స్వాధీనం చేసుకున్న ఆస్తులకు సంబంధించిన ధృవీకరణ పత్రాల నకళ్లను కూడా స్వాధీనం చేసుకు న్నారు. తన సోదరి భర్తను బినామీగా పెట్టి లాకర్ తెరిచినట్లు విజయవాడ ఏసీబీ అధికారులు గుర్తించారు. ఆదాయానికి మించి ఆస్తులున్నట్లు నమోదు చేసిన కేసులో..విశాఖ దసపల్లా హిల్స్ నటరాజ్ టవర్స్‌లోని ప్రదీప్ కుమార్ ఇంటితో పాటు హైదరాబాద్, అనంతపురం, ఒంగోలు, విజయవాడ సహా 12 ప్రాంతాల్లో గత నెల 29న సోదాలు నిర్వహించారు. తండ్రి, కుమారుడు, మామ, బంధువుల ఇళ్లల్లో నిర్వహించి సోదాల్లో రూ.60కోట్ల విలువైన ఆస్తులను అప ్పట్లో ఏసీబీ అధికారులు గుర్తించారు. ఐదు నివేశన స్థలాలు, నాలుగు ఫ్లాట్లు, 9.20 ఎకరాల వ్యవసాయ భూమి, పెద్ద మొత్తంలో బంగారం, వెండి సామాగ్రి, నగదు నిల్వలను అధికారులు గుర్తించి స్వాధీనం చేసుకున్న విజయవాడ ఏసీబీ అధికారులు సోమవారం లాకర్‌ను గుర్తించి నగలు స్వాధీనం చేసుకున్నారు.





శ్రీనగర్‌లో రహదారులపై మంచు దుప్పటి...



సిమ్లా రోడ్లపై వాననీటి పరవళ్లు...



కోల్‌కతా: రానున్న చైనా న్యూ ఇయర్ వేడుకలకు డాన్సర్ల సన్నాహం

భారత్ పెట్టుబడులకు పుట్టినిల్లు

• గల్ఫ్, పశ్చిమాసియా దేశ వ్యాపారులతో మోడీ • 8 కీలక ఒప్పందాలు

• 125 ఏళ్ల నాటి శివాలయంలో ప్రత్యేక పూజలు • భారత్ చేరుకున్న ప్రధాని మోడీ

మస్కట్ : ప్రధాని నరేంద్ర మోడీ తన రెండు రోజుల ఒమన్ పర్యటనలో భాగంగా ఆదివారం సాయంత్రం మస్కట్ చేరుకున్నారు. అనంతరం సుల్తాన్ ఖబూస్ క్రీడా కాంప్లెక్స్‌లో భారతీయ సంతతికి చెందినవారిని ఉద్దేశించి కీలక ఉపన్యాసం చేశారు. సోమవారం భారత్-ఓమన్ దేశాల మధ్య 8 కీలక ఒప్పందాలపై సంతకాలు చేసుకున్నాయి. వీటిలో రక్షణ, భద్రత, వైద్యం, టూరిజంతో పాటు పలు అంశాలపై సహాయ సహకారా లు అందిపుచ్చుకునేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. వీటితో పాటు మరికొన్ని రంగాలపై ప్రధాని నరేంద్రమో డీ, ఓమన్ సుల్తాన్‌తో చర్చలు నిర్వహించారు. భారత్‌లో అన్ని సౌకర్యాలు ఉన్నాయని, పెట్టుబడులు పెట్టాలని గల్ఫ్ దేశా ల్లోని వ్యాపారవేత్తలను ప్రధాని మోడీ కోరారు. పశ్చిమాసియా దేశాల పర్యటనలో భాగంగా చివరిగా ఆదివారం ఓమన్ చేరుకున్నారు. ఉత్సాహభరిత వాతావరణంలో ఇరు దేశాల అధ్యక్షుల ద్వైపాక్షిక చర్చలు కొనసాగాయని విదేశీ వ్యవహారాల ప్రతినిధి రవీశ్‌కుమార్ ట్విట్టర్ వేదికగా తెలిపారు. వాణిజ్య, వ్యాపార రంగంలో అభివృద్ధితో పాటు పెట్టుబడులు పెట్టేందుకు ప్రధాని నరేంద్ర మోడీ ఓమన్ దేశ వ్యాపారులను కోరినట్టు వివరించారు. ఓమన్ దేశాభివృద్ధిలో నికచ్చిగా, నిష్పక్షపాతం గా వ్యవహరిస్తున్న భారత్ వైఖరిపై సుల్తాన్ ప్రశం సలు కురిపించారు. లీగల్, జ్యూడిషియల్, సివిల్, కమర్షియల్ వ్యవహారాల్లో సహాయ సహ కారాలు అందిపు చ్చు కు నేందుకు ఒప్పం దపత్రాలు మార్చు కున్నా రు. విమాన యాన రంగంలో డిప్లొమాటిక్ మ్యూచువల్ వీసా విష యంలో చర్చించి ఫలవంత మైన ఒప్పం దం చేసుకు న్నారు. ఇరు దేశాల్లో శాంతిపూర్వ వాతా వరణం నెలకొల్పే లా చర్యలు తీసుకోవాలని కోరుకున్నారు. విదే శీ వ్యవహా రాలు, ఫారెన్ సర్వీస్ ఇన్‌స్టిట్యూట్ విష యంలో కూడా ఇరు దేశా లు కొన్ని కీలక ఒప్పందాలు చేసుకు న్నాయి. అకాడ మిక్, స్కాలరీ జాతీయ రక్షణ కళాశాలలు విషయమై కూడా ఇరు దేశాల ప్రధా నులు లోతుగా చర్చిం చారు. ఆర్మీ రం గంలో కూడా సమ యాను కూ లంగా సహాయం అంద జేసేం దుకు ఇరు దేశాలు సాను కూల నిర్ణయాలు తీసుకు న్నాయి.



భారత్‌లో సానుకూల వాతావరణం

ఓమన్ పర్యటనలో భాగంగా ప్రధా ని మోడీ గల్ఫ్, పశ్చిమ ఆసియా రీజియన్‌లోని పారిశ్రామిక వేత్తలతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా భారత్‌లో పెట్టుబడులకు సానుకూల వాతావరణం ఉందని, దీనిపై దృష్టిసారించాలిందిగా వారిని కోరారు. నాలుగు రోజుల్లో నాలుగు దేశాలు పర్యటించి పలు కీలక ఒప్పందాలు చేసుకున్నట్లు భారత విదేశీ వ్యవహారాల ప్రతినిధి రవీశ్ కుమార్ చెప్పారు. గల్ఫ్, పశ్చిమాసి యాలో ఈ పర్యటన సాగిందని వివరించారు. చాలా రోజుల తర్వాత ఓమన్ పర్యటన తనకు సంతృప్తి ఇచ్చిందని మోడీ తెలిపారు.



నమో.. శివాయ

మస్కట్‌లో 125 ఏళ్ల క్రితం నిర్మించిన శివాలయంలో ప్రధాని మోడీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్య ప్రాచ్యంలో హిందూ ఆలయాల్లో అతి పురాతన దేవాలయంగా చరిత్రలో ఉంది. ఈ ఆలయం మత్రా ప్రాంతంలో నిర్మించ బడి ఉంది. ఈ సందర్భంగా మోడీ మాట్లాడుతూ... అతి ప్రాచీన ఆలయంలో పూజలు నిర్వహించడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. పూజల్లో భాగంగా అభిషేకం నిర్వహించినట్టు వివరించారు. గుజరాత్‌కు చెందిన వ్యాపార వేత్త 125 ఏళ్ల క్రితం ఈ ఆలయం నిర్మించినట్టు అక్కడి దేవాల య కమిటీ మోడీకి వివరించింది. ఆది మోతీశ్వర్ మహదేవ్, మోతీశ్వర్ మహదేవ్, హను మాన్‌జీ ఇలా మూడు తరాలు ఈ ఆలయ పర్య వేక్షణ చేసిం దన్నారు. పండు గ రోజు ల్లో సుమా రు రోజుకు 15వేల మంది భక్తులు శివున్ని దర్శించు కుంటారని వివరించారు.

‘అమ్మ’ చిత్రపటంపై డీఎంకే అభ్యంతరం

చెన్నై: తమిళనాడు అసెంబ్లీలో జయలలిత చిత్రపటం ఉంచడంపై డీఎంకే ఆక్షేపణ వ్యక్తం చేసింది. మాజీ ముఖ్యమంత్రి, దివంగత ఏఐఏడీఎంకే అధ్యక్షురాలు జయలలిత చిత్రపటాన్ని స్పీకర్ ధనపాల్ ఆవిష్కరిం చటంపై ప్రధాన ప్రతిపక్షం డీఎంకే అభ్యంతరం వ్యక్తం చేస్తూ చెన్నై హైకోర్టు తలుపు తట్టింది. దివంగత ముఖ్యమంత్రి జయలలిత అవినీతి కేసులో జైలుకు వెళ్లారని గుర్తుచేశారు. ప్రస్తుతం అదేకేసులో జయలలిత సహచరి శశికళ బెంగళూరులో జైలు జీవితాన్ని అనుభవిస్తున్నారన్నారు. కళంకిత చరిత్ర ఉన్న జయలలిత చిత్రపటాన్ని అసెంబ్లీలో తొలగించాలనిసిందిగా ఆదేశించాలని డీఎంకే కోర్టును కోరింది. ధర్మాసనం ప్రధాన న్యాయమూర్తి ఇందిరా బెనర్జీ, జస్టిస్ అబ్దుల్ ఖుద్దుస్ సోమవారం ఉదయం 10.30నిమిషాలకు ప్రొసీడింగ్స్ ప్రారంభించగానే డీఎంకేకు చెందిన పి విల్సన్ అసెంబ్లీలో జయలలిత చిత్రపటం విషయాన్ని హైకోర్టు దృష్టికి తీసుకొచ్చారు. డీఎంకే అభ్యర్థనను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు.

మోహన్‌భగవత్ క్షమాపణ చెప్పాలి

కేరళ ముఖ్యమంత్రి పి.విజయన్ డిమాండ్



తిరువనంతపురం: ఇండియన్ మిలిటరీపై ఆర్ఎస్ఎస్ అధినేత చేసిన వ్యాఖ్యలపై కేరళ ముఖ్యమంత్రి పి.విజయన్ అభ్యంతరం వ్యక్తం చేస్తూ మోహన్ భగవత్ క్షమా పణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఫేస్‌బుక్‌లో ఆయన ఆర్ఎస్ఎస్ ఇండియాను హిట్లర్ నాటి జర్మనీలా మార్చేయాలనుకుంటుందని పోస్టు చేశారు. మోహన్ భగవత్ వ్యాఖ్యలపై ప్రధాని నరేంద్ర మోదీ వివరణ ఇవ్వాలిసిందిగా సీఎం విజయన్ కోరారు. ఇండియన్ ఆర్మీపైనే కాదు రాజ్యాంగ వ్యవస్థ లపైన గౌరవం లేదన్నారు. భారతదేశాన్ని ఇటలీలోని ముస్సోలిని, జర్మనీలోని హిట్లర్ పాలన తర హాలో మార్చేందుకు ప్రయత్నిస్తుందన్నారు. ఆర్ఎస్ఎస్ భారత సైన్యానికి సమాం తరంగా తమ సైన్యాన్ని నడిపిస్తూ దేశంలో హిందూ టెర్రర్ సృష్టించేందుకు ప్రయ త్నిస్తుందన్న తమ హెచ్చరికలు నిజమయ్యాయన్నారు. దేశ ప్రజలకు మోహన్ భగవత్ దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలిసిందేనని కేరళ సీఎం విజయన్ డిమాండ్ చేశారు.

ఆర్మీ అధికారికి సుప్రీంలో ఊరట

న్యూఢిల్లీ: జమ్ము కాశ్మీర్‌లోని షోపియాన్‌లో కాల్పుల కేసులో ఆర్మీ అధికారి మనోజ్ ఆధిత్యకు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. జమ్ము పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌పై సుప్రీంకోర్టు స్టే విధించింది. మనోజ్‌పై పోలీసులు ఎలాంటి బలవంతపు చర్యలకు దిగవద్దని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ కేసుపై రెండు వారాల్లో జమ్ము కాశ్మీర్ ప్రభుత్వ స్పందనను తెలియజేయాలని ఆదేశాలు జారీ చేసింది. షోపియాన్ ప్రాంతాల్లో ఆర్మీ వాహనాలపై రాళ్లు రువ్వుతున్న పౌరులపై కాల్పులు జరపడంతో ముగ్గురు పౌరులు మృతి చెందారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరపాలని సీఎం మెహబూబాముఫ్తీ ఆదేశించడంతో కాల్పులు జరిపిన 10 మంది గర్వాల్ రైఫిల్స్ సహా ఆర్మీ అధికారి మనోజ్ ఆధిత్యపై పోలీసులు హత్య, హత్యాయత్నం సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఆర్మీ అధికారి తండ్రి కరమ్‌వీర్‌సింగ్ సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించాడు. కాల్పుల సమయంలో తన కుమారుడు ఘటనా స్థలంలో లేడని పేర్కొన్నాడు. ఈ కేసుపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రా నేతృత్వంలోని జస్టిస్ ఎఎం ఖన్విల్కర్, జస్టిస్ డి.వై చంద్రచూడ్ ధర్మాసనం పోలీసులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఆర్మీ అధికారిపై పోలీసులు ఎలాంటి బలవంతపు చర్యలకు దిగవద్దని సూచిస్తూ.. పిటిషన్ అటార్నీ జనరల్ కేకే వేణుగోపాల్ సహాయం తీసుకోవాలని పేర్కొంది.

కంబాలా రేసుకు సుప్రీం నో

న్యూఢిల్లీ: కర్నాటక ప్రజలు సంప్రదాయ బద్ధంగా నిర్వహించుకునే కంబాలా వేడుకకు అనుమతి ఇచ్చేందుకు సుప్రీం కోర్టు తిరస్కరించింది. మధ్యంతర ఉత్తర్వుల ద్వారా అనుమతులు ఇవ్వాలంటూ పెటా (జంతు హక్కుల సంస్థ) దాఖలు చేసిన పిటిషన్‌ను తోసిపుచ్చింది. ఎఎం ఖాన్విల్కర్, డీవై చంద్రచూడ్‌లతో కూడిన బెంచ్ ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. తదుపరి విచారణ మార్చి 12కి వాయిదా వేసింది. రాష్ట్రప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్ గడువు ముగిసినందున కంబాలా చట్టబద్ధం కానేరదని సీనియర్ న్యాయవాది సిద్ధార్ద్ లుథ్రా ధర్మాసనానికి వివరించారు. గతేడాది జంతు హింస పరిరక్షణ చట్టానికి సవరణలు చేస్తూ ఆర్డినెన్స్ తీసుకొచ్చారు.

భిక్షాటనతో మరుగుదొడ్డి నిర్మాణం

బీహార్: హామీల్లో ఘనం.. ఆచరణలో శూన్యం అన్నట్లుగ్లా సాగుతాయి ప్రభుత్వ వ్యవహారాలు. దేశాన్ని బహిరంగ మల, మూత్ర విసర్జిత రహితంగా చేయాలంటూ ఉపన్యాసాలు ఇచ్చే నాయకులు, ప్రభుత్వం ఆచరణలోకి వచ్చేసరికి అందుకు విరుద్ధంగా ప్రవర్తిస్తుంటాయి. బీహార్‌లోని ఓ నిరుపేద మహిళ బిచ్చమెత్తుకుని మరీ టాయిలెట్ నిర్మించుకోవడం ద్వారా తన ప్రభుత్వాల వైఖరిని చెప్పకనే చెప్పింది.బీహార్ రాష్ట్రంలోని బీహార్‌లోని సుపాల్ జిల్లా ప్రతా ఉత్తర్ గ్రామంలో నివశించే అమీనా ఖతూన్ ఓ పేద మహిళ. భర్త మృతి చెందడంతో కొడుకుతో కలిసి నివశిస్తోంది. కాలకృత్యాలకు బహిర్భూమిపై ఆధారపడిన ఆమెను దేశ వ్యాప్తంగా స్వచ్ఛభారత్ అంటూ ఊదర గొట్టింది. దీంతో తన సమస్యకు పరిష్కారం దొరికిందని సంబరపడి పోయిన ఆమె ఈ కార్యక్రమంలో తన మరుగుదొడ్డి సమస్య తీర్చాలంటూ అధికారుల చుట్టూ తిరిగి తిరిగి వేసారిపోయింది. ఇక లాభం లేదనుకుని సమీప ప్రాంతాల్లో భిక్షాటన చేసిన ఆ సొమ్ముతో మరుగుదొడ్డి నిర్మించుకుంది. అమీనా సంకల్ప బలానికి చైతన్యవంతులైన గ్రామంలోని భవన నిర్మాణ కార్మికులు ఆమె వద్ద డబ్బు తీసుకోకుండానే మరుగుదొడ్డి నిర్మించారు.

రియో ఎన్నిక ఇక లాంఛనమే

నాగాలాండ్ : ఈనెల 27న జరగనున్న నాగాలాండ్ అసెంబ్లీ ఎన్నికల బరి నుంచి తన ప్రత్యర్థి, నాగాలాండ్ పీపుల్స్ ఫ్రంట్ (ఎన్.పి.ఎఫ్) అభ్యర్థి చుప్పూ అంగమీ తప్పుకోవడంతో ఎన్‌డిపిపి (నాగాలాండ్ డెమొక్రటిక్ పీపుల్స్ ఫ్రంట్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి (మూడు సార్లు) నీఫి రియో ఎన్నిక లాంఛన ప్రాయం కానుంది. ఈనెల 27న నాగాలాండ్ 13వ శాసనసభకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ సందర్భంగా ఉత్తర నాగాలాండ్ లోని అంగమీ-2 అసెంబ్లీ నియోజక వర్గం నుంచి గతంలో మూడుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన నీఫి రియో తాను స్వంతంగా ప్రారంభించిన ఎన్‌డీపీపీ నుంచి పోటీ చేస్తున్నారు. ఈయనపై ఎన్‌పీఎఫ్ అభ్యర్థి, రియో బావ అయిన చుప్పూ అంగమీ పోటీ చేస్తున్నారు. రియో స్థాపించిన నూతన పార్టీ ఎన్‌డీపీపీకి ప్రజల నుంచి విశేష స్పందన వస్తుండడంతో ఎన్‌పీఎఫ్ డైలమాలో పడింది. దీంతో చుప్పూ తనకు నియోజకవర్గంలో ప్రజల నుంచి మద్దతు లభించదనే నిర్ధారణకు వచ్చారు. పోటీ చేసి ఓడిపోవడం కంటే ముందుగానే తప్పుకోవడం మేలనే భావనతో ఆయన బరి నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించారు.

లండన్ విమానాశ్రయంలో రెండో ప్రపంచ యుద్ధం నాటి బాంబు

లండన్: బ్రిటన్‌లో రెండవ ప్రపంచ యుద్ధ కాలం నాటి బాంబు ఒకటి వెలుగుచూసింది. పేలని బాంబును విమానాశ్రయానికి సమీపంలో థేమ్స్ తీరంలో దీన్ని గుర్తించారు. ఈ విషయం తెలియగానే అక్కడున్న వేలాది మంది ప్రయాణికులు తారెత్తిపోయారు. తక్షణమే తూర్పు లండన్ ఎయిర్‌పోర్టు కార్యకలాపాలను నిలిపివేశారు. ల్యాండింగ్ కావాల్సిన విమానాలను దూరంగా రన్‌వేపైన ఆపివేశారు. దాదాపు 100 విమానాల రాకపోకలు స్తంభించాయి. 16వేల మంది ప్రయాణికులు అసౌకర్యానికి గురయ్యారు. ఆదివారం వేకువ జామున విమానాశ్రయ పరిసరాల్లో పనులు పర్యవేక్షిస్తుండగా, జార్జ్ వి డాక్ వద్ద ఈ బాంబును గమనించారు. 500 కేజీల బరువు కలిగిన ఈ పేలుడు పరికరాన్ని జర్మన్ దేశానికి చెందినదిగా ధ్రువీకరించారు. దానిని నిర్వీర్యం చేసి ఆ ప్రాంతం నుంచి తొలగించేందుకు రాయల్ నేవీ అధికారులతో కలిసి పనిచేస్తున్నట్లు పోలీసు అధికారులు స్పష్టంచేశారు. 214 మీటర్ల ప్రాంతాన్ని పేలుడు జోన్‌గా ప్రకటించారు. జోన్ పరిధిలో నివాసితులను రాత్రికిరాత్రే తరలించారు. సోమవారం కూడా ఎవరూ విమానాశ్రయ పరిసరాలకు వెళ్లొద్దని ఆదేశాలు జారీచేశారు.

త్వరలో భారత్‌కు ఇరాన్ అధ్యక్షుడు

ఇరాన్: ఇరాన్ అధ్యక్షుడు హసన్ రౌహానీ ఈ వారం భారత్‌లో పర్యటించనున్నారు. ఈ విషయాన్ని అక్కడి మీడియా అధికారికంగా ప్రకటించింది. గతంలో నిర్వహించిన సమావేశంలోని కీలక ఒప్పందాలపై చర్చలు నిర్వహించనున్నట్టు అధికారులు తెలిపారు. గతేడాదే తమ దేశానికి రావాలని ప్రధాని నరేంద్రమోడీ, హసన్ రౌహానీని ఆహ్వానించారు. ఇండియా, ఇరాన్ మధ్య కీలకంగా ఉన్న చాబహార్ పోర్టు విషయమై ఇరు దేశాల అధ్యక్షులు చర్చించనున్నారు. డిసెంబర్ లోనే దీన్ని ప్రారంభించారు. ఇరాన్‌కు చెందిన, ఆయిల్ కొనుగోళ్లతో పాటు పలు వ్యాపార పెట్టుబడులు, ద్వైపాక్షిక చర్చలు చేపట్టనున్నారని అక్కడి మీడియా తెలియజేసింది.

పిల్లల సంరక్షణకు రెండేళ్ల సెలవులు

ఎన్నికల బడ్జెట్‌లో వసుంధర రాజే వరాలు

జైపూర్: మహిళా సాధికారతకు మరింత ప్రాధాన్యం ఇస్తున్నట్లు మధ్యప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించింది. బాలికా విద్యకు ప్రోత్సాహం, గ్రామీణ మహిళలకు ఆరోగ్య భద్రత, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగినులకు ప్రత్యేక సెలవుల పెంపు వంటి సంచలన నిర్ణయాలు తీసుకున్నది. ఈ మేరకు సోమవారం ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి వసుంధర రాజె అసెంబ్లీలో ప్రకటన చేశారు. 2018 బడ్జెట్‌లో మహిళా సాధికారతకు ప్రాధాన్యం ఇచ్చామని ఈ సందర్భంగా రాజె వెల్లడించారు. రాష్ట్రప్రభుత్వ పరిధిలోని ఉద్యోగినులకు ఇకమీదట, పిల్లల సంరక్షణ కోసం రెండు సంవత్సరాల పాటు సెలవులు ఇస్తున్నట్లు వసుంధర రాజె ప్రకటించారు. బాలికా విద్య ప్రోత్సాహానికి ఆకర్షణీయ పథకం ప్రవేశ పెట్టారు. ప్రతిభావంతులైన విద్యార్థినులకు ఉచితంగా స్కూటీలు పంపిణీ చేయనున్నారు. 12వ తరగతిలో 85శాతానికి మించి మార్కులు సాధించిన బాలికలకు ఈ పథకం ద్వారా లబ్దిపొందుతారు. రాష్ట్రవ్యాప్తంగా 2000 మంది విద్యార్థినులను స్కూటీ పథకానికి ఎంపిక చేస్తారు. 14 ఐటీఐలలో మహిళలకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు ప్రారంభించనున్నారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు వారంలో మూడు రోజులు గ్లాసు పాలు పంపిణీ చేస్తారు. అదేవిధంగా గ్రామీణ ప్రాంతాల్లో మహిళలకు ఉచితంగా శానిటరీ ప్యాడ్స్‌ను పంపిణీ చేస్తామన్నారు. 15-45 ఏళ్ల వయసు వారికి ఈపథకం ద్వారా లబ్ధి చేకూరుతుందన్నారు. ఇకనామమాత్రపు వేతనాలతో పనిచేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లకు వరాలు ప్రకటించారు. వారి కనీస గౌరవ వేతనం పెంచుతామని హామీ ఇచ్చారు.1.84 లక్షల మంది అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రయోజనం చేకూరుతుంది.

లా విద్యార్థి హత్యపై ఆందోళన



అలహాబాద్: లా విద్యార్థి దిలీప్ సరోజ్‌ను దారుణంగా కొట్టి చంపిన నేపథ్యంలో అలహాబాద్‌లో విద్యార్థులు భారీసంఖ్యలో ఆందోళనకు దిగారు. తమ సహచర విద్యార్థి మృతిపై నిరసన వ్యక్తం చేస్తూ బస్సును తగులబెట్టి తమ ఆందోళన వ్యక్తం చేశారు. ఇరవై ఆరేళ్ల లా విద్యార్థి సరోజ్‌ను ఒకరెస్టారెంట్ వద్ద కొంతమంది వ్యక్తులు తీవ్రంగా కొట్టడంతో మృతిచెందాడు. శనివారం బాధిత విద్యార్థి చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోవటంతో యూనివర్సిటీ విద్యార్థులు ఈ ఘటనపై తీవ్రంగా స్పందించి తమ నిరసన వ్యక్తం చేస్తూ ఆందోళనకు దిగారు. పెద్దగా నినాదాలు చేస్తూ, రాళ్లను రువ్వుతూ భారీ సంఖ్యలో ఆందోళనకు దిగి బస్సుకు నిప్పు పెట్టారు. విద్యార్థి దాడి ఘటనలో నిర్లిప్తంగా వ్యవహరించారని ఆరోపిస్తూ పోలీసు ఉన్నతాధికారులు ఇద్దరు పోలీసులను సస్పెండ్ చేశారు. పెట్రోలింగ్ వ్యాన్ చేరువలోనే ఉన్న విద్యార్థిపై దాడిని నివారించేందుకు వీరు ఎటువంటి చర్యలు తీసుకోలేనందునే వారిని సస్పెండ్ చేశామన్నారు. అలహాబాద్ యూనివర్సిటీ నుంచి భారీ సంఖ్యలో విద్యార్థులు బయటకు వచ్చి ఆందోళనకు దిగారని పోలీసులు తెలిపారు. విద్యార్థి దిలీప్ సరోజ్‌ను హాకీ స్టిక్స్, ఐరన్ రాడ్, ఇటుకలతో విజయ్ శంకర్ సింగ్ అతని సహచరులు దాడిచేయటంతో విద్యార్థి అచేతనావస్థకు చేరిపోయాడు ఈ ఘటనను ఆ ప్రాంతంలో ఉన్న ఒక వ్యక్తి తనదగ్గరున్న ఫోన్‌తో చిత్రీకరించటంతో ఈ వీడియో వైరల్‌గా మారింది. ఈ దాడిలో గాయపడిన విద్యార్థి చికిత్స పొందుతూ శనివారం ఆసుపత్రిలో మరణించాడు. ఈ ఘటనలో ప్రధాన నిందితుడు విజయ్ శంకర్ సింగ్ రైల్వే ఉద్యోగస్థుడని, ఘటన అనంతరం ఇతను పరారయ్యాడని ఇతని కోసం గాలిస్తున్నామని పోలీసులు తెలిపారు. నిందితుడు వారణాసిలో ఉన్నట్టుసమాచారం అందిందని పోలీసులు తెలిపారు.

ప్రేమికుల దినోత్సవంపై నిరసన

చెన్నై: ప్రేమికుల దినోత్సవాన్ని నిరసిస్తూ కొయంబత్తూరులో ఆందోళనకారులు గ్రీటింగ్ కార్డులను తగులబెట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా భారత్ సేన, శక్తిసేన అనే హిందూ సంస్థలకు చెందిన ఆందోళనకారులు మాట్లాడుతూ వాలెంటైన్ డే జరుపుకోవటం ఇండియన్ కల్చర్‌కు విరుద్ధం అన్నారు. పెళ్లయినవారు సైతం బహిరంగంగా ప్రేమికుల దినోత్సవాన్ని జరుపుకొంటే వారిపైన కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భారత్ సేన, శక్తి సేన కార్యకర్తలు ప్రేమికుల దినోత్సవం రోజున మోరల్ పోలీసింగ్ నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు తెలిపారు. భారతీయ సంస్కృతికి విరుద్ధంగా వ్యవహరించేవారిని ఉపేక్షించమని హెచ్చరికలు జారీ చేశారు. కాగా భారతసేన, శక్తిసేన పేరుతో హిందూ సంస్థలను నిర్వహిస్తున్న వీరికి ఏ రాజకీయ పార్టీతోనూ సంబంధం లేదు. వీరంతటివీరే ప్రేమికుల దినోత్సవాన్ని నిరసిస్తూ పార్కులు, బీచ్, దేవాలయాలు, సినిమాహాళ్ల తదితర పబ్లిక్ ప్రాంతాల్లో తిరుగుతూ ప్రేమికుల దినోత్సవానికి వ్యతిరేకంగా ప్రచారంచేస్తున్నారు.

శ్రీనగర్‌లో ఉగ్రదాడి

• సీఆర్పీఎఫ్ క్యాంప్‌పై కాల్పులు

• ప్రతిఘటించిన సెంట్రీ.. గాయాలతో ఆస్పత్రిలో కన్నుమూత

• ఉగ్రదాడిని తిప్పికొట్టిన భద్రత బలగాలు • కొనసాగుతున్న గాలింపు



శ్రీనగర్: జమ్ము నగర శివారులోని సుంజ్వాన్ ఉగ్రదాడి మరువక ముందే శ్రీనగర్‌లో మిలిటెంట్లు మరోసారి మెరుపుదాడి చేశారు.కరణ్ నగర్‌లో సీఆర్పీఎఫ్ క్యాంప్‌పై దాడి చేసేందుకు యత్నిస్తున్న ఉగ్రవాదులను డ్యూటీలో ఉన్న సెంట్రీ పనిగట్టి వెంటనే కాల్పులు జరిపాడు. భారీ ఆయుధాలతో వచ్చిన ఉగ్రవాదులు ఒక్కసారిగా సెంట్రీపై కాల్పుల మోత మోగించడంతో తీవ్రంగా గాయపడిన జవాను ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు విడిచాడు. శ్రీనగర్‌లోని సీఆర్పీఎఫ్ 23వ బెటాలియన్ లక్ష్యంగా దాడులకు యత్నిం చిన ఇద్దరు ఉగ్రవాదులను సెంట్రీ ప్రతిఘ టించడంతో వెంటనే తేరుకున్న బలగాలు ఎదురుకాల్పులు ప్రారంభిం చాయి. ఉగ్రదాడి నేపథ్యంలో ఖాళీ చేసిన భవనం లో తలదాచుకున్న ఉగ్రవాదులు.. పక్కా పథకం ప్రకారమే సీఆర్పీఎఫ్ క్యాంప్ పై దాడి చేసేందుకు సోమవారం తెల్లవారు జామున 4.30 గంటలకు వచ్చినట్లు అధికార ప్రతినిధి తెలిపారు. ఈనెల 6న పోలీస్ కస్టడీ నుంచి మిలిటెంట్ ను తప్పించిన ఎస్ఎంహెచ్ఎస్ ఆస్పత్రి సమీపంలోనే ఉగ్రవాదులు తల దాచుకుని దాడి చేయడం గమనార్హం. అయితే సీఆర్పీఎఫ్ జవాన్‌పై కాల్పులు తమ పనేనని ఉగ్రవాద సంస్థ లష్కరీ తోయిబా ప్రకటించింది.

యుద్ధంకాదు.. చర్చలు జరపండి



పాకిస్తాన్‌తో చర్చలు అవశ్యమని జమ్ముకాశ్మీర్ ముఖ్య మంత్రి మెహ బూబా ముఫ్తీ స్పష్టం చేశారు. భారత్- పాక్ సరి హద్దుల్లో దాడులు పెరు గుతున్న నేపథ్యంలో రెండు దేశాల చర్చల ద్వారానే సమస్యలను పరిష్కరించుకోవాలని విజ్ఞప్తి చేశారు. శనివారం జమ్ము నగర శివారులోని సుంజ్వాన్ సైనిక శిబిరంపై ఉగ్రదాడి, సోమవారం శ్రీనగర్‌లో మిలిటెంట్ల దాడిలో సీఆర్పీఎఫ్ జవాను ప్రాణాలు కోల్పోయిన నేపథ్యంలో ముఫ్తీ తీవ్ర ఆవేదన చెందారు. రెండు దేశాలకు యుద్ధం ఒక్కటే ఆప్షన్ కాదని గుర్తు చెసిన ఆమె.. సరిహద్దుల్లో రక్తప్రవాహం ఆగాలంటే పరస్పర చర్చలు అవసరమైన నొక్కి చెప్పారు. నాకు తెలుసు ఈ వ్యాఖ్యలతో న్యూస్ ఛానల్స్ నాపై కూ డా జాతివ్యతిరేక ముద్ర వేసి యాంకర్లతో వార్తలు చదివిస్తాయి. అయినా పర్వాలేదు. నాకు జమ్ము కాశ్మీర్ ప్రజల క్షేమమే ముఖ్యం. అని ట్వీట్ చేశారు. ఆ తర్వాత అసెంబ్లీలో ముఫ్తీ మాట్లాడుతూ భారత్- పాక్ చర్చలు కోరుకునేవారిని జాతి వ్యతిరేకు లుగా ముద్ర వేస్తున్న మీడియా సంస్థలపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. దురదృష్టవశాత్తు కొన్ని మీడియా సంస్థ లు ఎవరైనా చర్చల ప్రస్తావణ తీసుకురాగానే వారిపై జాతి వ్యతిరేక ముద్ర వేస్తున్నాయి. అని ఆవేదన వ్యక్తం చేశారు.

పాక్ మూల్యం చెల్లించక తప్పదు



సుంజ్వాన్ ఆర్మీ క్యాంప్‌పై ఉగ్రదాడి చేయించిన పాకిస్తాన్ తగిన మూల్యంచెల్లించుకోక తప్పదని రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ హెచ్చరించారు. గాయపడిన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సైనిక కుటుంబీకులను సీతారామన్ పరామర్శించారు. బాధితులకు అండగా ఉంటామని హామీ ఇచ్చిన ఆమె..అమర సైనికుల ఆత్మకు శాంతి చేకూరేలా కృషి చేస్తామన్నారు. ఆ తర్వాత సైనిక అధికారు లతో అత్యున్నత స్థాయి సమావేశం నిర్వహిం చారు. అనంతరం జమ్ము కాశ్మీర్ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీతో భేటీ అయిన రక్షణ మంత్రి తాజా పరిణామలపై చర్చించారు.

పాక్ కొత్త నాటకం

భారత్ సర్జికల్ దాడులు చేయొచ్చని ఆందోళన



ఇస్లామాబాద్: దాయాది దేశం పాకిస్తాన్ మరోసారి కపట బుద్ధిని ప్రదర్శించింది. జమ్ము శివారులోని సుంజ్వాన్ సైనిక శిబిరంపై అత్యాధునిక ఆయుధాలతో దాడులకు విరుచుకు పడిన జైషే మహ్మద్ ఉగ్రవాదులతో తమకు సంబంధమే లేదని మోసపూరిత వ్యాఖ్యలు చేసింది. అంతటితో ఆగక సరిహద్దుల్లో సర్జికల్ లాంటి దాడులకు పాల్పడితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని భారత్‌ను హెచ్చరించింది. సుంజ్వాన్ ఉగ్రదాడి వెనక పాకిస్తాన్ హస్తం ఉందని భారత ఆర్మీ ఆరోపించిన నేపథ్యంలో పాకిస్తాన్ ఈ వ్యాఖ్యలు చేయడం చర్చనీ యాంశమైంది. ఎలాంటి విచారణ జరపకుండా తమపై అభాండాలు మోపడం సరికాదని పాకిస్తాన్ వ్యాఖ్యానించడం పలు అనుమనాలకు తావిస్తోంది. 2016లో కాశ్మీర్‌లోని ఉరి ప్రాంతాల్లో ఉగ్రవాదుల దాడిలో 18 జవాన్లను పొట్టనబెట్టుకున్నందుకు ప్రతీభారత జవాన్లు పాకిస్తాన్‌లోని సరిహద్దును దాటి పాక్ పదుల సంఖ్యలో పాక్ రేంజర్లను హతమార్చారు. నాటి ఉగ్రదాడి వెనక పాక్ హస్తం ఉన్నందునే తమ ప్రదేశంలో ఎలాంటి సర్జికల్ దాడులు జరగలేదని పాక్ అప్పట్లో కప్పిపుచ్చుకున్నా.. తాజాగా జమ్ము నగర శివారులోని ఆర్మీ క్యాంప్ పై ఉగ్రదాడికి ప్రతీగా భారత్ మరోసారి సర్జికల్ దాడులు జరగవచ్చనే అనుమానంతో పాకిస్తాన్ ముందే తమ ఆందోళనను వెల్లగక్కింది. ఈ నేపథ్యంలోనే సరిహద్దు రేఖ దాటి భారత జవాన్లు దాడులకు రావద్దంటూ హెచ్చరికలు జారీ చేసింది. భారత్ అకారణంగా దాడులు చేయడాన్ని అంతర్జాతీయ సమాజం అడ్డుకోవాలి. కాశ్మీర్‌లో అల్లర్లను తగ్గించి.. మానవహక్కులను కాపాడాలి. సరిహద్దు రేఖ వెంబడి ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా చూడాలి అంటూ నీతులు పలికింది. ఉగ్రవాదులకు శిక్షణ ఇచ్చి భారత్ వైపు పంపడంతో పాకిస్తాన్ హస్తం ఉందని అనుమానిస్తున్న మన సైన్యం ముష్కరులను ఎక్కడికక్కడ మట్టుబెట్టేందుకు ఆపరేషన్ కొనసాగిస్తున్నారు. ఉగ్రవాదుల కు అత్యాధునిక ఆయుధాలు సరఫరా చేయడంలోనూ పాక్ హస్తం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్న భారత్ ఎలాంటి ప్రతిఘటనైనా ఎదుర్కొనేందుకు సైన్యాన్ని సిద్ధంచేసింది. ఇప్పటికే ప్రత్యేక కమాండోలు జమ్ము నగర శివారు ప్రాంతాన్ని జల్లెడపడుతున్నారు.

షీలాజీ కలిసి పోరాడుదాం రండి



న్యూఢిల్లీ : వర్గాలుగా విడిపోయిన ఢిల్లీ కాంగ్రెస్ పార్టీని ఏకతాటిపైకి తెచ్చేందుకు ఢిల్లీ కాంగ్రెస్ అధ్యక్షుడు, మాజీ మంత్రి అజయ్ మాకెన్ నడుం బిగించారు. ఆమ్‌ఆద్మీ పార్టీకి చెందిన 20 మంది సభ్యులపై అనర్హత వేటు పడి నందున త్వరలోనే ఢిల్లీ అసెంబ్లీకి ఉప ఎన్నిక లు జరుగనున్నాయి. ఈ ఎన్నికల్లో ఎలాగైనా తమ సత్తా చాటి పూర్వవైభవం పొందాలని కాంగ్రెస్ భావిస్తోంది. ఇందు కోసం గత ఎన్నిక ల్లో పరాభవంతో నైరాశ్యంలో మునిగిపోయిన కేడర్‌ను ఉత్తేజ పరచడానికి, వివిధ గ్రూపు లుగా ఉన్న నాయకులను ఒక్కటిగా చేయడా నికి మాకెన్ రంగంలోకి దిగారు. ఇందులో భాగంగా ఢిల్లీ అభివృద్ధిలో తనదైన ముద్రను వేసిన మాజీ సీఎం షీలా దీక్షిత్‌ను ప్రస న్నం చేసు కోవడానికి ఆయన ప్రయ త్నాలు మొదలు పెట్టారు. ఢిల్లీ కాంగ్రెస్‌లో షీలా వర్గం చాలా ప్రధానమైనది. అందుకే మాకెన్ షీలా దీక్షిత్‌తో చర్చిం చడానికి సమయం అడిగారు. మంగళవారం వీరి భేటీ జరుగుతుంది. ఈ విషయమై షీలా స్పందిస్తూ నేను వ్యక్తులను చూడను.. ఒక కాంగ్రెస్ వాది ఎప్పటికీ కాంగ్రెస్ వాదే. అధికా రంలో ఉన్నా, లేకున్నా పార్టీ కేడర్‌కు నేను ఎప్పుడూ ద్వారాలు తెరిచే ఉంచుతాను. మాకె న్ నన్ను కలవాలని అడిగిన మాట నిజమే. దీనికి అంగీకరించనన్నారు .

ఫేస్‌బుక్, వాట్సాప్‌లకు పోలీసుల లేఖ



న్యూఢిల్లీ : దేశ భద్రతకు సంబంధించిన రహస్యాలను పాకిస్థాన్‌కు చెందిన ఐఎస్ఐ ఏజెంట్లతో పంచుకున్నారనే అభియోగంపై అరెస్ట్ చేయబడ్డ ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ గ్రూప్ కెప్టెన్ అరుణ్ మార్వాకు చెందిన వాట్సాప్, ఫేస్‌బుక్‌ల చాటింగ్‌కు సంబంధించిన సమాచారాన్ని తమకు అందించా లని ఢిల్లీ పోలీసులు ఆ సంస్థలకు లేఖలు రాశారు. అరుణ్ మార్వా ఫేస్‌బుక్ మెసెం జర్, వాట్సాప్ చాట్‌ల ద్వారా అనేక నిగూఢ సమారాన్ని ఐఎస్ఐతో పంచుకు న్నారని పోలీసుల విచారణలో బయటపడ్డది. మరోవైపు మార్వాతో సంప్రదిం పులు జరిపిన ఐఎస్ఐ తెలివిగా టీఓఆర్ అనే సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించింది. ఈ సాఫ్ట్‌వేర్ కంప్యూటర్ ఐపీ అడ్రస్‌ను నేరుగా కాకుండా వివిధ దేశాల నుంచి ఎంచుకున్న వ్యక్తిని చేరుకుంటుంది. ఈ కారణంగా పోలీసు కూడా నిందితులను గుర్తించడానికి తీవ్రంగా శ్రమించాల్సి వస్తోంది. చాటింగ్ సమాచా రాన్ని కొంత వరకూ సేకరించిన పోలీసులు దానిపై విశ్లేషణ జరుపుతున్నారు. మరి కొన్ని చాటింగ్‌లను ఆయన డిలీట్ చేయడంతో డేటా రికవరీ టీంను రంగంలోకి దింపారు.

క్రీడాప్రభ



స్నో బోర్డింగ్‌లో జెమీకి స్వర్ణం

ప్యాంగ్ చాంగ్: ప్రమాదకరమైన మంచుతో కూడిన గాలులను తప్పించుకుని స్లోప్‌స్టైల్ స్నోబోర్డింగ్ క్రీడలో డిఫెండింగ్ ఛాంపియన్ అమెరికాకు చెందిన జెమీ అండర్సన్ తన ఒలింపియన్ టైటిల్‌ను నిలబెట్టుకుంది. సోమవారం జరిగిన ఈ పోటీ ఫైనల్ రన్‌లో 27ఏళ్ల జెమి కెనడాకు చెందిన లారీ బ్లోయిన్‌పై విజయం సాధించింది. కాగా మూడో స్థానంలో ఫిన్లాండ్‌కు చెందిన ఎన్ని రుకాజర్వి కాంస్య పతకంను గెలుపొందింది. బ్రిటన్ క్రీడాకారిణి కేటీ ఒర్మిరోడ్, ఆస్ట్రేలియాకు చెందిన టెస్ కోడీ పోటీల్లో తీవ్రంగా గాయ పడ్డారు. ఈ పోటీలో తీవ్రమైన మంచుతోకూడిన శీతల గాలులును ఎదుర్కొంటూ.. ఇరుకైన మార్గాలను దాటుతూ మంచు రాళ్లపై నుంచి దూకాల్సి ఉంటుంది. ఇవ్వన్నీ దాటుకుని లక్ష్యాన్ని అందరికంటే ముందు చేరుకున్న ముగ్గురికి పతకాలు దక్కుతాయి. స్వర్ణ పతక విజేత తృటిలో ప్రమాదాలను తప్పించుకుంటూ తన లక్ష్యాన్ని చేరి టైటిల్‌ను సాధించింది. తీవ్రమైన గాలుల కారణంగా ఫైనల్ రన్ గంట ఆలస్యంగా ప్రారంభమైంది. రన్ సాగుతున్నప్పుడు పలువురు క్రీడాకారిణులు అవాంతరాలు ఎదుర్కొన్నారు. అండర్సన్, బ్లోయిన్‌లు బ్లాక్ ఐ అనే సమస్యకు గురయ్యారు.

ఫిగర్ స్కేటింగ్‌లో కెనడాకు స్వర్ణం



గ్యాంన్యూంజ్: ఐస్ డ్యాన్సింగ్ స్టార్స్ టస్సా విర్ట్యూ, స్కాట్ మొయిర్ అద్భుత విన్యాసాలతో కెనడా జట్టు ఫిగర్ స్కేటింగ్‌లో స్వర్ణ పతకంను గెలిచింది. సోమవారం జరిగిన హెవీ వెయిట్స్ ఫిగర్ స్కేటింగ్ పోటీలో కెనడా జట్టు స్వర్ణాన్ని గెలుపొందగా, ఈవజెనియా మెద్వేదెవా, అలినా జగితోవాలతోకూడిన రష్యా జట్టు రజత పతకంను, అమెరికా జట్టు కాంస్య పతకంను గెలుపొందాయి. 2014 సోచి శీతాకాల ఒలింపిక్స్‌లో కెనడా జట్టు రజత పతకంను గెలిచి ఈ సారీ రష్యా అథ్లెట్లను ఓడించి స్వర్ణాన్ని కైవసం చేసుకుంది. కెనడా జట్టులోని చాన్ పురుషుల షార్ట్ గేమ్‌లో నిరాశ పర్చినప్పటికి శుక్రవారం జరిగిన మహిళల షార్ట్ గేమ్‌లో విర్ట్యూ, మొయిర్‌లు గేమ్‌లో ఆధిక్యతను ప్రదర్శించారు. మౌలిన్ రోగ్ మ్యూజిక్‌లో వీరు అద్భుత విన్యాసాలతోకూడిన నాట్యంను ప్రదర్శించి 10 పాయింట్లు తమ జట్టుకు సంపాదించి పెట్టారు. కెనడా ఓవరాల్‌గా 73 పాయింట్లు సాధించగా, ఓఎఆర్(రష్యా) 66 పాయింట్లు, అమెరికా 62 పాయింట్లు సాధించి పతకాలు గెలుపొందాయి. మూడు సార్లు ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచిన చాన్ తాము ముందే స్వర్ణంకోసం పూర్తి స్థాయిలో సన్నద్ధమై వచ్చామన్నారు. ఇటలీ నాలుగవ స్థానంలో, జపాన్ ఐదవ స్థానంలో నిలిచాయి.


ఏటా ఐస్ క్రికెట్ టోర్నీ!



న్యూఢిల్లీ: ఇటీవల స్విట్జర్లాండ్‌లో నిర్వహించిన సెయింట్ మోర్టిజ్ ఐస్ క్రికెట్ టోర్నమెంట్ విజయవంతం కావడంతో ఈ క్రీడను ప్రతీ సంవత్సరం నిర్వహించేందుకు ప్రమోటర్లు ముందుకు వస్తున్నారు. స్విట్జర్లాండ్‌లో సెటిల్ అయిన భారత సంతతికి చెందిన ప్రమోటర్లు అఖిలేష్ బహుగుణ, విజయ్ సింగ్ ఈ మేరకు తమ నిర్ణయాలను మీడియాకు వెల్లడించారు. స్విట్జర్లాండ్‌లో ఐస్ క్రికెట్ టోర్నీ ముగింపు కార్యక్రమం అనంతరం సింగ్ మీడియాతో మాట్లాడుతూ.. 'కొత్త ఫార్మాట్ ఐస్ క్రికెట్‌కు మంచి ఆధరణ వచ్చింది. ప్రపంచ వ్యాప్తంగా ప్రముఖ క్రికెటర్లు ఇందులో పాల్గొన్నందుకు మాకు సంతోషంగా ఉంది. ఈ టోర్నీని ప్రతీ ఏడాది నిర్వహించడమే మా లక్ష్యం. మూడు మ్యాచ్‌ల సిరీస్‌గా ఇది జరపాలని మేము అనుకుంటున్నాం' అని చెప్పారు. బహుగుణ మాట్లాడుతూ.. 'ఐస్ క్రికెట్ ప్రతిపాధనను తొలుత సెహ్వాగ్ అంగీకరించాడు. అయితే ఎటువంటి షూలను ధరించాలన్న దానిపై కొంచెం సందిగ్ధత ఏర్పడింది. తర్వాత అదికూడా నిర్ణయమయింది. వీకెండ్‌లో ఈ టోర్నీని ఏర్పాటు చేయడానికి నిర్ణయించాము. వీకెండ్‌లో ఐస్‌హార్స్ రేసింగ్‌లో ఇక్కడి స్థానికులు పాల్గొంటుంటారు. దాదాపుగా 5వేలమంది ఈ ఆటలో పాల్గొంటారు. ఐస్ క్రికెట్‌ను ఆ సమయంలో నిర్వహిస్తే వారిని ఆకట్టుకోవచ్చని వీకెండ్‌లలో మ్యాచ్‌లు ఆడాలని నిర్ణియించాము' అని తెలిపారు. శీతాకాల ఒలింపిక్స్‌లో ఐస్ క్రికెట్ టీ10ను ప్రవేశపెట్టేందుకు ఇంకా చాలా కాలం పడుతుంది. ఏమైనా ఏటా ఈ టోర్నీని ఏర్పాటుచేసి ప్రజల ఆదరణ పొందితే ఒలింపిక్స్‌లో ఈ క్రీడకు చోటు లభించే అవకాశాలు పెరుగుతా యని బహుగుణ చెప్పారు.

తేల్చుకుందాం

• ఐదో వన్డేకు భారత్, సఫారీలు రెడీ
• పిచ్ స్పిన్నర్లకే అనుకూలం!



నాల్గో వన్డేలో ఎదురైన పరాభవానికి బదులు తీర్చుకోవడానికి కోహ్లీ సేన కదం తొక్కుతోంది. సెయింట్ జార్జి పార్క్ మైదానం గతంలో స్పిన్నర్లకు అనుకూలించిన చరిత్రను కలిగివున్న నేపథ్యంలో ఇది మన స్పిన్నర్లకు అనుకూలాంశం. అయితే ఈ మైదానంలో భారత్ ఇప ్పటివరకు ఆడిన 5 వన్డేల్లో ఓడింది. నేడు జరుగుతున్న వన్డేలో గెలిచి భారత్ ఇక ్కడ తొలివిజయంను నమోదు చేసి సిరీస్ చేజిక్కించుక ుంటుదని ఆశిద్దాం

పోర్ట్ ఎలిజబెత్: దక్షిణాఫ్రికాతో నాలుగో వన్డేలో ఓటమి నుంచి భారత్ కోలుకొని ఐదో మ్యాచ్‌కు సన్నద్ధం అవుతోంది. వరుసగా మూడు మ్యాచ్ వన్డేలు గెలిచి ఊపుమీదున్న భారత్‌కు జొహన్నెస్‌బర్గ్ పింక్ వన్డే చేదు అనుభవాన్ని మిగల్చింది. అయితే భారత కెప్టెన్ కోహ్లీ మాత్రం ఫలితాన్ని పాజిటివ్‌గా తీసుకొని తన స్పోర్టివ్‌నెస్‌ను చాటాడు. వాళ్లు భాగా ఆడారు గెలిచారని పేర్కొన్నాడు. నేడు జరుగనున్న పోర్ట్ ఎలిజబెత్ వన్డేలో భారత్ తన ఆటతీరును సమీక్షించుకొని చారిత్రాత్మక విజయానికి సిద్ధమవుతుందనటంలో ఎలాంటి సందేహం లేదు. ఆరు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 3-1 ఆధిక్యంలో ఉంది. డర్బన్‌లో జరిగిన తొలి వన్డేలో భారత్ ఆరు వికెట్ల తేడాతో విజయం సాధించగా, సెంచూరియన్ వన్డేలో 9 వికెట్ల తేడాతో విజయం సాధించింది. కేప్‌టౌన్‌లో జరిగిన మూడో వన్డేలో భారత్ 124 పరుగుల ఆధిక్యంతో గెలుపొందింది. జొహన్నెస్‌బర్గ్‌లో జరిగిన నాలుగు వన్డేలో దక్షిణాఫ్రికా 5 వికెట్ల తేడాతో విజయం సాధించి భారత్ విజయాలకు బ్రేక్ వేసింది. అయినప్పటికి.. మిగిలిన రెండు వన్డేల్లో ఒక్క మ్యాచ్ గెలిస్తే చాలు.. దక్షిణాఫ్రికాపై ఆదేశంలోనే సిరీస్ తొలిసారి గెలిచిన రికార్డు కోహ్లీ సేన సొంతమవుతుంది.

మణికట్టు స్పిన్నర్ల గుట్టు పసిగట్టారా?



తొలి మూడు వన్డేల్లో భారత స్పిన్నర్లకు దాసోహమన్న సఫారీలు నాలుగో వన్డేలో స్పిన్నర్ల బౌలింగ్‌ను చితకొట్టారు. అయితే ఇది వర్షం వల్ల పిచ్‌లో వచ్చిన మార్పు ప్రభావమే అని కోహ్లీతో సహ కొంతమంది పరిశీలకులు అంటు న్నారు. ఇంకా చెప్పాలంటే.. వర్షం కారణంగా ఓవర్లు కుదించి లక్ష్యాన్ని తగ్గించడం కూడా సఫారీలు తెగబడటానికి అవకాశం దొరికింది. డివిల్లియర్స్ తొందరగా అవుటయి నప్పటికీ.. దక్షిణాఫ్రికా తొట్రుపాటుకు గురికాకుండా నిలదొక్కకుంది. సఫారీలు మ్యాచ్‌ను టీ20ను తలపింపచేశారు. ముఖ్యంగా మిల్లర్స్, క్లాసెన్ భారత స్పిన్నర్లు యుజువేంద్ర చాహల్, కుల్దీప్ యాదవ్‌లను ఎదుర్కొన్న తీరు వీక్షకులను ఆకట్టుకుంది. మరోవైపు పిచ్ కూడా బ్యాటింగ్‌కు అనుకూలించేదే కావటం వారికి అదనపు అనుకూలాంశంగా మారింది. అయితే మిల్లర్స్ ఇచ్చిన క్యాచ్‌ను భారత ఆటగాడు శ్రేయాస్ వదిలివేయడం.. వంటి ఘటనలు జరిగినప్పటికి మొత్తానికి మ్యాచ్ ఓటమికి వర్షమే కారణమని పలువురు అంటున్నారు. ఏమైనప్పటికి దక్షిణాఫ్రికా బ్యాట్స్‌మన్లు భారత స్పిన్నర్లను విజయవంతంగా ఎదుర్కొన్నారు. ఇక పేస్ బౌలర్లు భువనేశ్వర్ కుమార్, జస్ప్రీత్ బుమ్రాలను కోహ్లీ తగిన విధంగా ఉపయోగించకపోవడంతో కోహ్లీని పలువురు సీనియర్ క్రికెటర్లు విమర్శించారు. ముఖ్యంగా చివరి రెండు ఓవర్లు వారితో వేయించాల్సిందని వారు అభిప్రాయపడ్డారు. అప్పటికే దక్షిణాఫ్రికా బ్యాట్స్‌మన్లు స్పిన్నర్లను లెక్కచేయకున్నప్పటికి.. చివరి ఓవర్లను కూడా వారికే అప్పగించటంతో సఫారీల విజయం ఖాయమైంది. ఈ నేపథ్యంలో పోర్ట్ ఎలిజబెత్ వన్డేలో ఆడనున్న భారత ఆటగాళ్లలో ఏమైనా మార్పులు జరిగే అవకాశముండవచ్చు. మరోపక్క కేప్‌టౌన్ వన్డేలో గాయపడ్డ కేదార్ జాదవ్ జొహన్నెస్‌బర్గ్ వన్డేకు దూరమయ్యాడు.

పార్ట్ టైం బౌలర్లు గట్టెక్కిస్తారా..

కేదార్ జాదవ్ లోటు పూడ్చడంలో హార్దిక్ పాండ్యా కొంత వరకు సఫలీకృతం అయ్యాడు. పాండ్యా 5 ఓవర్లు వేసి 37 పరుగులు ఇచ్చి ఒక వికెట్ తీశాడు. జాదవ్ స్లో స్పిన్ వేస్తూ.. చాహల్, యాదవ్‌లను తలపింపజేసేవాడు. రోహిత్ శర్మ వన్డేల్లో బౌలింగ్ వేసి దాదాపుగా ఏడాది దాటిపోయింది. 2016 జనవరిలో పెర్త్‌లో జరిగిన వన్డేలో రోహిత్ బౌలింగ్ చేశాడు. శ్రేయాస్ అయ్యర్ లెగ్ బ్రేక్ ప్రాక్టీస్ చేస్తున్నాడు. శ్రీలంకతో జరిగిన సిరీస్‌లో ఒక ఓవర్ బౌలింగ్ చేశాడు. అయితే వీరు జాదవ్ పోషించిన పాత్రక ు ప్రత్యామ్నాయం కాదని కెప్టెన్ కోహ్లీతోపాటు పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. కోహ్లీ కూడా బౌలింగ్ చేయగలడు. కాని అది సీమ్ బౌలింగ్ సీమర్లు మన జట్టులో ఎక్కువమందే ఉన్నారు కాబట్టి కోహ్లీ బౌలింగ్‌కు ఇప్పట్లో అంతగా ప్రాధాన్యం లేదని చెప్పవచ్చు. మొత్తానికి జాదవ్ లేకపోవడంతో భారత్ మిడిలార్డర్‌లో సమతూకం లోపించిందని పరిశీలకులు అంటున్నారు. అంత కంటే ఎక్కువగా బౌలింగ్‌లో కూడా జాదవ్ లేని లోటు కన్పిస్తోందని అంటున్నారు. అంజిక్యా రహానే, నెం.4 బ్యాట్స్‌మన్‌గా దిగి తొలి వన్డేలో 79 సాధించి అనంతరం విఫలమయ్యాడు. పాండ్యా మూడో వన్డేలో కేవలం 14, నాలుగో వన్డేలో 9 పరుగుల మాత్రమే చేశాడు. తొలి రెండు వన్డేల్లో బ్యాటింగ్‌కు ఆయనకు అవకాశం రాలేదు. ధోనీ నాలుగో వన్డేలో చేసిన 42 పరుగులు భారత్‌కు చెప్పుకోదగ్గ స్కోరును సాధించడంలో తోడ్పడ్డాయి. ఈ వన్డే సిరీస్ లో రోహిత్ శర్మ విఫలమవుతు న్నప్పటికి నాలుగు వన్డేల్లో కొనసాగాడు. నాలుగు వన్డేల్లో రోహిత్ చేసిన పరుగులు 40. దీనితో దక్షిణాఫ్రికాలో రోహిత్ ఆడిన 12 మ్యాచ్‌ల్లో సగటు 11.45కు క్షీణించింది. కోహ్లీ, ధావన్‌లు భాగా రాణిస్తుండటంతో సఫారీలు వీరిని త్వరగా ఔట్‌చేయటంపై దృష్టి పెడుతుం దనటంలో ఎలాంటి సందేహం లేదు. నాలుగు వన్డేల్లో కోహ్లీ 393, ధావన్ 271 పరుగులు చేయగా, మిగతా బ్యాట్స్‌మన్లంతా కలిసి 239 పరుగులు చేశారు. ఇది ఆందోళన కలిగించే విషయం.





సా. 4.30 గం. నుంచి సోనీ టెన్ 1, 2, 3 ఛానెల్లలో ప్రత్యక్షప్రసారం

జట్లు:

భారత్: విరాట్ కోహ్లీ(కెప్టెన్), శిఖర్ ధావన్, రోహిత్ శర్మ, ఆజింక్యా రహానే, ఎంఎస్ ధోనీ(వికెట్ కీపర్) కేదార్ జాదవ్, హార్దిక్ పాండ్యా, భువనేశ్వర్ కుమార్, కులదీప్ యాదవ్, యుజువేంద్ర చాహల్, జస్‌ప్రీత్ బుమ్రా, మనీష్ పాండే, దినేష్ కార్తీక్, శ్రేయాస్ అయ్యర్, అక్సర్ పటేల్, మహ్మద్ షమీ, శార్దూల్ ఠాకూర్,

దక్షిణాఫ్రికా: ఏడెన్ మర్‌క్రం(కెప్టెన్), హెయిన్‌రిచ్ క్లాసెన్(వికెట్ కీపర్), హషీం ఆమ్లా, జెపి డుమిని, డేవిడ్ మిల్లర్, క్రిస్ మోరిస్, కగిసో రబాడా, మోర్నీ మోర్కెల్, ఇమ్రాన్ తాహిర్, తాబారిజ్ శంసీ, ఆండిలె పెహ్లుక్‌వాయో, లుంగిసాని ఎన్గిడి, ఫర్హాన్ బెహర్దీన్, ఖాయా జొండో, ఎబి డివిల్లియర్స్

సెయింట్ జార్జి పార్క్ మైదానం స్పిన్నర్లకు అనుకూలమే !

పోర్ట్ ఎలిజబెత్‌లోని సెయింట్ జార్జి పార్క్ మైదానం స్పిన్నర్లకు అనుకూలించిన చరిత్రను కలిగివుంది. 2017 జనవరిలో ఇక్కడ శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌లో ఇమ్రాన్ తాహిర్ 26 పరుగులిచ్చి 3 వికెట్లు తీశాడు. 2016 అక్టోబర్‌లో అస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌లో తాబారిజ్ షామ్సి 36 పరుగులకు 3 వికెట్లు తీశాడు. సఫారీల సెంకడ్ స్పిన్నర్ అరోన్ ఫాంగిసా కూడా 17 పరుగులకు 2 వికెట్లు ఇక్కడ తీశాడు. దక్షిణాఫ్రికా ఇక్కడ 32 మ్యాచ్‌లాడగా 11 మ్యాచ్‌ల్లో ఓడింది. ఇక్కడ భారత్ రికార్డు ఇక్కడ ఏమాత్రం బాగలేదు.
1992 నుంచి చూస్తే... ఇక్కడ ఆడిన 5 వన్డేల్లో భారత్ ఓటమి చవిచూసింది. వీటిలో నాలుగు దక్షిణాఫ్రికా చేతిలో ఓడగా మరో మ్యాచ్ కెన్యా చేతిలో పరాజయం పాలైంది. ఈ మైదానంలో భారత్ ఇప్పటివరకు 200 స్కోరును చేయలేకపోయింది. దక్షిణాఫ్రికాపై చేసిన అత్యధిక పరుగులు 176 మాత్రమే. మొత్తానికి నేటి మ్యాచ్ స్పిన్నర్లకు అనుకూలిస్తుందని అనుకోవచ్చు. చాహల్, యాదవ్‌లు పుంజుకొని సఫారీల బ్యాట్స్‌మన్లను కట్టడి చేస్తారో లేదో వేచిచూద్దాం.



టీ20 కెప్టెన్‌గా హర్మన్‌ప్రీత్ కౌర్

నేడు తొలి మ్యాచ్

పొట్చెఫ్‌స్ట్రూమ్: దక్షిణాఫ్రికాపై వన్డే సిరీస్‌ను 2-1 తేడాతో గెలుచుకున్న భారత్ నేడు ఐదు టీ20 సిరీస్‌లో భాగంగా తొలి మ్యాచ్ ఆడనుంది. తొలి రెండు వన్డేల్లో భారత్ విజయం సాధించగా చివరి వన్డేలో దక్షిణాఫ్రికా జట్టు గెలిచి భారత్‌కు సవాలు విసిరింది. ఈ ఓటమి భారత జట్టును కుదిపేసింది. తొలి వన్డేలో 88 పరుగుల తేడాతో, రెండో వన్డేలో 178 పరుగుల తేడాతో గెలిచిన విషయం తెలిసిందే. అయితే టీ20లకు హర్మీత్‌ప్రీత్ కౌర్ జట్టుకు నాయకత్వం వహిస్తున్నది. అంతేకాక జట్టు సభ్యుల్లో కూడా మార్పులు చోటుచేసుకున్నాయి. కౌర్‌కు అండగా స్మృతి మంధాన ఉండనుంది. టీ 20 స్పెషలిస్ట్ అంజు పాటిల్, ఆల్‌రౌండర్ రాధాయాదవ్, వికెట్ కీపర్ నూజత్ ప్రవీణ్ జట్టులోకి వచ్చారు. అంతేకాక, 17 ఏళ్ల ముంబై క్రీడాకారిణి జెమిమా రోడ్రిగ్స్ కూడా జట్టులో చేరారు. ఈమె అండర్ 19 పోటీలో 163 బంతుల్లో 202 పరుగులు చేసింది. మంధాన, దీప్తి వర్మ, వేద కృష్ణమూర్తి జట్టులో తమ స్థానాలను కాపాడుకొన్నారు. మొత్తానికి చూస్తే భారత జట్టు సామర్థ్యం స్కిప్పర్ కౌర్, మిథాలిరాజ్ ఆటపైనే ఎక్కువగా ఆధారపడిఉన్నది చెప్పవచ్చు. బౌలింగ్ పరంగా చూస్తే.. మూడో వన్డేలో ఆడని వెటరన్ జులన్ గోస్వామి టీ20లోకి వచ్చే అవకాశముంది.

భారత జట్టు: హర్మన్‌ప్రీత్ కౌర్(కెప్టెన్) స్మృతి మంధాన(వైస్ కెప్టెన్), మిథాలి రాజ్, వేద కృష్ణమూర్తి, జెమిమాహ్ రోడ్రిగ్స్, దీప్తి శర్మ, అంజు పాటిల్, తానియా భాటియా, నుజత్ ప్రవీణ్, పూనం యాదవ్, రాజేశ్వరి గ్వైక్వాడ్, జులన్ గోస్వామి, శిఖా పాండే, పూజా వస్త్రాకర్, రాదా యాదవ్.

ఫెడరేషన్ కప్ కబడ్డీ ఛాంపియన్ షిప్

సెమీఫైనల్లో మహారాష్ట్ర, హర్యానా

ముంబై: ఫెడరేషన్ కప్ కబడ్డీ ఛాంపియన్‌షిప్ టోర్నీలో జాతీయ ఛాంపియన్ మహారాష్ట్ర తన జైత్ర యాత్రను కొనసాగిస్తోంది. సోమవారం జరిగిన మ్యాచ్‌లో మహారాష్ట్ర జట్టు హర్యానాపై 32-24 తేడాతో విజయం సాధించింది. విశాల్ మానే మహారాష్ట్రజట్టుకు తొలి పాయింట్‌ను అందించాడు. హర్యానా రైడర్ ను పట్టుకొని ఈ పాయింట్‌ను అందించాడు. తొలి అర్థ భాగం సమయంలో హర్యానాను ఆలౌట్ చేసి 20-10 ఆధిక్యంను సాధించింది. బ్రేక్ తర్వాత, హర్యానా డిఫెన్సివ్ ఆటగాల్లు మానె ఆరు పాయింట్లు, కృష్ణమద్నే, విరాజ్ లాండ్జేలు కొంతవరకు ప్రత్యర్థులకు ఇబ్బందులకు గురిచేశారు. మహారాష్ట్రకు చెందిన తుషార్ పాటిల్ ఒక్కడే 17 రైడ్లలో 11 పాయింట్లు సాధించాడు. నీలేష్ సాల్యుంకె 7పాయింట్లు తెచ్చాడు. కాగా, హర్యానా, మహారాష్ట్ర జట్లు ఇప్పటికే సెమీఫైనల్లోకి ప్రవేశించాయి. సెమీస్‌లో మహారాష్ట్ర జట్టు కర్నాటకను ఢీకొన నుండగా, హర్యానా జట్టు సర్వీసెస్‌తో తలపడనుంది.

మహిళా విభాగంలో..

మహారాష్ట్ర మహిళల జట్టు గ్రూప్ దశలోనే వెనుదిరిగింది. ఇండియన్ రైల్వేస్‌పై 47-24 తేడాతో ఓడింది. రెండో మ్యాచ్‌లో హర్యానా చేతిలో పరాజయం పాలైంది. ఫైనల్లో స్థానం కోసం, రైల్వేస్ జట్టు సెమీస్‌లో పంజాబ్‌తో తలపడనుంది. పంజాబ్ రణదీప్ కౌర్ నేతృత్వంలో ఛత్తీస్‌గఢ్‌ను 34-28 తేడాతో ఓడించింది. కౌర్ 23 రైడ్లలో 18 పాయింట్లు సాధించి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించింది. మరో సెమీస్‌లో హర్యానా మహిళల జట్టు హిమాచల్ ప్రదేశ్‌పై 38-13 పాయింట్ల తేడాతో మట్టికరిపించి సెమీస్‌కు చేరింది.



Printed & Published by **MOOTHA GOUTAM** on behalf of Andhra Prabha Publications Ltd., and printed at Andhra Prabha Publications Ltd., 13-6-445/a/b1, Konejeti Enclave, Mehdhipatnam, Hyderabad-500028. Published from Andhra Prabha Publications Ltd., 8-2-293/82/A/75, Plot No.75, Road No.9, Jubilee Hills, Hyderabad-500033. Phones: 23559940/41/42/45, Fax No.23558812. Editor: Y S R Sarma, Responsible for News selection under PRB ACT. RNI Regd.No.32178/1977.

lifepage2012@gmail.com

ఆంధ్రప్రభ

లైఫ్ I

మంగళవారం 13 ఫిబ్రవరి 2018

శంభో!... శివశంభో!!

చెంబెడు నీళ్లు పోసినా....చిటికెడు బూడిద రాసినా.... ఉట్టి పుణ్యానికే మోక్షమిస్తవ్....శబ్బాసురా శంకరా!..అని తనికెళ్ల భరణి అన్నట్లు.. మొక్కితే చాలు అసురులకు సైతం వరాలిచ్చి....తన ప్రాణాలమీదికే తెచ్చుకునేంత బోళాశంకరుడు.. శివుడు! సకలపాప హరుడు...సర్వేశ్వరుడు! ఆయన ప్రసన్నం కోసం ..నమకచమకాలు చదవాల్సిన, పూజలు పునస్కారాలు చేయాల్సిన పనిలేదు... ఎందుకంటే ఆయన కాళహస్తీశ్వరుడు. అలాంటి సృష్టిస్థితి,లయకారునికి మహా ప్రీతి పాత్రమైన రోజు మహా శివరాత్రి. ఈ పర్వదినాన పార్వతీపతిని మనసారా స్మరిస్తే చాలు....ఇట్టే మోక్షం ప్రసాదిస్తాడు. అందుకే శైవ క్షేత్రాలలో శివుని మహిమకు ప్రతీకగా నిలిచే విశేషాల గురించి తెలుసుకుందాం!

శ్రీశైలంలో పాగాలంకరణ!

శ్రీశైల శిఖర దర్శనం సకలపాపహరణం... అంతేకాదు ఈ శిఖర దర్శనంతో పునర్జన్మ ఉండదంటారు. ఇక్కడి పార్వతీ సతిని కన్నడిగులు.. తమ ఆడపడుచుగా ఆరాధిస్తారు. మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించే పాగాలంకరణ కార్యక్రమం ఈ క్షేత్ర ప్రత్యేకత. ఈ పాగాలంకరణ కార్యక్రమం మరే శైవక్షేత్రంలో జరుగదు. గర్భాలయ శిఖర కలశాన్ని..నవ నందులను కలుపుతూ పాగాలంకరణ కార్యక్రమం అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తారు. శివరాత్రి రోజు శివపార్వతుల కళ్యాణానికి ముందు ఈ కార్యక్రమం జరుగుతుంది. ప్రకాశం జిల్లా చీరాల మండలం హస్తినాపురం గ్రామానికి చెందిన పృథ్వి వెంకటేశ్వర్లు ..ఏడాది పొడుగునా.. రోజుకు మూర చొప్పు పాగాలంకరణకు వినియోగించే వస్త్రాన్ని నేస్తారు. తాను నేసిన 150 గజాల వస్త్రాన్ని తీసుకుని వెంకటేశ్వర్లు కాలినడకన శ్రీశైలం చేరుకుంటారు. కార్యక్రమానికి ముందు ఆలయంలో పూజలు నిర్వహిస్తారు. అనంతరం వెంకటేశ్వర్లు దిగంబరంగా పాగాలంకరణ కావిస్తారు. ఆసమయంలో గుడిలో లైట్లు తీసివేస్తారు. చిమ్మ చీకట్లో జరిగే ఈ కార్యక్రమాన్ని చూసే అవకాశంలేకున్నా... భక్తులు మాత్రం ఆలయ గోపురం వైపు చూస్తూ దిక్కులు పిక్కటిల్లేలా శివనామ స్మరణ చేస్తారు.



మహానందీశ్వరుని మహిమ!

ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లాలో వెలసిన పవిత్రశైవక్షేత్రం మహానంది ..ఈ పేరు వినగానే మనకు గుర్తొచ్చేది కోనేరు. ఈ కోనేటిలోని నీరు... గుండు సూది వేసినా కనిపించేంత స్వచ్ఛం గా ఉంటుంది. అది 365 రోజుల ఒకే మట్టంలో ఉండడం స్వామి మహిమకు నిదర్శనమని భక్తులు నమ్ముతారు. మరి అంతటి స్వచ్ఛమైన నీరు పుష్కరిణిలోకి ఎక్కడ నుంచి వస్తుంది? సహజంగా గంగమ్మ శివుని తలమీద ఉంటుంది. ఇక్కడ మాత్రం గంగమ్మ శివలింగం అడుగు భాగం నుంచి పుష్కరిణిలోకి ప్రవహిస్తుంది. ఈ శివలింగం కింద ఐదు నీటి ఊటలు ఉన్నాయని చెబుతారు. స్వామి దర్శనం చేసుకునే భక్తులకు కనిపించేది కాని ...ఎత్తుగా కాకుండా అణిగినట్లు.. తప్పటగా కనిపించే శివలింగానికి మధ్యలో ఓ రంధ్రం ఉంటుంది. అందులో చేయిపెట్టి చూస్తే శివలింగం అడుగు భాగంలో వెచ్చని నీరు చేతికి తగులుతుంది.



కాకులు కనిపించని యాగంటి క్షేత్రం!

వీరబ్రహ్మేంద్రస్వామి కాలజ్ఞానంతో ముడిపడిన శైవక్షేత్రం యాగంటి. కర్నూలు జిల్లా బనగానపల్లె సమీపంలో ఉంది. ఎర్రమల అటవీ ప్రాంతంలో పర్వతసానువు ప్రాంతంలో ఉన్న ఈ క్షేత్రంలోని నంది విగ్రహం ఏటేటా పెరుగుతుంది. ఈ విషయాన్ని పురావస్తుశాఖ నిర్ధారించింది. అంతకంతకు పెరిగి యాగంటి బసవన్న కలియుగాంతమున రంకె వేస్తాడని కాలజ్ఞానంలో బ్రహ్మంగారు చెప్పింది ఈ నందీశ్వరుని గురించే. ఇక్కడి మరో ప్రత్యేకత ఏంటంటే..ఈ క్షేత్రంలో ఎక్కడా మనకు కాకి సంచారం ఉండదు. ఇక్కడ తపస్సుచేసిన ఓ మునీశ్వరుని శాపఫలి తంగా ఇక్కడ కాకులు సంచరించవని స్థలపురాణం చెబుతోంది. ఏదేమైనప్పటికి ఇక్కడ కాకులు కనిపించక పోవడం కూడా క్షేత్ర ప్రాశస్త్యానికి నిదర్శనం.



శీర్షాసనంలో పరమేశ్వరుడు...!



శైవక్షేత్రాల్లో పరమశివుడు లింగాకారంలో దర్శనం ఇస్తాడు. విగ్రహ రూపంలో దర్శనం ఇచ్చే శివాలయాలు అరుదు. అటువుంటిది లింగంపై తలకిందులుగా తపస్సు చేస్తూ దర్శనం ఇచ్చే పరమేశ్వరున్ని ఎక్కడైనా చూశారా? ప్రపంచంలోఎక్కడా చూసి ఉండరు. కాని తలకిందులుగా తపస్సుచేస్తూ భక్తులకు దర్శనమిచ్చే శివున్ని... పశ్చిమ గోదావరి జిల్లాలోని యనమదుర్రు గ్రామంలో చూడవచ్చు. ఇక్కడి శక్తీశ్వరాలయంలో పరమశివుడు శీర్షాసనంలో అపురూపంగా శివలింగంపై దర్శనమిస్తాడు. ఈ ఆలయంలో శివుడు,పార్వతీదేవి, సుబ్రహ్మమణ్యస్వామి ఒకే పానవట్టం మీద ఉండడం ఇక్కడి మరో ప్రత్యేకత. పార్వతి ఒడిలో పసికందుగా బాల సుబ్రహ్మణ్యస్వామి కొలువై ఉండడం మరో విశేషం.

నందీశ్వరా..కానరావేల!

మనం ప్రపంచంలో ఏ శివాలయంలోకి వెళ్లినా మొదట దర్శనమిచ్చేది నందీశ్వరుడే! నంది విగ్రహంలేని శివాలయం ఉండడం ఓ వింతే. కాని నంది విగ్రహం లేని శివాలయం మరెక్కడో లేదు. ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లా అమరాపురం మండలం,హేమావతి గ్రామంలో ఉంది. ఇక్కడ కొలువైన స్వామి సిద్దేశ్వరుడు. ఈ సిద్దేశ్వరాలయంలో నంది విగ్రహం ఉండదు. బోళాశంకరుడైన శివుడు ఇక్కడ ఉగ్రరూపుడు కావడం మరో విశేషం. ..బైటికి బండబూతివి...అర్థంకాని లోలోతివి...కరిగే రాతివి పరంజ్యోతివి... శబ్బాసురా శంకరా..! అని తనికెళ్లభరణిగారు స్తుతించినట్లు ఆ పరమశివుని మహిమలు తెలుసుకోవడం ఎవరితరం! అందుకే పరమ పవిత్రమైన మహా శివరాత్రి పర్వదినాన ..ఆయనను మనసారా స్మరించుకుందాం!



జ్యోతిర్లింగ స్వరూపం...రుద్రకోటీశ్వరం!



కర్నూలు జిల్లా ఆత్మకూరు పరిధిలోని నల్లమల అటవీ ప్రాంతంలో ఉన్న రుద్రకోటీశ్వరాలయం చాలా పవిత్రమైంది. గతంలో సరైన విద్యుత్ సౌకర్యం లేనికారణంగా ఇక్కడకు పౌర్ణమి రోజు మాత్రమే భక్తులు వెళ్లి స్వామి దర్శనం చేసుకుని రాత్రి జాగారం చేసేవారు. ఇప్పుడు సౌకర్యాలు మెరుగు పడ్డాయి. ఇక్కడి శివుడు జ్యోతిర్లింగ స్వరూపుడు. భక్తులు నిష్టగా జాగారం చేస్తే,..దేవాలయం గోపురం మీద రాత్రి వేళ లింగాకారంలో జ్యోతిని దర్శించుకోవచ్చని స్థానికులు చెబుతారు. అంతేకాదు అర్థరాత్రి దాటిన తర్వాత గర్భాలయంలోకి నాగేంద్రుడు వచ్చి శివలింగాన్ని చుట్టుకొని నాట్యం చేయడం ..క్షేత్ర పవిత్రతకు నిదర్శనంగా భక్తులు విశ్వసిస్తారు. ఆ సమయంలో సకల దేవతలు వచ్చి శివున్ని దర్శించుకుంటారని ప్రతీతి.

చేపల కూరను నైవేద్యంగా స్వీకరించే శివయ్య

శ్రీకాళహస్తి క్షేత్రంలో మాంసాన్ని నైవేద్యంగా స్వీకరించిన బోళాశంకరుడు. ..కన్నప్పను కరుణించినట్లు స్థలపురాణం చెబుతోంది. అది మనం చూడలేదుకాని ..చేప కూరను నైవేద్యంగా స్వీకరించే శివయ్య ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం జిల్లాలో కొలువై ఉన్నాడు. జిల్లాలోని కొమరాడ మండలం కోటిపాం గ్రామపంచాయతీ పరిధిలోని దేవునిగుంపలో చేపనైవేద్యం స్వీకరించే శివయ్యను దర్శించుకోవచ్చు. గుంప సోమేశ్వరునిగా భక్తుల పూజలందుకుంటున్న ఇక్కడి స్వామిని దర్శించుకునేందుకు శివరాత్రి రోజు భక్తులు పోటెత్తుతారు. ఇక్కడకు వచ్చిన భక్తులు శివరాత్రి రోజు స్వామిని దర్శించుకుని రాత్రి జాగారంస్తారు. మరుసటి రోజు చేపలను వండి స్వామికి నైవేద్యంగా సమర్పిస్తారు.



చెక్కుచెదరని దారులింగం..సంగమేశ్వరం!



పరమేశ్వరుడు కొలువైన సప్తనదీ సంగమ క్షేత్రం సంగమేశ్వరం. కర్నూలు జిల్లాలోని నందికొట్కూరుకు 20 కిలోమీటర్ల దూరంలో వెలసిన శివయ్య ..సంగమేశ్వరునిగా భక్తుల పూజలు అందుకుంటున్నారు. ఈ క్షేత్రంలో కృష్ణవేణి, తుంగ, భద్ర, భీమ, మల, పాపహరిణి అనే ఆరునదులు..భవనాశినదిలో సంగమిస్తాయి. ఈ ఆలయంలోని శివలింగం వేపదారువు చేత చేయబడింది. దీనిని మహాభారత కాలంలో ధర్మరాజు ప్రతిష్టించినట్లు చెబుతారు. ఎవరు,ఎప్పుడు ప్రతిష్టించారనే విషయం పక్కనపెడితే..ఈ సంగమేశ్వరాలయం దాదాపు 8 మాసాలు.... శ్రీశైలం ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌లో మునిగి ఉంటుంది. ఒక 4 మాసాల మాత్రమే సంగమేశ్వరుడు భక్తుల పూజలు అందుకుంటారు. శ్రీశైలం డ్యాం నిర్మాణం పూర్తి అయినప్పటి నుంచి ఇదే పరిస్థితి.. సాదారణంగా కలప నీటిలో నాని, ఎండకు ఎండితే పుల్లిరిగిపోయి చెడిపోతుంది. కాని వేప మొద్దుతో చెయబడిన ఇక్కడి శివలింగం చెక్కుచెదరకుండా ఉండడం అనేది ఆ పరమేశ్వరుని మహిమగా భక్తులు విశ్వసిస్తారు.

– చొల్లేటి వేంకటేశ్వరా చారి



జాగరణ మనసుకి... జాగృతి

ప్రకృతిలో నిద్రాణమైన శివశక్తిని మేలుకొలపడమే అంటారు ఆది శంకరాచార్యులు
మనలోని ఉత్తేజం శివమెత్తి....డిప్రెషన్‌ని వదిలిస్తుంది...అంటారు శాస్త్ర వేత్తలు

శివరాత్రి రోజు చేసే పూజలతో పాటు రాత్రి మొత్తం నిద్రమేలుకుని ఉండే జాగరణకు కూడా విశిష్టమైన ప్రాధాన్యత ఉంది. శివ లింగోద్భవ కాలం రాత్రే కనుక ఆ సమయంలో మేలుకుని శివనామస్మరణతో, పూజలతో తరించాలని చెబుతారు. అలాగే ప్రకృతిలో ఉన్న శివశక్తిని మేల్కొలుపుతూ తానే శివుడై, సర్వమును శివుడిగా భావించి పూజలు చేయడమే జాగరణ ఉద్దేశ్యమని ఆదిశంకరాచార్యులు చెప్పారు. భక్తిపరంగా శివరాత్రి జాగరణకు ఉన్న ప్రాధాన్యత అది. అయితే...ఒక రోజు రాత్రంతా అలా మేలుకుని ఉండటం వలన మానసికంగా, నిద్రాపరంగా లాభాలు ఉన్నాయని...కొన్ని పరిశోధనలు చెబుతున్నాయి. ఆ విశేషాలు తెలుసుకుందాం-

రాత్రంతా నిద్రమేలుకుని ఉన్నపుడు, ఆ తరువాత శరీరంలో కలిగిన మార్పులపై 1970ల్లో పరిశోధనలను నిర్వహించారు. నిద్రమేలుకున్నపుడు, ఆ తరువాత.... రక్తంలో కలిగిన మార్పులను విశ్లేషించారు...అలాగే మెదడు ఎలాంటి మార్పులకు గురయిందో కూడా గమనించారు. నిద్ర మానుకుని మేలుకున్న తరువాత ఆశ్చర్యకరంగా 37.2శాతం మందిలో వారి మానసిక స్థితి మెరుగైనట్టుగా గుర్తించారు. అంటే నిద్రమేలుకోవటం అనేది వారి విషయంలో యాంటీ డిప్రెసెంట్‌గా పనిచేసిందన్నమాట. నిద్రమేలుకున్న తరువాత సెరొటోనిన్, నార్ఎడ్రినలిన్ పెరిగినట్టుగా భౌతిక రసాయన శాస్త్రవేత్తలు గుర్తించారు. పైన పేర్కొన్న రెండు హార్మోన్లు ఒకటి ఆనందాన్ని పెంచేదైతే...మరొకటి ఉత్తేజాన్ని ఇచ్చేది.


నిద్రమేలుకున్నవారిలో ఆ తరువాత నుండి వారి నిద్రా స్థితి మెరుగైనట్టుగా కూడా గమనించారు. ఈ మార్పు డిప్రెషన్‌కి గురయినవారిలోనూ, డిప్రెషన్ లేని వారిలోనూ కనిపించింది. ఒకరోజు పూర్తిగా నిద్రమేలుకుంటే తరువాత నిద్రాస్థితి మెరుగవటం మంచి విషయమే కదా.

ఇలా ఎందుకు జరుగుతుంది...

ఈ ప్రశ్నకు కూడా శాస్త్రవేత్తలు సమాధానం ఇస్తున్నారు. ఒక రాత్రంతా పూర్తిగా నిద్రమేలుకోవటం అంటే... మన శరీరంలోని నిద్ర ఆహారవేళల క్రమబద్ధీకరణ వ్యవస్థకు సంబంధించిన బయోలాజికల్ క్లాక్ జీరో స్థితికి చేరినట్టు అవుతుంది. అంటే నిద్రావేళలు నియమం తప్పి చిందరవందరగా తయారయినప్పుడు... మళ్లీ ఒకసారి మొదలుపెట్టినట్టన్నమాట. ఒక రోజంతా మేలుకున్న తరువాత...మరుసటి రోజు...ఎవరైనా గాఢ నిద్రలోకి జారుకోవటం తెలిసిన విషయమే. అలా గాఢనిద్ర పట్టినప్పుడు మన శారీరక వ్యవస్థ పునరుత్తేజితం అవుతుంది. అందుకే నిద్రలేమికి గురవుతున్నవారు, మానసిక బాధల వల్ల నిద్రపట్టని వారు ఒక రోజంతా మేలుకుని తమలోని నిద్రావ్యవస్థని చక్కదిద్దుకోవాలని ఈ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. మేలుకున్న రోజు... తరువాత రోజు ఏడున్నర నుండి తొమ్మిదిగంటల సంపూర్ణమైన నిద్రతో నూతన ఉత్తేజాన్ని ఎలాంటి సైడ్ ఎఫెక్టులు లేకుండా పొందవచ్చని వారు సలహా ఇస్తున్నారు. మొత్తానికి రాత్రంతా మేలుకుని...ఆరోగ్యకరమైన నిద్రని మేలుకొలపటం మంచి విషయమే కదా. ఈ పరిశోధనలను మన శివరాత్రికి అన్వయించుకుంటే శివరాత్రి చలికాలం వెళ్లిపోతుందనగా వస్తుంది. అందుకే చలి శివశివా అని వెళ్లిపోతుందని అంటారు. చలికాలమంటే...మనసుకి కూడా మబ్బులేసి దిగులు, గుబులు పెరిగే కాలం.

చలి వాతావరణంలో మనలో డిప్రెసివ్ మూడ్ ఉంటుందనేది శాస్త్రీయంగా నిరూపితమైన విషయమే. దీనిని వింటర్ డిప్రెషన్‌గా, సీజనల్ ఎఫెక్టివ్ డిజార్డర్ (శాడ్) గా కూడా పిలుస్తారు. చలికాలం బద్ధకంగా, నలుగురితో కలవకుండా, శరీరాన్ని ఎక్కువగా కదపకుండా... శరీరమే కాక...మనసూ ముసుగేసినట్టుగా ఉన్నవేళ... శివరాత్రివేళ జాగరణతో చలి, డిప్రెషన్, నిద్రరాని బాధలు ఇవన్నీ వదిలిపోయి...మనలోని ఉత్తేజం శివమెత్తడం...మరింత మంచి విషయమే కదా. శివరాత్రి పూజలు భజనలు అన్నీ జనసందోహం ఒక్కటిగా చేరి శివాలయాల్లో చేసేవి. జనంతో కలిసి, జనంలో ఒకరిగామారడమూ...మానసిక ఆరోగ్యానికి మొదటి మెట్టు...అలా చూసినా... శివనామస్మరణ, జాగరణ... భక్తితో అంతరాత్మనే కాదు...మనో శక్తినీ మేలుకొలుపుతాయనటంలో సందేహం లేదు.

✍ వి.దుర్గాంబ



మహాశివరాత్రి!...మహాశివుడు లింగ రూపంలో ఉద్భవించిన రోజు..శివుని జన్మనక్షత్రమైన ఆరుద్రతో ,చంద్రుడు కూడి ఉన్న రోజుగా పురాణాలు చెబుతున్నాయి. సాక్షాత్తు పరమశివునికే అత్యంత ప్రీతి పాత్రమైన రోజు ఇది. అందుకే శివ భక్తులకు మహా పర్వదినం మహాశివరాత్రి.. అంతటి విశిష్టమైన రోజున ఆచరించాల్సిన విధివిధానాలును నిగమ శాస్త్రాలు వివరిస్తున్నాయి. ఆగమం అంటే దైవిక క్రియలు అని అర్థం..నిగమం అంటే మానవుడు ఆచరించాల్సిన విధులు అని అర్థం. మహాశివరాత్రి పర్వదినాన భక్తులు ఆచరించే క్రియల్లో ప్రధానమైనది ఉపవాసం. మన పూర్వీకులు ఏర్పాటు చేసిన ఆచార వ్యవహారాల్లో అంతర్లీనంగా ఆరోగ్యసూత్రాలు దాగున్నాయి. అందులో పర్వదినాల్లో ఉండే ఉపవాసం ఒకటి. ఆధునిక కాలంలో శాస్త్రీయ పరిశోధనలు కూడా ఉపవాసం ఆరోగ్యపరమైనదిగా తేల్చాయి.

ఉపవాసం ఆరోగ్యమే

ఉపవాసం అంటే?

సంప్రదాయ వాదులు పర్వదినాల్లో ఉపవాసం ఉంటారు. అది వారికి భక్తి ప్రధానమైనది.ముఖ్యంగా శివరాత్రి రోజు ఉపవాసం చేయడం అనేది శివసాయుజ్యానికి ఓ మార్గం. వరాహోపనిషత్తు ప్రకారం ఉపవాసం అంటే దగ్గరగా వసించడం..నివసించడం.. ఉండడం అని అర్థం.. అంటే తమ ఇష్టదైవానికి దగ్గరగా ఉండడం అని. అయితే ఉపవాసం అంటే ఆహారం తీసుకోకుండా దైవ సన్నిధిలో గడపడం అనే అర్థంలో ప్రస్తుతం పర్వదినాల్లో భక్తులు ఉపవాసం ఉంటున్నారు. దీనినే ఉపవాస దీక్ష అంటున్నారు. పర్వదినాల్లో లేదా శివరాత్రి పర్వదినం రోజు ఉపవాసం ఉండేవారు ..ఆ రోజు అంతా అంటే మరుసటి రోజు సూర్యోదయం వరకు ఆహారం తినకుండా ఉంటారు. అలా సాధ్యం కాని పక్షంలో పగలంతా ఆహారం భుజించకుండా ఉండి రాత్రి నక్షత్ర దర్శనం తర్వాత భుజిస్తారు. ఇలా ఉపవాసం ఉండడాన్ని నక్తం అంటారు. మరి కొందరు పగటి పూట ఆహారం తీసుకొని రాత్రి ఉపవాసం ఉంటారు., దీనిని ఏక భుక్తం అంటారు. ఇందులో ఏది మంచిది అనేదానికంటే మన ఆరోగ్యం, మన శక్తి దృష్ట్యా ఏది వీలైతే అది మేలు. ఎందుకంటే.. ఆకలితో నకనకలాడుతూ దైవ పూజ చేయడం వల్ల.. చిత్తం శివుని మీద..ధ్యాస చెప్పుల మీద అన్న సామెతలా తయారవుతుంది పరిస్థితి. అంటే.. మనస్సు దైవం మీద కాకుండా ఆహారం మీద ఉంటుంది. ఉపవాసం అనేది హిందూ మతంలోనే కాదు ఇతర మతాల్లో కూడా భక్తి ప్రధాన క్రియగా కొనసాగుతోంది.

శాస్త్రీయంగా..

శాస్త్రీయంగా .. ఆరోగ్య పరంగా వారానికి ఒక రోజు ఆహార నియంత్రణ పాటించడం ఉపవాసంగా భావిస్తున్నారు. వారంలో ఒకరోజు ఉపవాసం ఉంటే ఆరోగ్యగానికి ఎంతో మేలు జరుగుతుందని పరిశోధనలు తేల్చి చెబుతున్నాయి. అటు భక్తి పరంగా చూసినా..ఇటు శాస్త్ర పరిశోధనల పరంగా చూసినా ఉపవాసం వల్లప్రయోజనాలున్నాయన్నది వాస్తవం.

ఉపవాసంతో ఉపయోగాలు

ఉపవాసం ఉండడం వల్ల ఆరోగ్య పరంగా చాలా లాభాలున్నాయి. మనం తీసుకున్న ఆహారం రెండు మూడు గంటల్లో జీర్ణమై.. రక్తంలో కలిసి ప్రయాణించి కండరాల్లో, కాలేయంలో కొవ్వు రూపంలో నిల్వఉంటుంది. కొన్ని గంటల పాటు ఆహారం తీసుకోక పోవడం వల్ల అంటే ఉపవాసం ఉండడం వల్ల.. శరీరం తన శక్తిని కాపాడుకునేందుకు కండరాల్లో, కాలేయంలో దాచుకున్న కొవ్వు నిల్వలను కరిగించుకుంటుంది. అలా శరీరంలోని కొవ్వు పరిమాణం తగ్గడం అనేది ఆరోగ్యానికి దోహద పడుతుంది. ఉపవాసం ఉండడం వల్ల ఉపవాసి శరీరం బరువు తగ్గుతుందని పరిశోధనల్లో తేలింది. అలాగే మధుమేహం బారిన పడే అవకాశాలు తగ్గుతాయి. రక్తపోటు,గుండె కొట్టుకునే వేగం, కొలస్ట్రాల్ స్థాయిలు తగ్గుతాయని పరిశోధనల్లో గుర్తించారు. గుండెపోటు, పక్షవాతం వంటి వ్యాధులు వచ్చే అవకాశాలు తగ్గుతాయి. మెదడులో ప్రొటీన్లతయారి మెరుగుపడుతుంది. నాడీ కణాల మధ్య సంబంధాలు మెరుగవుతాయి. అలాగే క్యాన్సర్ నివారణకు ఉపవాసం మెరుగైన మార్గంగా పరిశోధకులు భావిస్తున్నారు. మెదడు పనితీరు, విషయ గ్రహణ శక్తి పెరుగుతుంది. అల్జీమర్స్ వంటి వ్యాధుల ముప్పు తగ్గుతుంది. ఉపవాసం ..హార్మోన్ల పనితీరును క్రమబద్ధీకరిస్తుంది. జీర్ణాశయంలోఉండే..హంగ్రీ హార్మోన్‌గా పిలువబడే.. ghrelin హార్మోన్ స్థాయిని సాధారణ స్థితికి తీసుకువస్తుంది. ఈ హార్మోన్ అధిక ఉత్పత్తి వల్లే మనిషికి ఆకలి తీవ్రత పెరుగుతుంది. అతిగా తింటే ఆరోగ్యానికి హానికరం అన్న విషయం తెలిసిందే. అలాగే ఉపవాసం దీర్ఘాయువుకు హేతువని ఎలుకల మీద చేసిన పరిశోధనల వల్ల తేలింది. ఉపవాసం ఒంటికి మంచిది..లంఖణం పరమ ఔషధం.. అనిపెద్దలు కూడా చెప్పారు. వైద్య పరిభాషలో ..ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్ అంటారు. మొత్తానికి సంప్రదాయం ప్రకారం చెప్పిన ఉపవాసం వెనుక కూడా భక్తితో పాటు ఆరోగ్య సూత్రం దాగుందన్నది అక్షర సత్యం.

జాగ్రత్తలు...


- ఏకబిగిన రోజంతా లేదా సగం రోజు ఉపవాసం ఉండకూడదు. కొద్దిగంటలు చొప్పున ఉపవాసం ఉంటూ, టైం పెంచుతూ.. క్రమేపి అందుకు శరీరం అలవాటు పడేలా చేసుకోవాలి.

-ఉపవాసం తర్వాత తేలిక పాటి ఆహారం అంటే... పండ్లు,కూరగాయలు లాంటవి తీసుకోవాలి. ఉపవాసం వదిలేసాము కదా అని అతిగా తినకూడదు.

-ఉపవాసం ఉండే రోజుల్లో తేలికపాటి పనులు ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి. శారీరక శ్రమ అధికంగా ఉండే పనులు మానుకోవడం మంచిది.

- ఉపవాసం ఉన్నప్పుడు శరీరం డీహైడ్రేషన్‌కు గురికాకుండా నీరు, ద్రవపదార్థాలు తీసుకోవాలి. అలాగని తీపి పానీయాలు. చెక్కెర అధికంగా ఉన్న కాఫీ, టీలు తాగడం మంచిది కాదు.

-చిన్న పిల్లలు, 60 సంవత్సరాల వయస్సుపైబడిన వారు, గర్భిణులు, పాలిస్తున్న తల్లులు, బలహీనంగా ఉన్నవాళ్లు, మధుమేహ వ్యాధిగ్రస్తులు ఉపవాసం ఉండకూడదు.



శివనామంలో మూడు వర్ణాలున్నాయి. అవి 'శ, ఇ, వ' అని విజ్ఞులు విభజించారు. వీటిలో శ కారం సుఖాన్ని, పరమానందాన్ని, ఇ కారం పరమ పురుషత్వాన్ని, వ కారం అమృత శక్తిని ప్రసాదిస్తుందని ఒక శ్లోకార్థం. పరమ శివుని ఆరాధించేందుకు ప్రతి సోమవారం, ప్రతి ఆర్ద్ర నక్షత్రం, సంవత్సరంలోని కృష్ణ చతుర్దశి తిథులు (మాస శివరాత్రులు), ముఖ్యంగా మాఘ బహుళ చతుర్దశి (మహా శివరాత్రి) శ్రేష్ఠమని పేర్కొంటారు.

చింతన

ఒక్కరోజు ఆరాధనతో ఏడాది ఫలం

శివరాత్రి

శివరాత్ర మహోరాత్రం నిరాహారో జితేన్ద్రియః
అర్చయేద్వా యథాన్యాయం తథాబలమ వంచకః
యత్ఫలం మమపూజాయాం వర్షమేకం నిరంతరమ్
తత్ఫలం లభతే సత్యం శివరాత్రే మదర్చనాత్॥

శివరాత్రి నాడు రోజంతా ఉపవాసం ఉండి, ఇంద్రియాలను నియంత్రించి, త్రికరణ శుద్ధిగా శివార్చన చేసిన వారికి సంవత్సరమంతా శివుని ఆరాధించిన ఫలం లభిస్తుందని శంకరుడు బ్రహ్మకు చెప్పినట్లు పురాణ కథనం. 'శం' సుఖం పరమానందం. 'ఇ' కారః పురుషస్మృతమ్

'వ'కారం శక్తిరమృతం 'శివ' ఇత్యుచ్యతే బుధః

శివనామంలో మూడు వర్ణాలున్నాయి. అవి 'శ, ఇ, వ' అని విజ్ఞులు విభజించారు. వీటిలో శ కారం సుఖాన్ని, పరమానందాన్ని, ఇ కారం పరమ పురుషత్వాన్ని, వ కారం అమృత శక్తిని ప్రసాదిస్తుందని ఈ శ్లోకానికి అర్థం.

పరమ శివుని ఆరాధించేందుకు ప్రతి సోమవారం, ప్రతి ఆర్ద్ర నక్షత్రం, సంవత్సరంలోని కృష్ణ చతుర్దశి తిథులు (మాస శివరాత్రులు), ముఖ్యంగా మాఘ బహుళ చతుర్దశి (మహాశివరాత్రి) శ్రేష్ఠమని పేర్కొంటారు.

శ్రీమదప్పయ్య దీక్షితులవారు తమ 'శివ కర్ణామృతం'లో శివుడు ఓంకార స్వరూపుడని అంటూ

ఆదిస్వరం తృతీయేన సహితం బిందు సంయుతం
ధ్యాయామి హృదయే యోగి ధ్యేయం కామిత మోక్ష దమ్

అని పేర్కొన్నారు. అంటే ఉ కారం (మూడవ స్వరం)తో, బిందువు (మ్)తో కలిసిన అ కారాన్ని (ఆది స్వరాన్ని) ధ్యానిస్తున్నానని భావం. అనగా ఆ ఉ మ్ కలిస్తే ఓం. ఇది యోగులచే ధ్యానింపబడి మోక్షాన్ని ఇస్తున్నది. ఇదే శివ స్వరూపం.

శివరాత్రికి సంబంధించిన పలు కథలు పురాణాల్లో ఉన్నాయి. అందులో ఒక దాని ప్రకారం బ్రహ్మాది దేవతలతో సృష్టి సమస్తం ప్రళయంలో లయమైంది. జగన్మాత కాత్యాయిని సమస్త సృష్టి బీజాలను ఒక మహాపద్మంలో పదిలపరచి, చేతితో పట్టుకుని పరమాత్మ ధ్యానంలో మునిగిపోయింది. ప్రళయాంతంలో తిరిగి పునఃసృష్టి చేయాల్సిందిగా పరాశక్తి పరమ శివుణ్ణి ప్రార్థించింది. పరమాత్మ ప్రసన్నుడై ఆమె ముందు సాక్షాత్కరించాడు. పరాశక్తి ప్రసన్నవదనంతో 'పరమ శివా! ఈ రోజు మాఘ కృష్ణ చతుర్దశి. నీవు ప్రకాశమానంగా అర్ధరాత్రి సాక్షాత్కరించిన ఈ రోజు మహాశివరాత్రిగా ప్రసిద్ధి చెందుగాక! ఈ రోజంతా శివుని జపిస్తూ, ఉపవాసం ఉండి, అర్ధరాత్రి శివుడు సాక్షాత్కారం అయిన సమయం వరకూ జాగరణ చేసిన వారు ఇహపర సౌఖ్యాలు అనుభవిస్తారని అన్నది. పరమ శివుడు 'తథాస్తు' అన్నాడు.

మరొక కథ ఎక్కువగా ప్రచారంలో ఉన్నదే. దీని ప్రకారం ఒకసారి బ్రహ్మ విష్ణువుల మధ్య ఎవరు అధికులమన్న వివాదం మొదలై యుద్ధం వరకూ వచ్చింది. బ్రహ్మ బ్రహ్మాస్త్రాన్ని, విష్ణువు నారాయణాస్త్రాన్ని ప్రయోగించడానికి ఉద్యుక్తులయ్యారు. ఆ సమయంలో పరమేశ్వరుడు ఇద్దరి మధ్య జ్వాలాస్తంభ రూపంలో నిలిచాడు. అది మాఘ బహుళ చతుర్దశి అర్ధరాత్రి సమయం. ఈ పురాణ కథ అందరికీ తెలిసిందే. అలా సాక్షాత్కరించిన అగ్నిలింగ స్వరూపమే అరుణాచలం. అదే పంచ భూత లింగాలలో ఒకటి. ఆ లింగం మహోగ్ర తేజాన్ని భరించలేక బ్రహ్మాది దేవతలు ప్రార్థించగా, పార్థివ లింగంగా ఆవిర్భవించి 'అరుణాచలేశ్వరునిగా' పూజలు, అభిషేకాలు అందుకుంటున్నాడు.

శ్రీవ్యాసభగవాన్ విరచితమైన శివపురాణంలో శివలింగావిర్భావం, స్వరూపం, శివనామ మహిమ, శివతత్త్వం, పూజా విధానం ఇత్యాదిగా ఎన్నో వివరణలు ఉన్నాయి. నిరాకార, నిరామయ, సృష్ట్యున్ముఖ శివ తత్త్వమే లింగ రూపం. శివుడు నిరాకార (నిష్కల), సాకార (సకల) రూపంలోనూ దర్శనమిస్తాడు.

నిష్కలంగా లింగ రూపి - ద్వాదశ జ్యోతిర్లింగాలు, పంచభూతలింగాలు, పంచారామాలలో వెలసిన లింగాలు, ఇంకా దేశమంతటా స్వయంభువులుగా ఉన్నవి, ప్రతిష్ఠించినవి, ఈ కోవలోనివి. సకలంగా గంగాధర, చంద్రశేఖర, త్రిశూలధారి ఇత్యాది విగ్రహ రూపాలను చెప్పవచ్చును.

ఈశ్వరుడు అనేది శివునికి గల మరో పేరు. జగత్తును పాలించేవాడు, శాసించేవాడని అర్థం. అయితే ఐశ్వర్యం కలవాడు, ఇచ్చేవాడు అనే అర్థం జనసామాన్యానికి దగ్గరైంది. అందుకే 'ఈశ్వరుడు ఇవ్వాలి, ఇల్లు నిండాలి' అనే సామెత పుట్టింది. ఐశ్వర్యమంటే సిరిసంపదలు, ఆయురారోగ్యాలు. మోక్ష ప్రాప్తి కూడా ఐశ్వర్యమే. పరమ శివుని ప్రార్థిస్తే ఆయనిచ్చేది ఐశ్వర్యం స్వపర భోగ్యంగా భాసిల్లుతుంది.

ఈ జగత్తంతా శివమయం. పంచ భూతాలు, సూర్యచంద్రులు ఇలా మనలను పెంచి పోషించేవన్నీ ఈశ్వరుని ఐశ్వర్యమే. **'అన్నానాం పతయే నమః', పుష్టానాం పతయేనమః'** అని ఈశ్వరుని వేదాలు కీర్తించాయి. రుద్ర నమక మంత్రాలు, సహస్ర నామాలు ఈ భావాన్ని మరింతగా చెప్పాయి. ఈశ్వరుడు సర్వ దేవతా స్వరూపుడు. అష్ట సిద్ధులూ, నవ నిధులూ ఈశ్వరుని చెంతనే ఉన్నాయి. అందుకే ఆయన ఐశ్వర్యేశ్వరుడు. ఈశ్వరుని విభూతులే లోకమంతా నిండి ఉన్నాయి. **'విష్ణోశ్చ హృదయం శివః'** అని ఆర్ష వాక్కు. సంపత్కారిణి అయిన లక్ష్మి కూడా విష్ణు హృదయమే. అలా లక్ష్మికి కూడా లక్ష్మీ అష్టోత్తర నామాలలో 'విభూతిం, శివాం, శివకరీం' అని. సహస్ర నామాలలో 'అఘోర రుద్ర రూపిణీ', 'శుద్ధ స్ఫటిక సన్నిభా', 'సదా శివా' ఇత్యాదినామాలున్నాయి. ఇవి శివలక్ష్ముల అభేదాన్ని తెలియజేస్తాయి.

ఈశ్వరుడు దిగంబరుడై రుద్ర భూమిలో సంచరించినా, అన్నపూర్ణను భవతీ భిక్షాందేహి అని ప్రార్థించినా ఆయన యందు అష్టైశ్వర్యాలు ఉన్నాయి. లక్ష్మి ఆదిగా దేవతలందరూ తమ తమ సంపదల శక్తిని ఈశ్వరుని వల్ల పొందారని పురాణాలు సవివరంగా చెప్పాయి.

మహాకవి కాళిదాసు కుమారసంభవంలో ఈశ్వరుని ఇలా వర్ణించాడు. 'ఏమీ సంపద లేని వాడైనా సంపదలనిచ్చేవాడు, శ్మశాన వాసియైనా త్రిలోకనాథుడు. భయంకర రూపం కలవాడైనా శివుడు (మంగళకరుడు)గా చెప్పబడుతున్నాడు. శివుని యదార్థ స్వరూపం అతని అర్ధాంగికి కూడా తెలియదేమో!

'శివం సుఖం రాతీతి శివరాత్రి' అని వ్యుత్పత్తి.

మాఘ కృష్ణ చతుర్దశి శివరాత్రి పర్వదినాన బ్రాహ్మీ ముహూర్తంలో లేచి కాలకృత్యాలు తీర్చుకుని, స్నానం చేసి శివాలయంలో శివుని అభిషేకించి, అర్చిస్తే అభీష్ట సిద్ధులు కలుగుతాయి. రోజంతా ఉపవాసం ఉండి, శివనామ స్మరణతో గడిపి, రాత్రంతా జాగరణం చేసి అర్ధరాత్రి సమయంలో లింగోద్భవాన్ని దర్శిస్తే ఈశ్వరుని అనుగ్రహం పొంది ఇహ పర సౌఖ్యాలు తప్పక పొందుతారు.

- ఏ.సీతారామారావు

దినఫలాలు

మేష రాశి: నూతన కార్యక్రమాలు ఆర్థికంగా ప్రారంభించగలుగుతారు. దూరప్రయాణాలు అనుకూలం. విద్యావిషయంలో సూక్ష్మత పెరుగుతుంది. మంచి కార్యాలలో పేరు, ప్రఖ్యాతులు లభిస్తాయి. ఆరోగ్యంలో ప్రతికూలత తగ్గుతుంది. ప్రభుత్వ వ్యవహారాల్లో వ్యతిరేకత ఉంటుంది. ఆదాయ మార్గాలు సులభతరమవుతాయి.

వృషభ రాశి: ఆర్థిక విషయాల్లో జాగ్రత్తలు పాటించాలి. స్థిరాస్తి విక్రయాలు వంటివి ఉపకరిస్తాయి. విద్యావిషయాల్లో ఆటంకాలను అధిగమించగలుగుతారు. ఆరోగ్య విషయంలో ఖర్చులు పెరుగుతాయి. ఆదాయవృద్ధిలో ఆటంకాలు కొనసాగుతాయి.

మిథున రాశి: వాహన విషయాల్లో చిరాకులు ఉంటాయి. ఆర్థిక వ్యవహారాల్లో అనుకూలత ఉంటుంది. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. పనులలో వేగం పెరుగుతుంది. ఆదాయంలో గట్టి ప్రయత్నాలు లాభిస్తాయి.

కర్కాటక రాశి: శ్రమ అధికమవుతుంది. మానసిక ధైర్యం పెరుగుతుంది. శుభవార్తలు వింటారు. పిల్లల విషయంలో శ్రద్ధ తప్పనిసరి. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. శత్రుభీతిపోతుంది. ఆదాయమార్గాలు అనుకూలం.

సింహ రాశి: ఆందోళనకర పరిస్థితులు ఆర్థికంగా కొనసాగుతాయి. ఆర్థిక క్రమశిక్షణ తప్పనిసరి. పెట్టుబడుల విషయంలో జాగ్రత్తలు పాటించాలి. ఆరోగ్య విషయంలో శ్రద్ధ తప్పనిసరి. వ్యాపార అంచనాలు ఆశించినంతగా పొందలేకపోతారు. ఆదాయంలో అయోమయ పరిస్థితులున్నా అధిగమించగలుగుతారు.

కన్యా రాశి: విదేశీ లావాదేవీలు కలసి వస్తాయి. ఆహ్లాద పరిస్థితులు గృహ రీత్యా ఉంటాయి. వ్యాపార విజయాలు కొనసాగుతాయి. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. స్థిరాస్తి విషయాల్లో చిరాకులు పరిష్కరింపబడతాయి. ఆదాయ మార్గాలు సులభతరమవుతాయి.

తులారాశి: మానసిక రుగ్మతలు కొనసాగుతాయి. కోర్టు వ్యవహారాలు లాభిస్తాయి. ఖర్చులు అధికమవుతాయి. మెరుగైన పరిస్థితులు ఆరోగ్య రీత్యా ఆనందాన్ని కలిగిస్తాయి. అతి తొందర ద్వారా కార్యక్రమాల్లో పొరపాట్లు దొర్లుతాయి. ఆదాయంలో మంచి లాభాలను కూడగట్టుకొనే ప్రయత్నాలు అనుకూలిస్తాయి.

వృశ్చిక రాశి: శ్రమ ఉన్నా ఫలితాలు కూడా అనుకూలం. ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు పాటించాలి. ప్రయాణాలు అనుకూలం. ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. అసహన పరిస్థితులు వ్యాపారపరంగా ఉంటాయి. ఆదాయం పర్వాలేదు.

ధనూ రాశి: స్థిరాస్తి సమస్యలకు పరిష్కారాలు లభిస్తాయి. ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. నూతన స్నేహాలు ద్వారా లబ్ధి చేకూరుతుంది. వ్యాపార ప్రతిబంధకాలను ఎదుర్కోగలుగుతారు. ఆరోగ్యంలో ప్రతికూలత తగ్గుతుంది. గతంలోని తప్పులు సరిదిద్దుకొనే అవకాశాలు లభిస్తాయి. ఆదాయంలో మెరుగైన అవకాశాలు దగ్గరవుతాయి.

మకర రాశి: ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయి. కోర్టు వ్యవహారాల్లో ఏకాగ్రత తప్పనిసరి. శ్రమ అధికమవుతుంది. బాధ్యతలు పెరుగుతాయి. ఆదాయం గట్టి ప్రయత్నాలతో మాత్రమే సాధ్యం.

కుంభ రాశి: శుభపరిణామాలు ప్రారంభమవుతాయి. విద్యాప్రయత్నాలు లాభిస్తాయి. శుభవార్తలు వింటారు. ఆకస్మిక వ్యయం లేకపోలేదు. ఆరోగ్య విషయంలో ప్రతికూలత ఉంటుంది. ప్రత్యర్థుల ద్వారా చిరుసమస్యలు ఉంటాయి. ఆదాయంలో ప్రోత్సాహ పరిస్థితులు మాత్రం ఆనందాన్ని కలిగిస్తాయి.

మీన రాశి: ఆర్థిక సమస్యలు వేధిస్తాయి. వాహన విషయాల్లో జాగ్రత్తలు పాటించాలి. కోర్టు వ్యవహారాల్లో ప్రతికూల పరిస్థితులు విస్మయాలని కలిగిస్తాయి. ఆరోగ్య సమస్యల నుండి ఉపశమనం లభిస్తుంది. ముఖ్యమైన పనులు విషయంలో ఏకాగ్రత తప్పనిసరి. ఆదాయంలో జాగ్రత్తతో కూడిన నిర్ణయాలు ఉపకరిస్తాయి.




శ్రీ నూకల సూర్యనారాయణ
nookalasuryanarayana@gmail.com



ఇది త్రిలోచన లింగం

శివలింగాలలో పెద్దవి, చిన్నవి చాలా రకాలు ఉన్నాయి. ఒక్కో చోట రెండంతస్తుల పొడవున్న లింగాలు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని ద్రాక్షారామం, సామర్లకోటల్లోని లింగాలు రెండంతస్తుల పొడ వున్నవి కాగా వారణాసిలోని ప్రసిద్ధ విశ్వేశ్వర లింగం చాలా చిన్నదిగా ఉంటుంది. దేశవ్యాప్తంగా చూస్తే కొన్ని కొన్ని చోట్ల వేర్వేరు శివలింగాలు దర్శనమిస్తుంటాయి. ఒక్కొక్క చోట లింగానికి కొన్నికొన్ని ప్రత్యేకతలు ఉంటుంటాయి. అటువంటి ప్రత్యేకతలు గల వాటిలో కర్ణాటకలోని హంపిలో గల భాదవ లింగం ఒకటి. నల్లని ఏకశిల నుంచి చెక్కిన ఈ శివలింగం శిల్పకళకు కాణాచి అయిన హంపిలోని శివలింగాలన్నిటిలోకి పొడవైనది. 5, 6 అడుగుల పొడవైన ఈ లింగం త్రినేత్రుడైన శివునికి సంబంధించి నదని చెబుతారు. ఆ లింగాన్ని పరిశీలనగా చూస్తే దానిపై మూడు కన్నులు చిత్రించి ఉండడం కని పిస్తుంది. మరో విశేషమేమంటే ఇక్కడి శివునికి పైన కప్పు ఉండదు, సరికదా లింగం ఎప్పుడూ నీటిలో ఉంటుంది. ముందు వైపు నుంచే ఆలయంలోకి ప్రవేశం ఉంటుంది. ఇక్కడి శివలింగం ఎప్పుడూ నీటిలో ఉంటుంది. దానికి కారణం ఈ ఆలయం గుండా నది పాయ ఒకటి ప్రవహిస్తుండటమేనని చెబుతారు. ఆ నది నీరు అక్కడి పొలాలకు ఆధారమని అంటారు. ఇక్కడి శివ లింగం ఆలన పాలన ఒక వృద్ధ బ్రాహ్మణుడు నిర్వహిస్తున్నాడని చెబుతారు. స్థానికుల కథనం ప్రకారం హంపి అనే పేద ఆదిమవాసి తన కోరికలన్నీ తీరితే తాను శివలింగాన్ని నిర్మిస్తానని మొక్కుకున్నాడని అవన్నీ తీరడంతో ఆతడు శివుని కోసం కేటాయించిన శిల నుంచి ఈ లింగాన్ని చెక్కాడని చెబుతారు. అయితే ఈ లింగాన్ని ఒక పేద కూలినాలి చేసుకునే మహిళ నిర్మించిందని, ఆమె ఈ లింగానికి బద్వా (స్థానిక భాషలో పేద అని అర్థం) అనే పేరు పెట్టిందని చెబుతారు. అదే కాలక్రమంలో భాదవ లింగంగా మారింది.





గిరిజనుల ఇలవేల్పు కురవి వీరభద్రుడు

తెలుగు రాష్ట్రాల్లో ఎన్నో శైవాలయాలు ఉన్నాయి. వేటి ప్రత్యేకత వాటికుంది. ఇక గిరిజనులుల ఎక్కువగా దర్శించే శైవాలయాలు కొన్ని ఉన్నాయి. వాటిలో కురవిలోని భద్రకాళి సమేత వీరభద్ర స్వామి ఆలయం ఒకటి ఈ ఆలయం తెలంగాణలోని మహబూబాబాద్ జిల్లాలో ఉంది. ఈ ఆలయానికి రమారమి 850 సంవత్సరాల చరిత్ర ఉంది. చాళుక్యుల సామంతుడైన భీమరాజు కురవిని రాజధానిగా చేసుకుని పరిపాలించిన కాలంలో ఈ ఆలయాన్ని నిర్మించినట్లు చారిత్రక ఆధారాలను బట్టి వెల్లడవుతోంది. వేంగి చాళుక్యుల అనంతరం కాకతీయుల తొలి స్వతంత్ర రాజైన బేతరాజు దీ ని జీర్ణోద్ధరణ చేయగా రెండవ బేత రాజు కురవి నగరాన్ని ఆను క ని ఉన్న పెద్ద తటాకాన్ని నిర్మించినట్లు తెలుస్తోంది. రాణి రుద్రమదేవి కూడా కురవి వీరభద్రస్వామిని దర్శించుకుని ఆశీస్సులు పొందినట్లు మార్కోపోలో రచనలను బట్టి తెలుస్తోంది. తెలుగు రాష్ట్రాల నుంచే కాక ఇతర ప్రాంతాల నుంచి కూడా భక్తులు ఇక్కడికి వచ్చి స్వామిని దర్శించుకుని వెళుతుంటారు. ఇక్కడ విశిష్టత ఏమంటే కురవి వీరభద్ర స్వామిని ఎక్కువ మంది గిరిజనులు ప్రీతిపాత్రంగా కొలుస్తారు. ఆయనను వారు కురవి వీరన్నగా పిలుచుకుంటుంటారు. కురవి వీరన్న ప్రధానంగా మైదాన ప్రాంత గిరిజనుల ఇలవేల్పు. కురవి వీరభద్రస్వామికి నిత్య పూజలు జరుగుతుంటాయి. మహాశివరాత్రి రోజున వీరభద్ర స్వామి మహా జాతర ప్రారంభమవుతుంది. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామి వారి కళ్యాణం అంగరంగ వైభవంగా జరుగుతుంది. ఈ ఆలయంలో భద్రకాళి దేవాలయం, మహామండపం, నవగ్రహ మండపం, కళ్యాణ కట్ట, పాకశాల, యాగ శాల, వాహనశాల కూడా ఉన్నాయి.

- కొలనుపాక కుమారస్వామి
9963720669

ధర్మం-మర్మం

జ్యోతిషాంపతయే నమః

మంత్ర జప విధానము :

ప్రాతఃకాలమునే లేచి స్నానాదులు ముగించుకుని పరిశుద్ధమైన వస్త్రాలు ధరించి నుదుట తిలకం దిద్దుకుని

స్పష్టమైన చూపుకోసం మంత్రం


పూజామందిరంలో దీపారాధన చేసి, నిత్య కృత్యాలైన సంధ్యా వందనాది కార్యక్రమాలను ముగించుకుని నిశ్చలమైన పరిశుద్ధమైన మనస్సుతో తమ శక్తికి అనుగుణంగా మంత్రాన్ని జపించాలి.



- డా॥ కందాడై రామానుజాచార్య

కులాసా

పిల్లల ఎదుగుదలకి పౌష్టికాహారం



పిల్లలు ఎదుగుదల అనివార్యం. వారికి బలం, శక్తి ఎక్కడి నుంచి వస్తుంది? తినే ఆహారాన్ని బట్టే ఇవి సమకూరుతాయి. ఇది సగం నిజమని చెప్పొచ్చు. అవసరమైనపోషకాలు అందించడానికి ఆహారం కీలకపాత్ర పోషిస్తుంది. ఈ పోషకాల వల్ల శరీరానికి బలం చేకూరుతుంది. బాల్యదశలోనే పెరుగుదల ఉంటుంది. అంటే కౌమారదశకు రాకముందే పెరుగుదల రేటు ఎక్కువగా ఉంటుంది. పోషకాలు కూడా ఈ దశల్లోనే అవసరమవుతుంటాయి.

పాఠశాలకు వెళ్లే పిల్లలు అంటే ఆరు నుంచి 12 సంవత్సరాల వయసులో ఎత్తు, బరువు పెరుగుతుంటారు. శరీర నిర్మాణం ఈ దశల్లోనే ఎక్కువగా జరుగుతుంది. పిల్లలు ప్రతి సంవత్సరం 6 సెంటీమీటర్ల ఎత్తు, 3 కిలోల బరువు పెరుగుతారు. 18 సంవత్సరాలు వచ్చే వరకు ఎత్తు పెరుగుతారు. పిల్లలు సమతుల ఆహారం తీసుకోవాలి. కార్బోహైడ్రేట్స్, విటమిన్స్, మినరల్స్, ప్రోటీన్స్ అవసరమవుతుంటాయి. ఎదిగే సమయంలో ప్రోటీన్ ఎక్కువగా అవసరమవుతుంది. భారతీయ ఆహారం పిల్లల అవసరాలను తీర్చలేకపోతుంది.

మన దేశంలో పౌష్టికాహార లోపంతోనే శిశుమరణాలు సంభవిస్తున్నాయని అనేక నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఆర్థిక స్థోమత, అవగాహన లేమి కారణమేదైనా కావొచ్చు కొందరు పిల్లలు మృత్యువాత పడుతుంటే మరికొందరు ఏదో ఓ రోగంతో బాధపడుతున్నారు. ఈ మధ్య పెరిగిన టెక్నాలజీ, పోటీ ప్రపంచం పుణ్యమా అని మధ్య తరగతి తల్లిదండ్రులు తమ పిల్లలను కార్పోరేట్ విద్యాసంస్థల్లో చేర్పిస్తున్నారు.

అక్కడ సమయానికి పౌష్టికాహారం అందక చదువుల ఒత్తిడి ఎక్కువై పిల్లల్లో ఎదుగుదల మందగిస్తుంది. ఇక పిల్లలను ప్రయివేటు స్కూళ్లకు పంపే తల్లిదండ్రులు బిజీలైఫ్‌లో పడి హడావిడిగా రెడీ చేసి, ఏదో ఒకటి లంచ్ బాక్స్ కట్టి పంపిస్తున్నారు. కానీ అది పౌష్టికాహారమా.. కాదా అని చూడటం లేదు. ఇలా చేయడం వల్ల పిల్లల ఎదుగుదలపైనే కాదు. చదువుపైనా ప్రభావం పడుతుంది. అందుకే పిల్లల ఎదుగుదలకు తొలి దశ అయిన స్కూల్ స్థాయి నుంచి తప్పనిసరిగా విటమిన్లు, ప్రోటీన్లు, పిండిపదార్థాలు ఉన్న ఆహారాన్ని అందించాలని వైద్యులు సూచిస్తున్నారు. తల్లిదండ్రులు ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే పిల్లల భవిష్యత్‌పై ప్రభావం పడుతుందని హెచ్చరిస్తున్నారు.

రోగనిరోధక శక్తి

పిల్లలు తినే ఆహారం విషయంలో తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలి. అశ్రద్ధ వహిస్తే పోషకాలు, విటమిన్లు లోపంతో పిల్లల్లో రోగ నిరోధక శక్తి తగ్గి అనేక వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుంది. అలసట, చురుగ్గా లేకపోవడం, చదువులో వెనుకబడటం, జ్ఞాపకశక్తి తగ్గడం, దంతాలు, ఎముకల సమస్యలు వస్తాయి.

మొలకెత్తిన విత్తనాలు ఆరోగ్యాన్ని ఎంతో మేలు చేస్తాయి. వీటిలో విటమిన్లు, పోషక పదార్థాలు అధికంగా లభిస్తాయి. వీటిని ఇంట్లోనే తయారు చేసుకోవచ్చు. పెసర్లు, శనగలు, రాగులు, బబ్బర్లు వంటి వాటిని తడి గుడ్డలో చుట్టి ఉండాలి. తెల్లారేసరికి మొలకలు వస్తాయి. వాటిని ప్రతి రోజు ఉదయం పిల్లలకు తినిపించాలి.

పిల్లలకు రోజుకు ఉడకబెట్టిన గుడ్డు తినిపిస్తే ప్రోటీన్లు లభించడంతో పాటు రోగనిరోధక శక్తి పెరుగుతుంది. గుడ్డులో 11 రకాల ఆమ్లాలు లభిస్తాయి. వందశాతం పౌష్టికాహారం లభించేది గుడ్డులోనే.

మినరల్స్ తక్కువగా ఉండడంతో విద్యార్థుల్లో ఎముకలు, దంతాల పెరుగుదల నిలిచిపోతుంది. రక్తస్రావం అయితే త్వరగా అదుపులోకి రాదు. నాడీ వ్యవస్థ చైతన్యం కోల్పోతుంది. కండరాలు పనిచేయవు. జీవ ప్రక్రియ మందగిస్తుంది. ఐరన్‌తో పాటు మినరల్స్ ఆకుకూరల్లో ఎక్కువగా లభిస్తాయి. శారీరక, మానసిక దృఢత్వానికి మాంసం,కోడిగుడ్లు, చేపలు, పాలు, కూరగాయలు, పండ్లు, ధాన్యాలు, ఖర్జూరా, బాదం, కాజూ బాగా తినిపించాలి.

అయోడిన్ థైరాయిడ్ హార్మోన్లను ఉత్పత్తి చేయడంలో ప్రధాన పాత్ర పోషిస్తుంది. దీనిలోపంతో పిల్లల్లో జ్ఞాపకశక్తి తగ్గుతుంది. దీంతో విద్యార్థులు చదువుతున్నా వాటిని గుర్తుంచుకోలేకపోతారు. జింక్ కూడా రోగనిరోధక శక్తిని పెంచుతుంది. అందుకే కూరల్లో అయోడిన్, ఐరన్ కలిసిన ఉప్పును అవసరమైన మేర వాడాలి.

బీవిటమిన్లు కొన్నింటిని కలిపి బీ కాంప్లెక్స్‌గా పిలుస్తారు. దీన్ని బహుళ ప్రయోజనకారి అంటారు.

విటమిన్ ఎ లోపిస్తే కంటిచూపు సమస్య తలెత్తుతుంది. అంతేకాదు ఎముకల పెరుగుదల నిలిచిపోతుంది. డీ విటమిన్ లోపిస్తే ఎముకల ఎదుగుదల లోపిస్తుంది. పిండి పదార్థాలు ఇవి విద్యార్థులకు గ్లూకోజ్‌లా పనిచేస్తాయి. చిరుధాన్యాలు, బియ్యం, గోధుమలు, రాగులు తదితర వాటిలో ఇవి సంవృద్ధిగా లభిస్తాయి. వీటి వల్ల తక్షణ శక్తి లభిస్తుంది. కొవ్వు పదార్థాలు తక్కువ ఉన్నవారు వాతావరణంలో వచ్చే మార్పులను తట్టుకోలేరు. విటమిన్ సి రోగనిరోధక శక్తిని పెంపొందిస్తుంది.

ప్రోటీన్లు, కాల్షియం

సరిపడినంత ప్రోటీన్లు మీ పిల్లలు తీసుకున్నప్పుడే కాల్షియం శరీరం తీసుకోగలుగుతుంది, ఎముకలు కేవలం కాల్షియంతో మాత్రమే తయారవుతాయి. పెరుగుదల హార్మోన్లను ప్రభావితం చేసే ప్రోటీన్లు పాఠశాలకు వెళ్లే పిల్లలకు అవసరమవుతుంటాయి. పిల్లల ఆహారంలో సరిపడినంత కాల్షియం ఉండే విధంగా జాగ్రత్తపడాలి. యుక్తవయసులో ప్రోటీన్ లోపం ఉన్నట్లయితే ఆస్టియోపారోసిస్ వ్యాధి, ఎముకల పగుళ్లు ఏర్పడతాయి. మొక్కలు, జంతువుల ద్వారా ప్రోటీన్లను పొందగలుగుతాం.

ప్రోటీన్లు శారీరక ఎదుగుదలకు ఉపయోగపడతాయి. అలాగే కణజాల నిర్మాణానికి ప్రోటీన్లు అవసరమవుతుంటాయి.

ప్రతిరోజు ఆహారంలో ప్రోటీన్లు ఉండే విధంగా జాగ్రత్తపడాలి. ప్రోటీన్లు సరిగ్గా ఉన్నప్పుడే ఎముకల ఆరోగ్యం బాగుంటుంది. ఎముకల్లో కాల్షియం లేనట్లయితే ప్రోటీన్ల ద్వారా తిరిగి కాల్షియం పొంద గలుగుతాం. పిల్లల ఆహారం ద్వారా సరిపడినంత కాల్షియం తీసుకోవాలి.

నేషనల్ న్యూట్రిషన్ మానిటరింగ్ బోర్డ్ అధ్యయనం ప్రకారం మూడో వంతు గ్రామీణ జనాభా రిస్క్‌లో ఉంది. ఎందుకంటే వీళ్లు తగినంత ప్రోటీన్లు తీసుకోవడం లేదు. బాడీ మాస్ ఇండెక్స్ తక్కువగా చూపిస్తుంది. పిల్లలు ప్రోటీన్ల మీద సరైన అవగాహన పెంపొందించుకోవాలని పోషకాహార నిపుణులు అంటున్నారు.

నట్స్, ఓట్స్, పాల ఉత్పత్తులు, బ్రకోలీ, లెంటిల్స్, టునా, క్యనోవా వంటివి తీసుకోవడం వల్ల ప్రోటీన్ల కొరతను అధిగమించవచ్చు. ధాన్యాలు, చిరుధాన్యాలు, కూరగాయలు, పండ్లు తగినంత తీసుకోవాలి. ముఖ్యమైన వ్యాయామాలు చేయాలి. జంక్ ఫుడ్ జోలికి వెళ్లకూడదు. శారీరక శ్రమ లేకుండా జీవనశైలి ప్రమాదకరం. సిఫారసు చేసిన ఆహారం సేవించడం వల్ల కాల్షియం కొరత లేకుండా చూసుకోవచ్చు.

పిల్లలకు ఆహారం మీద అవగాహన పెరిగితే ఏం తినాలి? ఏం త్రాగాలో తెలుసుకోగలుగుతారు.

పిల్లలకు ప్రతి రోజు మూడు పూటలా తప్పనిసరిగా పౌష్టికాహారాన్ని అందించాలి. ప్రతి రోజు గుడ్డు, పచ్చి క్యారట్, ఆకు కూరలు, ఐరన్ పెంపొందించే బెల్లంపట్టీలు వారంలో ఒకటి, రెండు పర్యాయాలు మాంసకృత్తులను అందించాలి. పాఠశాలకు వెళ్లే పిల్లలు బయట తినుబండారాలకు అలవాటు పడకుండా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలి. అలాగే పరిశుభ్రత కూడా పాటించాలి. భోజనానికి ముందు తప్పనిసరిగా చేతులు శుభ్రంగా కడుక్కునేలా అలవాటు నేర్పించాలి.



డాక్టర్ శ్రీలత
పౌష్టికాహార నిపుణులు
మ్యాక్స్ క్యూర్ హాస్పిటల్స్

మాటలు రావడంలో జాప్యం

సూక్ష్మ పోషకాల లోపం చిన్నారుల్లో మాటలు రావడంలో జాప్యం వంటి తీవ్రమైన ఆరోగ్య పరిణామాలకు దారితీసే అవకాశం ఉందని నిపుణులు అంటున్నారు.

ఐరన్, జింక్, అయోడిన్, విటమిన్ ఎ, విటమిన్ డి వంటి సూక్ష్మ పోషకాలు లాంటివి అత్యావశ్యక విటమిన్లు, మినరల్స్, హార్మోన్స్ సరిగ్గా విడుదలయ్యేందుకు రోగ నిరోధక వ్యవస్థ నియంత్రణ, సమతుల్యతలో ఇవి తోడ్పడుతాయి.

ఈ సందర్భంగా హైదరాబాద్‌కు చెందిన న్యూట్రిలైన్ విమెన్స్ కేర్ క్లినిక్ సీనియర్ కన్సల్టెంట్ డైటీషియన్, న్యూట్రిషనిస్ట్ డాక్టర్ జ్యోతి చబ్రియా మాట్లాడుతూ ''మాటలు రావడంలో జాప్యం జరిగిన పిల్లలు చివరకు మాటలతో సంభాషణ కన్నా సైగలకు ప్రాధాన్యం ఇస్తుంటారు. శబ్దాలను అనుకరించడంలో ఇబ్బందులకు లోనవుతారు. సాధారణ మాటలను అర్థం చేసుకోవడంలో కూడా సమస్యలను ఎదుర్కొంటారు. మాటల్లోజాప్యంతో ముడిపడిన ప్రధాన కారణం సూక్ష్మ పోషకాల లోపం. ఈ లోపాన్ని ఎదుర్కొనేందుకు వైవిధ్య భరిత ఆహారం, ఫుడ్ పోర్టిఫికేషన్ వంటి ఆహార ఆధారిత ధోరణులు అత్యుత్తమ విధానాలు. చిన్నారుల్లో సూక్ష్మ పోషకాల లోపంతో బాధపడకుండా ఉండేందుకు ఇవి అత్యుత్తమ మార్గాలు'' అని అన్నారు.

పెరుగుదలకు ప్రోటీన్

మన శరీరంలో సగం ప్రోటీన్లు కండరాల నిర్మాణానికి అయితే మిగతా సగం ఎముకలు, కాట్రిలేజ్, చర్మం తయారీకి ఉపయోగపడతాయి.

''పాఠశాలకు వెళ్లే పిల్లలకు ప్రోటీన్లు కండరాల బలానికి ఉపయోగపడుతుంటాయి. ప్రతిరోజు ప్రోటీన్ అవసరాలు పెరుగుతాయి. దీనివల్ల పిల్లల ఎదుగుదల సాధ్యపడుతుంది'' అని ముంబాయికి చెందిన డైటీషియన్ జిగ్నా సేథ్ అంటున్నారు.

ప్రోటీన్‌లు ప్రత్యేక అమినో యాసిడ్స్ ఉంటాయి. ఈ అమినో యాసిడ్స్ తప్పనిసరి. మొక్కలకు సంబంధించిన ఆహారం భారతీయ ఆహారంలో ప్రధాన పాత్ర పోషిస్తుంది. సోయాఉత్పత్తులు చాలా ఉపయోగకరం.

స్కూలుకు వెళ్లే విద్యార్థుల కోసం ఎంత పరిమాణంలో ప్రోటీన్లు తీసుకోవాలో ఇప్పుడు తెలుసుకుందాం.

వయసు	మగపిల్లలు	ఆడపిల్లలు
4-6 సం	ప్రతిరోజు 20 గ్రాములు	-
7-9 సం	ప్రతిరోజు 29.5గ్రాములు	-
10-12 సం	ప్రతిరోజు 39.9గ్రాములు	ప్రతిరోజు 40.4గ్రాములు
13-15 సం	ప్రతిరోజు 54.3గ్రాములు	ప్రతిరోజు 51.9గ్రాములు
16-17సం	ప్రతిరోజు 61.5గ్రాములు	ప్రతిరోజు 55.5గ్రాములు

ఆయుర్వేదంలో చికిత్స

పిల్లలు సక్రమంగా ఎదగడానికి ఆహారపుటలవాట్లు కీలకపాత్ర పోషిస్తాయి. జంక్ ఫుడ్, కూల్ డ్రింక్స్ తీసుకోవద్దు. వేళకు ఆహారం, నిద్ర ఉండాలి. ఆహారం తీసుకున్న తర్వాత నాలుగు గంటల గ్యాప్ తర్వాత మళ్లీ కొద్ది మోతాదులో పౌష్టికాహారం తీసుకుంటూ ఉండాలి. మసాలా ఉన్న ఆహారాన్ని తీసుకోకూడదు. పిల్లలు తినే సమయంలో టీవీలకు అతుక్కుపోకూడదు. వీడియో గేమ్స్ వంటివి దూరంగా పెట్టాలి. కుటుంబమంతా కల్సి కూర్చుని భోజనం చేయాలి.

అశ్వగంధ లేహ్యం తినడం వల్ల ఆయుర్వేదంలో మంచి ఫలితాలు వస్తాయి. ఆయుర్వేద చికిత్స ద్వారా పిల్లల ఎదుగుదలకు మంచి మార్గాలు ఎన్నో ఉన్నాయి.



డాక్టర్ క్రాంతికుమార్
కేరళ ఆయుర్వేద
పంచకర్మ సెంటర్
9494675168


ఆక్యుపంక్చర్ ద్వారా ఎత్తు

ఆక్యుపంక్చర్ పాయింట్స్ వల్ల ఎత్తు పెరగడానికి అనేక అవకాశాలున్నాయి. సహజసిద్దంగా ఎత్తు, బరువు పెరగడానికి సూదులతో ప్రెషర్ పాయింట్స్ మీద ఒత్తిడి తేవాలి. ఫ్యాషన్ ప్రపంచంలో పిల్లలు ఎదగడానికి అనేక అవరోధాలు ఉన్నాయి. సరైన పౌష్టికాహారం కొరతతో బాటు మానసిక ఆందోళనవల్ల కూడా పిల్లలు సరిగ్గా ఎదగలేకపోతున్నారు. కాబట్టి మానసికంగా ధృఢంగా చేయడానికి ఆత్మనూన్యత వంటివి దూరం చేస్తూనే శారీరకంగా ఎదగడానికి ఆక్యుపంక్చర్ బాగా దోహదపడుతుంది.



హీలర్ కె. దిలీప్‌కుమార్
క్యాతన్ ఆక్యుపంక్చర్ హెల్త్ రీసెర్చ్ అండ్ సొసైటీ
హైదరాబాద్, విజయవాడ
9848828808

బాల్యంలో క్యాన్సర్ భూతం



నేటి పిల్లలే రేపటి భవిష్యత్ తరాలు. ముందుతరాల గుర్తులు. భవిష్యత్ తరాల జీన్స్‌గా పరిగణించవచ్చు. ఈ జీన్స్ వల్లే పిల్లల వృద్ధి, వికాసం ఆధారపడి ఉంటుంది. వాటిని అనుసరించే వివిధ అలవాట్లు, అభిరుచులు వ్యాధులు వ్యక్తమవుతాయి. కాబట్టి నేటి తరాల పిల్లలపై ప్రభావితం చూపిస్తాయి. వీటి ప్రభావం వల్లే దీర్ఘకాలిక వ్యాధులైన మధుమేహం, హైపర్‌టెన్షన్, క్యాన్సర్ మొదలగు వ్యాధులు కలుగుతాయి.

ప్రతీ సంవత్సరం ఫిబ్రవరి 15వతేదీన ప్రపంచవ్యాప్తంగా అంతరాష్ట్రీయ చైల్డ్ హుడ్ క్యాన్సర్ డేని అవగాహన దినోత్సవం నిర్వహిస్తున్నారు. ఇంటర్నేషనల్ ఏజెన్సీ ఫర్ రీసెర్చి ఇన్ క్యాన్సర్ నివేదిక ప్రకారం ప్రపంచం మొత్తంలో క్యాన్సర్ బారినపడే పిల్లల సంఖ్య రోజురోజుకి పెరుగుతుంది. మనదేశంలో ఢిల్లీలో అత్యధిక పిల్లలు క్యాన్సర్ బారినపడుతున్నారు. 15 సంవత్సరాల లోపు పిల్లలలో వచ్చే క్యాన్సర్‌ను చైల్డ్ హుడ్ క్యాన్సర్‌గా పరిగణిస్తారు. వీళ్లలో కనిపించే లక్షణాలు పెద్దవారికంటే భిన్నంగా కనిపిస్తాయి. ఇవి ముఖ్యంగా మూడు కారణాల వల్ల కలగవచ్చు.

జన్యు సంబంధ కారణాలు

జన్యుపరమైన లోపాలు, క్యాన్సర్ బారిన పడిన కుటుంబ సభ్యుల వల్ల కారణాలుగా నిలిచాయి.

గర్భావస్థ సంబంధ కారణాలు

గర్భిణీస్త్రీ శరీరంలో జరిగే మార్పుల వలన, ఆ సమయంలో తీసుకునే విపరీతమైన ఆహార విహారపు అలవాట్ల వలన అనవసరపు ఔషధ సేవన వలన, రేడియేషన్స్‌కి ఎక్కువగా ప్రభావిత కావడం వల్ల కారణాలుగా నిలిచాయి.

పిల్లలకు సంబంధించిన కారణాలు

సహజరూపమైన ఆహారం బదులుగా కృత్రిమ ఆహారపుటలవాట్లు ఆర్టిఫిషియల్ స్వీటనర్స్, రిఫైన్డ్ ఫుడ్స్, రిఫైన్డ్ షుగర్స్, జంక్ ఫుడ్, క్యాన్డ్ ఫుడ్ యొక్క అధిక వాడకం. ఇందులో రుచిని పెంచడానికి, నిలువ ఉంచడానికి వాడే నైట్రేట్స్, ప్రిసర్వేటివ్స్ మొదలగు రసాయనాలు అధికంగా వాడటం వల్ల కారణాలుగా నిలిచాయి. తల్లిదండ్రులు కూడా ఈ ఆహారపుటలవాట్లు తమ పిల్లలకు నేర్పిస్తున్నారు. తమకు తెలియకుండానే పిల్లల ఆరోగ్యానికి హాని కలిగించడంలో బాధ్యులవుతున్నారు.

క్యాన్సర్ అనే భయంకరమైన వ్యాధి రక్తం, మాంసం, ఎముకలు, లివర్, కిడ్నీ, కళ్లు మొదలగు ఏ అవయవానికైనా రావచ్చు.

పిల్లల్లో సాధారణంగా లుకేమియా (33శాతం), బ్రెయిన్ ట్యూమర్ (20శాతం), లింఫోమా (12శాతం), నెఫ్రోబ్లాస్టోమా, న్యూరో బ్లాస్టోమా, రెటినో బ్లాస్టోమా, విల్మ్స్ ట్యూమర్, బోన్ ట్యూమర్ కలుగుతాయి.

మొదటి మూడు రకాల క్యాన్సర్స్ అత్యధికంగా పిల్లల్లో కనిపిస్తాయి.

లుకేమియా

రక్తనాళాల్లో ఎర్ర రక్తకణాలు, తెల్ల రక్తకణాలు ప్లేట్‌లెట్స్ ఉంటాయి. లుకేమియా వ్యాధిలో తెల్ల రక్తకణాల అపరిమితంగా పెరిగిపోవడం వలన మిగతా కణాలకు రక్తనాళాల్లో స్థానం తక్కువవుతుంది. ఇందులో అక్యూట్ లింఫోసిటిక్ లుకేమియా, అక్యూట్ మైలోజినియస్ లుకేమియా అనేవి సర్వసాధారణంగా వచ్చే క్యాన్సర్ రకాలు.

చిన్నగాయాల్లో కూడా అధిక రక్తస్రావం, ఆకలిలేకపోవడం, కడుపునొప్పి, తరచుగా ఇన్‌ఫెక్షన్స్ రావడం, శ్వాసలో ఇబ్బంది, నీరసం, బడలిక, ఎముకల నొప్పి, కీళ్ల నొప్పి కలుగుతాయి.

బ్రెయిన్ ట్యూమర్

వాంతులు, తలనొప్పి, ఫిట్స్, ముఖభాగం చేతులు, కాళ్లు నీరసంగా ఉండటం, మాటలో తత్తరపాటు, సరిగ్గా నిలవలేకపోవడం, నడవలేకపోవడం, తలసైజు పెరిగినట్టు ఉంటుంది.

లింఫోమా

హాడ్‌కిన్ లింఫోమా, నాన్ హాడ్‌కిన్ లింఫోమా రకాలున్నాయి.

హాడ్‌కిన్ లింఫోమా

ఇందులో శరీరంలోని లింఫ్ గ్రంథులు పెరుగుతాయి. ఈ గ్రంథులు గట్టిగా రబ్బరు మాదిరిగా నొక్కితే నొప్పిలేకుండా ఒకటికి ఒకటి అతుక్కొని మెడకి ఒక పక్కకు కలిగి ఉంటాయి. ఇందులో ఆహారంనందు రుచిలేకపోవడం, రాత్రి చెమటలు పుట్టడం, దురద మొదలగు లక్షణాలు కనిపిస్తాయి.

నాన్ హాడ్‌కిన్ లింఫోమా

జీర్ణాశయంలో ఈ లింప్ గ్రంథి ఏర్పడుతుంది. ఇందులో తీవ్రమైన కడుపునొప్పి వస్తుంది.

వ్యాధి నిర్ధారణ

ప్రస్తుత సమయంలో ఎన్నో రకాల ఆధునిక చికిత్సా పద్ధతులు అందుబాటులో ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో వ్యాధి ఎంత త్వరగా నిర్ధారణ జరిగితే అంత త్వరగా కోలుకునే అవకాశం ఉంది.

ఆయుర్వేద చికిత్స

ఆయుర్వేదంలో ట్యూమర్‌కి అద్భుతంగా చికిత్స అందుబాటులో ఉంది. ఈ పరిస్థితుల్లో వ్యాధి ఎంత త్వరగా నిర్ధారణ జరిగితే అంత త్వరగా కోలుకునే అవకాశం ఉంటుంది.

ఔషధ మొక్కలు పిల్లల జీవిత నాణ్యత పెంచుతాయి.

హరిద్ర (పసుపు), దారుహరిద్ర (మాను పసుపు), ఆమ్లకి (ఉసిరిక), అశ్వగంధ (పెన్నేరుగడ్డ), గుగ్గులు (గుగ్గిలం), గుడూచీ (తిప్పతీగ), యష్టిమధు (అతి మధురం), శుంఠి (శొంఠి), పిప్పళి (పిప్పళ్లు), లశునం (వెల్లుల్లి)

ఈ ఔషధాలని ఆహారరూపంలో కానీ ఔషధరూపంలోకానీ రోజువారి దినచర్యలో భాగంగా అలవాటు చేసుకోవాలి.


చికిత్స కంటే నివారణ ఉత్తమం అనేది పాతమాట. ప్రస్తుత సమయంలో నివారణే ఉత్తమమైన చికిత్స. అందుకే ఆయుర్వేద సిద్దాంత ఆధారిత జీవనం పలు వ్యాధులకు ఉత్తమమైన నివారణ



డాక్టర్ స్నేహలత
ఆయుర్వేదవైద్య నిపుణులు

లక్షణాలు

- అకాల జ్వరం ఎంతకీ తగ్గకపోవడం లేదా చాలా సమయం పట్టడం
- అసాధరణమైన వాపులు, బొబ్బలు
- త్వరగా గాయాలు అవటం, రక్త స్రావం తగ్గకపోవటం
- శరీర భాగాన ఎల్లప్పుడు నొప్పి కలిగి ఉండటం
- కుంటుతూ నడవటం
- మాటిమాటికి తలనొప్పి, వాంతులు అవటం
- నీరసం, బడలిక
- ఆకస్మికంగా కళ్లు కనిపించకపోవడం, చూపు మందగించడం





మీ అభిమాన నాయిక ఎవరంటే ఒక పేరు చెబుతాం. మరి ఆ నాయికకూ అభిమాన తారలుంటారని తెలుసా..? మనం ఈ తారలనెలా అభిమానిస్తామో...వాళ్లూ అలాగే వేరే వాళ్ల నటనను ఇష్టపడతారు. అలా మన నాయికలు ప్రేమించే కథానాయకులెవరో తెలుసుకుందాం...

అందాల భామల అభిమాన హీరోలు





ప్రభాస్ అంటే ఇష్టం - అనుష్క...

దక్షిణాది అగ్రతారగా అనుష్కకు ఎంత పేరుందో అందరికీ తెలుసు. లేడీ సూపర్‌స్టార్‌లా గుర్తింపు తెచ్చుకుంది ఈ యోగా సుందరి. నాయిక ప్రధాన చిత్రాలైనా, భారీ బడ్జెట్ సినిమాలైనా హీరోయిన్‌గా అనుష్క ఉండాల్సిందే. ఆమె ఉండేనే చిత్రానికి ఆ బరువు వస్తుందని దర్శక నిర్మాతలు నమ్ముతారు. ప్రేక్షకులంతా అభిమానించే అనుష్కకు ఫేవరేట్ యాక్టర్ ఎవరో తెలుసా...ప్రభాస్. నాగార్జున తనకు అసలైన అండగా భావించే అనుష్క.....నటుడిగా ప్రభాస్‌ను అభిమానిస్తుంది. నాయికగా ఇంత గుర్తింపు తెచ్చుకుని, ఇలా ఉన్నానంటే కారణం నాగార్జునే ఉంటుంది అనుష్క.. అయితే నటుడిగా ప్రభాస్ అంటే ఇష్టమని చెబుతుంది. ఎప్పుడూ సరదాగా నవ్వుతూ ఉండే ప్రభాస్ ప్రతి ఒక్కరికీ డార్లింగ్ అంటుంది అనుష్క.. ఈ జోడీ బిల్లా, మిర్చి, బాహుబలి లాంటి మర్చిపోలేని చిత్రాల్లో నటించారు.

పవర్‌స్టార్ అభిమానిని - సాయి పల్లవి..

ఫిదాలో సాయి పల్లవి పవన్ కళ్యాణ్ అభిమాని. నిజంగా కూడా పవర్ స్టార్ అభిమానే. గబ్బర్‌సింగ్ సినిమాను థియేటర్‌లో చూసేందుకు వెళ్లినప్పుడు ఆయనకున్న అభిమానుల ఫాలోయింగ్ చూసి ముగ్ధురాలైందట. తెరపై పవన్ చేసే మాయాజాలాన్ని ఇష్టపడుతుందట.

మహేష్ డ్రీమ్ హీరో - రకుల్..

మోడల్‌గా గ్లామర్ ఫీల్డులోకి వచ్చిన పంజాబీ సుందరి రకుల్ ప్రీత్‌సింగ్...ఆ తర్వాత వెండితెరకు పరిచయమైంది. వరుస విజయాలతో అగ్ర నాయికగా మారింది. మొదటి నుంచీ ఈ భామ మహేష్ బాబు తన అభిమాన నటుడని చెప్పుకుంది. అతనితో కలిసి నటించే అవకాశం ఎప్పుడొస్తుందా అని వేచి చూసింది. ఆశించినట్లుగానే స్పైడర్ చిత్రంతో మహేష్‌తో ఆడిపాడే సందర్భం రానే వచ్చింది. దీంతో రకుల్ కల నెరవేరినట్లయింది..



నాగ్‌తో నటించాలి - కాజల్ ..

అందాల జాబిలి కాజల్ అగర్వాల్ దక్షిణాదితో పాటు బాలీవుడ్ ప్రేక్షకులను అలరించింది. నటనలో, అందంలో మిగతా నాయికలకు ఏమాత్రం తగ్గదు కాజల్. ముఖ్యంగా తెలుగులో ఎన్నో సూపర్‌హిట్ చిత్రాల్లో భాగమైంది. దాదాపు అందరు అగ్ర నటులతో కలిసి నటించింది. మీ అభిమాన నటుడెవరు అంటే నాగార్జున అని చెబుతుంది కాజల్. ఆయనతో ఒక్క చిత్రమూ చేయని కాజల్‌కు...నాగార్జున నటన అంటే చాలా ఇష్టమట.



ఎన్టీఆర్ అభినయం ఇష్టం - నివేదా

జెంటిల్‌మన్ తో తెలుగు ప్రేక్షకుల ముందుకొచ్చిన కేరళ కుట్టి నివేదా థామస్. తొలి చిత్రంతోనే తన నటనతో అందరినీ ఆకట్టుకుంది. ప్రతిభావంతమైన పాత్రలకు న్యాయం చేయగలదనే పేరు తెచ్చుకుంది. ప్రతిభగల నాయికగా గుర్తింపును తెచ్చుకున్న నివేదాకు ఎన్టీఆర్ అభినయం అంటే ఇష్టమట. ఇండస్ట్రీకి రాగానే ముఖాముఖిల్లో ఈ మాటే చెప్పింది. ఎన్టీఆర్‌తో నటించాలనే కోరికను తెలిపింది. నివేదాకు కూడా అతి తక్కువ సమయంలోనే ఆశ నెరవేరింది. జై లవకుశలో ఎన్టీఆర్ సరసన ఈ భామ నటించింది.



సాత్విక్ ఈశ్వర్, అక్షిత

అనాధల కోసం సత్య గ్యాంగ్

సమాజంలో అనాధలనేవారు లేకుండా చేయాలనే సందేశంతో రూపొందించిన చిత్రం సత్య గ్యాంగ్. సిద్దయోగి క్రియేషన్స్ పతాకంపై సాత్విక్ ఈశ్వర్, అక్షిత, ప్రత్యూష్, హర్షిత నాయకానాయికలుగా ప్రభాస్ దర్శకత్వంలో మహేష్ ఖన్నా నిర్మించిన ఈ చిత్రం టీజర్‌ను సోమవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో అతిథులుగా పాల్గొన్న అనాధ బాలలు విడుదలచేశారు. ఈ సందర్భంగా నిర్మాత, దర్శకత్వ పర్యవేక్షకులు మహేష్ ఖన్నా మాట్లాడుతూ, సందేశంతో పాటు వినోదాన్ని మేళవించి తీసిన చిత్రమిది. అనాధలకు సంబంధించిన కథాంశంతో రూపొందించిన ఈ చిత్రం స్ఫూర్తిదాయకంగా ఉంటుంది. ఈ వారంలోనే ఆడియోను విడుదల చేయబోతున్నాం. దర్శకుడిగా పరిచయమవుతున్న ప్రభాస్ ప్రతీ ఫ్రేమ్‌ను అందంగా తీర్చిదిద్దారు. మేము పెట్టుకునే షరతులకు అనుగుణంగా సినిమా చూసి నచ్చలేదన్న వారికి డబ్బులు వాపసు ఇచ్చేస్తాం. సినిమాపై మాకున్న నమ్మకంతోనే అలా చెబుతున్నాం అని చెప్పారు.

దర్శకుడు ప్రభాస్ మాట్లాడుతూ, నలుగురు అనాధలు తమ తోటి అనాధలకు ఏ విధంగా సాయపడ్డారన్న ఆసక్తిదాయక కథాంశంతో ఈ చిత్రం సాగుతుందని, అడుసుమిల్లి విజయ్‌కుమార్ ఛాయాగ్రహణం ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని చెప్పారు. ఇందులో మంచి యాక్షన్ కూడా ఉందని, కమర్షియల్‌గా కూడా చిత్రం అలరింపజేస్తుందని అన్నారు. ఇలాంటి సందేశాత్మక చిత్రం ద్వారా పరిచయమవుతున్నందుకు ఆనందంగా ఉందని హీరోహీరోయిన్లు సాత్విక్ ఈశ్వర్, అక్షిత. ప్రత్యూష్ పేర్కొన్నారు. కార్యక్రమంలో అనాధ బాలలకు పదివేల రూపాయల ఆర్థిక సాయాన్ని నిర్మాత మహేష్ ఖన్నా అందించారు.

శిక్షణ కోసం ఖజికిస్థాన్!



వరుణ్ తేజ్

తొలిప్రేమ చిత్రం ద్వారా ఈ ఏడాది తొలి విజయాన్ని అందుకున్న హీరో వరుణ్ తేజ్. గత ఏడాది ఫిదా చిత్రంతో వరుణ్ బాక్సాఫీస్ విజయాన్ని చవిచూశాడు. ఫిదా సుమారు 40 కోట్లు వసూలు చేసింది. హీరోగా వరుణ్‌కు మంచి బ్రేక్ ఇచ్చింది. తాజా సినిమా తొలిప్రేమ సైతం కలెక్షన్లసునామి సృష్టిస్తోంది. పవన్‌కల్యాణ్ నటించిన తొలిప్రేమ టైటిల్‌తో అబ్బాయ్ వరుణ్ నటించిన ఈ చిత్రంపై మొదటినుండి అంచనాలు ఎక్కువే ఉన్నాయి. దానికి తగినట్టుగా ఈ సినిమా చేరుకుంది. రెండు రాష్ట్రాలతో పాటుగా విదేశాల్లో సైతం మంచి రెవెన్యూ తెస్తోందని ట్రేడ్‌వర్గాలు అంటున్నాయి. వరుణ్ కమర్షియల్ మార్కెట్ అనూహ్యంగా పెరిగింది. ఎస్.ఎస్. రాజమౌళి సైతం తొలిప్రేమ చిత్రాన్ని ప్రశంసించారు.

తాజాగా వరుణ్ తేజ్ మరోవైవిధ్యమైన చిత్రంలో నటిస్తున్నాడు. ముకుందా, కంచె, ఫిదా, తొలిప్రేమ వంటి డిఫరెట్స్ కథల్లో నటించిన వరుణ్ ఈసారి అంతరిక్షవ్యోమగామిగా కనిపించనున్నారు. ఘాజి వంటి చిత్రం ద్వారా జాతీయ గుర్తింపు పొందిన దర్శకుడు సంకల్ప్ రెడ్డి ఈ చిత్రానికి దర్శకుడు. కంచె చిత్రాన్ని నిర్మించిన రాజీవ్ రెడ్డి నిర్మిస్తున్నారు. దర్శకుడు క్రిష్ ఈ చిత్రానికి సహ నిర్మాతగా వ్యవహరిస్తారని తెలిసింది.

వ్యోమగామిగా నటిస్తుండడంతో వరుణ్‌తేజ్ శిక్షణ తీసుకోనున్నట్టు తెలిసింది. సహజంగా ఉండేందుకు జీరో గ్రావిటిలో కొన్ని సన్నివేశాలు చిత్రీకరిస్తారట. ఇందుకోసం కృత్రిమ జీరో గ్రావిటి వాతావరణంలో వరుణ్ శిక్షణ తీసుకుంటారని సమాచారం. ఇందుకోసం ఖజికిస్థాన్ వెళతారని తెలిసింది.

ఏప్రిల్ నెలలో షూటింగ్ ప్రారంభించే అవకాశం ఉంది. ఈ చిత్రానికి సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

మనసుకు నచ్చిందే చేయాలి




మంజుల

ఏదైనా పనిచేసేటప్పుడు మనసు పెట్టి చేయమని పెద్దలు అంటుంటారు. మనసుకు నచ్చి చేసినపుడు ఏ పనిలో అయినా సంతృప్తి చెందవచ్చు, విజయం సాధించనూ వచ్చు. ఈ పాయింట్‌ను ప్రేరణగా తీసుకుని మనసుకు వచ్చింది చిత్రాన్ని తెరకెక్కించడం జరిగిందని దర్శకురాలు మంజుల ఘట్టమనేని పేర్కొన్నారు. సందీప్‌కిషన్, అమైరాదస్తూర్ నాయకానాయికలుగా రూపొందిన ఈ చిత్రం విడుదలకు సిద్ధమైంది. ఈ సందర్భంగా మంజుల పాత్రికేయులతో కొద్దిసేపు ముచ్చటించారు. ఏదో ఒక సినిమా తీయాలని నేను ఈ సినిమా చేయలేదు. ప్రకృతిని ప్రేమించే ప్రేమికుల కథే ఈ చిత్రం. ప్రకృతితో మనం ఎలా మమేకం కావాలన్న అంశాన్ని ఇందులో ఆవిష్కరించాను. చిన్న చిన్న అనుభూతుల్ని ఎలా కోల్పోతున్నాం. వాటిని ఎలా ఆస్వాదించాలన్నది ఇందులో చూపించడం జరిగింది. అలాగే స్వచ్ఛమైన ప్రేమకథకు వినోదాన్ని కూడా మేళవించాం. ఓ కొత్త జోనర్‌లో సినిమా ఉంటుంది. నేటి ప్రేక్షకులు ఇటీవల వచ్చిన అర్జున్‌రెడ్డి, పెళ్లిచూపులు, తొలిప్రేమ వంటి కొత్తతరహా సినిమాలను ఎంతగానో ఆదరించారు. ఆ కోవలోనే ఈ సినిమాను కూడా విజయవంతం చేస్తారని ఆశిస్తున్నాం. సినిమా అనగానే ఇన్ని ఫైట్లు, ఇన్ని పాటలు, కమర్షియల్‌గా ఇలా ఉండాలనే ఫార్ములాను పక్కనపెట్టి చేసిన కొత్తరకమైన సినిమాలకు ప్రేక్షకులు పట్టం కడుతున్న నేపథ్యంలో దానిని దృష్టిలో పెట్టుకుని మేమూ ఓ నూతన ప్రయత్నం చేశాం. ముఖ్యంగా యూత్‌కు స్ఫూర్తిదాయకంగా సినిమా ఉంటుంది. ప్రేమకథల సినిమాలకు ఉండే సంగీత ప్రాధాన్యం ఇందులో కూడా ఉంటుంది. తొలుత ఎ.ఆర్.ంహమాన్ అయితే బావుంటుందని అనుకున్నప్పటికీ, దెర్శకురాలిగా నేను చేస్తున్న తొలి సినిమా కావడం చేత ఆయనను సంప్రదించలేదు. అయితే నేను అనుకున్న అంచనాలకు తగ్గట్టుగా రాధన్ సమకూర్చిన సంగీతం చిత్రానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది అని అన్నారు. తదుపరి సినిమా కథ కుదిరిన తర్వాత దానికి ఏ హీరో సరిపోతారనుకుంటే వారితో చేస్తాను అంటూ ముగించారు.

జువ్వ పాటలు విడుదల

రంజిత్, పాలక్ లల్వాని నాయకానాయికలుగా త్రికోటి దర్శకత్వంలో సోమి ఫిలిమ్స్ పతాకంపై భరత్ సోమి నిర్మిస్తున్న జువ్వ చిత్రం ఆడియో వేడుక హైదరాబాద్‌లో జరిగింది. బొత్స



సత్యనారాయణ, ఆయన సతీమణి బొత్స ఝాన్సీ విశిష్ట అతిథులుగా హాజరైన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న దర్శకుడు వి.వి.వినాయక్ ఆడియో సీడీలను విడుదలచేశారు. ఈ సందర్భంగా వి.వి.వినాయక్ మాట్లాడుతూ, తమ్ముడి మీద అభిమానంతో హీరోగా పరిచయం చేస్తున్న నిర్మాత భరత్‌కు అభినందనలు. ఈ సినిమా ద్వారా రంజిత్‌కు హీరోగా మంచి గుర్తింపు రావాలని కోరుకుంటున్నాను. అలాగే కీరవాణి సంగీతాన్ని అందించడం గొప్ప విషయం. తప్పకుండా సినిమా ప్రేక్షకులను అలరింపజేస్తుందని ఆశిస్తున్నాను అని అన్నారు.

దర్శకుడు త్రికోటి మాట్లాడుతూ, దర్శకుడిగా నాకిది రెండో అవకాశం. నాలాంటి కొత్తవాడి సినిమాకు సంగీతాన్ని అందించిన కీరవాణి రుణం తీర్చుకోలేనిది. సినిమా మేము ముందు అనుకున్న బడ్జెట్ కంటే ఎక్కువ అయ్యింది. కానీ ఏ మాత్రం ఇబ్బంది పెట్టకుండా నిర్మాత ఎంతగానో సహకరించారు అని చెప్పారు. నిర్మాత భరత్ మాట్లాడుతూ, సినిమా చాలాబాగా వచ్చింది. రత్నంగారి డైలాగ్స్ బావున్నాయి. హీరోయిన్ పాలక్, విలన్ అర్జునా ఇద్దరూ మంచి నటనను కనబరిచారు. ఈ నెలలోనే సినిమాను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం అని చెప్పారు.

సంగీత దర్శకుడు కీరవాణి మాట్లాడుతూ, త్రికోటి మొదటి సినిమా దిక్కులు చూడకు రామయ్యకు కూడా నేనే సంగీతాన్ని అందించాను. ఇది పక్కా కమర్షియల్ సినిమా. ప్రేక్షకులకు విందు భోజనం లాంటిది. అన్నిరకాల భావోద్వేగాలు ఇందులో ఉన్నాయి. హీరో రంజిత్ డ్యాన్స్, ఫైట్స్ చాలాబాగా చేశాడు. హీరో రంజిత్ మాట్లాడుతూ, నన్ను ఎంతో ప్రోత్సహిస్తున్న కుటుంబ సభ్యులకు, చిత్రబృందానికి కృతజ్ఞతలు. కథే ఈ చిత్రానికి హీరో. కచ్చితంగా అందరికీ నచ్చేలా సినిమా ఉంటుంది అని అన్నారు. రచయిత ఎం.రత్నం మాట్లాడుతూ, త్రికోటి నాకు చాలా ఏళ్లుగా తెలుసు. చాలా తెలివైన దర్శకుడు. అతనికి ఈ చిత్రం గుర్తింపును ఇస్తుందన్న నమ్మకం ఉంది. హీరో రంజిత్ అనుభవం ఉన్న నటుడిలా నటించాడు.

కీరవాణి అబ్బాయి భైరవ పాడిన ఓ కలా అనే పాట నాకు చాలా నచ్చింది అని అన్నారు. ఇంకా ఈ వేడు కలో నటులు అలీ, సప్తగిరి, నిర్మాత బి.వి.ఎస్. ఎన్.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.